RNI No.APTEL/15835/2019

ప్రజా

మణిపూస

మాసపత్రిక

తెలుగు మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 5 జూన్ - 2020 పేజీలు : 70 వెల : 25/-



ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్
కనపర్తి రాజారావు

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
శ్రీ డా॥ ఎం.జయకుమార్, MBA.,Ph.D

ఎడిటర్ : శ్రీ బి.రాజేష్

కరస్పాండెంట్
కె.దినేష్, B.Tech.,(M.J.M.C)

ఫొటోగ్రాఫర్ : బి.వీరయ్య

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్, Cell : 9866789072

సేల్స్ మేనేజర్
జి.విజయ్‌కుమార్ B.A., B.Ed

Office Address

D.No.10-12-6/44, Plot No.302,
Sai Towers 1, Rednam Gardens,
Visakhapatnam.530002
Cell : 9492423833

విషయ సూచిక

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

Registration No.1140/2019

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్ : 94924 23833

ఎడిటోరియల్

స్వేచ్ఛా వాయువులు



ఐదవ దశలో, లాక్‌డౌన్ జూన్ 30 వ తేదీ వరకూ కొనసాగిస్తున్నట్లుగా కేంద్ర హోమ్ శాఖ ప్రకటించింది. దీనితో, కరోనా కల్పిత లాక్‌డౌన్ నిబంధనల నుండి చాలావరకూ విముక్తి వచ్చినట్లే భావించాలి. ఈ సడలింపులు చాలా వరకూ ముందుగా ఊహించినవే. మూడు, నాల్గవ దశ సడలింపుల నుండే స్వేచ్ఛా వాతావరణం పెరుగుతూ వచ్చింది. నిజం చెప్పాలంటే, మద్యం దుకాణాలకు ఎప్పుడు అనుమతులు ప్రకటించారో? అప్పుడే నిబంధనల బారికేడ్లు తెగిపోయాయి. నాల్గవ, ఐదవ దశలో ప్రకటించిన నిబంధనలు అప్పుడే ఇచ్చి ఉంటే వ్యాపార లావాదేవీలకు ఇంక కాస్త ప్రయోజనకారిగా ఉండేది. నాల్గవ దశ నుండి, సడలింపుల నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వాలకే ఎక్కువ శాతం వదిలివేశారు. దీని వల్ల మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు ఐదవ దశ లాక్‌డౌన్ లోనికి దేశం ప్రవేశించింది. ఈసారి ఇచ్చిన మినహాయింపులు దశలవారీగా ఉన్నాయి. కేవలం కంటైన్‌మెంట్ జోన్లలోనే లాక్‌డౌన్ కొనసాగనుంది. కంటైన్ మెంట్ కేంద్రాలను నిర్ణయించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని కేంద్రం ప్రకటించింది. అలాగే, బఫర్ జోన్ల నిర్ణయాధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. పరిస్థితులను అనుసరించి రాష్ట్రాలు నిర్ణయం తీసుకుంటాయి. రాత్రి వేళల కర్ఫ్యూ సమయం తగ్గించారు. ఇది వ్యాపార లావాదేవీలకు, కార్యాలయాల నిర్వహణకు కాస్త వెసులుబాటవుతుంది. హోటల్స్, రెస్టారెంట్లు, ఆతిథ్య సేవలు, షాపింగ్ మాల్స్ కు కూడా అనుమతులు వచ్చేశాయి. అందరూ ఊహించినట్టుగానే, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు కూడా ఇక నుండి తెరుచుకుంటాయి. పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధిపతులతో మాట్లాడిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు తల్లిదండ్రులు, యాజమాన్యాలతో చర్చించి, దాని ఆధారంగా వచ్చిన సమాచారం మేరకు నివేదికలు తయారుచేసి కేంద్రప్రభుత్వానికి పంపాలి. విద్యా సంస్థల పునఃప్రారంభంపై కేంద్ర నిర్ణయం జూలైలోనే ఉంటుంది. ఈ విషయం కూడా కేంద్రం పేర్కొంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు జులై నుండి విద్యా సంస్థలు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నాయి. మెట్రో రైళ్లు, అంతర్జాతీయ విమానాలపై నిషేధం కొనసాగనుంది. అంతర్జాతీయ విమానాలకు సంబంధించి ఈ నిర్ణయం మంచిదే. కానీ, మెట్రో రైళ్లకు అనుమతి ఇవ్వడం అవసరమేనని భావించాలి. సినిమా హాల్స్ ప్రారంభించాలనే ఒత్తిడి సినిమా పరిశ్రమల నుండి రాష్ట్ర ప్రభుత్వాలపై బలంగానే ఉంది. ఇది వినోదానికి సంబంధించిన అంశం. దేశవ్యాప్తంగా ఒకేసారి సినిమాహాళ్లకు అనుమతులు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలు కూడా కోరుకుంటున్నాయి. హోమ్ శాఖా మంత్రి (ఎం.ఓ.ఎస్) కిషన్ రెడ్డి కూడా ఈ దిశగానే తెలుగు సినిమా పెద్దలకు హామీ ఇచ్చారు. సినిమా హాల్స్ ప్రారంభం కాస్త ఆలస్యమైనా, షూటింగ్స్ చేసుకోడానికి నియమాలతో కూడిన అనుమతులు ఇచ్చే ఆలోచనలోనే తెలుగు ప్రభుత్వాలు ఉన్నాయి. త్వరలో అధికారికంగా ప్రకటనలు రానున్నాయి. జిమ్ములు, స్విమ్మింగ్ పూల్స్, బార్లు, పార్కులపై నిషేధం కొనసాగిస్తున్నట్లుగానే ప్రకటించారు. పార్కులు ఎలా ఉన్నా, జిమ్ములు, బార్లు, స్విమ్మింగ్ పూల్స్ పై ఇంకా కొంతకాలం నిషేధం కొనసాగితేనే మంచిది. రాజకీయ, సామాజిక, క్రీడా కార్యక్రమాలపై కూడా నిషేధం కొనసాగించవచ్చు. అంతర్రాష్ట్ర రవాణాపై నిషేధం ఎత్తివేయడం మంచి నిర్ణయం. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా, మహారాష్ట్ర ప్రభుత్వాలు పొరుగు రాష్ట్రాల రాకపోకలకు సుముఖంగా లేవు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అంతర్రాష్ట్రాల రవాణాను మొదటినుండీ స్వాగతిస్తున్నారు. కరోనా ప్రభావం మహారాష్ట్ర, తమిళనాడులో చాలా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడికి వెళ్లకపోవడమే శ్రేయస్కరం. కానీ, తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు జరగాలి. నిషేధం సరియైన చర్య కాదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించి త్వరగా నిర్ణయం తీసుకుంటారని ఆశిద్దాం. జూన్ నెలలో మరి కొన్ని సడలింపులు వచ్చే అవకాశం ఉంది. లాక్‌డౌన్ నుండి సడలింపులు పెరుగుతున్నాయి. కరోనా కేసులు అంతే రీతిలో పెరుగుతూ ఉన్నాయి. మరణాల రేటు తక్కువగా ఉండడం, కోలుకునేవారి శాతం ఎక్కువగా ఉండడం ఆశావాహమైన పరిణామం. స్వేచ్ఛ వేరు. విశృంఖలత్వం వేరు. కొన్ని రంగాలు, కొంతమంది ప్రజలు ఈ స్వేచ్ఛను విచ్చలవిడిగా వాడుకుంటున్నారు. దాని పర్యవసానమే, కరోనా కేసులు పెరగడానికి ఉన్న కారణాలలో ప్రధానమైంది. లాక్‌డౌన్, కరోనా దుష్ప్రభావాలతో ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, మానసికంగా చాలా నష్ట పోయాం. అన్ని అంశాలను బేరీజు వేసుకుంటూ, ప్రభుత్వాల నిబంధనలకు తగిన గౌరవం ఇస్తూ, సేవలు అందిస్తున్న వారిపట్ల మర్యాద, కృతజ్ఞతలు పాటిస్తూ, ఆరోగ్యాన్ని -ఆర్థికాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుదాం.



చీఫ్ ఎడిటర్

దళిత తొలి ముఖ్యమంత్రి



దళితనేత దామోదరం సంజీవయ్యను ముఖ్య మంత్రిగా నియమించాలని నెహ్రూ నిర్ణయం తీసుకు న్నాడు... అగ్ర కులాల ఆధి పత్యం అధికం కదా కాంగ్రెస్ లో... కొందరు ఆంధ్రప్రదేశ్ నాయకులు ఓ దళితుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం ఏమిటంటూ సహించలేక పో యారు... సంజీవయ్య అవినీ తిపరుడు అని, లక్షలాది రూపాయలు సంపాదించారంటూ నెహ్రూకు ఫిర్యాదులు వెళ్లాయి... కాంగ్రెస్‌లో ఇలాంటి ఆకాశ రామన్న లేఖలు మామూలే కదా... నెహ్రూ వాటిని నమ్మలేదుగానీ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మొండిపట్టుతో కొంతకాలం సీఎం మార్పిడి నిర్ణయం వాయిదా పడింది.

నెహ్రూ తన ఆంతరంగిక మిత్రుడు ఒకాయనకు ఓ బాధ్యత అప్పగిం చాడు... తను వెళ్లి సంజీవయ్య మీద రహస్య విచారణ చేసి నివేదిక ఇవ్వాలి... ఆయన హైదరాబాద్ వచ్చాడు... కాంగ్రెస్ నాయకుడు చక్రపాణిని కలిసి, తను వచ్చిన పని చెప్పాడు... సంజీవయ్య గురించి చక్రపాణికి తెలుసు... ఐనా ఓ నివేదిక కావాలి కదా... ప్రధాని ఆదేశం కూడా... అందుకని ఇద్దరూ కలిసి సంజీవయ్య ఊరు వెళ్లారు రహస్యంగానే.

ఊరి పొలిమేరల్లోనే ఓ పూరిపాక ముందు కారు ఆపాడు చక్రపాణి... ఆ పాక బయట ఓ ముసలావిడ కట్టెల పొయ్యితో కుస్తీ పడుతోంది... మట్టి కుండలో అన్నం ఉడుకుతోంది... పదే పదే పొగగొట్టంతో మంటను ఊదుతూ నానా అవస్థలూ పడుతోంది ఆమె... ఏమిటిక్కడ ఆపారు అన్నాడు ఆ ఢిల్లీ ప్రతినిధి... సంజీవయ్య ఇల్లు అదే, ఆమె ఆయన తల్లి అన్నాడు చక్రపాణి.

చక్రపాణి ఆమెకు ఓ నమస్కారం పెట్టాడు... ఈ ఢిల్లీ ప్రతినిధి విస్తుపోయి చూస్తూనే ఉన్నాడు... 'అమ్మా, ఇప్పుడు మీ అబ్బాయి మంత్రి కదా, ఈసారి ముఖ్యమంత్రి కాబోతున్నాడు' అన్నాడు చక్రపాణి... ఆమెకు అవన్నీ ఏం తెలియవు... "అవునా బాబూ, ముఖ్యమంత్రి అంటే మావాడి జీతం ఏమైనా పెరుగుతుందా..? ఈ కట్టెల పొయ్యితో మరీ అవస్థ అయిపోతోంది... ఓ బొగ్గుల కుంపటి కొనరా నాయనా అంటే డబ్బుల్లేవు అంటున్నాడు..." అన్నదామె చెమటలు తుడుచుకుంటూ... ఊరిలోకి పోదాం పదండి అన్నాడు చక్రపాణి... "ఇంకా దేనికి విచారణ..? పదండి హైదరాబాద్‌కు" అన్నాడు సదరు ఢిల్లీ ప్రతినిధి... తరువాత వారం రోజులకే ఏపీ తొలి దళిత ముఖ్యమంత్రి అయ్యాడు సంజీవయ్య.

కరోనా పాజిటివ్ రోగులొస్తే కచ్చితంగా చేర్చుకోవాలి

గవర్నర్ తమిళసైలి



హైదరాబాద్: కరోనా పాజిటివ్ రోగులొస్తే కచ్చితంగా చేర్చుకుని మెరుగైన చికిత్స అందించాలని గవర్నర్ తమిళ సై ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలకు తేల్చి చెప్పారు. అంతేకాదు.. నాణ్యమైన చికిత్సతో రోగులకు భరోసా కల్పించేలా వ్యవహరించాలని గవర్నర్ స్పష్టం చేశారు. తెలంగాణలో కరోనా వ్యాప్తి రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తమిళ సై వివిధ ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో నేరుగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో 11 ప్రయివేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు పాల్గొన్నాయి. కరోనా కల్లోలంతో భయాందోళనలు పెరిగిపోతున్న దృష్ట్యా అనేక కారణాలతో ప్రైవేట్ హాస్పిటల్స్ కు వచ్చే రోగుల పట్ల బాధ్యతగా.. మానవత్వంతో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందుతలేదన్న ఫిర్యాదులను ప్రస్తావిస్తూ.. కార్పొరేట్ హాస్పిటల్స్ కు వచ్చే పాజిటివ్ రోగులకు భరోసా కల్పించాలన్నారు. పాజిటివ్ బాధితులు హాస్పిటల్స్ రాగానే కచ్చితంగా చేర్చుకోవాలని, నాలుగైదు హాస్పిటల్స్ తిరిగే పరిస్థితి రాకూడదని గవర్నర్ హెచ్చరించారు. అలాగే టెస్టులు బాధ్యతతో చేయాలని.. అవసరమైతే కార్పొరేట్ హాస్పిటల్స్ కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల సహకారం తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేషెంట్స్ నుండి అధిక చార్జీలు వసూలు చేయకూడదని గవర్నర్ తమిళ సై స్పష్టం చేశారు.

ప్రశ్నించేగొంతుకకు ప్రతీక సాహిత్యంలో 'శంబుక'



ఆచార్య **దార్ల వెంకటేశ్వరరావు,**
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్,
ఫోను: 9182685231



భారతీయ సాహిత్యంలో 'శంబుక' పాత్ర నాటినుండి – అంటే త్రేతాయుగం నుండీ ప్రశ్నించే, ఆలోచించే గొంతుకకు ప్రతీకగా నిలుస్తుంది. శ్రీమద్రామాయణం, దాన్ని ఆధారంగా చేసుకొని వచ్చిన రచనలెన్నింటిలోనో శంబుక పాత్ర పీడిత ప్రజల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. ఒక చైతన్యానికి, ఒక తిరుగుబాటుకీ, ఒక హేతుతత్త్వ ఆలోచనా ధోరణికి 'శంబుక' పాత్ర నిదర్శనంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో కువెంపు (1904 –1994) 'శూద్రతపస్వి', త్రిపురనేని (1887%–1943) 'శంబుకవధ' (ఉత్తరరామచరిత) నాటకాలను తులనాత్మకంగా పరిశీలించడం ఈ పత్ర లక్ష్యం. ప్రముఖ కన్నడ రచయిత కుప్పళ్ళి వెంకటయ్య గౌడ పుట్టప్పగారే 'కువెంపు' కలంపేరుతో ప్రసిద్ధి చెందారు. అలాగే తెలుగులో హేతువాదరచయితగా పేరుప్రఖ్యాతులు పొందిన త్రిపురనేని రామస్వామిచౌదరిగార్ని 'త్రిపురనేని'గా సాహితీవేత్తలు పిలుస్తుంటారు.

'కువెంపు' కన్నడంలో రాసిన పద్యనాటిక 'శూద్రతపస్వి' (1944)ని శంకరగంటి రంగాచార్యులు తెలుగులో అనువదించారు. అది ఆగస్టు,1985 భారతి మాసపత్రికలో ప్రచురితమైంది. త్రిపురనేని 'శంబుకవధ' నాటకాన్ని 1922లో ప్రచురించారు. రెండూ పద్యనాటికలే. కానీ, కువెంపు నాటికలో భాష సరళగ్రాంథికంలోను, త్రిపురనేని నాటికలో గ్రాంథికంలోను ఉంది. త్రిపురనేని సుమారు 26 పుటల్లో ఆర్య-ద్రావిడ సిద్ధాంతాన్ని వివరిస్తూ స్వీయపీఠికను రాశారు. ఈ రెండు నాటికల్లోని అంశాలను విశ్లేషణ చేసుకునేందుకు వీలుగా వాల్మీకి రాసిన శ్రీమద్రామాయణంలో గల శంబుక' వృత్తాంతాన్ని ముందుగా తెలుసుకుంటే బాగుంటుందనుకుంటున్నాను.

శ్రీమద్రామాయణంలో 'శంబుక' వృత్తాంతం:

వాల్మీకి 'శ్రీమద్రామాయణం'లో ఉత్తరకాండ 73 నుండి 76వ సర్గవరకు శంబుకవృత్తాంతాన్ని వర్ణించాడు. పల్లెటూరునుండి ఒక బ్రాహ్మణుడు తన కుమారుని శవాన్ని తీసుకొని, రాజద్వారం దగ్గర పెట్టుకొని దు:ఖిస్తుంటాడు. ఇతర రాజ్యాలలో వయసు పైబడకముందే బాలలు చనిపోకపోయినా, రాముని పాలనో చిన్నవయసులోనే బాలలు చనిపోతున్నారు. రాజు చరిత్ర మంచిది కాకపోయినా, రాజు దోషాలు చేసినా, రాజ్యానికి రక్షణలేకపోయినా అకాలమృత్యువు సంభవిస్తుంటుందని నిందిస్తూ రోదిస్తుంటారా బ్రాహ్మణ దంపతులు. ఈ విషయం తెలిసిన రాజైన శ్రీరాముడు తన మంత్రులు, గురువైన వసిష్ఠుడు, సోదరులను, ఆయా గణప్రముఖులను సమావేశపరిచి చర్చించాడు. కృతయుగంలో బ్రాహ్మణులు, త్రేతాయుగంలో బ్రాహ్మణ, క్షత్రియులు, ద్వాపరయుగంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, కలియుగంలో శూద్రులతో సహా అన్ని వర్ణాలవారూ తపస్సు చేసుకోవచ్చు.

"బ్రహ్మ క్షత్రం చ తత్సర్వం యత్పూర్వమవరం చ యత్
యుగ యోరుభయోరాసీత్సమవీర్య సమన్వితమ్"

(శ్రీమద్రామాయణం, శ్లోకం: 13, 74 వ సర్గ)

(కృతయుగంలో బ్రాహ్మణజాతి తపోవీర్యములచేత అధికముగా ఉండెడిది. అప్పుడు క్షత్రియజాతి తక్కువగా ఉండెడిది. త్రేతాయుగంలో క్షత్రియజాతికి కూడ తపస్సు ఉండుటచేత అపుడు ఈ రెండు జాతులూ తపోవీర్యములచేత సమానములైనవి. త్రేతాయుగబ్రాహ్మణజాతి కూడ కృతయుగ బ్రాహ్మణజాతికంటె న్యూనమే) వాల్మీకి, శ్రీమద్రామాయణం, వ్యాఖ్యాత: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు, ఉత్తరకాండము (రెండవ సంపుటం), ఆర్ష విజ్ఞాన ట్రస్టు, హైదరాబాదు, 1995, పుట: 391)

బ్రాహ్మణ, క్షత్రియాధిక్యతా సంఘర్షణలు త్రేతాయుగంలో మొదలైయ్యాయి. అందువల్ల చాతుర్వర్ణ వ్యవస్థను త్రేతాయుగంలోనే ఏర్పాటుచేశారు.

"అపశ్యన్తస్తు తే సర్వే విశేషమధికం తత:
స్థాపనం చక్రిరే తత్ర చాతుర్వర్ణ్యస్య సమ్మతమ్ "
(శ్రీమద్రామాయణం, శ్లోకం: 14, డెబ్బైనాలుగవ సర్గ)

(అప్పుడు శాస్త్రనిర్మాతలు బ్రాహ్మణ క్షత్రియులలో భేదము అధికముగా లేకపోవుటచేత అందరికీ సమ్మతమైన చాతుర్వర్ణ్యవ్యవస్థను ఏర్పాటు చేశారు. వ్యాఖ్యాత: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు, ఉత్తరకాండము (రెండవసంపుటం),ఆర్ష విజ్ఞాన ట్రస్టు, హైదరాబాదు, 1995, పుట: 391) త్రేతాయుగం నుండీ వైశ్య, శూద్రులు మిగితా పై రెండు వర్ణాల వారికీ శుశ్రూష ధర్మచేయడమే ధర్మం. తర్వాత అది కేవలం శూద్రులకే పరమధర్మమైంది. ఈ యుగానంతరం అంటే ద్వాపరయుగంలో అధర్మం భూమిమీద రెండవపాదం మోపింది. తన ధర్మం కాకపోయినా శంబుకుడు తపస్సు చేస్తున్నాడు. రాజ్యాన్ని ధర్మంగా పాలించే రాజుకి ధర్మంలోను, పుణ్యంలోను ఆరవవంతు చేరుతుంది. అటువంటి రాజు ప్రజలను రక్షించాలి. కాబట్టి, పాపకార్యాల్ని ఆపి, ధర్మాన్ని కాపాడాలి. శంబుకుడు తన యుగం రాకుండానే తపస్సు చేయడం అధర్మం, పాపం. దాన్ని రాజు ఆపాలని నారదుడు వివరిస్తాడు.అప్పుడు శ్రీరాముడు ఆ బ్రాహ్మణ బాలుణ్ణి బతికిస్తానని, ఆ శవాన్ని తాను వచ్చేవరకు జాగ్రత్తగా ఉంచమని ఆజ్ఞాపిస్తాడు.తనరాజ్యంలో దక్షిణదిక్కున ఒక పర్వతప్రాంతంలో శంబుకుడు అధోముఖంగా తపస్సుచేస్తుంటాడు.శ్రీరాముడు అతనిజాతినీ, తపస్సు కారణాన్ని అడిగితెలుసుకుంటాడు.

"శూద్రయోన్యాం ప్రజాతోస్మి తపఉగ్రం సమాస్థిత:
దేవత్వం ప్రార్థయే రామ సశరీరో మహాశయశ :
న మిథ్యాహం వదే రామ దేవలోక జిగీషయా
శూద్రం మాం విద్ధి కాకుత్థ్స శమ్బూకో నామ నామత:"
(శ్రీమద్రామాయణం, 2-3 శ్లోకాలు, 76 సర్గ)

తాను శూద్రజాతికి చెందిన శంబుకుడుననీ, తన శరీరంతోనే దేవత్వాన్ని పొందడానికి, దేవలోకాన్ని జయించడానికీ తపస్సు చేస్తున్నానని శంబుకుడు శ్రీరామునికి వివరిస్తాడు. ఆ మాట వింటుండగానే శ్రీరాముడు తన ఖడ్గంతో శంబుకుని శిరస్సుని ఖండిస్తాడు. ఇదంతా గమనిస్తున్న దేవతలంతా సంతోషించి, శ్రీరాముణ్ణి అనేక విధాలుగా ప్రశంసిస్తారు. తానిచ్చిన మాటప్రకారం బ్రాహ్మణ బాలుణ్ణి బతికించేవరమివ్వమని దేవతలను కోరతాడు. శంబుకుణ్ణి వధించిన వెంటనే ఆ బ్రాహ్మణ బాలుడు బతికాడని దేవతలు వివరిస్తారు.

ఈ ఇతివృత్తాన్ని ఆధారం చేసుకునే తర్వాత అన్ని రామాయణాల్లోను శంబుకవధను చిత్రించారు. అలాగే తెలుగులో త్రిపురనేని రామస్వామి చౌదరి, కన్నడంలో కువెంపు శంబుకుడికి సంబంధించిన నాటకాల్ని రాశారు. త్రిపురనేని తన పద్యనాటకంలో రసావిష్కరణకు అవకాశం ఉండటం వల్ల తానీ నాటకాన్ని పద్యంలో రాసినట్లు వివరించారు. అయితే, నాటకాన్ని పద్యంలో రాసినా, పద్యనాటకాలకంటే వచననాటకాలు రావలసిన అవసరం ఉందనీ, ఈ నాటకరచన చేసేనాటికే వచననాటకాలు ప్రేక్షకులను అలరిస్తున్న విషయాన్ని స్వీయపీఠికలో పేర్కొన్నారు.

త్రిపురనేని 'శంబుకవధ':

ఆర్యులతో పోరాడి ఓడినవాళ్ళు ద్రావిడులనీ, శంబుకుడు ద్రావిడుడనీ వర్ణించారు. శంబుకుడు తపస్సు చేస్తూ శిష్యగణాన్ని ఏర్పరుచుకొని మతబోధ చేస్తూ హిందూమతం పట్ల వ్యతిరేకతను పెంపొందిస్తున్నాడని బ్రాహ్మణవర్గం ఆరోపణ.ఆ ఆరోపణను ఋజువుచేయడానికి అశ్వనీ దేవతలతో మాట్లాడి బ్రాహ్మణ బాలుణ్ణి తాత్కాలికంగా చనిపోయినట్లు ఆ రాజ్యానికి రాజైన శ్రీరాముణ్ణి నమ్మిస్తారు. అలా నమ్మించడానికి బ్రాహ్మణులు నారదుడు, వసిష్ఠుడు ఒక ప్రణాళిక ప్రకారం శ్రీరాముణ్ణి ప్రేరేపిస్తారు. శ్రీరాముడు స్వయంగా శంబుకుని చిదానందాశ్రమానికి వెళ్ళి ఆ ప్రశాంతవాతావరణాన్ని, శిష్యగణాన్ని చూసి ఆనందపరవశు డవుతాడు. తర్వాత శంబుకుడితో మాట్లాడతాడు. స్మృతుల ప్రకారం శూద్రులు తపస్సు చేయకూడదని చెప్పడానికి వచ్చిన శ్రీరాముడికి శంబుకుడు కాలానుగుణంగా అనేక స్మృతులు వచ్చిన విషయాన్ని విశదీకరిస్తాడు. శ్రీరాముడు ఆ వాదనకు సంతోషించినా, తన నిర్ణయాన్ని ప్రకటించకుండా అందరితోను ఆలోచిస్తానంటాడు. ఈలోగా తన కులగురువు వసిష్ఠుడు వచ్చి బ్రాహ్మణ-క్షత్రియవర్ణాల వారి ఆధిక్యత నిలబడాలంటే, స్మృతుల్ని రాజు కాపాడవలసిందేనంటాడు. మనసు అంగీకరించకపోయినా శ్రీరాముడిని బలవంతంగా చిన్నపిల్లవాడిని తీసుకెళ్ళి చేతికి ఖడ్గాన్నిచ్చినట్లు శంబుకుణ్ణి చంపిస్తాడు.

నాటకంలో పద్యాలు చాలా బాగున్నాయి. జాతి, వృత్తపద్యాలు సందర్భానుగుణంగా రసోచితంగా వర్ణించారు త్రిపురనేని. నాటకం చదువుతున్న పాఠకుడికి శ్రీరాముడొక అవతారపురుషుడుగా కాకుండా రాజ్యాధికారాన్ని నిర్వహించే రాజుగానే కనిపిస్తాడు. అలాంటి రాజుని బ్రాహ్మణులు తమ శాస్త్రపాండిత్యంతో అవతారపురుషుణ్ణి చేశారనే అవగాహన కలుగుతుంది. శంబుకుణ్ణి చంపితేనే అలా అవతారపురుషుడుగా పిలిపించుకొనేలా ఋషులు చేయగలరని ఒక సందర్భంలో వసిష్ఠుడు చెప్తాడు. బహుశా ఆ బలహీనత వల్లనే శ్రీరాముడు తనకిష్టం లేకపోయినా శంబుకుణ్ణి వధించాడని నాటకం చదివేవారికి అనిపిస్తుంది. శ్రీరాముడికి అవతారపురుషుడిగా ప్రఖ్యాతి పొందాలనే తపన ఉండబట్టే వాల్మీకి కంటే ముందే హనుమంతుడు రామాయణాన్ని రాసినా దానిలో శ్రీరాముణ్ణి సామాన్యమానవుడిగా వర్ణించడం వల్ల ఆ కావ్యాన్ని ప్రచారం చేయించకుండా సముద్రంలో కలిపేసినట్లు నాటకంలో వివరించారు కవి. త్రిపురనేని ఆర్య-ద్రావిడ సిద్ధాంతాన్ని వివరించడానికి, శూద్రులకు బ్రాహ్మణ వర్ణం చేసిన కుట్రలను హేతుబద్ధంగా వివరించడానికి ఈ నాటకాన్ని రాశారనే అభిప్రాయం కలుగుతుంది.

కువెంపు 'శూద్రతపస్వి':

శంబుకాశ్రమద్వారం దగ్గర ఒక పెద్దవృక్షం ఉంటుంది. హఠాత్తుగా పెనుగాలి వీస్తుంది. పక్షులు అరుస్తుంటాయి. జంతువులన్నీ అటూ ఇటూ పరుగుపెడుతుంటాయి. ఎక్కడనుండో ఆర్తధ్వనులు వినిపిస్తుంటాయి. ప్రశాంతమైన ఆ వనప్రాంతమంతా చిందరవందరగా మారిపోతుంది. ఇలా నాటకం ప్రారంభమవుతుంది. ఆ ఆశ్రమంలో జరక్కూడనిదేదో జరుగుతుందని ఆ దృశ్యం సూచిస్తుంది. నాటకంలో సాధారణంగా నాందీగీతంలో ప్రార్థనతో పాటు నాటకసూచ్యార్థాన్ని వర్ణిస్తుంటారు. అది ఈ దృశ్యవర్ణన ద్వారా ఆ ఆశ్రమంలో సంభవించబోయేదేమిటో సూచించాడు కవి. నాటక ప్రదర్శనలో ఈ దృశ్యం చాలా బాగుంటుంది. వృక్షాన్ని మానవరూపంలో వర్ణించి, ఆ ఆశ్రమాన్ని ఆ వృక్షం కాపాడుతున్నట్లు, ఆ ఆశ్రమం దగ్గరకు మృత్యువు రావడం

వల్లనే వాతావరణమంతా బీభత్సంగా మారిపోయిందని పాఠకుడు గ్రహిస్తాడు. మృత్యువుని కూడా మానవీకరించారు కవి. వృక్షాన్ని, మృత్యువునీ జూవతీంశీఅఱటఱఅష్‌ఱశీఅచేయడం కవి భావుకతకు నిదర్శనం.

మొదటి దృశ్యంలో భైరవుడు(వృక్షం రూపంలో ఆశ్రమాన్ని రక్షించే రక్షకుడు)కీ, మృత్యువుకీ దీర్ఘమైన సంభాషణ జరుగుతుంది. శంబుక మహర్షికి అధర్మాన్ని తలపెట్టి, ఆశ్రమంలో ఒకడు ప్రవేశించాడనీ, అందుకే తాను వచ్చాననీ మృత్యువు వివరిస్తాడు. రెండవ దృశ్యంలో -శ్రీరాముడు నివాసం ఉండే ఉద్యానవనం దగ్గర్లో, ఒక బ్రాహ్మణుడు తన పుత్రుడు చనిపోయాడని ఏడుస్తుంటాడు. శూద్రుడైన శంబుకుని తపస్సువల్లనే తన పసివాడు చనిపోయాడనేది అతని ఆరోపణ. ఈ రాజ్యాన్ని రామరాజ్యమంటారనీ, కానీ అధర్మంగా తన కుమారుడు చనిపోయాడనీ నిందిస్తూ, తాను కూడా ఈ రాజభవనం దగ్గరే చనిపోతాననీ, అప్పుడు శ్రీరామునికి బ్రహ్మహత్యా దోషం సంక్రమిస్తుందనీ శపిస్తుంటాడు. ఆ ఏడుపు విని శ్రీరాముడు, ఆ వృద్ధబ్రాహ్మణుని దగ్గరకు వస్తాడు. శ్రీరాముణ్ణి అనేకవిధాలుగా స్తుతించి శిష్టరక్షణ, దుష్టశిక్షణా చేస్తే తనకుమారుడు బతికి వస్తాడని ప్రార్థిస్తాడు.

మూడవ దృశ్యంలో- శంబుకాశ్రమానికి చేరుకున్న శ్రీరాముడు ఆ ప్రశాంతమైన పరిసరాలను చూసి ఆనందిస్తాడు. శూద్రడు తపస్సు చేయడం తప్పుకాదనీ, అయినప్పటికీ తమరు వేదమూర్తులు, శాస్త్రానుసారులు కనుక, తమ అభీష్టానుసారంగానే ధర్మాన్ని రక్షిస్తానని హామీ ఇస్తాడు శ్రీరాముడు. ఆశ్రమంలో శ్రీరాముడికి మాత్రమే కనిపించిన మృత్యువుతో మాట్లాడతాడు. ధర్మాన్ని కాపాడ్డానికే వచ్చానని మృత్యువు చెప్తుంది. అక్కడున్న శంబుకుణ్ణి చూసి శ్రీరాముడు తన విల్లుని ఎక్కుపెట్టేనెపంతో నమస్కరిస్తాడు. బ్రాహ్మణుని కోరిక మేరకు బ్రహ్మాస్త్రాన్ని సంధించి " అధర్మ ద్రోహిని దగ్ధం చేయి" అని బాణాన్ని వదులుతాడు. ఆ బాణం తపస్సు చేసుకుంటున్న శంబుకుని దగ్గరకు వెళుతుంది. దాన్నే మృత్యువు కూడా అనుసరిస్తుంది. విచిత్రంగా- బాణం, మృత్యువు రెండూ శంబుకుడికి నమస్కరించి వెనక్కి తిరిగి వస్తుంటాయి.

ఆ దృశ్యాన్ని చూసి శ్రీరాముడు, కారణమేమిటని బ్రాహ్మణుణ్ణి అడుగుతాడు. శూద్రుని తప: ఫలం వల్ల బ్రహ్మాస్త్రం కూడా నిష్ఫలమైపోయిందని బ్రాహ్మణుడు అంగీకరిస్తాడు. బ్రహ్మాస్త్రం మాత్రం నిష్ఫలం కాదనీ, అది అధర్మపరుల్ని నాశనం చేస్తుందనీ శ్రీరాముడు వెల్లడిస్తాడు. దాంతో ఆ బ్రాహ్మణుడు భయపడి పూజ్యనీయుడైన శంబుక మహర్షిని అవజ్ఞ చేసానని, తనని రక్షించమనీ శ్రీరాముణ్ణి వేడుకుంటాడు. ఉత్తమ క్రియలకు, ఉత్తమ హృదయానికి కేవలం శాస్త్రాదేశాలు సరిపోవు. యుక్తాయుక్త వివేచన లేకపోతే శాస్త్రవిజ్ఞానం కూడా హానిచేస్తుందని గ్రహించమని బోధిస్తాడు శ్రీరాముడు.

బ్రాహ్మణుడు శంబుక మహర్షికి సాష్టాంగ దండప్రమాణం చేస్తాడు. పూలవాన కురుస్తుంది. పిల్లవాడు బతికి వస్తాడు. శ్రీరాముడు ఆ బాలుణ్ణి ఎత్తుకుని ముద్దాడి, తపస్సులో నిమగ్నమై ఉన్న శంబూకుణ్ణి చూపించి మొక్కమంటాడు. ఆ బ్రాహ్మణబాలుడితో పాటు బ్రాహ్మణుడు కూడా శంబుకమహర్షిని మొక్కుతారు. శంబుకుడు అందర్నీ ఆశీర్వదించడంతో నాటకం ముగుస్తుంది.

కువెంపు నాటకంలో శంబుకమహర్షి పాత్ర కేంద్రంగానే రచనంతా నడుస్తుంది. కానీ, నాటకంలో శంబుకునికి ఒక్క సంభాషణ కూడా లేకుండా దాన్ని కొనసాగించడం నాటకరచనలో ఒకవిశేషం. నాటకంలో శ్రీరాముడు ధర్మాన్ని కాపాడే రాజుగానే చిత్రితమైయ్యాడు.

నాటకం చదువుతున్న పాఠకుడికి ఆద్యంతం ఆ పాత్రలు కళ్లెదుటే కదులుతున్నట్లుంటాయి. ఆశ్రమాన్ని రక్షిస్తున్న వృక్షం 'భైరవుడు'గా మారడం, ఆశ్రమంలోకి ప్రవేశించిన మృత్యువుతో సంభాషించడం వంటివి పాఠకునికి మనసులో చక్కని దృశ్యాల్ని ఆవిష్కరిస్తాయి. వృక్షానికీ, మృత్యువుకీ మానవరూపమివ్వడం ప్రదర్శనయోగ్యంగా ఉండే చక్కని ప్రయోగం. అలాగే చివరిలో శంబుకమహర్షిని పొదలన్నీ చుట్టుముట్టడం వంటివి, ఆ పొదల్లో నుండి శంబుకుని హస్తాలు మాత్రమే ఆశీస్సులు అందించడం వంటివన్నీ నేడు చలనచిత్రాల్లో గ్రాఫిక్స్ లాంటి అనుభూతిని కలిగిస్తుంటాయి.

కువెంపు నాటకం చదువుతుంటే మానవుల మధ్య ప్రేమానురాగాలు వ్యక్తమవుతాయి. రాజు వివేకవంతుడైతే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటారనే ప్రబోధం కలుగుతుంది. శిక్షించడం కంటే మనిషిలో పరివర్తన తీసుకురావడానికి క్షమాగుణమనేది గొప్ప ఆయుధగా పనిచేస్తుందని నిరూపించినట్లనిపిస్తుంది. కులాలనేవన్నీ కాలానుగుణంగా శ్రమవిభజన ఫలితంగా వచ్చినా, అవి కాలాలనుగుణంగా నశించకతప్పదని, మానవత్వమే నిలుస్తుందనే సందేశాన్నిస్తున్నట్లనిపిస్తుంది. మూలంలో వాల్మీకి వర్ణాశ్రమధర్మరక్షణలో భాగంగా శంబుకుని శిరస్సు ఖండించినట్లు వర్ణించాడు. త్రిపురనేని తన నాటకంలో కూడా నాటకానుగుణంగా కొన్ని మార్పులు చేసినప్పటికీ శంబుకుణ్ణి శ్రీరాముడు వధించినట్లే వర్ణించారు. కువెంపు నాటకంలో శంబుకవధ జరగలేదు. కువెంపు ప్రధానమైన ఇతివృత్తాన్నెందుకలా మార్పు చేశారనిపిస్తుంది. చారిత్రకేతివృత్తాన్ని అలా మార్పు చేయడం సమంజసమేనా అనికూడా అనిపిస్తుంది. పురాణేతిహాసాల్ని కావ్యాలు, నాటకాలుగా రాసేటప్పుడు కొన్ని మార్పులు చేయడం సహజంగానే జరుగుతుంది. ఈ మార్పు చేయడం అనేది రచయిత దృక్పథాన్ని బట్టి ఉంటుంది. శంబుకుడు పాత్ర నాడు ఆలోచనాపరులైన పీడితులు, దళితుల (ఆనాడు ఆ పదం లేకపోయినా, వర్ణవ్యవస్థవల్ల అవమానాలకు, సమాజంలో నిరాదరణకు గురౌతున్నవారు) ఆలోచనలకు ప్రతీకగా తీసుకోవచ్చు. అయితే శుంబుకుడి ఆలోచనలన్నీ లోకాయతం (చార్వాకం)లో భాగంగా చూసి, వాటిని భారతీయులు కొట్టిపారేయడం గమనించాలి. ఒక ప్రశ్నించే గొంతుకకు ప్రతీక శంబుకుడని మాత్రం శంబుక ఇతివృత్తంతో వచ్చిన ఏభాషలోని రచనలను చూసినా స్పష్టమవుతుంది.

(పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 2014 అక్టోబరు, 17-18 తేదీలలో కువెంపు సాహిత్యం పై నిర్వహించిన జాతీయసదస్సులో సమర్పించిన పరిశోధన పత్రం)

పర్యావరణ విద్య - దాని ప్రాముఖ్యత

- ప్రొ॥ కె.పి.సుబ్బారావు



పర్యావరణం చాలా విస్తృతమైంది. సమగ్రమైనది కూడా. పర్యావరణమంటే సాధారణంగా మనల్ని ఆవరించి ఉండే భౌతిక, జీవపరిసరాలే. శాస్త్రీయంగా చూస్తే మనం భూమిమీద వివిధరకాలైన జీవుల, నిర్జీవుల ప్రకృతి ప్రభావాలు మధ్య జీవిస్తున్నాం. దీనినంతా పర్యావరణం అనవచ్చు.

పర్యావరణం రెండు రకాలు. ఒకటి సాంస్కృతిక పర్యావరణం, రెండు సహజసిద్ధ పర్యావరణం. అలవాట్లు వైఖిరులు, ఆర్థిక, సాంఘిక, మానసిక అంశాలు, ప్రజాసముదాయం, కుటుంబం, పాఠశాల లాంటివి సాంస్కృతిక పర్యావరణం క్రిందికి వస్తే, కాలుష్యం, ఆమ్ల వర్షాలు, ఓజోన్‌పొర క్షీణత, భూమి వేడెక్కడం లాంటివి సహజ సిద్ధపర్యావరణం అవుతుంది. పర్యావరణ సమస్యల పరిష్కరించడానికి ప్రజాచైతన్యం ఎంత అవసరమో, విద్యార్థులకు చిన్న తనంనుండే పర్యారణం పై అవగామన కల్పిస్తే పెద్ద వారైనాక పర్యావరణం గురించి ఆలోచిస్తారు. మమస్య పరిష్కారానికి బాటలు వేస్తారు. పర్యావరణ వాదులుగా, సైంటిస్టులుగా మారే అవకాశ ముంది. అందుకే పర్యావరణ విద్య చాలా అవసరం.

ప్రతీ జీవి తన జీవనానికి పర్యావరణంపై అధారపడుతుంది. మనం నిత్యావసరాలైన గాలి, నీరు, ఆహారం, నివాసం కోసం పర్యావరణంపై ఆధారపడతాం. కాబట్టి మనం పర్యావరణ నుండి వేరుగా గాని విడిగా గానిలేము. మనిషి తన మేధా సంపత్తితో తనచుట్టూ ఉన్న పరిసరాలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ వస్తున్నాడు. నాగరికత అంతా పరిసరాలపై మానవుడు చేసిన యుద్ధమే. సాధించుకొన్న అవసరాలతో మనిషి ఇప్పుడున్న స్థితికి చేరుకున్నాడు.

పర్యావరణం మన జీవించడానికే కాదు, మన ఆరోగ్యానికి, మనం బ్రతకడానికి అవసరం కాబట్టి మనం పర్యావరణాన్ని కాపాడుకోవాలి. మనం జీవించాలంటే పరిశుభ్రమైన గాలి, యోగ్యమైన పరిసరాలు అవసరం అవి లేకపోతే మనం బ్రతకలేము. దీన్ని దృష్టిలో పెట్టుకొనే ప్రతీ సంవత్సరం జూన్ 5వ తారీఖున పర్యావరణ దినంగా గుర్తుచేసుకొంటున్నాం. ఈ సంవత్సరం పర్యావరణం దినం సందర్భంగా ఐక్యరాజ్య సమితి “జీవ వైరుధ్యాన్ని ఎత్తిపడదాం” (Celebrate Bio-diversity) అనే నినాదాన్నిచ్చింది. దీని ముఖ్యలక్ష్యం గ్లోబల్ వార్మింగ్, మెరైన్ పొల్యూషన్, జంతుసంరక్షణ, నిలకడగా ఉండే ఉత్పత్తి, సంపద సరఫరా, వినియోగం సమతూకంలో ఉండాలి. ప్రతీ సంవత్సరం ఒక దేశ పర్యావరణ దినోత్సవానికి కేంద్రంగా ఉంటుంది. ఈ సంవత్సరం కొలంబియా దేశం ఆ కేంద్రంగా ఎన్నుకోబడింది.

పర్యావరణ విద్యా – దాని ప్రాముఖ్యత

పర్యావరణంకు సంబంధించిన జ్ఞానం, జాగృతి, అవగాహన, అనుకూల సమతౌల్యవైఖిరులను విద్యార్థులలో కలిగించి వారిలో నైపుణ్యాలను పెంపొందించి పర్యావరణ పరిరక్షణలో పాల్గొనేటట్లు చేసే విధానమే పర్యావరణ విద్య. (Environmental Education).

పర్యావరణం, విద్య రెండు ఒక దాని నుండి ఒకటి విడదీయలేని సబంధంగలవి నేటి పరిస్థితులకనుగుణంగా పర్యావరణ విద్య గురించి విద్యార్థులకే కాకుండా సమాజంలో నివసించే ప్రజలకు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉంది. నేటి భౌతిక సంస్కృతి అభివృద్ధికి పర్యావరణమే పునాది అనే భావన విద్యర్థులలో కలగాలి. స్విడన్ దేశానికి చెందిన గ్రెటాతుంబర్గ్ అనే 16 సంవతసరాల అమ్మాయి తన చదువుమాని అదేశ పార్లమెంటు ముందు నిరసన కార్యక్రమం చేపట్టింది. “దేశ నాయకులారా మీరు మా బాల్యాన్ని నాశనం చేశారు.! (You have robbed my Childhood) ఎన్నికల ముందు మీరిచ్చిన హామీలను గాలికి వదిలేశారు. వాతావరణ పరిరక్షణ (Climate Protection) గురించి మీరేమీ చేయడంలేదు. పర్యావరణం రోజు రోజుకు క్షీణిస్తుంది. దానివలన మాకేకాదు. మీకుకూడా నష్టం పర్యావరణ రక్షణ గురించి మీరేమీ చేయడంలేదని గొంతు ఎత్తింది. దానితో ప్రభుత్వం దిగివచ్చింది. తుంబర్గ్ పేరు పర్యావరణ రక్షణకు ఇప్పుడు మారుపేరుగా మారింది. ప్రపంచ బాలల శాంతి అవార్డును గెలుచుకుంది. ప్రపంచంలోని అన్ని దేశాలు బాలలకు ఒక స్ఫూర్తిగా మిగిలింది.

విద్యార్థులో పర్యావరణంపై కలిగించే అవగామనలో భాగంగా ఇండియన్ ఫారెస్టు చట్టం (1927) వన్యప్రాణి రక్షణ చట్టం (1972) జలకాలుష్య నియంత్రణ చట్టం (1974) వాయు కాలుష్య నివారణ చట్టం (1982), పర్యావరణ పరిరక్షణ చట్టం (1986) మొదలగు చట్టాలపై దృష్టి సారించాలి.

పర్యావరణం గురించి బోధించడంలో వివిధ విషయాల (Subjects) అంతర్ పార్యాంశ విధానం (Interdesciplinary Approach) చేపట్టాలి. దీనర్థం అన్ని సబ్జెక్టులలోని బోధనాంశాలను పర్యావరణం చుట్టూ పరిభ్రమింపచేయాలి. అప్పుడు విద్యార్థికి ఒక సమగ్రమైన అవగాహన కలుగుతుంది. ఇది సాంప్రదాయ బోధనా పద్ధతికి భిన్నమైంది.

భిన్నమైన విద్య :

ప్రకృతికి మానవుడికి గల సంబంధాన్ని పర్యావరణం నిరంతరం ప్రభావితంచేస్తుంది. మానవుడి ఆలోచనో మార్పు తీసుకొస్తుంది. నూతన ఆవిష్కరణలకు, పద్ధతులకు దారి సుగమనంచేస్తుంది. ఉదాహరణకు భూమి ఒక గ్రహంగా కాకుండా సర్వజాతులకు, సర్వసంపదను అందించే ఒక మూలకంగా చూడాలి. దేశమంటే మట్టికాదు. దేశమంటే ప్రజలన్నట్లు, భూమి అంటే ఒక గ్రహమే కాదు. అది మానవాళినివసించే ఒక ఆవాసం. విద్యార్థులకు బోధించేటప్పుడు చరిత్ర, భూగోళశాస్త్రం, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం, వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, గణితశాస్త్రంతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలను విడి విడిగా నేర్పుతారు. విడి విడిగా బోధించడంవలన విషయ పరిజ్ఞానం కూడా ముక్కలు ముక్కలుగా గానే అర్థమౌతాయి. అలాకాకుండా వాటన్నిటినీ సమగ్రంగా బోధిస్తే సమగ్రమైన ఆలోచన చేకూరుతుంది. ఉదాహరణకు పర్యావరణాన్ని బోధించేటప్పుడు ఆదిమానవుడు ఎలా అర్థంచేసుకొన్నాడు, కాలక్రమేణా పర్యావరణం ఎలా పైచేయిసాధించాడు, అతడు తనకు కావలసిన భౌతికావసరాలను ఎలా సమకూర్చుకొన్నాడో కూడా తెలియచేయాలి. నివాసం (భూగోళశాస్త్రం) పరిణామక్రమం (చరిత్ర) బ్రతుకుతెరువు (అర్థశాస్త్రం) చెట్టు సేవల గురించి (వృక్షశాస్త్రం, జీవశాస్త్రం), ఆహారం రుచులు తెలుసుకొనడం గురించి (రసాయిన శాస్త్రం) మానవునికి కావలసిన భౌతికావసరాలు (భౌతిక శాస్త్రం) ఆటలు, పాటలు, వినోదం గురించి (సాంస్కృతి, నాగరికత) లన్నింటిని ప్రాకృతి ప్రపంచానికి అనుబంధం చేయాలి. అలాచేస్తేనే విద్యాకు ఒక సమగ్రమైన, సంపూర్ణమైన (Integrative, Holistic) అవగామన వస్తుంది.

విషయాలను అనువర్తన చేయడం :

చరిత్ర యుద్ధాల గురించి, సంఘటనలగురించే గాక పర్యావరణంలో వచ్చే మార్పులు గురించి ఉపయోగించవచ్చు. ఒక ప్రాంతంలోని జీవ, నిర్జీవ (Living, Non - Living) ప్రాణులగురించి వాటి పరిణామం గురించి బోధించవచ్చు. బ్రిటీషు వాడు మన సంపదను దోచుకెళ్ళడానికి రైలు పట్టాలేసాడు. ఈ రైల్లు మొదట్లో బొగ్గుతో నడిచేవి. బొగ్గుకలప (Wood) నుంచి వస్తుంది. ఇలా కలప కోసం చెట్లను నరికివేయడం పర్యావరణ సమతుల్యానికి చేటు, ఫారెస్టునుండి డిఫారెస్టుకు దారి తీస్తుంది. ఇదే విద్యార్థులకు 'ఎఫారెస్టేషన్' అనే భావనకు, ఆచరణకు దారి తీసింది. అలాగే భూగోళం భూమి గురించి, అడవులగురించే గాక పట్టణాలు ఎలా వెలిశాయో, ఎలా అభివృద్ధి చెందాయో చెబుతూ తీర ప్రాంతాలు, ఆదివాసీ తండాలు ఎలా వెనుకబడిపోతునన్నాయో కూడా బోధించవచ్చు. విజ్ఞానశాస్త్రం (Science) లో జీవశాస్త్రం, భౌతిక శాస్త్రాలు కేవలం పరిస్థితుల గురించే గాక బయట ప్రపంచంలో జరిగే రసాయనిక చర్యలగురించి కూడా బోధించవచ్చు. ప్రజలుపయోగించే వస్తువులు ఉదాహరణకు ప్లాస్టిక్, కూల్ డ్రింక్‌ల వలన కలుగు అనారోగ్యలగురించి తెలుసుకోవడానికి, నైట్రోజన్, కార్బన్, ఫాస్పరస్, నీటి సరఫరా ఏవిదంగా భూమి పైభాగానిక, రాళ్ళు, రప్పల గురించి, ఖనిజాల గురించి విజ్ఞానం పొందడం వలన వాటి వల్ల కలిగే ప్రభావాలు, ప్రయోజనాలు, అప్రయోజనాల గురించి వివరించవచ్చు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలనే తీసుకొందాం. ఈ సంవత్సరం మే నెలలో విశాఖపట్నంలోని ఎల్.జి. పాలిమర్స్ నుండి స్టైరిన్ మోనోమెర్ వాయువు విడుదలవ్వడం వలన 15 మంది చనిపోయారు. వేలదా మందికి శ్వాససంబంధమైన ఇబ్బంది కలిగింది. రసాయన వాయువుల గురించి సామాన్య ప్రజలకు అంతగా తెలియదు. ప్రజలు అలాంటి కంపెనీలలో పనిచేయడమే గాక, దాని సమీపంలోనే నివసించడం కూడా జరుగుతుంది. పారిశ్రామిక వాడలలో జరిగే ప్రమాదాలకు అంతేలేదు. ఈ నెలలో పరవాడ పార్మాసిటిలో సాయినార్ కంపెనీలో ఇద్దరు, నంద్యాలలోని ఎస్‌పివి ఆగ్రో ఇండస్ట్రీలలో ఒకరు అలాంటి వాయువలనే చనిపోయారు. 1984లో భోపాల్ విడుదలైన మిథైన్ వాయువు వేలమందిని పొట్టన పెట్టుకున్న చరిత్ర నుండి మన మింకా పాఠాలు నేర్చుకోలేదు. ఇలాంటి సంఘనల గురించి, రసాయనక దుర్ఘటనల గురించి విద్యార్థులకు సమకాలీన (Contemporary) విషయాలలో భాగంగా వివరించాలి అవసరమైనతే పార్యపుస్తక విషయం నుండి కొద్దిగా వైదొలగాలి. ఇలా చేయడం వలన పాఠం జనరంజకంగా ఉండడమేగాక వైజ్ఞాకంగా ఉంటుంది.

సందులో సడేమియా అన్నట్లు దీర్ఘకాల లాక్‌డౌన్‌లో ఏవిధమైనక్షేత్ర పరిశీలన లేకుండా, నిర్ణీత డాక్యుమెంట్లును చూడకుండా పదినిమిషాలలో 'ప్రపోసనల్' చూసి కేంద్ర ప్రభుత్వం అజమాయిషీఉన్న పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాజెక్టులకు అనుమతులనిచ్చేస్తుంది. ఉదాహరణకు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఎటారిన్ హైడ్రోపవర్ ప్రాజెక్టు, అస్సాంలోని బొగ్గుగని, పన్నార్ ఫారెస్టు బెల్టులోని డైమండ్ మైనింగ్, అదాని కంపెనీకి చెందిన ఒడిషాలోని కోల్ హైర్డ్ పవర్ ప్లాంట్, కర్ణాటకలోని సరస్వతీ సింహాల సాంక్చురీలు మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలా అడ్డదిడ్డంగా అనుమతులు ఇవ్వడంవలన పర్యావరణం మరింత క్షీణిస్తుంది. దీనివలన అనేకమైన వైపరీత్యాలకు, కరోనా వైరస్ లాంటివే గాక మరికొన్ని అనారోగ్య సమస్యలకు భవిష్యత్తులో ప్రజలు ఎదుర్కొనవలసి వస్తుంది.

ప్రభుత్వాల పర్యావరణంపై చేసే చట్టాలు, పథకాలపై ఇద్యార్థులకు

జూనోసిస్: ప్రజారోగ్యానికి ప్రధాన ముప్పు



Dr. V.Anu Prasanna, M.Sc., Ph.D
Assistant Professor, Head of the Department,
Department of Zoology,
Yogi Vemana University,
YSR Kadapa, A.P

జంతువులు ప్రజలకు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మానవులు తమ ఆహారం, జీవనోపాధి, ప్రయాణం, క్రీడలు, సాంగత్యం మరియు విద్యకోసం, ప్రాచీన కాలం నుండే ఎల్లప్పుడు వాటితో సన్నిహితంగా ఉంటు వస్తున్నారు. ఏదిఏమైనా జంతువులు కొన్ని సార్లు చాలా హానికరమైన సూక్ష్మక్రిములును కలిగి ఉంటాయి. ఇవి మానవులుకి కూడా వ్యాప్తి చెంది తీవ్రమైన అనారోగ్యాలకు కారణమవుతాయి. వీటిని జూనోసిస్ లేదా జూనోటిక్ వ్యాధులు అని అంటారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధులు చాలా ఆందోళనకు గురిచేస్తాయి. జూనోసిస్ అనే పదాన్ని రుడాల్ఫ్ విర్చో 1880లో ప్రవేశపెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) 1959లో జూనోసిస్‌ని సకశేరుక (Vertebrate) జంతువులుకు మరియు మనిషికి మధ్య వచ్చే అంటువ్యాధులుగా పరిగణించారు. జూనోసిస్ యొక్క కారకాలు వైరస్లు, బాక్టీరియా, పరాన్నజీవులు, శిలింద్రాలు (fungi) కావచ్చు. ఈ కారకాలు తేలికపాటి నుండి తీవ్రమైన అనారోగ్యం మరుయు మరణానికి కారణం కావచ్చు. వ్యాధి సోకిన జంతువులు కొన్ని సార్లు సూక్ష్మక్రిములను కలిగి ఉన్నప్పటికి కూడా ఆరోగ్యముగా కనిపిస్తాయి. ప్రజలు ఈ జూనోటిక్ కారకాలుతో ప్రత్యక్షంగా లేద పరోక్ష సంపర్కం ద్వారా సులభంగా వ్యాధిగ్రస్తులు అవుతారు లేద కొన్ని సార్లు ఆహారం, నీరు, వెరస్ (ఈగ, దోమ) ద్వారా కూడా ఈ వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయి. జూనోసిస్‌ను మూడు రకాలుగా వర్గీకరంచవచ్చు

1. స్థానిక జూనోసిస్ (స్థానికంగా జంతువులు మరియు మనుషులుపై ప్రభావం చూపుతుంది)
2. అంటువ్యాధి జూనోసిస్ (అప్పుడు అప్పుడు వ్యాప్తి చెందుతాయి)
3. ఉద్భావిస్తున్నా లేదా తిరిగి పుట్టుకొచ్చే జూనోసిస్ (జనాబాలో ఇంతకు ముందు ఉనికిలో ఉన్న వ్యాధి మళ్ళీ కొత్తగా కనిపిస్తుంది)

ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా జూనోటిక్ వ్యాధులు వల్ల ఒక్క బిలియన్ జనాబా అనారోగ్యపాలు అవుతున్నారు మరియు వాటిలో ఒక్క మిలియన్ మరణాలు సంభవిస్తున్నాయి అని ప్రాథమిక అంచనా. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న అంటువ్యాధులలో 60% వ్యాధులు జూనోసిస్ వల్లనే అని నివేధించబడింది. జూనోటిక్ వ్యాధులు అనుకున్నదానికంటే చాలా సాధారణంగా ఉద్భావిస్తూ ఉంటాయి ఉదాహరణంకి 1920లో ఆఫ్రికాలో చింపాంజీలు నుండి మానవులుకు HIV/AIDS సోకింది కానీ 1981 వరకు గుర్తించబడలేదు. అలాగే 1998లో మలేషియాలో నిఫావైరస్ కూడా సోకి పందులు ద్వారా గబ్బిలాలు నుండి మనుషులుకి వ్యాపించింది. 2002లో SARS (Severe acue respiratory syndrome), H1N1 Influenza 2009 Pandemic, Avian influenza (H5N1) మరియు (H7N9), West Nile virus, MERS (Middle East Respiratory syndrome)-CoV (Corona Virus), ఎబోల వైరస్ (మధ్య ఆఫ్రికా) మరియు ప్రస్తుతం ప్రపంచాని గడగడాలడిచ్చే COVID-19 అన్నీ కూడా ఈ కోవకి చెందిన జూనోటిక్ వ్యాధులే. ఈ రకమైన వ్యాధులు ఒక తీవ్రమైన ప్రజారోగ్య ముప్పుగా పరిగిణంచవచ్చు. ఈ వ్యాధులు తక్కువ సమయంలో భారీగా వ్యాప్తి చెంది అధిక మరణాలుకు కారణం అవుతాయి. ఈ వ్యాధులు కొత్త వైరస్లు వల్ల సంభవిస్తున్నాయి అనే నిర్ధారణ, భారీగా వ్యాప్తి సంభవించినప్పుడు మాత్రమే కనుగొనబడతాయి. ప్రస్తుతం ప్రపంచం అంతా బాధపడుంతున్న COVID-19 వ్యాధి గబ్బిలలు నుండి ఏదో జంతువుకి సంక్రమించి మళ్ళీ మానవులు పైన తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

ఈ వ్యాధులు ఎక్కడో పుట్టి ప్రస్తుతం ఉన్న గ్లోబల్ కొన్నెక్టివిటి ద్వారా అంతర్జాతీయంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ జూనోటిక్ వ్యాధులు వల్ల పరిసర ప్రాంతాల వన్యప్రాణుల వాణిజ్యం, పశు సంపద కోల్పోవడం వంటి చాలా ఆర్ధిక నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ప్రజలలో అవగాహన లోపం, నైపుణ్యం కలిగిన మానవశక్తి లేకపోవటం, వివిధ రంగాల్లో (ఆరోగ్య, పశువైద్య, వ్యవసాయ మరియు వన్యప్రాణులు) సహకారం లేక పోవడం వల్ల ఇలాంటి వ్యాధులు ఒక వేల వ్యాప్తి చెందితే నియంత్రిచ్చే అవకాశాలు లేవు. ప్రస్తుత COVID-19 మహమ్మారి కూడా మానవుల ఉనికిని ప్రశ్నార్ధకంగా మార్చేసింది. ఏద్దైన vaccine కనుకొనే వరుకు సామాజిక దూరాన్ని మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటించండం తప్ప ఎటువంటి వ్యూహాత్మక ప్రణాళికలు లేవు. అందుకే జంతువుల మరియు మానవ ఆరోగ్య రంగాలు మధ్య సమర్ధవంతమైన అంతర్-రంగాల నిర్మించడం, వ్యాధి బెదిరింపులను ముందే పసిగట్టే నిఘా వ్యవస్థలు ఏర్పాటు చెయ్యడం, కొత్త వ్యాధి కారకాలును గుర్తుపట్టే బలమైన ప్రయోగశాలలును పెంపొందిచండం ద్వారా ఇటువంటి అంటువ్యాధులును ముందు నుంచే అరికట్టవచ్చు. మనిషికి జంతువులుకి మధ్య సంబంధం ఉన్నతవరకు కొత్త కొత్త జూనోటిక్ వ్యాధులు ప్రబలిస్తూనే ఉంటాయి గనుక మానవ-జంతువులు ఆరోగ్య రంగాలుకు మధ్య “ఒన్ హెల్త్” (One Health) అనే విధానం ద్వారానే సమీప భవిష్యత్తులో అనేక మహమ్మారులను నివారాంచిగలం.



వందల కోట్లు ఖర్చు పెట్టినా కానిది ఒక్క కరోనా వైరస్ తో ప్రక్షాళన

గంగానది ప్రక్షాళన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. రిషికేష్, హరిద్వార్ వంటి పుణ్యక్షేత్రాల వద్ద గంగానది ఉండటం అక్కడకు లక్షలలో వచ్చే భక్తులు ఇష్టానుసారంగా వ్యర్థాలు పడేయడం, ఇక గంగానది వెంట అనుకని ఉన్న పరిశ్రమల నుంచి వచ్చే ప్రమాదకర రసాయనాలు, వ్యర్థాలు నదిలో కలిపేయడంతో గంగానది విషపూరితంగా మారింది. గంగానది ప్రక్షాళనకోసం ఎన్ని చర్యలు తీసుకున్నా కానిది ఒక్క కరోనా వైరస్ వలన జరగడంతో పర్యావరణ నిపుణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కరోనా వైరస్ వలన అందరూ ఇళ్లకే పరిమితమవ్వడంతో పాటు భక్తుల రాక కూడా పూర్తిగా నిలిచిపోవడంతో గంగానది మంచి నీళ్లు తాగే అంత పరిశుభ్రంగా మారడమే కాకుండా నది లోపల ఉండే చేపలు స్పష్టంగా కనపడేంత స్వచ్ఛంగా నదీజలాలు పరిశుభ్రమయ్యాయి.

హరిద్వార్ వద్ద గంగా నది నీటి పీహెచ్ శాతం అదుపులోకి వచ్చిందని తాజాగా ఇక్కడి నీటిని పర్యావరణ విభాగం 'క్లాస్ ఏ' విభాగంలో చేర్చింది. 'క్లాస్ ఏ' లో ఉండే నీటి పీహెచ్ శాతం 6.5 నుంచి 8.5 మధ్యలో ఉండాలి. ప్రస్తుతం గంగానదీ జలాల పీహెచ్ శాతం 7.4 గా ఉన్నట్టు పర్యావరణ విభాగం పేర్కొంది.

కరోనా వైరస్ మానవాళికి ఎంతో ముప్పు వాటిల్లేలా చేస్తున్న పర్యావర ణాన్ని మాత్రం వ్యర్థాల నుంచి పరిశుభ్రంగా మార్చడంలో సహాయ పడు తుంది. ఇప్పటికైనా ప్రక్షాళన అయిన గంగ నదిని కాపాడుకుంటారో లేక కరోనా వైరస్ తగ్గుముఖం పట్టిన తరువాత గాలికి వదిలేస్తారా చూడాలి.


ఇది తుదిలేని పోరు

భారత్ – చైనా సరిహద్దుల్లో జరిగే ఈ ఆందోళనలు, ఈ ఉద్రిక్తతలు, ఈ గందరగోళాలు రావణాసురుడికాష్టం వంటివి.రగులుతూనే ఉంటాయి. యుద్ధం జరుగుతుందేమో, అనే భయాన్ని కలిగిస్తూ ఉంటాయి. నిజం చెప్పాలంటే, ప్రత్యక్ష యుద్ధం చేపట్టాలనే ఆలోచనలో రెండు దేశాలు లేవనే చెప్పాలి.జవహర్ లాల్ నెహ్రూ దశ నుండి ఇప్పటి ప్రధాని నరేంద్రమోదీ వరకూ వాళ్ళ వాళ్ళ పరిధిలో, సరిహద్దుల్లో శాంతి నెలకొల్పటానికే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. దాదాపు 1962 నుండి నేటి వరకూ భారత్ భూభాగాన్ని ఆక్రమించుకునే పనిలోనే చైనా ఉంది. ఇప్పటికే కొంత ఆక్రమించింది. ఇంకా అవే అక్రమచర్యలు కొనసాగిస్తూనే ఉంది. అక్సాయ్ చిన్, అరుణాచల్ ఆక్రమణ దశలో పెద్ద యుద్ధం చేసింది. మధ్య మధ్యలో అప్పుడప్పుడు యుద్ధవాతావరణాలు కమ్మినా, యుద్ధాలు జరుగలేదు.ఘర్షణలు మాత్రమే జరిగాయి.ఇరు వైపులా ప్రాణనష్టం మాత్రం జరుగుతూనే ఉంది.చైనా –భారత్ ప్రయాణాలను గమనిస్తే,1978 ప్రాంతం నుండి చైనా అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈ నలభై ఏళ్ళల్లో, ప్రపంచంలోని అగ్రదేశాల సరసన చైనా చేరిపోయింది. అన్నిరకాలుగా బలమైన దేశంగా అవతరించింది. అమెరికా వంటి అగ్రరాజ్యం తోనూ, నువ్వా– నేనా అని సవాల్ చేసే స్థాయికి ఎదిగింది. భారతదేశం యొక్క అభివృద్ధి 1990 వ దశకం నుండే ఊపందుకుంది. ఒకప్పుడు, భారతదేశం ఎంతో సంపన్నవంతమైన దేశమైనప్పటికీ, వివిధ దేశాల ఆక్రమణలు, దోపిడీలకు గురియై, ఎంతో సంపదను కోల్పోయింది. ప్రగతి ప్రయాణం మళ్ళీ ఆరంభించాల్సిన పరిస్థితులు భారత్‌కు వచ్చాయి. పి.వి.నరసింహారావు ఆర్థిక సంస్కరణలను చేపట్టినప్పటి నుండి దేశం అంతర్జాతీయంగా, ఆర్థికంగా, వాణిజ్యపరంగా పెరగడం ప్రారంభించింది. ఈ క్రమంలో, అమెరికా, చైనా మొదలైన దేశాలు మన అవసరాలను అవకాశంగా తీసుకొన్నాయి. మనకు చేసే మేలుకంటే, ఆ దేశాలే మన నుండి ఎక్కువ లాభాలు పొందాయి. ఇలా ప్రయోజనాలు పొందిన దేశాల్లో చైనాదే అగ్రస్థానం. ప్రపంచంలో యూరప్ కంటే పెద్ద మార్కెట్ భారత్. ఈ మార్కెట్‌ను చైనా బాగా వాడుకుంది. ఇంకా వాడుకుంటోంది. మనవల్ల వాణిజ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు పొందింది, పొందుతోంది. మన దేశం నుండి చేసుకొనే దిగుమతులు చాలా తక్కువ. మనకు చేసే ఎగుమతులు మాత్రం చాలా ఎక్కువ. అనేక సరుకులు మన దగ్గర అమ్ముకుంటోంది. విపరీతమైన లాభాలు ఆర్జిస్తోంది.మన ముడి సరుకులు కొనుక్కొని, వాటిని వస్తువులుగా మలిచి,తిరిగి ఎక్కువ రేట్లకు మనకే అమ్ముతోంది. ఇక్కడ స్టీల్ ఉదాహరణగా చెప్పవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే, మనల్ని తెలివిగా వాడుకుంటూ, మన వాణిజ్య సామ్రాజ్యాన్ని

దురాక్రమించింది. మనదేశానికి ఉండే పరిస్థితులు, అవసరాల వల్ల మనం అటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సి వచ్చింది. చైనా నేడు, మనకంటే ఎంతో బలమైన దేశంగా అవతరించింది. మన వాణిజ్యంతో పాటు, సరిహద్దుల్లో ఉండే భూభాగాలను దురాక్రమించుకోవాలనే దురాలోచనలతోనే సాగుతోంది. ఇంకొక పక్క, చర్చల ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకుంటామని కల్లబొల్లి కబుర్లు చెబుతోంది.సుమారు 60ఏళ్ళ నుండీ, చైనా–భారత్ మధ్య జరుగుతున్న ఈ పోరులో, ఒకసారి మనది పైచేయిగా, మరొకసారి వాళ్ళది పైచేయిగా నడుస్తోంది. గతంలో, పార్లమెంట్‌లో మాట్లాడుతూ. "మన దేశాన్ని, చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించకుండా చూస్తాను", అని, అప్పటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యలపై ఆచార్య కృపలానీ వ్యంగ్యంగా తిప్పికొట్టాడు. మీ దృష్టిలో అంగుళం అంటే ఎన్ని మైళ్ళు, అని, నెహ్రూను ఉద్దేశిస్తూ, కృపలానీ చేసిన వ్యాఖ్యలు రాజకీయరంగంలో హాస్యగుళికలుగా చెప్పుకునేవారు. అప్పటికే భారత్ భూభాగాన్ని ఎన్నో కిలోమీటర్ల పరిధిలో చైనా ఆక్రమించుకున్నదని దాని సారాంశం. అది ఇప్పటికీ అదే రీతిన కొనసాగుతోంది. నిజంగా, భారత్ –చైనా మధ్య యుద్ధమే అనివార్యమైతే, అది ఏమాత్రం శ్రేయస్కరం కాదు. అమెరికా సహకారం తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితులే భారత్‌కు ఉన్నాయి.అమెరికా చైనా కంటే కూడా ప్రమాదకరమైంది. మన బలహీనతలను అడ్డంపెట్టుకొని, మనల్ని మరింత దోపిడీ చేసే తత్త్వం ఉన్న దేశం అమెరికా. సప్త సముద్రాల ఆవల ఉన్న అమెరికా కంటే, పక్కనే ఉన్న చైనాతో జాగ్రత్తగా మెలగడమే వివేకవంతమైన చర్య. పరోక్షంగా అలజడులు సృష్టిస్తున్నా, ద్వైపాక్షిక చర్చల ద్వారానే సరిహద్దు సమస్యలు పరిష్కరించుకుంటామని, చైనా బాహ్య ప్రకటనలు చేస్తోంది. భారత్‌తో, మరిన్ని ఘర్షణలు కోరుకోవడం లేదని, చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి జావో లిజియన్ తాజాగా వెల్లడించారు. భారత్ – చైనా విదేశాంగ మంత్రులు ఎస్.జై శంకర్ –వాంగ్ ఈ ... సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకొనే దిశగా ఒక అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. వీరిద్దరూ తాజాగా ఫోన్‌లో కూడా మాట్లాడుకున్నారు.భారతదేశ సార్వభౌమాధికారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అదే సమయంలో, శాంతి కోరుకుంటామని, కవ్వింపు చర్యలకు పాల్పడితే తగిన రీతిలో సమాధానం చెప్పే సత్తా మనకుందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చైనాపట్ల ఘాటుగా ప్రతిస్పందించారు. ఆర్థికప్రయోజనాల పరంగా భారత్‌తో చైనాకు ఎంతో అవసరముంది. అలాగే, వాణిజ్య పరంగా భారత్‌కు కూడా చైనాతో అవసరాలున్నాయి. పైపెచ్చు, రెండూ ఇరుగు పొరుగు దేశాలు. భారతదేశం అన్ని రకాలుగా తన బలాన్ని పెంచుకోవడమే ఏకైక ఆయుధం. ఎంత శాంతికాముక దేశమైనప్పటికీ, యుద్ధం చెయ్యాల్సి వస్తే, గెలిచే సత్తాను పెంచుకోవడం అత్యవసరం, అతిముఖ్యం. విదేశాంగ, వాణిజ్య, వ్యాపార, ఆర్థిక, దౌత్యపరమైన అంశాలలో అటు అమెరికాతోనూ– ఇటు చైనాతోనూ, వాళ్లకు మించిన తెలివితేటలు, వ్యూహ, ప్రతివ్యూహాలు పెంచుకుంటూ వెళ్లడమే యుద్ధనీతి మరియు రాజనీతి.

నా ఇల్లు అమ్మి పెడతావా ప్రసాద్! : మాజీ ప్రధాని పీవీ

- బి. ఉదయ్



"ప్రసాద్. నాకోచిన్న సహాయం చేయాలయ్యా!" అంటూ హైదరాబాద్ రాజ్‌భవన్‌లో పివి నన్ను అడిగారు.

'జార్ఖండ్ ముక్తి మోర్చ పార్టీ ఎం.పీలకు ముడుపులు' కేసు వాదోపవాదాలు ముగిసి, ఆ కేసులో కూడా పి.వి.నరసింహారావుని నిర్దోషిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఈ తీర్పు వచ్చిన కొన్ని రోజులకే పి.వి.గారు హైదరాబాద్ వచ్చారు. అప్పుడు నాతో అన్నమాటలివి.

"ఇక్కడ జూబ్లీహిల్స్‌లో నాకో ఇల్లుంది. తెలుసుగదా! ఆ ఇల్లు అమ్మిపెట్టాలయ్యా"

"అంత అవసరం ఏమొచ్చింది సర్! మాజీ ప్రధానమంత్రిగా మీకు నివాస గృహాన్నీ, నౌకర్లనీ ప్రభుత్వమే ఇస్తుంది. వైద్యసదుపాయం ఉంటుందీ. నెలనెలా పెన్షన్? వస్తుంది...." అంటూ నసిగాను.

ఆయనకేమీ పెళ్ళికావలసిన కూతుళ్ళూ లేరు. నాకు తెలిసి ఆయన ఎవరిదగ్గరా భారీగా అప్పుచేసిన దాఖలాలు లేవు. ఏదన్నా ఇబ్బంది పడివుంటే ముఖ్యమంత్రిగా వున్నప్పుడు పడ్డారు.

కొడుకుని చదివించటానికి అల్లుడు బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. కూతుర్ని మెడిసిన్ చదివించడంకోసం ఫీజుకట్టడానికి ఇబ్బంది పడాల్సివచ్చింది. కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేయటానికి కూడా చాలా అవస్థలు పడాల్సివచ్చింది. ... పోనీ, ముఖ్యమంత్రిగా చేసిన నాటికి అంత రాజకీయపరిణతి లేదు అనుకున్నా, ఆ తరువాత కేంద్రంలో చాలా పదవుల్లో వున్నారు కదా! అవి కూడా ఏదో పనికిమాలిన పదవులూ కాదు, సహాయమంత్రి, ఉపమంత్రి పదవులూ కాదు. క్యాబినెట్ హోదావున్న మంత్రి పదవులే. దేశీయాంగశాఖ, విదేశాంగ శాఖ, మానవవనరులశాఖ. ఇంకా కాంగ్రెసు పార్టీలో కార్యదర్శి, ప్రధానకార్యదర్శి పదవులు కూడా చేశారు. 1991 నుండి అయిదేళ్ళపాటు ప్రధానమంత్రి పదవి కూడా చేశారు. ఇన్ని పదవులు అనుభవించిన వ్యక్తికి తనకున్న ఒకేఒక్క ఇల్లు అమ్ముకోవాల్సిన అగత్యం ఏమిటి?

"... అన్ని కేసుల్లోనూ నిర్దోషిగా బయటపడ్డానంటే నాకోసం ఎవరెవరో వకీళ్ళు నా తరఫున కోర్టుల్లో వాదిస్తేనే గదా! వాళ్ళెవరూ నా దగ్గర ఫీజు అడ్వాన్సు అడగలేదు. నేనెప్పుడు ఏమిస్తే అదే పుచ్చుకున్నారు. అదైనా ఎలా ఇచ్చాను. పదవిపోయాక 'ఇన్‌సైడర్' పుస్తకం రాస్తే, దానిమీద వచ్చిన రాయల్టీని వాళ్ళకిచ్చేస్తూ వచ్చాను. ఇంకా ఇవ్వాల్సింది – నా అంచనాల ప్రకారం లక్షల్లో ఉంది. వాళ్ళకి ఫీజు ఇవ్వకుండా, బాకీ తీర్చకుండా చనిపోతానేమోనని భయంగా ఉందయ్యా..."

నిర్ఘాంతపోయాను. ఎలాంటి వ్యక్తి ఏం మాట్లాడుతున్నారు?

ఆయన అయిదేళ్ళలో ఆర్థిక దుస్థితి నుంచి ఈ దేశాన్ని గట్టెక్కించి, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ప్రపంచం అంతా అబ్బురపడేలా వినూత్న ప్రగతిమార్గంలో నడిపించాడు. భారతదేశాన్ని ఈ 60కోట్ల జనాభా గర్వపడే ఒక వైభవదశలోకి మలుపుతిప్పాడు. అలాంటి మేధావి, రాజనీతివేత్త నన్ను అభ్యర్థిస్తున్నారు – ప్లీడర్లకి ఫీజులు చెల్లించటం కోసం తనకున్న ఒకే ఒక ఇల్లు అమ్మిపెట్టాలని!!

ఆయన సొంత విషయాలు ముఖ్యంగా కుటుంబసభ్యుల విషయాలు, రాబడి ఖర్చులూ వగైరా విషయాలన్నీ ఆయన దగ్గర ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీగా వున్న ఎ.వి.ఆర్.కృష్ణమూర్తి చూసుకుంటూండేవాడు. నేనెప్పుడూ ఈ ఇంటి విషయం తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

"వున్న ఒక్క ఇల్లూ అమ్మేస్తే శేష జీవితం గురించి కూడా ఆలోచించాలి గదా..."

"ఏముంది ఆలోచించటానికి! పిల్లలందరికీ వాళ్ళ వ్యాపకాలు వాళ్ళకున్నాయి. వాళ్ళెవరూ నాతో వుండనక్కర్లేదు. నేనొక్కణ్ణీ ఉండటానికి ఎన్ని గదులు కావాలి తినాలన్నా ఎన్ని తినగలను పప్పు, అన్నం చాలు... మాజీప్రధానమంత్రి హోదాలో అవెలాగూ లభిస్తాయి కదా! అయినా ఒంటరిగా ఉండటం అలవాటై పోయింది. నా అనుభవాలన్నీ పుస్తకాల రూపంలో రాయాలను కుంటున్నానయ్యా. ఒకవేళ ఏదన్నా జబ్బు చేసినా మాజీ ప్రధాని అనే ముద్ర ఒకటి ఉంది కాబట్టి, నడిచి పోతుందిలే..."

ఎంత సులువుగా చెబుతున్నాడీయన.... నేనిలా ఆలోచిస్తుంటే మళ్ళీ ఆయనే అందుకున్నారు.

"అమ్మేస్తే మంచి రేటు వస్తుందంటావా? ... రాకపోయినా ఫరవాలేదయ్యా. ఏదో ఒకరేటుకి అమ్మేసి ప్లీడర్లందరి బాకీలు తీర్చేస్తే నాకు మనశ్శాంతిగా ఉంటుంది. ప్రస్తుతం మన కృష్ణమూర్తి కొడుకు ప్రసాదే ఆ ఇంటి విషయం చూస్తున్నాడు. నువ్వుకూడా పూనుకుంటేనే త్వరగా అవుతుందనిపిస్తోంది. ఇప్పుడు నేను రాసిన రెండు పుస్తకాలు రెడీగా ఉన్నాయి. అవి ఎప్పటికి అచ్చయి మార్కెట్లోకి వెళ్ళి, మనకి రాయల్టీ వస్తుందో తెలీదుకదా! అప్పటిదాకా వాళ్ళ ఋణం తీర్చకుండా వుంటామా? ఈలోపలే నాకేమైనా అయితే...?"

పి.వి.నరసింహారావుగారి మాట నిజాయితీ మీద నాకు ఎలాంటి అనుమానం లేదు. కాని ఎందుకో ఆయన చెబుతున్న బీదకబుర్లు నమ్మలేకపోతున్నాను. ఆయన ప్రధానమంత్రిగా ఉండగా ఎన్నెన్ని అనధికార కార్యక్రమాలకి లక్షలకి లక్షలు ఎలా ఖర్చయ్యేవి? అవన్నీ ప్రభుత్వనిధులు కావు. పార్టీ నిధుల రూపంలో వచ్చేవి, ఖర్చయ్యేవి. పార్టీ నిధుల సేకరణ, వ్యయం, జమాఖర్చుల నిర్వహణ వగైరా 'నిధి నిర్వహణ' పనులన్నీ పార్టీ కోశాధికారి సీతారాంకేసరి చూసుకునేవారు. కాకపోతే ఆయన ఏం చేసినా పి.వి.గారికి చెప్పకుండా చేసేవారు కాదు.

నేను అయోధ్య రామాలయంకోసం ట్రస్టు ఏర్పాటుచేసే పనిమీద దేశంలో ఎక్కడెక్కడికో వెళ్ళాల్సివచ్చేది. అనేక సందర్భాలలో నా విమానం టిక్కెట్లు నాపేరుమీద ఉండేవికావు. కొన్నిసార్లు ప్రత్యేక విమానాలు కూడా నాకోసం ఏర్పాటయ్యాయి.

ఇవి ఇలా ఉంచి, ప్రధానికి మీడియా సలహాదారు అంటే పత్రికల వాళ్ళతో సత్సంబంధాలు వుండేలా, నేను కూడా వాళ్ళ 'బాగోగులు' కొంత పట్టించుకోవాలి కదా? ఇక, పార్టీ పరంగా అనేక వీడియో ప్రకటనలకి, పత్రికాప్రకటనలకీ అయ్యే ఖర్చు అంతా కోట్లల్లోనే ఉండేది. పార్టీకి కోశాధికారి సీతారాంకేసరే అయినా పార్టీ అధ్యక్షుడి ఆమోదం లేకుండా కోట్లరూపాయలు ఖర్చు ఎలా జరుగుతుంది?

కొంతమంది పారిశ్రామిక వేత్తలకి పార్టీ విరాళాల్ని అధ్యక్షునిద్వారా అందజేస్తేనే సంతృప్తి ఉంటుంది.

మరి అలా వచ్చిన విరాళాలన్నీ కోట్లల్లోనే ఉంటాయే! ఇవన్నీ నా కళ్ళముందు మెదిలాయి. ఉండబట్టలేక అడిగేశాను.

"సర్, మీ చేతుల మీదుగా కోట్లాదిరూపాయల నిధులు ఖర్చయ్యేవికదా! మీరు మరీ అడ్వకేట్లకివ్వాల్సిన ఫీజులు కూడా ఇవ్వకుండా..." అని తటపటాయిస్తూనే అడిగాను.

పి.వి గారు నావంక విచిత్రంగా చూశారు.

"అదేంటి ప్రసాద్?, అదంతా పార్టీ ఫండయ్యా. పార్టీకోసమని ఇచ్చిన డబ్బుని మన సొంతానికి ఎలా వాడుకుంటామయ్యా? ఎవరు తెచ్చి ఏమిచ్చినా దాన్ని నేరుగా సీతారాంకేసరికే పంపించేస్తూ వచ్చాను... (కొంచెం ఆగి) ఇవ్వాళ ఇలాంటి సొంత అవసరం వస్తుందనీ, అందుకోసం అప్పుడా డబ్బు దాచుకోవాలనీ అనిపించలేదయ్యా..."

నాకు మనస్సు చివుక్కుమంది. ఎందుకు అడిగానా అనుకున్నాను.

సుప్రీంకోర్టు దాకా 'ఎక్కేకోర్టు, దిగేకోర్టు' అయిపోయింది ఆయన పదవీ విరమణానంతర జీవితం. అదే ఆయనలో ఆందోళన పెంచేసింది. వయసు పెరుగుతోంది. ఆరోగ్యం క్షీణిస్తోంది. ఉత్సాహం తగ్గిపోతోంది. తనకంటూ ఏమీ చేసుకోలేదు. తనవాళ్ళకీ ఏమీ చేసిపెట్టలేదు. (ఈ మాటని ఆయన కొడుకు ఒకరు బాహాటంగానే పత్రికల ముందు వెళ్ళగ్రక్కాడు). కనీసం తన అధికార బలంతో ఆశ్రిత పక్షపాతం చూపించి అయినా తన వర్గం అంటూ ఎవర్నీ కూడగట్టుకునే ప్రయత్నం చేయలేదు.

ఆయన వల్ల లాభం పొందిన కొందరు ముఖ్యమంత్రులుగానీ, ఇతర నాయకులు గానీ పదవీవిరమణ తరువాత ఆయన్ని పట్టించుకొనే ప్రయత్నం చేయలేదు. పట్టించుకోకపోయినా ఈయన ఏమీ అనుకోడు అన్న భరోసాతో కొంతమంది, ఈయన్ని పట్టించుకుంటే ఈయన తరువాత వచ్చిన పార్టీ నాయకత్వం దృష్టిలో నేరం చేసినవాళ్ళమవుతామన్న భయంతో కొంతమంది ... మొత్తంమీద ఆయన ఏకాకి అయిపోయాడు

చివరిరోజుల్లో ఆయనకి ఆప్తులుగా ఆయన పరిగణించిన వాళ్ళంటూ ఎవరన్నా మిగిలివుంటే – బహుశా – ఆయన వ్యక్తిగత సిబ్బందిగా పనిచేస్తూ వచ్చిన ఎ.వి.ఆర్. కృష్ణమూర్తి, రామూ దామోదరన్, ఖండేకర్, ఐఏయస్ అధికారి రతన్ వట్టల్, నేనూ మాత్రమే. ఆయనకి పరిచయంలేని అనేకమంది దేశభక్తులు మాత్రం ఆయనకి సానుభూతిపరులుగా మిగిలిపోయారు.

నేను అతిగా మాట్లాడాననిపించిన వెంటనే ఆ మాటల్ని సమర్థించుకునే ప్రయత్నం చేశాను.

"సర్, సర్... అంటే నా ఉద్దేశ్యం, మీ వల్ల ఉపకారం పొందిన వాళ్ళు ఎంతోమంది ఉంటారు కదా, మీకీ అవసరం వచ్చిందంటే ఎవరుమాత్రం సహాయం చేయరు!" అన్నాను.

"కాని నేనెప్పుడూ వాళ్ళకి సహాయం చేయటం వెనకాల వాళ్ళు నాకు రుణపడి ఉండాలని భావించ లేదే! కనీసం ఆ భావాన్ని వాళ్ళకి కలిగించే ప్రయత్నం కూడా చేయలేదే! ఇవ్వాళ ఏమని అడుగుతానయ్యా? ఏనాడైనా నేను అధికారాన్ని ఒక బాధ్యతగా భావించానే తప్ప భవిష్యత్ కోసం ఉపయోగించుకునే అవకాశంగా కాదు. దుర్వినియోగం చేయగలిగిన వాళ్ళకి అధికారం ఒక వరం. నాలాంటి వాళ్ళకి అదొక శాపం. ఆ శాపం వల్లనే ఇప్పుడు ఆర్థికంగా నేనూ బాగుపడలేకపోయాను, నన్ను నమ్ముకున్నవాళ్ళకీ ఏమీ చేయలేకపోయాను... ఎవరైనా ఇప్పుడు ఎందుకు వచ్చి, నా అవసరాలు కనిపెట్టి పలకరిస్తారయ్యా! నా ప్రారబ్ధం నేనే అనుభవించాలి గదా..."

నా కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. అప్పటికింకేమీ మాట్లాడలేకపోయాను. ఆయన తన ఇంటి పత్రాల గురించి ఏదో చెప్పారు, వెళ్ళిపోయారు.

నేను ఆ ఇల్లు అమ్మకం గురించి తీవ్రంగా ప్రయత్నం చేసే లోపల – ఇది జరిగిన కొన్ని మాసాలకే – 2004 డిసెంబరు 23 న ఆయన ఢిల్లీలో కన్నుమూశారు.

ఆయన తన వకీళ్ళకి ఫీజుల బకాయిలు చెల్లించారో లేదో నాకు తెలీదు!

(ఆదిపర్వం నుంచి)

వైట్ హౌస్‌లో భగవంతుడు

-సతీష్ చందర్

నా ప్రియ శత్రువా! నువ్వెక్కడ?
నాకు ప్రేమే కాదు-పగ కూడా పవిత్రమే
సర్పానివి నువ్వయితే,
నిన్ను -
మోహించే సంపెంగ పువ్వును నేనే
వేధించే ముంగిస పిల్లనూ నేనే
నీ-
పడగతూగులో పదనిసల్ని నేర్చిన వాణ్ణి
విషపు కాటులో వనమూలికలెత్తిన వాణ్ణి
నువ్వు-
నాట్యమాపితే నాకు నడక సాగదు
బుసలు మానితే కక్ష నిలవదు
ఓ నా ప్రియాతి ప్రియమైన శత్రువా! నీ
చిరునామా ఎక్కడ ?
జూడాస్ దాచిన వెండి రూపాయిలోనా?
కుక్కకు మాంసపు ముక్క వేసినట్లు,
నా దేహాన్నో, మనసునో వేస్తూనే వున్నాను
నువ్వు ముక్కు పుటాలు ఎగుర వేస్తూ, మట్టి
కురుస్తూనే వున్నావు.
నా మేను తరగదు,మనసు విరగదు
నా తనువొక అల్లావుద్దీన్ అద్భుత దీపం
నేను నదికడ్డుగా పవళిస్తే ఆనకట్ట
మట్టిమీద మోకరిల్లితే పంటచేను
కాళ్ళూపితే కర్మాగారం
రెక్కలాడిస్తే రైలుబండి
ఊపిరిపీల్చి వదిలితే పొగ గొట్టం
సకల చలనాల్లోనూ సిరిసంపదలే
కదిలిందే తనువు కాకుంటే తరువు
నా శరీరమొక పుణ్యక్షేత్రం
నేను పిల్లన గ్రోవికి చిల్లులు పెట్టిన,
హార్మోనియానికి మెట్లు కట్టినా,
ప్రేమలేఖ రాసినట్లే వుంటుంది.
శిలనెత్తిన ఉలితో మోదినా,
మట్టితో కుండను మలిచినా
చంటి బిడ్డకు స్నానం చేయించినట్లే
వుంటుంది
నేను చేసే ప్రతీ వస్తువూ
ప్రపంచానికో పుట్టిన రోజు కానుక
సకల చర్యల్లోనూ కోల్పోవటమే
ధారబోసిందే దేహం - దేహి! అంటే
కళేబరమే
నా మనసొక వెన్నెల రేయి
నేను-
పసిపిల్లల పాదాల మీద ప్రవహిస్తే కవిత్వం
తడిసిన ఇసుక తిన్నెల మీద తళుక్కుమంటే
నాట్యం
అల్లకల్లోలమయిన సముద్రానికి జోలపాడితే
సంగీతం
నల్లమబ్బుల్లోంచి తొంగిచూస్తే చిత్రలేఖనం
తెల్లవారక ముందే దాక్కుండి పోతే
ఇంద్రజాలం
జాడలన్నిటిలోనూ కళామతల్లే
కలిగినదే గుండె కాకుంటే కంప్యూటర్
నా హృదయమొక రంగస్థలం
నాది కాని నినాదంతో నేను
శయనిస్తున్నప్పుడూ
రెండు రాతి వక్షోజాల మధ్య ఒంటరి నగనై
వేళ్ళాడుతున్నప్పుడూ
అద్దెకొంపలో తలదాచుకున్నట్లే వుంటుంది
నాకప్పుడు-
అర్ధాంతరంగా తెరపడుతున్నట్లే వుంటుంది
పట్టు తేనె పిండినా, పాము చర్మం వలిచినా
మరణించిన మహాసుందరి దేహాన్ని
తడుముతున్నట్లే వుంటుంది
నేను పొందిన ప్రతి పరాభవమూ
సమాజానికి పం పే సంతాపసందేశం
రాలిన ప్రతి శిరస్సూ రహస్యంగా
నవ్వుకుంటుంది
ఎత్తిన తలే తెగుతుంది - దించితే సత్కారమే
ఓ నా ప్రియ శత్రువా! నీ మారీచ
ముఖమెక్కడ?
పాలిస్తూ పీక తెగ్గోసిన కన్నతల్లి కల్తీ
ప్రేమలోనా?
కలలు కనకుండా నరం తప్పించే టెలివిజన్
మాయలోనా?
అన్నం మెతుకుల్నిఅమ్ముకుని
అత్తరు చుక్కల్ని కొంటూనే వున్నాను
ఉప్పుకల్లాల్లో నేను పిండించిన
ప్రశ్నార్థకాలను
ఎప్పటికప్పుడు నువ్వు రొయ్యల్లా భుజిస్తూనే
వున్నావు
అమ్ముకునేది సరుకు - తెగనమ్ముకునేది
బతుకు
నా భవిష్యత్తొక సూపర్ బజార్
నన్ను నేను కోసుకుంటే ఎన్నో క్లోనింగుల
నేను
మైథునంతో పనిలేని సంతాన సౌభాగ్యం
కామిస్తే కెరీర్
ప్రేమిస్తే వ్యసనం
గ్యాస్ స్టౌ మీదే సతీసహగమనం
అన్ని సరుకులూ అంగజాలివ్వని ఆలింగనాలే
ఖర్మ కాదు- నిష్కామ కర్మ
ఓ నా శాశ్వత శత్రువా!
నన్ను నిరంతర వర్తమానంలో బంధించు
నా కిక్కడ-
నేడు మరణించదు రేపు జన్మించదు
వృషణాల్లేని విత్తుల్ని, స్వప్నల్లేని జగత్తునీ
నేను బహిష్కరిస్తున్నాను
ఒక సుదీర్ఘ సమాధి తర్వాత
నవ మన్మధున్నైతిరిగిలేస్తాను
నా జాతికి ఒక స్వప్న సకలాన్ని
కోసుకొస్తాను.
ఒక గర్భస్త బీజాన్ని బహూకరిస్తాను.
అందాకా-
మీరు నా శత్రు భజన చెయ్యండి
వాడు-
సర్వాంతర్యామి
సర్వ యుక్తిమంతుడు
సర్వ సంపన్నుడు
విశ్వ రుణదాత
అంతేకాదు-
వైట్ హౌస్ లో భగవంతుడు

విశ్వవిజేత.. దాసరి

- శ్రీనివాస్



THE MOST BUSY ARTIST OF THE FEILD అని పేరుగడించిన ఏకైక వ్యక్తి దాసరి. సినిమా పోస్టరుపై హీరో బొమ్మ, హీరోయిన్ అందాలు, టైటిల్ తప్ప ఇంకేం కనిపించని రోజుల్లో.. 'దాసరి నారా యణరావు' అంటూ ఎర్రసూరీడల్లే వెలుగులీనుతున్న అక్షరాల్ని ముద్రిం చుకొని, 'సినిమాకి కెప్టెన్ దర్శకుడు, వాడి పేరు అందరికంటే ముందుండాలి..' అని నమ్మి.. ఇదే మాటలు సినీ జనాలూ నమ్మేలా చేసి, దర్శకుడ్ని అందలం ఎక్కించిన ఘనత దాసరిది..తెలుగు చిత్రసీమపై దాసరి ప్రభావం అంతా ఇంతా కాదు. మరీ ముఖ్యంగా దర్శకత్వ విభాగంలో! దాసరి జోరు, దాసరి ఆలోచనలు, సినిమాని దాసరి నడిపించిన తీరు – ఇప్పటికీ నిత్య పారాయణాలు. అందుకే దర్శకుల పాలిట ఆది గురువుగా మారాడు దాసరి.కథ, అందులోని డ్రామా, వాటిలోంచే పుట్టికొచ్చే సంఘటనలు.. ఇవన్నీ దాసరి సినిమాల్లో స్పష్టంగా కనిపి స్తుంటాయి. తెరపై హీరో బొమ్మ కనిపిస్తున్నా, తెర వెనుక దాసరి కథ తాలుకా దమ్ము, సంభాషణల్లో ఛమక్కు.. సినిమాని వంద కిలోమీటర్ల స్పీడుతో ముందుకు నడిపిస్తుంటాయి. తెలుగు తెరపై దాసరి చేసిన ప్రయోగాలు, వినూత్న ప్రయత్నాలకు అంతు లేదు.

అప్పటి వరకూ ఉన్న సినిమా పోకడల్ని, సమూలంగా మార్చిన ఘనత దాసరిదే. ఆయన తొలి సినిమా 'తాతా మనవడు'లోనే ఇంటర్ కట్స్ కనిపిస్తుంటాయి. ఆ రోజుల్లో.. ఆ తరహా సన్నివేశాల అల్లిక ఓ ప్రయో గమే అనుకోవాలి. సింబాలిక్ షాట్స్‌కి దాసరి పెట్టింది పేరు. 'తాతా మనవడు' లోనే లెక్కకు మించి సింబాలిక్ షాట్స్ కనిపిస్తాయి. వాటిని ఆ తరం దర్శకులు స్ఫూర్తిగా తీసుకొన్నారు. ఇప్పటికీ.. అడపా దడపా దాసరి తాలుకూ టేకింగ్ స్టైల్ కనిపిస్తూనే ఉంటుంది. సంభాషణలు, వాటిని కథానాయకులు పలికే తీరులోనూ దాసరి వచ్చాకే ఓ మార్పు వచ్చింది. దాసరి చిన్న చిన్న డైలాగుల్నీ రాశారు.. బారెడు పొడవున్న సంభాషణల్నీ రాశారు. నాగేశ్వరరావు లాంటి నటుడొచ్చినప్పుడు అలతి అలతి పదాలతోగారడీ చేశారు. ఎన్టీఆర్ తన కథలో హీరో అయితే... పేజీల కొద్దీ డైలాగులు పేల్చేశారు. అంటే.. హీరోని బట్టి కథ, హీరోని బట్టి డైలాగ్! 'ప్రేమాభిషేకం'లో ప్రతీ సంభాషణ అబ్బురపరుస్తుంది. కాకపోతే.. అవన్నీ సింపుల్‌గా ఉంటాయి. 'బొబ్బిలిపులి', 'సర్దార్ పాపారాయుడు' సినిమాల్లో దాసరి శైలి మరోలా కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా కోర్టు సీన్ వచ్చేసరికి.. దాసరి పెన్ను పరుగులు పెడుతుంటుంది. దాసరి సినిమాల్లో కోర్టు సీన్లు ఎక్కువగా తారసపడుతుంటాయి. ఇలాంటి సందర్భంలో రెచ్చిపోయి మరీ డైలాగులు రాసేవారాయన. దాసరి డైలాగుల్ని క్యాసెట్ల రూపంలో దాచుకొని మరీ వినేవారు అభిమానులు. ఆ ట్రెండ్ దాసరితోనే మొదలైంది.'మానవ సంబంధాలు' అనే టాపిక్ వస్తే.. దాసరి విజృంభణ కనిపిస్తుంటుంది. 151 చిత్రాల్లో ఈ కథల వాటానే ఎక్కువ. తొలి సినిమాలోనే తండ్రీ కొడుకుల అనుబంధాలెలా ఉన్నాయో పూస గుచ్చినట్టు చెప్పేశారు దాసరి. పిల్లలు పెరిగి పెద్దవారై, తల్లిదండ్రుల త్యాగాలు మర్చిపోయి, వాళ్లని నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రులేం చేయాలి? అనే విషయాన్ని దాసరి తనకు వీలున్నప్పుడల్లా చెబుతూనే వచ్చారు. 'తాతా మనవడు' దగ్గర్నుంచి దాసరి నటించి, దర్శకత్వం వహించిన 'సూరిగాడు' వరకూ దాసరి ఎంచుకొన్న కథలన్నీ వీటి గురించే. 'బహుదూరపు బాటసారి', 'అమ్మ రాజీనామా', 'కంటే కూతుర్నే కను', 'ధర్మపీటం దద్దరిల్లింది'.. ఇవన్నీ బిడ్డల చేతిలో మోసపోయిన, మోసపోతున్న తల్లిదండ్రుల బాధలకు, వాళ్ల కన్నీళ్లకు వెండి తెర రూపాలు. పొలిటికల్ సెటైర్లలోనూ దాసరికి తిరుగులేదు. ప్రతీ సినిమాలోనూ ఏదో ఓ చోట.. ఏదో ఓ రూపంలో కుళ్లు రాజకీయాల్ని కడిగి పారేయడం, సమాజంలోని కుళ్లుని కుతంత్రాన్నీ పరిచయం చేయడం.. దాసరికి అలవాటు. 'ఎంఎల్ఏ ఏడుకొండలు', 'పోలీసు వెంకటస్వామి', 'లంచా వతారం', 'ప్రజా ప్రతినిధి', 'ఒరేయ్ రిక్షా', 'మేస్త్రీ', 'ఒసేయ్ రాములమ్మా'.. ఇలా దాసరి నుంచి వచ్చిన ప్రతీ సినిమాలోనూ పొలిటికల్ పంచ్‌లు కనిపిస్తాయి.. వినిపిస్తాయి.తూర్పు పడమర' సినిమాలో దాసరి ఎంచు కొన్న కథ.. వాటిని నడిపించిన తీరు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఆ కాలానికి దాసరి 20 యేళ్ల ముందున్నాడన్న సంగతి అర్థం అవుతుంది.

సినిమాలపై సినిమాలు తీసినప్పుడు కూడా.. వెండి తెర వెలుగు జిగుల్లనే కాదు, ఇందులోని చీకటి కోణాల్నీ నిజాయతీగా ఆవిష్కరించారు. సినిమా వాళ్ల బాధలు, వాళ్ల మనసులూ ఆవిష్కరించారు. కుటుంబ కథా చిత్రాలకు దాసరి కేరాఫ్ అడ్రస్. ఆయన కథలన్నీ ఓ మధ్యతరగతి ఇంటి చుట్టూనే తిరుగుతుంటాయి. నాన్న పాత్రల్ని దాసరి ఎంత ఉదాత్తంగా తీర్చిదిద్దారో? మహిళల్నీ ఆయన ఏనాడూ తక్కువ చేయలేదు. స్త్రీ పాత్రల్ని ఆవిష్కరించిన విధానం, వాళ్లని హీరోలుగా మార్చిన వైనం... తెలుగు సినిమా ప్రేక్షకుడు అంత తేలిగ్గా మర్చిపోడు. దాసరిలో ఓ మంచి నటుడున్నాడు. దాదాపుగా తన ప్రతీ సినిమాలోనూ ఏదో ఓ చిన్న పాత్రలో తళుక్కున మెరవడం, ఆ పాత్రకు పరిపూర్ణ న్యాయం చేయడం.. దాసరికి అలవాటు. అయితే సినిమా మొత్తాన్ని తన భుజ స్కంధాలపై వేసుకొని నడిపించిన సందర్భాలూ చాలా ఎక్కువగానే కనిపిస్తాయి. 'సూరిగాడు', 'మామగారు', 'మేస్త్రీ' చిత్రాల్లో దాసరి పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోయేవే. ఆ పాత్రల్ని దాసరి తప్ప మరెవ్వరూ చేయలేరు అనుకొనేలా నటించారు.. ఆయా పాత్రల్ని రక్తికట్టించారు. ఓ వ్యక్తి ఇన్ని చిత్రాలకు దర్శకత్వం వహించడం ఓ రికార్డ్ అయితే.. ఓ దర్శకుడు ఇన్ని వైవిధ్యమైన పాత్రలు చేయడం కూడా రికార్డే!! ఒకే వ్యక్తి.. ఇన్ని రంగాల్లో, ఈ స్థాయిలో ప్రతిభ చూపడం అసామాన్యం. బహుశా.. భవిష్యత్తులోనూ సాధ్యం కాకపోవొచ్చు. అందుకే సినిమా పరిశ్రమలో ఏ రంగంలో చూసినా.. దాసరిదంటూ ప్రత్యేకమైన స్థానం కనిపిస్తుంటుంది. దాసరి ఇప్పుడు మన మధ్య లేకపోవొచ్చు. కానీ ఆయన ఘనత ఎప్పుడూ కనిపిస్తుంటుంది. ఆయన సాధించిన విజయాల గురించి ఎప్పుడూ మాట్లాడుకొంటూనే ఉంటాం. అద్భుతాలు పుడతాయి.. నశించవు. దాసరి కూడా అంతే!

బుల్లెట్ ఫ్రూఫ్



మాకు 1,86,000 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కావాలి అని రక్షణ దళాలు 2009 లో మన్మోహన్ ప్రభుత్వాన్ని అడిగితే 2014 వరకు ఒక్కటంటే ఒక్కటి కూడా కొనలేదు.

కారణం? అవినీతి. 2009 లో 59,000 జాకెట్లు కొనడానికి టెండర్ పిలిచి ఫైనలైజ్ చేశారు. కానీ ఆ జాకెట్స్ శాంపిల్స్ నాణ్యత ఎంత దారుణంగా ఉంది అంటే మామూలు తుపాకీ గుళ్ళకే అది తట్టుకోలేక జాకెట్ కన్నాలు పడిపోయింది. అంటే సైనికుల ప్రాణాల కన్నా అవినీతి డబ్బే ముఖ్యం అన్నమాట. అప్పుడు మీడియాలో వీటిమీద విపరీతమైన అవినీతి ఆరోపణలు రావడంతో ఆ టెండర్ రద్దు చేసి యూపీఏ ప్రభుత్వం మరి వీటిని కొనే సాహసం చెయ్యలేదు.

2014 లో మోడీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి మళ్లీ సైనిక దళాలు వీటి గురించి అడగడం మొదలు పెట్టారు. అత్యవసరంగా వాడుక కోసం మోడీ ప్రభుత్వం 2016 లో 50,000 జాకెట్స్ దేశంలోనే గల టాటా అనుబంధ సంస్థ నుంచి కొనుగోలు చేసింది.

రక్షక దళాలు సుమారు 3,50,000 జాకెట్లు కావాలని ప్రభుత్వాన్ని అడిగితే ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యత ఉండే విధంగా సుమారు 1,86,000 కొనడానికి 2018 ఏప్రిల్ లో ఒప్పుకొని టెండర్లు పిలిచారు. ఒక భారత్ కంపెనీ టెండర్ గెలుచుకుని ?639 కోట్ల ఆర్డర్ సంపాదించింది. ఈ జాకెట్స్ AK47 బుల్లెట్స్ కూడా తట్టుకోగలవు.

పూర్వం మనం ఈ జాకెట్లను అమెరికా నుండి దిగుమతి చేసుకుంటూ వుండేవారం.

అయితే మొట్టమొదటి సారిగా దేశంలో స్వాతంత్రం వచ్చిన 70 సం. తరువాత ఈ జాకెట్స్ దేశంలో తయారుచేయడం మొదలయింది. దీనికి ముఖ్య ప్రేరణ శ్రీ శాంతను భౌమిక్. ఈయన మాతా అమృతానందమయి యూనివర్సిటీ లో ఏరో స్పెస్ ఇంజినీరింగ్ లో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. ఈయన మన సైనికులకు పనికి వచ్చే దృఢమైన తేలిక అయిన బులెట్ ప్రూఫ్ జాకెట్లు తయారీ మీద మన కేంద్ర రక్షణ పరిశోధనా సంస్థ (DRDO)తో కలసి పరిశోధనచేసి విజయం సాధించారు. అమెరికా నుండి దిగుమతి చేసుకుంటున్నవి ఒక్కొక్కొ జాకెట్ ?1,50,000 ఖరీదు ఉండి, 15-18 కేజీల బరువు ఉంటే ఈయన తయారుచేసినవి ?50,000 ఖరీదు మాత్రమే చేసి 1.50 కేజీలు బరువు మాత్రమే ఉంటాయి. అంతే కాక ఇవి 57 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా పని చేస్తాయి. మోడీ ప్రభుత్వం వచ్చాక వీటి పనితనం, నాణ్యత పరిశీలించి బాగున్నాయని ఈ జాకట్లకే ఆర్డర్ పెట్టారు. ఈ భౌమిక్‌గారివల్ల దేశం సం.కి సుమారు ?20,000 కోట్లు వరకు ఆదా చేయగల్గుతుంది అని నిపుణులు చెపుతున్నారు.

ఈ జాకెట్లు ఇప్పుడు మన దేశీయ అవసరాలకు ఉపయోగపడడమే కాదు మన దేశం యూరోపియన్ దేశాలతో సహా సుమారు 100 దేశాలకు ఎగుమతి ఆర్డర్స్ సంపాదించింది. అమెరికా, బ్రిటన్, జర్మనీ తరువాత దేశీయ పరిజ్ఞానంతో ఈ జాకెట్లను తయారు చేసుకుంటున్న 4వ దేశంగా భారత్ ప్రపంచంలో నిలిచింది.

ఆన్ లైన్ లో పెళ్లి ..ట్విట్టర్ లో సంసారం!!

- టి.వరప్రసాద్



ఒకప్పుడు పెళ్లి పదహారు రోజుల పండగ. అన్ని రోజులు ఖర్చు దండగ అని తరువాత తనకు తానే పెళ్లి ఒకటి, రెండు రోజులకు కుదించుకుంది. మనది కాకపోయినా మనదైన మెహందీ, చాందినీ, సంగీతం లాంటివి ఈమధ్య మంగళసూత్రం కంటే ముఖ్యమయ్యాయి కాబట్టి కాదనడానికి వీల్లేదు. అర్థం లేని, అర్థమయితే పక్కవాడికి ఆ అర్థం చెప్పుకోలేని పాటలకు సంగీత్‌లో కుప్పిగంతులు వేయడం ఇప్పుడు మర్యాదస్థులు తప్పనిసరిగా చేయాల్సిన పెళ్లి తంతు. పెళ్లయిన తరువాత ఎలాగూ ఎగిరి గంతులేయడానికి ఏ ఆనందమూ మిగిలి ఉండదు కాబట్టి, పెళ్లి పందిట్లో ఒళ్లు మరిచి జీవితకాలానికి సరిపడా ఎగరడం అన్న వేదాంత సంగీత నృత్య ధోరణి ఏదో ఉండి ఉంటుంది.

సుబ్బి పెళ్లి అనాదిగా ఎంకి చావుకే వస్తోంది. కరోనా ఆంక్షలతో పెళ్లిళ్లకు చిక్కు ముళ్లు పడ్డాయి. లాక్‌డౌన్ తాళం తెరిచినా ఊళ్లకు ఊళ్లు ఊరేగి చేసుకునే పెళ్లిళ్లు ఇక కలలో మాటే. యాభై డిగ్రీల మండే ఎండల్లో సూటు కోటు బూటు మెడకు ఊపిరాడకుండా టై తాడుతో పెళ్లి కొడుకు, సెలెబ్రిటీలకు చింపిరి బట్టలు తయారు చేసే రీతూ కుమార్ తాత నీతూ కుమార్ కుట్లు కుట్టిన ప్రత్యేక బట్టలు కప్పుకుని పెళ్లి కూతురు పడే కష్టాలు కూడా భవిష్యత్తును ముందే దర్శనం చేయించే వేదాంత ధోరణి వస్త్ర ధారణే అయి ఉంటుంది. ఫంక్షన్ హాల్ పట్టనంత మంది పెళ్లికి వస్తే అది గొప్ప. వచ్చిన అతిథులకు మంచి నీళ్లు ఇచ్చేవాళ్ళు కూడా లేక, సంతలో తప్పిపోయిన పిల్లల్లా దిక్కులు చూస్తూ, వేదిక చేరే మార్గం తెలియక ఇసుక వేస్తే రాలని జనంలో ఇసుక రేణువుగా మిగిలి ఎలాగో బయటపడితే ఆ పెళ్లికి విలువ. ఆ పెళ్లి నిజంగా కలకాలం చెప్పుకునే పెళ్లి. సోమాలియా శరణార్థులు ఐక్యరాజ్యసమితి ఆహార శిబిరాల్లో బొచ్చెలు పట్టుకుని దీనంగా పట్టెడన్నం కోసం క్యూలో నిలుచున్నట్లు – బఫే విందుభోజనం దగ్గర మాయాబజార్ ఘటోత్కచుడయినా వరుసలో నిలుచోవాల్సిందే. కాశీలో సాక్షాత్తు విశ్వేశ్వరుడే అన్నపూర్ణ ముందు భిక్షా పాత్ర పట్టుకుని అన్నం పెట్టమని రోజూ అడుగుతుంటాడు. అలాంటిది ఒక పెళ్లిలో ప్లేటు పట్టుకుని బఫే భిక్షామ్ దేహి అని మనం అడుక్కోవడంలో సిగ్గుపడాల్సిన పనిలేదు. తాత్వికంగా చూస్తే ఈ ప్రపంచంలో ప్రతిదీ భిక్షే. అది పెళ్లి బఫేలో ప్రతిఫలిస్తుంది.

పెళ్లంటే హడావుడి. సందడి. కెమెరాలు. వీడియోలు. ఫోటోలు.గానా బజానాలు. ఎల్ ఈ డి స్క్రీన్లు. ఈవెంట్ మేనేజ్మెంట్లు. ఆకాశమంత పందిళ్లు. భూగోళమంత పీటలు. ముత్యాల తలంబ్రాలు. రత్నాల వేదికలు. నగలు. నట్రలు. ప్రదర్శనలు. అబ్బో పెళ్లంటే మాటలా?

ఇలాంటి సందడి, తండోపతండాల జనం ఇక పెళ్లిళ్లల్లో కనిపించకపోవచ్చు. కరోనాతో పెళ్లిసందడి కూడా ఆన్‌లైన్ బాట పడుతోంది. ముహూర్తం ముఖ్యం. ఆ ముహూర్తానికి బాంబేలో అబ్బాయి, ఢిల్లీలో అమ్మాయి, కలకత్తాలో పురోహితుడు, మద్రాసులో మంగళవాద్యాలు ఉంటాయి. వీడియో కాన్ఫరెన్స్‌లో లైవ్‌లో మొదట మద్రాసు సన్నాయి పీ పీ అని మంగళవాద్యం మోగుతుంది. కలకత్తా పురోహితుడు మంత్రోచ్చారణ మొదలుపెడతాడు. బాంబే అబ్బాయి లైవ్‌లో మంగళసూత్రం పట్టుకుంటాడు. ఢిల్లీ అమ్మాయి సిగ్గుల మొగ్గయి బుగ్గలు ఎరుపెక్కుతుండగా బాంబే అబ్బాయి సెల్ ఫోన్ మెడకు మంగళసూత్రం కడతాడు. వాట్సాప్పుల్లో చూస్తున్న అందరూ డిజిటల్ అక్షింతలు చల్లుతారు. తరువాత విందు భోజనం ఇమేజ్ లు, ఇమోజీలు కలగలిపి ప్రపంచవ్యాప్తంగా లైవ్‌లో చూస్తున్న అందరికీ వెళతాయి. ఈ వీడియోనే ఆన్‌లైన్ పెళ్లికి ధృవపత్రం లేదా ధృవదృశ్యం. తరువాత డిపి కబుర్లు, ఫేస్‌బుక్ సంసారం, నూతన డిజిటల్ గృహప్రవేశం. ట్విట్టర్ పిల్లలు.

డిజిటల్ విద్యా సాధ్యమేనా??

- టంకు

మహమ్మారి కరోనా వైరస్ ప్రవేశంతో భారతదేశం తీవ్ర కష్టాలు పడుతోంది. ఆ వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా దాదాపు రెండు నెలలుగా లాక్‌డౌన్ కొనసాగుతోంది. ఈ లాక్‌డౌన్‌తో అన్ని రంగాలు స్తబ్దుగా మారాయి. ఏ ఒక్క కార్యకలాపం కొనసాగడం లేదు. అన్ని రంగాలు మూతపడ్డాయి. వీటిలో ప్రధానంగా విద్యారంగం. భారతీయ విద్యావిధానం జూన్ మొదలుకుని మార్చి వరకు ఉంటుంది. మార్చిలో దాదాపు అన్ని పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మార్చి సమయంలోనే ఆ మహమ్మారి ప్రబలి పరీక్షలన్నీ వాయిదా పడేలా చేసింది. దీంతో విద్యా విధానమంతా సర్వ నాశనమైంది. ప్రస్తుతం విద్యార్థులంతా తమ కెరియర్ దెబ్బ తీసుకునేలా మారింది. అకడమిక్ క్యాలెండర్ పూర్తిగా మారిపోయింది.

అయితే త్వరలోనే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావాల్సి ఉంది. కాకపోతే ఆ వైరస్ వలన వాయిదా పడిన పరీక్షలు విద్యా కార్యాచరణ జూన్ జూలైలో పూర్తి చేసే అవకాశం ఉంది. ఇక విద్యావిధానం సెప్టెంబర్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి యూజీసీ వంటి సంస్థలు నివేదిక రూపొందించాయి. అయితే ఈ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విద్యకు భారీ ప్రోత్సాహకాలు ఇస్తూ ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజీలో ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరంలో డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తూ ఈ మేరకు కార్యాచరణ మొదలుపెట్టింది. అయితే భారతదేశంలో డిజిటల్ విద్యా విధానం సాధ్యమేనా అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఎందుకంటే భారతదేశం ప్రధానంగా గ్రామీణ ప్రాంతం. పెద్ద సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. గ్రామీణ భారతంగా ఉన్న మనదేశంలో డిజిటల్ విద్యా విధానంపై నీలిమేఘాలు అలుముకున్నాయి. వారానికి మూడు రోజులు పాఠశాలలు మూడు రోజులు డిజిటల్ తరగతులు కొనసాగించేలా ప్రభుత్వం భావిస్తుండగా అది సాధ్యమయ్యే పని కాదని తెలుస్తోంది. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా డిజిటల్‌గా అభివృద్ధి చెందలేదు. పట్టణ ప్రాంతాల వరకు ఆ విధానం విజయవంతమయ్యే అవకాశం ఉంది.

దేశంలో చాలా రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలు వెనుకబాటులో ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో డిజిటల్ విద్యా విధానం సాధ్యం కాదనే భావన ఉంది. ఆన్‌లైన్ విద్యా విధానం విద్యార్థి ఉన్నతికి దోహదం చేయదనే భావన కూడా కొంతమంది మేధావులు చెబుతున్నారు. ఆన్‌లైన్ విద్యావిధానంతో విద్యార్థుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారిలో సృజనాత్మకత బయటకు రాకపోవడంతో పాటు ఉపాధ్యాయులకు విద్యార్థి ఎలా ఉన్నాడో ఏ సబ్జెక్ట్‌లో వీక్‌గా ఉన్నాడో తెలుసుకునే అవకాశం ఉండదని తెలుస్తోంది. మానసిక ఒత్తిడి పెరుగుతుందని కూడా చెబుతున్నారు.

సమష్టిగా ఉండటం క్రమశిక్షణ పాటించడం సమయపాలన వంటివి పాఠశాల కళాశాలకు వెళ్తేనే సాధ్యమవుతాయి. విద్యార్థికి తరగతి గదే అన్ని నేర్పిస్తుంటుంది. అలాంటిది ఇప్పుడు డిజిటల్ అంటే వారిని తప్పుదోవ పట్టించే ఆస్కారం కూడా ఉంది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న పరిస్థితులు డిజిటల్ విద్యకు ప్రతికూలంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు వెనకబడే అవకాశం ఉంది. ఏదిఏమైనా అన్ని ఆలోచించి ముందడుగు వేయాలని మేధావులు విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం 2020 కొనసాగుతున్నా కొన్ని గ్రామాల్లో ఇంకా విద్యుత్ సౌకర్యానికి నోచుకోనివి ఉన్నాయని మరి ఇలాంటి పరిస్థితుల్లో డిజిటల్ విద్యా ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించి చర్యలు తీసుకుంటే బాగుటుందని పలువురు చెబుతున్నారు. మరొక సలహా వినిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య అమలుచేసి గ్రామీణ ప్రాంతాల్లో యథాతథ పరిస్థితిని కొనసాగించాలని కొందరు సూచిస్తున్నారు.



జీ-7లోకి భారత్?

-ఆర్. విజయ్‌బాబు

జీ-7 కూటమి దేశాల్లోకి భారతదేశాన్ని కూడా చేర్చుకోవాలనే ఆలోచనలో ట్రంప్ బలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది మంచి పరిణామంగానే భావించాలి. దీనివల్ల అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ, పరపతి, ప్రయోజనాలు బాగా పెరుగుతాయి. ఇది ట్రంప్ చేస్తున్న ప్రతిపాదనగానే భావించాలి. ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి చెందిన దేశాలే ఈ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ ఇందులో సభ్యులుగా ఉన్నాయి. ప్రపంచ సగటు నికర సంపదలో 58శాతం ఈ కూటమిదే. ప్రపంచ గ్రాస్ జి.డి.పి లో 46శాతానికి పైగా జీ-7 కూటమిదే ఉంటుంది. ప్రపంచంలో కొనుగోలు శక్తి కూడా వీటికే ఎక్కువ ఉంటుంది. ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాలు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం. ఆర్థికంగా మనం వీటన్నింటి కంటే ఎంతో వెనుకబడి ఉన్నాం. ఇటువంటి నేపథ్యంలో, ఈ కూటమిలోకి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానించే సంకేతం రావడం ఎంతో హర్షదాయకం. ఇప్పటికే అభివృద్ధి చెందిన అగ్రదేశంగా అమెరికాకు గట్టి పోటీ ఇస్తూ, భారత్‌తో సహా కొన్ని దేశాలను బెదిరించే స్థాయిలోకి చైనా వచ్చింది. ఫిలిప్పీన్స్, వియాత్నం, హాంకాంగ్ మొదలైనవాటికి కూడా చైనా నుండి బెదిరింపులు ఎక్కువయ్యాయి. కొన్ని రోజుల నుండి వాస్తవాధీన రేఖ చుట్టూ సైనికులను మోహరించి, భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోంది. నేపాల్‌ను రెచ్చగొడుతోంది. పాకిస్తాన్‌కు ఇబ్బడిముబ్బడిగా ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇవ్వన్నీ చేస్తూనే, ఇంకొక పక్క, దౌత్య పరమైన చర్చల ద్వారా భారత్‌తో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటామని చైనా చెబుతోంది. భారత్ కూడా సైనిక పరంగా ఢీ కొట్టడానికి సిద్ధవుతూనే, ఇంకొక పక్క చర్చల ద్వారా చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకుంటామని వివరిస్తోంది. ఇదే క్రమంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని సున్నితంగా తిరస్కరించింది. చైనా కూడా అమెరికాకు ఇదే తీరున సమాధానం చెప్పింది.ఇటువంటి తరుణంలో భారతదేశానికి జీ-7కూటమిలోకి సభ్యత్వం ఇవ్వడానికి అమెరికా సహా మిగిలిన సభ్య దేశాలు కూడా ఆసక్తి చూపడం విశేషమైన పరిణామం. ఇటువంటి సందర్భంలోనే భారతదేశం దౌత్యనీతి ప్రదర్శించడంలో మరింత అప్రమత్తంగా, వివేకంగా ఉండాలి. ఇప్పుడు, జీ-7గా ఉన్న కూటమిని డి-10గా రూపొందించాలనే యోచనలో ఈ దేశాలన్నీ ఉన్నాయి. డి అంటే డెమోక్రాటిక్. ప్రజాస్వామ్య సిద్ధాంతానికి ఆచరణలో పెద్ద పీట వేసే 10 దేశాలు ఈ డి-10 కూటమిలో సభ్యదేశాలుగా ఉంటాయి. ఈ నేపథ్యంలో వీరికి భారత్ స్ఫూర్తినిస్తుంది. నైతికత, ప్రజాస్వామ్య విలువలు, అంతర్జాతీయ విశ్వాసం మొదలైన సులక్షణాలు, అర్హతలు భారతదేశానికి ఎక్కువగా ఉన్నాయనేది ఈ కూటమి దేశాల విశ్వాసం. అదే సమయంలో, కరోనా నేపథ్యంలో చైనాపై అమెరికాకు వ్యతిరేక భావనలు బాగా పెరిగాయి. కరోనాను ఎదుర్కొంటున్న తీరులోనూ భారత్ ప్రజాస్వామ్య విధానం, ఐకమత్యం ప్రపంచ దేశాలకు బాగా నచ్చాయి. అమెరికా ప్రతిపాదించినప్పటికీ, భారత్‌లోని సుగుణాలు, అర్హతలు జీ-7/డి-10 కూటమిలోకి స్వాగతించడానికి మిగిలిన దేశాలు కూడా మొగ్గు చూపిస్తున్నాయి. భారత్ సేవారంగంలోనూ, మానవ వనరులలోనూ ప్రపంచంలో ఉన్నత దేశంగా గుర్తింపు ఉంది. ఇది కూడా మరో కారణం. చైనా తయారీ రంగంలో అగ్రగామిగా ఉంది. ఉత్పత్తి, అంతర్జాతీయ వాణిజ్యంలో అగ్రగామిగా ఉంటూ, ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ, వాణిజ్య యుద్ధాలు సృష్టిస్తోంది. ఇటువంటి క్రమంలో, తయారీ, ఉత్పత్తి, వాణిజ్యం, పారిశ్రామిక కేంద్రంగా భారత్‌ను అభివృద్ధి చెయ్యాలనే ఆలోచనలు అమెరికాతో సహా మిగిలిన అగ్రదేశాలకు కూడా ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ ఆశావహ వాతావరణాన్ని భారత్ అందిపుచ్చుకోవాలి.అదే సమయంలో, చైనాకు శత్రుదేశంగా మారకూడదు. జీ-7/డి-10లో సభ్యత్వం సంపాదించినా, పూర్తిగా అమెరికా కనుసన్నల్లోకి వెళ్లకుండా, చైనాతో -అమెరికాతో సత్ సంబంధాలు నిలబెట్టుకుంటూ, పెంచుకుంటూ అభివృద్ధి పథంలోకి సాగాలి. భారత్‌తో పాటు రష్యా, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాలను కూడా ఈ కూటమిలోకి ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. ఇక్కడే, భారత్ దౌత్యప్రజ్ఞను, రాజనీతిజ్ఞతను ద్విగుణీకృతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు అటు అమెరికాతో, ఇటు సోవియట్ యూనియన్ తోనూ గొప్ప సంబంధాలు ఏర్పరచుకున్నారు. మన్మోహన్ సింగ్ చైనా, పాకిస్తాన్ తో సత్ సంబంధాలు పెంచే ప్రయత్నం చేశారు.ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ పాకిస్తాన్ ను విస్మరిస్తూ, అమెరికా, చైనాతో దౌత్య సంబంధాలు మెరుగుపడే దిశగా వెళ్తున్నట్లుగా అర్థమవుతోంది. ఒక్కొక్క ప్రధాని ఒక్కొక్క విదేశాంగ విధానాన్ని అవలంబిస్తున్నారు. అందరికీ భారత్ ప్రగతి, శాంతి, రక్షణలే ముఖ్య ఉద్దేశ్యాలు.జీ-7 కూటమిలో భారత్ చేరుతుందా? లేదా? అనేది, అధికారికంగా ఇంకా ఎటువంటి ప్రకటన లేదు. ఇది ప్రస్తుతానికి ట్రంప్ నుండి సంకేతంగానే భావించాలి. ఈ జూన్‌లో సదస్సు జరగాలి.కానీ, కరోనా ప్రభావంతో వాయిదా వేశారు.వచ్చే సెప్టెంబర్‌లో జరిపే యోచనలో ఉన్నట్లుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.ఈ ఏడాది అమెరికా అధ్యక్షత వహిస్తోంది.గత సంవత్సరం ఫ్రాన్స్ అధ్యక్షత వహించింది.మన ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించింది.ఈ సంవత్సరం అధ్యక్షత వహిస్తున్న అమెరికా ఈ సదస్సుకు మరోమారు భారత్ ప్రధానిని ఆహ్వానించే యోచనలో ఉన్నట్లు సమాచారం. జీ-7కూటమిలో భారత్ సభ్యత్వం పొందితే, అంతర్జాతీయంగా ఆర్థిక సంబంధాలు, దౌత్యసంబంధాలు బాగా పెరుగుతాయి. భారత్ శరవేగంగా ప్రగతిబాట పట్టి, అగ్రరాజ్యంగా అవతరిస్తుంది.

అమెరికా మీద అమెరికన్ల ఆక్రోశం

- డి. స్టాలిన్

తెల్లజాతి పోలీసు కాళ్ల కింద నలిగి చనిపోయి, తన మరణంతో అమెరికా అంతటినీ కదిలించకముందే.. ఆఫ్రో–అమెరికన్ అయిన జార్జి ఫ్లాయిడ్ తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశారు.

అతని జీవితంలో ఘనతలున్నాయి. 1992లో హ్యూస్టన్‌లో ఉంటున్నప్పుడు యేట్స్ స్కూల్ లయన్స్ జట్టు తరఫున టెక్సాస్ స్టేట్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌లో ఫ్లాయిడ్ పాల్గొన్నారు. రన్నర్స్ అప్ టీమ్‌లో అతను సభ్యుడు.

అతని జీవితంలో పతనాలు కూడా ఉన్నాయి. 2007 సంవత్సరంలో ఒక దొంగతనం కేసులో ఫ్లాయిడ్ ఐదు సంవత్సరాల జైలు శిక్షను కూడా అనుభవించారు.

మినీ పోలిస్ నగరంలో మే 25న ఒక పోలీస్ కాళ్ల కింద నలిగి మరణించే నాటికి అతను ఓ సాదాసీదా అమెరికన్ పౌరుడు. వ్యక్తిగతంగా, సామాజికంగా ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటూ మెరుగైన జీవితాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి. దేశంలో లక్షమందికి పైగా చంపి, నాలుగు కోట్ల మందిని నిరుద్యోగులుగా చేసిన ఒక మహమ్మారి అమెరికాను చుట్టేస్తున్న సమయంలో ఆయన హత్యకు గురయ్యారు.

టెక్సాస్‌లోని హ్యూస్టన్ నగరంలో, నల్లజాతీయులు ఎక్కువగా ఉండే ప్రాంతంలో జార్జ్ ఫ్లాయిడ్ పుట్టి పెరిగారు. సిటీ సెంటర్‌కు ఈ ప్రాంతం దక్షిణ భాగంలో ఉంటుంది. ప్రముఖ సింగర్, లిరిక్ రైటర్ బెయాన్స్ కూడా అక్కడే పెరిగారు. కెనడాకు చెందిన ప్రముఖ ర్యాపర్ డ్రేక్ కూడా ఈ ప్రాంతంలోని వారి సంగీతాభిరుచిని తరచూ మెచ్చుకునేవారు. 1990లలో హూస్టన్‌లో ఉన్నప్పుడు ఫ్లాయిడ్ కూడా హిప్–హాప్ గ్రూపుల్లో తిరుగుతూ స్క్రిట్‌బార్స్‌లో పాలు పంచుకునేవారని చెబుతారు.

జార్జ్ ఫ్లాయిడ్ చనిపోవడానికి ముందు ఆఖరి 30 నిమిషాల్లో ఏం జరిగింది?

చాలా అమెరికన్ నగరాలలాగే హ్యూస్టన్‌లో కూడా పేదరికం, జాతి వివక్ష, ఆర్థిక అసమానతలు కనిపిస్తాయి. ఫ్లాయిడ్ నివసించే మూడో వార్డులో ఇళ్ల స్థలాల విషయంలో తరచూ ఉద్రిక్తతలు, హింస చోటు చేసుకుంటుంటాయి. "ఇక్కడికి వేరే ప్రాంతం వాళ్లను తీసుకొస్తే..."అమ్మో నేనింత పేదరికాన్ని ఎప్పుడూ చూడలేదని ఆశ్చర్యపోతారు" అని రోనీ లిల్లార్డ్ బీబీసీతో అన్నారు.

"ఇక్కడి వాళ్లలో చాలామంది ఇప్పటికీ 1920లో కట్టించిన చెక్క ఇళ్లలో నివాసం ఉంటుంటారు. పేదరికం నుంచి ఇక్కడ ఎవరూ తప్పించుకోలేరు" అని రికాన్సైల్ పేరుతో ర్యాపర్ షోలు నిర్వహించే లిల్లార్డ్ చెబుతున్నారు. క్యూనీ హోమ్స్ పేరుతో ఉండే కాలనీలో నివాసముంటున్న ఫ్లాయిడ్ పేరు చుట్టుపక్కల చాలామందికి తెలుసు. క్యూనీ హోమ్స్ అంటే ఇటుకతో కట్టిన భవనాలు అని అర్థం. ఆ బిల్డింగ్‌లలో ఉండేవారిని 'బ్రిక్ బాయ్స్' అంటారు.



ఆరడుగుల, ఆరంగుళాల పొడవున్న ఫ్లాయిడ్ అథ్లెటిక్స్ కోసం పుట్టినట్లు కనిపిస్తారు. టీనేజ్‌లో ఫ్లాయిడ్‌ను స్నేహితులు 'జెంటిల్ జెయింట్' అని పిలిచేవారు. బాస్కెట్‌బాల్, అమెరికన్ ఫుట్‌బాల్ ఆడటంలో ఆయన దిట్ట. "నేను చాలా ఆశ్చర్యపోయేవాడిని, 12 సంవత్సరాల వయసులోనే ఫ్లాయిడ్ 6 అడుగుల 2 అంగుళాల పొడవు ఉండేవారు" అని అతని చిన్ననాటి స్నేహితుడు, అతని టీమ్‌మేట్ జోనాథన్ వీల్ స్థానిక మీడియాతో అన్నారు. "అంత పొడవున్న వ్యక్తిని అంతకు ముందు నేను ఎప్పుడూ చూడలేదు" అని చెప్పారు.

ట్రంప్‌ను నోరు మూసుకోమని వార్నింగ్ ఇచ్చిన హ్యూస్టన్ పోలీస్ చీఫ్

జాన్ యేట్స్ హైస్కూలు ఫుట్‌బాల్ జట్టుకు ఆడిన ఫ్లాయిడ్ 88వ నంబర్ జెర్సీ ధరించేవారు. ఆ తర్వాత సౌత్ ఫ్లోరిడా స్టేట్ కాలేజ్ బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. 1993 నుంచి 1995 వరకు అక్కడే జార్జ్ అక్కడే చదువుకున్నారని సీఎన్ఎన్ తెలిపింది. కొన్నాళ్ల తర్వాత టెక్సాస్ తిరిగి వచ్చి కింగ్స్‌విల్లేలోని ఏ అండ్ ఎమ్ యూనివర్సిటీలో చేరారు. కానీ డిగ్రీ పూర్తి చేయలేదు.

ఆ తర్వాత కొన్నాళ్లకు ఆయన జీవితం ఒక్కసారిగా మారిపోయింది. డ్రగ్స్ సరఫరా, దొంగతనం కేసుల్లో అనేకసార్లు అరెస్టయ్యారు ఫ్లాయిడ్. మారణాయుధాలతో బెదిరించి దోపిడీకి పాల్పడ్డ నేరంపై 2007లో కోర్టు ఫ్లాయిడ్‌కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. "జైలు నుంచి విడుదలయ్యాక, మంచి మనిషిగా మారే క్రమంలో జార్జ్, స్థానికంగా పనిచేసే మత సంస్థ రిసరెక్షన్ హ్యూస్టన్‌లో చేరారు" అని అతని చిన్ననాటి మిత్రుడు లిల్లార్డ్ వెల్లడించారు. "తాను మారడమే కాదు...తన చుట్టూ ఉన్న తన కమ్యూనిటీ వాళ్ల గురించి కూడా ఆలోచించేవారు" అని లిల్లార్డ్ అన్నారు.

తుపాకీ హింసను విడనాడాలంటూ ఫ్లాయిడ్ ఇచ్చిన సందేశపు వీడియోను 2017లో చిత్రీకరించినట్లు భావిస్తున్నారు. అది సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. "మీరు ఇంటికి రండి" అంటూ చెడుదారి పట్టిన యువతకు సందేశం ఇచ్చారు ఫ్లాయిడ్. క్రైస్తవ మత సంబంధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి 2018లో ఫ్లాయిడ్ మిన్నెసోటాకు వెళ్లినట్లు అతని కుటుంబం హ్యూస్టన్ క్రానికల్ పత్రికకు వెల్లడించింది. "సరికొత్త జీవితం ప్రారంభించాలనుకున్నారు" అని అతని క్లాస్‌మేట్ క్రిస్టోఫర్ హ్యారిస్ అన్నారు. "తనలో వచ్చిన మార్పుపట్ల అతను చాలా సంతోషంగా ఉన్నారు" అని హ్యారిస్ వెల్లడించారు.

జార్జ్ ఫ్లాయిడ్: పోలీసు కాల్పుల్లో చనిపోయేదీ, కేసుల్లో అరెస్టయేదీ, జైళ్లలో మగ్గుతున్నదీ అత్యధికంగా నల్లజాతీయులే. క్రైస్తవ మిషనరీ 'సాల్వేషన్ ఆర్మీ'లో ఫ్లాయిడ్ కొన్నాళ్లు సెక్యూరిటీగార్డుగా పనిచేశారు. కొన్నాళ్లు లారీడ్రైవర్‌గా, ఓ డ్యాన్స్ క్లబ్‌లో బౌన్సర్‌గా కూడా పని చేశారు. అక్కడ ఆయన్ను 'బిగ్ ఫ్లాయిడ్' అని పిలిచేవారు. కోవిడ్ – 19 సంక్షోభం కారణంగా వ్యాపారాలు దెబ్బతినడంతో చాలామంది అమెరికన్లలాగానే ఫ్లాయిడ్ కూడా ఇబ్బందుల్లో పడ్డారు.

అరెస్టయిన రోజున ఆయన 20 డాలర్ల నకిలీ నోటుతో సిగరెట్లు కొనడానికి ప్రయత్నించారని ఆరోపణలున్నాయి. ఫ్లాయిడ్ మరణంపై మొదలైన నిరసనలు అమెరికావ్యాప్తంగా హింసకు కారణమయ్యాయి. వివిధ నగరాల్లో వందలమందిని పోలీసులు అరెస్టు చేశారు. పలు రాష్ట్రాల్లో నేషనల్‌గార్డ్ పోలీసులు రంగంలోకి దిగి శాంతి భద్రతలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

"ఒక మంచి మనిషిని చంపేశారు" అని చెప్పిన ఫ్లాయిడ్ మిత్రుడు లిల్లార్డ్ కూడా నిరసన ప్రదర్శనల్లో హింసపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. "అతను క్షమాపణలకు కరిగిపోయే వ్యక్తి. ప్రజల మనిషి" అన్నారు లిల్లార్డ్. "తాను చనిపోక ముందు కూడా తనలాంటి చాలామంది కష్టాల్లో ఉన్నారని అతనికి తెలుసు" అని లిల్లార్డ్ వ్యాఖ్యానించారు. "ఈ ఆందోళన జార్జ్ ఫ్లాయిడ్‌ను దాటి పోయింది. ఇది ఒకరకంగా అమెరికా మీద అమెరికన్ల ఆక్రోశం" అని అభివర్ణించారు లిల్లార్డ్.

నడక ఆగింది

– డా.జి.వి.రత్నాకర్
మౌలానా అజాద్ నేషన్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్



అమ్మా..

లే..మనూరొచ్చింది

మన అంటరాని పల్లె
ఆ ఒంటి నిట్టాడి గుడిసె..నిన్ను
పలకరిత్తుంది....

ఇంకా నాలుగడుగులేత్తె
అయ్య, ఆళ్ళయ్యలు నడిచిన నేల

ఆ అయ్యల సెమట సుక్కలు
తాగిన, నెత్తుటి పాదముద్దర్లు
మింగిన
సిగ్గు సెరం లేని ఊరు

ఆ గుడి
గణ గణ గంటలు దొజస్తంబం
తాగిన నెత్తురు
ఏసిన కొరడా దెబ్బలు..
అన్నీ నీ కోసం
ఎదురు సూత్తున్నాయి.

నడక ఆపకే అమ్మా..

అయ్య,ఆడయ్య సేసిన
ఊరి అప్పు ఇంకా తీరలే...

అసలే సత్తె అరిచ్చందురుని
ఆనవాలుగా బతికెటోల్లంకదా..

పల్లె ముంగిటి అయ్య సమాధి
అవతలేపునున్న
ఆ సొసానం

నీగాజులు పగలగొట్టిన
ఆ మూల మలుపు
పాడెక్కిన అయ్య కోసం
నువ్వు ఏడిసిన
ఆ ఏడుపులు

చెరిపిన నీ నుదిటి బొట్టు అన్నీ
గురుతొస్తున్నాయి అమ్మా...లే..

బతకడానికి కాకపోయినా
కనీసం చావడానికి
అయినా...ఊరెలదాం
అన్నావుగా...అమ్మా..

మంచాన బడ్డ
ముసిలి జేజి కోడలా
చెంచమ్మా...

యాడున్నవమ్మా
కాసిని నా గొంతుల గెంజినీళ్ళు
పోద్దువుగాని రామ్మా అని

నింగి నేల ఏకం సేత్తా పొగిలి
పొగిలి ఏడుత్తుంది.....

ఆకలి కడుపుల
అనాధ బతుకుల
అంటరాని యతలు
ఏ ఏలికలకు అర్థం కావు...

ఎగిరే జెండాలు
ఆటి రంగులు
మారే రంగుల గుడ్డలు

మన బతుకుల్లో ఎలుతురు కాదు
కనీసం రంగు కూడా లేకుండా
ఎలిసిపోయేట్టు సేత్తన్నాయి...

అమ్మా లే...
ఆకలేత్తంది...

నూ లేవకపోతే
రేపట్నుంచి నాకు కూడెవురు
పెడతారే...

సందమామని
సూపిత్తా ఆకలి కడుపుల
అంటరాని
కతలెవరు సెపతారె..

(మిత్రుడు అక్బర్ బొమ్మ కి
ప్రేమతో...)

కోటిమందిలో కొమర్రాజు

- వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్



"నూటికో కోటికో ఒకరు" అంటారు కదా! కొమర్రాజు లక్ష్మణరావు వంటివారు కోటికొక్కరే ఉంటారు.వీరి పూర్తిపేరు కొమర్రాజు వేంకట లక్ష్మణరావు. కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో 18వ తేదీ మే, 1877లో వీరు జన్మించారు. జులై 12 వ తేదీ, 1923లో మరణించారు.వీరి వంశానికి మూలపురుషుడు కొమ్మరాజు.పెనుగంచిప్రోలు గ్రామపాలకులు వీరే. వ్యావహారికంలో కొమ్మరాజు కొమర్రాజుగా మారింది. లక్ష్మణరావు గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనే ఒక విజ్ఞానసర్వస్వం. మునగాల, మద్రాస్, హైదరాబాద్ కార్యక్షేత్రాలుగా ఆయన ముట్టని విజ్ఞాన రంగమే లేదు. బహుభాషావేత్త, చరిత్రకారుడు, పరిశోధకుడు, పాత్రికేయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, పరిపాలకుడు, సాహిత్యపోషకుడు ఇలా ఎన్నో రంగాలతో వారి జీవితం ముడిపడి సాగింది. తెలుగుజాతిని ఆధునిక యుగంవైపు నడిపించిన వైతాళికుడు. వారి కుటుంబమంతా ప్రతిభామూర్తులు, త్యాగకీర్తులే. కాకపోతే, లోకమే వారిని మరిచిపోయింది. ప్రభుత్వాలు వారిని తలవడం కూడా మరిచిపోయాయి.వారి స్మారకంగా ఒక్క విగ్రహం లేదు. ఒక్క ఉత్సవం లేదు. లక్ష్మణరావు సోదరి భండారు అచ్చమాంబ తొలి కథకురాలు.కూతురు అచ్చమాంబ తొలితరం మహిళా వైద్యురాలు. మేనల్లుడు డాక్టర్ కె.ఎల్.రావు సుప్రసిద్ధ ఇంజనీర్.అనేక ప్రాజెక్టుల సృష్టికర్త. లక్ష్మణరావు కుమారుడు వినాయకరావు జర్నలిస్ట్. ఎంతో మంది విద్యావేత్తలు, దేశభక్తులు ఈ కుటుంబం నుండి వచ్చారు. కొమర్రాజు లక్ష్మణరావు తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచెయ్యకుండా వినాశనానికే జీవితం అంకితం చేశారు. అనారోగ్యం పాలై, నలభైఆరేళ్లకే ఈ లోకాన్ని వదిలి వెళ్లిపో యారు. గొప్ప విజ్ఞాన సంపదను జాతికి అందించారు. భారతీయ భాషల్లో మొట్టమొదటగా తెలుగులోనే విజ్ఞాన సర్వస్వం (ఎన్సైక్లోపీడియా) నిర్మించారు. దీని నిర్మాత కొమర్రాజు లక్ష్మణరావు.అయ్యదేవర కాళేశ్వ రరావు,గాడిచర్ల హరిసర్వోత్తమరావు వీరి శిష్యులే. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఆంధ్ర విశ్వకళా పరిషత్ అని నామకరణం చేసింది వీరే. వీరు జీవించి ఉంటే, ఆంధ్రవిశ్వవిద్యాలయం మొట్టమొదటి వైస్ ఛాన్సలర్ వీరే అయ్యి ఉండేవారని డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. తన మూడవ ఏటనే తండ్రి మరణించడంతో మహారాష్ట్ర (అప్పుడు మధ్యప్రదేశ్) లోని నాగపూర్ వెళ్ళి, అక్క భండారు అచ్చమాంబ ఇంట్లో ఉండి విద్యాభ్యాసం చేశారు. అక్కకు విద్యను కూడా బోధించారు. అక్కపై ఉండే కృతజ్ఞత, ప్రేమతో తన కుమార్తెకు అక్కపేరే పెట్టుకున్నారు. రెండు మాస్టర్ డిగ్రీలు పొందారు. తెలుగు, మరాఠీ, సంస్కృతం, బెంగాలీ, ఉర్దూ, హిందీ, పాళీ మొదలైన 14 భాషల్లో పాండిత్యాన్ని గడించారు. ఎన్ని భాషలు నేర్చినప్పటికీ, మాతృ భాష తెలుగుపైనే వారికి తొలి మక్కువ. రెండవ భాష మరాఠీ. ఈ రెండూ నాకు మాతృ భాషలే, అని వ్యాఖ్యానించేవారు. నాగపూర్ లో ఉన్నప్పుడు మరాఠీలోని కొన్ని పదాల అర్థాలు, సాహిత్య అంశాల విషయంలో పెద్ద పెద్ద మరాఠీ పండితులతో వాదప్రతివాదాలు చేసేవారు. ఆ వాదనల్లో చివరకు ఆయనే గెలిచేవారు. విశ్వనాథ్ కాశీనాథ్ రాజ్ వాడే వంటి మహాపండితులతో తలపడేవారు. వీరి వాదనా పటిమకు ముగ్ధులై, వీరిని అపరిమితంగా అభిమానించేవారు. బాల గంగాధర్ తిలక్ తో కూడా వాదించి, గెలిచారు. రామాయణగాథలోని పర్ణశాల నాసిక్ త్రయంబకంలో ఉందని తిలక్ వాదన. గోదావరీ ప్రాంతమని లక్ష్మణరావు వాదన. వాల్మీకి రామాయణం, చారిత్రక, భౌగోళిక మూలాలన్నీ చూపించి, తన వాదమే సత్యమని నిరూపించారు.తిలక్ అభిమానానికి పాత్రుడయ్యారు.ఈ సంఘటన జరిగినప్పటి నుండీ బాలగంగాధర్ తిలక్, కొమర్రాజు లక్ష్మణరావుల మధ్య స్నేహం అజరామరంగా వెలిగింది. కలకత్తాలో ఎం.ఎ ఫిలాసఫీ (ప్రైవేట్‌గా) చదువుతున్న సందర్భంలో స్వామి వివేకానందతోనూ కొమర్రాజుకు పరిచయం ఏర్పడింది. బిపిన్ చంద్రపాల్ ను రాజమండ్రి, మద్రాస్

లకు తీసుకురావడంలో ప్రధాన భూమిక లక్ష్మణరావే వహించారు. మద్రాస్ లో కొమర్రాజు నివాసం పేరు వేదవిలాస్. కందుకూరి వీరేశలింగం చివరి దశలో కొమర్రాజుతోనే ఉండేవారు. కందుకూరి మరణించింది కూడా వీరింట్లోనే. చివరకు కొమర్రాజు కూడా వీరేశలింగం ఏ కుర్చీలో కూర్చొని మరణించారో, అదే కుర్చీలో మరణించారు. ఇద్దరూ సంఘ సంస్కర్తలే.కానీ, కందుకూరికి వచ్చినంతపేరు, అలాగే వీరి శిష్యులైన అయ్యదేవర కాళేశ్వరరావుకు వచ్చినంతపేరు ఎందుకో? కొమర్రాజుకు రాలేదు.వీరేమీ పేరు కోసం ప్రాకులాడినవారు కూడా కారు. ఆ తరం నాయకులే అటువంటివారు కారు. నిరంతరం జ్ఞాన సముపార్జన చెయ్యడమే లక్ష్మణరావు దీక్ష. తాను చెయ్యడమేకాక, అందరినీ ఆయన వెంట నడిపించుకునేవారు. ఇంకొక పక్క పరిపాలన, మంత్రిత్వంలోనూ చాలా ప్రతిభామూర్తిగా రాణించారు. మునగాల సంస్థానానికి కొమర్రాజు దివాన్‌గా పనిచేశారు. దివాన్ అంటే ప్రధానమంత్రి. ఆ సంస్థానం తాలూకూ అనేక ఆస్తి వివాదాలు, కోర్టు తగువులు అన్నీ వీరే చూసేవారు. వీరు న్యాయశాస్త్రం చదువుకోకపోయినా, తర్కంతో గెలుచుకొని వచ్చేవారు. సంస్థానం ఆస్తులన్నింటినీ కాపాడారు. అందుకనే, మునగాల రాజావారు నాయని వేంకటరంగారావుకు కొమర్రాజు వారంటే చాలా అభిమానం. రాజు-మంత్రి వలె కాక, ఇద్దరూ ప్రాణ స్నేహితుల్లా ఉండేవారు. జమిందారీ యుగం వరకు బ్రాహ్మణులలోని నియోగి శాఖీయులు మంత్రులుగా, ప్రధానమంత్రులుగా, దివాన్లుగా ఉండేవారు. వారందరూ ఆ పదవులకు వన్నెతెచ్చిన మనీషామూర్తులు.రాజు -మంత్రుల మధ్య ఉన్న ఆనాటి బంధం ప్రభువు-ఉద్యోగిలా కాక, కుటుంబ సభ్యులుగా, గురు శిష్యుల బంధంగా సాగేది. శ్రీకృష్ణదేవరాయలు-మహామంత్రి తిమ్మరుసు, మనుమసిద్ధి-తిక్కనామాత్య బంధాలు పూర్వ యుగంలో ఎలా ఉండేవో? మునగాల రాజు నాయని వెంకట రంగారావు - కొమర్రాజు లక్ష్మణరావు బంధం ఆదర్శప్రాయంగా సాగింది. అందుకే, కొమర్రాజు లక్ష్మణరావు చేసిన సాహిత్య, భాషా, సాంస్కృతిక సేవలకు మునగాల రాజు అండగా నిలిచాడు. 1901లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, 1906లో విజ్ఞాన చంద్రికా మండలి స్థాపించారు. తెలుగుభాషలో సంపూర్ణ విజ్ఞాన సర్వస్వం నిర్మించే బృహత్ కార్యానికి రూపకల్పనం చేశారు. ఈ మూడు కొమర్రాజు చేపట్టిన గొప్ప కార్యాలు. మద్రాస్, హైదరాబాద్ కార్యక్షేత్రాలుగా ఈ రెండూ నడిచాయి. నాయని వెంకటరంగారావు, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రి శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయానికి మూల పురుషులు. వీరందరినీ కలుపుకొని హైదరాబాద్ లో ఆ సంస్థ స్థాపించారు. తెలుగునాడులో అధునాతన పద్ధతుల్లో ప్రారంభమైన మొట్టమొదటి గ్రంథాలయం ఇదే.ముఖ్యంగా, తెలంగాణా ప్రాంతంలో తెలుగుభాషా స్థితిని మెరుగుపరచడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. ఆదిరాజు వీరభద్రరావు వంటి మహాత్ములు దీనికి కార్యదర్శులుగా పనిచేశారు. సమాజానికి ఆధునిక విజ్ఞానం పరిచయం చెయ్యాలనే లక్ష్యంతో వివిధ ఆధునిక శాస్త్రాలను ఈ సంస్థ ద్వారా ముద్రించి, జాతికి అందించారు. నాయని వెంకటరంగారావు,గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగారావు మొదలైన వారందరినీ ఈ యజ్ఞంలో భాగస్వామ్యులను చేశారు.పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, 1922లో ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించారు.1916లో కొవ్వూరులో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్ లోనూ కొమర్రాజువారి భూమిక ప్రధానమైంది. ప్రపంచ విజ్ఞానమంతా తెలుగువారికి దగ్గర చెయ్యాలని బ్రిటిష్ ఎన్సైక్లోపీడియా తరహాలో తెలుగులో విజ్ఞాన సర్వస్వం తీసుకురావడం ప్రధాన సంకల్పంగా 1912-13 ప్రాంతంలో మహాయజ్ఞానికి కొమర్రాజు పూనుకున్నారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆచంట లక్ష్మీపతి, రాయప్రోలు సుబ్బారావు మొదలైన మహాపండితులను ఇందులోకి తీసుకువచ్చారు. అవి ఇవి అనిలేదు, అధర్వణ వేదం నుండి అలంకారాల వరకూ, ఖగోళ శాస్త్రం నుండి అష్టాధ్యాయి వరకూ సర్వ శాస్త్రాలూ ఈ విజ్ఞాన సర్వస్వంలో భాగమే. వీటన్నింటికీ కొమర్రాజు లక్ష్మణరావు ప్రధాన సంపాదకులు. రాత్రి, పగలు మర్చిపోయి చేసిన ఈ కృషిలో లక్ష్మణరావు ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. ఉబ్బసం వ్యాధి సంక్రమించింది. అయినా లెక్కచేయకుండా, కృషి సాగించిన విజ్ఞాన కృషీవలుడు కొమర్రాజు. ఆంధ్రసంపుటానికి శాసనాలు పరిశీలిస్తూనే మరణించారు. సంఘ సంస్కర్తగా ఎన్నో అసమానతలపై పోరాడాడు. దళితుల విద్య కోసం పరితపించాడు. కందుకూరి వీరేశలింగంతో సమానంగా సంఘసంస్కరణల కోసం ఉద్యమించాడు. దేశభాషలలోనే శాస్త్రపఠనం జరగాలని సూచించాడు. పాత్రికేయుడిగానూ కొమర్రాజు ముద్ర చాలా గొప్పది. మరాఠీ పత్రికలు సమాచార్, వివిధ విజ్ఞాన్ విస్తార్ లకు సంపాదకుడిగా వ్యవహరించాడు. కేసరి, మహారాష్ట్ర వంటి పత్రికలకు అనేక అంశాలపై ఎన్నో వ్యాసాలు రాశాడు. నాగపూర్ లో ఉన్నప్పుడే తెలుగు పత్రికలకు కూడా ఎన్నో వ్యాసాలు అందించాడు. తెలుగు జనాభా అనే పత్రికకు, అక్క అచ్చమాంబతో కలిసి వ్యాసాలు పంపేవాడు. ప్రాచీన మరాఠీకవి మోరో పంత్ రాసిన భారతాన్ని పరిశోధించాడు. తన సంపాదకత్వంలో సరికొత్త ప్రతిని తయారుచేసి, కర్ణపర్వాన్ని ప్రచురించాడు. శివాజీ చరిత్ర కొమర్రాజువారి మొదటి తెలుగు గ్రంథం. హిందూ మహాయుగం, ముస్లిం మహాయుగం మొదలైనవి లక్ష్మణరావు వ్యాసావళి పేరుతో ముద్రించారు. ఎందరో మహనీయులను తెలుగువారికి పరిచయం చేశారు. కట్టమంచి రామలింగారెడ్డి ఆర్థికశాస్త్రవేత్తగా విజ్ఞానచంద్రికా గ్రంథమండలి ద్వారానే తెలుగు పాఠకులకు పరిచయం అయ్యారు. ఆనాటి ఎందరో మహాకవులతో కొమర్రాజుకు సాహచర్యం, స్నేహం ఉండేది. ప్రఖ్యాత జంటకవులు కొప్పరపు కవులతో మద్రాస్ లో, హైదరాబాద్ లో ఎన్నో అవధాన, ఆశుకవిత్వ సభలు ఏర్పాటుచేశారు. 1913లో తన మేనల్లుడు కానూరు వీరభద్రరావు (డాక్టర్ కె.ఎల్ రావు అన్నగారు) వివాహం సందర్భంగా కొప్పరపు కవులను ఆహ్వానించి ఆశుకవిత్వ మహాసభ నిర్వహించి, వారికి 516 రూపాయలు సమర్పించారు. ఆ కాలంలో 516 లు అంటే, ఇప్పుడు కొన్ని లక్షల రూపాయిలతో సమానం. కొమర్రాజు మరణించినప్పుడు కొప్పరపు కవులు మంజరీద్విపదలో సుదీర్ఘమైన కవితా నివాళి సమర్పించారు. పోతన్న నివాసం వరంగల్లు దగ్గర అని వాదించి గెలిచారు. వీరి రచనలు చాలావరకూ అలభ్యం. కొన్ని రచనలు ముద్రణకు కూడా నోచుకోలేదు. ఎందరికో ప్రోత్సాహకుడు, ఎన్నింటికో స్ఫూర్తిప్రదాత, విజ్ఞాననిధి,పెన్నిధి కొమర్రాజు లక్ష్మణరావు. వీరి స్మారకంగా రెండు తెలుగు ప్రభుత్వాలు ఏవైనా బృహత్ కార్యక్రమాలు చేపట్టాలి. ముందుగా విజయవాడ లోనో, వారి జన్మస్థలం కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులోనో వారి స్మారక మందిరం, కాంశ్య విగ్రహాలను నెలకొల్పాలి. తెలుగువారందరూ వీరికి ఋణపడే ఉంటారు.

ఎమర్జెన్సీకి 45 ఏళ్ళు

- కె.రాజా



సరిగ్గా 45 ఏళ్ళ క్రితం 25వ తేదీ, జూన్ 1975 నాడు, అర్ధరాత్రి 11.45 నిముషాలకు ఎమర్జెన్సీ విధించారు. 1977 మార్చి 21 వ తేదీ వరకూ 21నెలల పాటు సాగింది. ఈ కాలాన్ని భారతదేశ ప్రజాస్వామ్య పాలనలో చీకటిరోజులుగా అభివర్ణిస్తారు. చరిత్రలో పీడకలగా భావిస్తారు. ఈ ఎమర్జెన్సీకి నాయకురాలు ఇందిరాగాంధీ. అప్పటి ప్రెసిడెంట్ అఫ్ ఇండియా ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ అధికారికంగా ఈ ఎమర్జెన్సీని విధించారు. నేటికాలంలోనూ తరచుగా వినిపించే మాట ఇది. అధికారంలో ఉన్నవారిని ఉద్దేశిస్తూ, మీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందంటూ... నేటి ప్రతిపక్షాలు చేసే వ్యాఖ్యలకు మూల క్షేత్రం అప్పటి ఎమర్జెన్సీ. ప్రతిపక్షంలో ఏ పార్టీ ఉన్నా, అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ప్రభుత్వాలు మారుతూ ఉన్నా, ఈ మాట మాత్రం అందరూ వాడుతూ ఉంటారు. అదే ఎమర్జెన్సీ. అప్పుడు ఇందిరాగాంధీ చట్టబద్ధంగా ఈ చర్య చేపట్టింది. మన దేశాన్ని పాలించిన ఏకైక మహిళా ప్రధాని ఆమె. జవహర్ నెహ్రూ వారసత్వపు పునాదులపై లేచిన పెద్ద కెరటం. ఐరన్ లేడీగా, దుర్గగా అభివర్ణించబడిన ఇందిరాగాంధీ నాటి పరిస్థితుల్లో ఎమర్జెన్సీ విధించాల్సి వచ్చింది. విధి ఆడిన నాటకం అది. చివర్లో ఆత్మసమీక్ష చేసుకొని, 21నెలల తర్వాత ఎమర్జెన్సీని ఎత్తివేసింది. 1966 నుండి 1977 వరకూ అప్రతిహతంగా మూడుసార్లు ప్రధానమంత్రి పీఠం అధిరోహించింది. అంతకు ముందు జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో తండ్రి జవహర్ లాల్, తాత మోతీలాల్ జైలు పాలైనప్పుడు ఒంటరిజీవితం గడిపిన సందర్భాలూ ఉన్నాయి. ఆనాటి సంఘటనలలో నుండి తన వ్యక్తిత్వాన్ని మలుచుకుంటూ వచ్చింది. ఎదిరించి పోరాడే లక్షణం, దేశభక్తి రెండూ బలంగా పెంచుకుంది. తర్వాత రాజకీయ జీవితంలోకి ప్రవేశించింది. విజయాలకు విలాసంగా, ఎదురులేని శక్తిగా అవతరించింది. తనని ఎదిరించే వారెవ్వరూ ఉండకూడదని భావించేది. వరుస విజయాలు, తిరుగులేని ప్రజాభిమానం తనని శక్తిస్వరూపంగా మలిచాయి. ఈ క్రమంలో ప్రజారంజితమైన పాలన అందిస్తున్నప్పటికీ, ఏకస్వామ్య పోకడల వల్ల, వ్యతిరేకత తెచ్చిపెట్టుకుంది. బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు,, గరీబీ హటావో (పేదరిక నిర్మూలన), లౌకికత్వ నినాదం మొదలైనవి దేశానికి అధిపతిగానే కాకుండా, కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని నేతగా నిలబెట్టాయి. ఎవరైనా అణిగిమణిగే ఉండాల్సిన పరిస్థితులు వచ్చాయి. వీటన్నింటి ప్రభావంతో అంతర్గతంగా ఇటు సొంత పార్టీలోనూ, అటు ప్రతిపక్షాల్లోనూ తీవ్రమైన వ్యతిరేకత మూటకట్టుకుంది. ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ ముందుండి నడిపిన మాస్ స్టెరిలైజేషన్ (సామూహిక గర్భ నివారణ) కార్యక్రమం మొదలైన ఇతర దురాగతాలు తీవ్రవ్యతిరేక వాతావరణాన్ని సృష్టించాయి. సంజయ్‌గాంధీ రాజ్యాంగేతర శక్తిగా అవతారమెత్తాడు. వీటిని నివారించని, నివారించలేని ఆమె పుత్రవాత్సల్యం (తల్లిప్రేమ) కొంపముంచింది. దీనికితోడు మేరునగధీరులైన అగ్రనేతలందరూ ఏకమై వైరిపక్షం సృష్టించారు. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా దేశమంతా అల్లర్లు, అలజడులు, ఆందోళనలు చుట్టుముట్టాయి. గుజరాత్‌లో 1973-74 మధ్య జరిగిన నవ నిర్మాణ్ ఉద్యమంచాలా ప్రసిద్ధమైంది. 1971 లో ఇందిరాగాంధీ చేతిలో ఓడిపోయిన రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో ఇందిరాగాంధీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిందని, ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుందని కేసు ఫైల్ చేశాడు. 1975 జూన్ 12 వ తేదీన అలహాబాద్ హైకోర్టు ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ, ఆరేళ్ళపాటు ఎన్నికల్లో పాల్గొడానికి అవకాశం లేదని సంచలనమైన తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆమె సుప్రీం కోర్టుకు వెళ్ళింది. అప్పటి జస్టిస్ కృష్ణ అయ్యర్ కూడా హైకోర్టు తీర్పును సమర్ధించారు. కానీ, ప్రధానిగా కొనసాగడానికి అనుమతి ఇచ్చారు. ప్రతిపక్ష నాయకులు, వైరి పక్షీయులు ఇందిరాగాంధీని ఎలాగైనా కట్టడి చెయ్యాలని, అధికార యంత్రాంగాన్ని ఆమెకు అవిధేయులుగా చెయ్యాలనే కుట్రపన్నుతున్నట్లుగా సమాచారం అందింది. వీటన్నిటిని పసిగట్టిన ఇందిరాగాంధీ పరిస్థితులు చేజారిపోకుండా


చూడాలని, దీనికున్న ఏకైక మార్గం చట్టబద్ధంగా ఎమర్జెన్సీ విధించడమేననే నిర్ణయానికి వచ్చింది. ఆ విధంగా ఎమర్జెన్సీ ఆరంభమైంది. ఆమెకు శత్రువుల నుండి మృత్యుభయం, అభద్రతాభావం కూడా ఉండేదని కొందరు అంటారు. ఇటువంటి పరిస్థితుల మధ్య తనను కాపాడుకోవడానికి, దేశంలో శాంతి స్థాపించడానికి ఇందిరాగాంధీ ఈ సంచలన నిర్ణయం తీసుకున్నట్లుగా భావించాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ఈమెకు సహకరించింది. ప్రతిపక్షనేతలు ఎందరో జైలుపాలయ్యారు. కొందరు గృహ నిర్బంధమయ్యారు. విదేశీ జర్నలిస్టులను దేశం వదిలిపెట్టి వెళ్ళమని ఆదేశాలిచ్చారు. పౌరహక్కులన్నీ రద్దు చేశారు. జర్నలిస్టులు కూడా జైలుపాలయ్యారు.వారిలో కులదీప్ నయ్యర్ వంటి ప్రముఖులెందరో ఉన్నారు. వార్తాపత్రికలను కూడా కట్టడి చేశారు.అప్పటి సమాచార శాఖామంత్రి శుక్లా ఈ వ్యవహారాలన్నీ పర్యవేక్షించేవారు.ఏ పత్రికైనా తప్పకుండా తమ వార్తలు, కథనాలను చూపించి, ప్రభుత్వం నుండి అనుమతి పొందిన తర్వాతే ప్రచురించాలి.రామ్ నాథ్ గోయంకా యాజమాన్యంలో నడచిన ఇండియన్ ఎక్స్ ప్రెస్ గ్రూప్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసింది. అప్పటి ప్రముఖపత్రికల్లో వీరిదే ప్రముఖ పాత్ర. సంపాదకీయాల్లో, ఇన్వెస్టిగేటివ్ కథనాల్లో తమ వాణిని బలంగా వినిపించింది.అరుణ్ సౌరీ జర్నలిస్ట్‌గా, ఈ సందర్భంలో కీలక భూమిక పోషించారు.ఈ పోరాటం ఫలితంగానే అరుణ్ సౌరీకి పాత్రికేయ ప్రపంచంలో సంచలన జర్నలిస్ట్‌గా పెద్ద పేరు వచ్చింది. సమాజంలో అసాంఘిక శక్తులు, అరాచకవాదులు, ప్రభుత్వ, సంఘ వ్యతిరేకవాదులు, అశాంతిదూతలు అని ఎవర్ని భావిస్తే, వారందరినీ జైళ్లల్లో పెట్టారు. జయప్రకాష్ నారాయణ్,చరణ్ సింగ్, మొరార్జీదేశాయ్, బహుగుణ, జార్జిఫెర్నాండేజ్, రాజ్ నారాయణ్, మధుదండావతే, వాజ్‌పెయి, అద్వానీ, నిజలింగప్ప, ఆచార్య కృపలానీ ఇలా బడా బడా నాయకులందరూ ఈ ఎమర్జెన్సీ సమయంలో విధించిన కఠిన చర్యలకు గురైనవారే. ఒక్కమాటలో చెప్పాలంటే... వారలొక్కవైపు – నేనొక్కవైపు...

అన్నట్లుగా ఇందిరాగాంధీ ఏకవ్యక్తి సైన్యంగా ఎమర్జెన్సీని నడిపించింది. ప్రతిపక్షాలు, పత్రికలు, హక్కుల ఉద్యమకారుల నోళ్లు నొక్కేసిన రోజులవి. ఎమర్జెన్సీ ప్రభావం వల్ల, అనంతర కాలంలో భారతదేశంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మీడియా పెరిగింది. ప్రజలలో ప్రజాస్వామ్యం విలువ మరింత తెలియవచ్చింది. బ్రిటిష్ వారి నుండి స్వాతంత్ర్యం పొందిన తర్వాత, మన పాలనలో అనుభవించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ మొదలైనవాటికి ఈ ఎమర్జెన్సీ ఒక్కసారిగా ఎవ్వరూ ఊహించని ఒక ఝలక్ ఇచ్చింది. దీనితో, ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత, ప్రజాస్వామ్యంలో ఉండే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల అనుభవసారం మరింత అర్థమయ్యింది.ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎమర్జెన్సీ వంటి చర్యలు గొడ్డలి పెట్టువంటివి. మొత్తంగా, ఈ ఎమర్జెన్సీని రాజకీయ రణక్షేత్రంగా అభివర్ణించాలి. పాలకులు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించకపోతే, తప్పనిసరిగా ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోవలసిందే. మూల్యం చెల్లించాల్సిందే.అంతటి అజేయ, అమేయ శక్తిస్వరూపమైన ఇందిరాగాంధీ కూడా 1977ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. అధికారం కోల్పోయింది. ఎమర్జెన్సీ విధించినందుకు, ఏకస్వామ్యంగా వ్యవహరించినందుకు ప్రజాక్షేత్రంలో శిక్ష అనుభవించింది. ఇందిరాగాంధీ ఎదుర్కొన్న చేదు అనుభవాలు పాలకులందరికీ పాఠాలు, గుణపాఠాలే అవుతాయి

ఇక జ్ఞాపకాలలో అట్లాస్ సైకిల్

- ప్రజామీడియా నెట్‌వర్క్

1951లో సోనిపెట్,హర్యానాలో జానకీ దాస్ కపూర్ అనే ఆయన ఒక చిన్న షెడ్లో ప్రారంభించిన అట్లాస్ సైకిల్ రికార్డ్ స్థాయిలో 12 వేల సైకిల్స్ ఉత్పత్తి చేసింది, సంవత్సరం తిరిగే లోపే 25 ఎకరాల విశాల ప్రాంగణంలో ఫ్యాక్టరీ తెరచి,1958లో విదేశీ యూనిట్‌ని ప్రారంభించి దేశ విదేశాలకు ఎగుమతులు ప్రారంభించింది.1978లో తొలి రేసింగ్ సైకిల్ ప్రవేశపెట్టి 1982 ఢిల్లీలో జరిగిన ఆసియన్ క్రీడలకి అధికారికంగా సైకిల్స్ పంపిణీ చేసిన ప్రతిష్టాత్మక సంస్థ..అట్లాస్ సైకిల్స్ సైకిల్స్ వాడకం తగ్గడంతో 2004 నుండి కంపెనీ ఒడిదుడుకులు ఎదుర్కొంది, అదే సంవత్సరం హీరో సునీల్ శెట్టి, టెన్నిస్ తార సానియా మీర్జాలని ప్రచార కర్తలుగా నియమించినా సైకిల్ వాడకం తగ్గిపోవడంతో ఇక కోలుకోలేదు.2014లో మధ్యప్రదేశ్ మలన్ పూర్, 2018లో సోనిపెట్ హర్యానాలో ఉత్పత్తి ఆపేసింది. షాహీదాబాద్‌లో తన ఆఖరి సైకిల్ తయారీ యూనిట్‌ని నేడు మూసివేయడంతో అట్లాస్ సైకిల్ ఇక చరిత్రలో కలిసిపోయింది. ఒకప్పుడు రోడ్ల మీద రారాజులా తిరిగిన ఈ సైకిల్ ఇక మన జ్ఞాపకాలలో మాత్రమే మిగిలి పోనుండడం బాధాకరం.



సేద తీరు సైకిల్ మిత్రమా..ఇక మా జ్ఞాపకాలలో..

అంతా విష్ణు మాయ!!



పూరీ జగన్నాథ స్వామి ఆలయంలో అక్కడ ఉన్న ప్రతి ఒక్కటి మిస్టరీయే. అందుకే పూరీ జగన్నాథ స్వామిని భక్తులు అంతలా ఆరాధిస్తారు. ఇంతకీ పూరీ జగన్నాథ్ ఆలయంలో ఉన్న మిస్టరీలేంటో తెలుసుకొండి ముఖ్యంగా చెప్పుకోవాల్సింది అక్కడ ఉన్న 65 అడుగుల ఎత్తయిన పిరమిడ్ నిర్మాణం.

అక్కడ ఉండే స్తంభాలు, గోడలు.. అన్నీ ప్రత్యేకతతో కూడుకున్నవే.

జెండా ఈ ఆలయ గోపురం పైన ఉండే జెండాకు కూడా ప్రత్యేకత ఉంది. మామూలుగా ఏ గుడికి కట్టిన జెండా అయినా సరే..గాలి ఎటువైపు ఉంటే అటువైపే ఊగుతుంది. కానీ.. ఇక్కడి జెండా మాత్రంగాలి వస్తున్న వైపు కాకుండా.. వ్యతిరేక దిశలో ఊగుతుంది.

చక్రం

పూరీ జగన్నాథ్ ఆలయం చాలా ఎత్తులో ఉంటుందని తెలిసిందే. ఆ గోపురం పైన ఓ సుదర్శన చక్రం ఉంటుంది. మీరు పూరీలో ఎక్కడ ఉండి అయినా సరే.. ఆ సుదర్శన చక్రాన్ని చూస్తే.. అది మీ వైపే తిరిగినట్టు కనిపిస్తుంది. అది ఆ చక్రం ప్రత్యేకత.

అలలు

సాధారణంగా అన్ని చోట్ల వీచేగాలి సముద్రం నుంచి భూమి వైపునకు ఉంటుంది. పగటి పూట అలా వీస్తుంది. సాయంత్రం పూట భూమి వైపు నుంచి సముద్రం వైపునకు వీస్తుంది. కానీ.. పూరీలో మాత్రం అంతా రివర్స్. దానికి విభిన్నంగాగాలి వీస్తుంది.

పక్షులు

జగన్నాథ ఆలయం పైన పక్షులు ఎగరవు. ఆలయం పైకి పక్షులు వెళ్లవు. పక్షులు ఎందుకు అక్కడ ఎగరవు.. అనే విషయం మాత్రం ఎవ్వరికీ అంతు పట్టడం లేదు. ఎంతో మంది దీనిపై అధ్యయనం చేసినా కనుక్కోలేకపోతున్నారు.

గోపురం నీడ

జగన్నాథ ఆలయం ప్రధాన ద్వారం గోపురం నీడ ఎవ్వరికీ కనిపించదు. సూర్యుడు వచ్చినా కూడా అది కనిపించదు. పగలు అయినా.. సాయంత్రం అయినా ఏ సమయంలో కూడా ఆ గోపురం నీడ మాత్రం కనిపించదు. దీని నిర్మాణం అలా ఉంటుందా? లేక దేవుడి మహిమ వల్ల ప్రధాన ద్వారం గోపురం నీడ కనిపించదా? అనేది మాత్రం అంతు చిక్కడం లేదు.ప్రసాదం వృథా చేయరు

పూరీ జగన్నాథ్ ఆలయంలో తయారు చేసిన ప్రసాదాన్ని కొంచెం కూడా వృథా చేయరు. మొత్తం తినేస్తారు.

అలల శబ్దం

సింహద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించే సమయంలో ఒక అడుగు గుడి లోపలికి పెట్టగానే.. సముద్రంలో నుంచి వచ్చే శబ్దం వినిపించదు. కానీ.. అడుగు బయటపెట్టగానే అలల శబ్దం వినిపిస్తుంది

రథ యాత్ర

పూరీ జగన్నాథ్ ఆలయంలో అతి ముఖ్యమైంది ఇదే. పూరీ రథ యాత్ర. ఈ రథ యాత్రలో రెండు రథాలు ఉంటాయి. శ్రీమందిరం, గుండిజా ఆలయానికి మధ్యలో ప్రవహిస్తున్న నదిని దాటి వెళ్లాలి.

అందుకే రెండు రథాలను ఉపయోగిస్తారు. మొదటి రథం నది ఇవతలి ఒడ్డు వరకు తీసుకెళ్తుంది. అక్కడ మూడు చెక్క పడవల్లో దేవతలు నది దాటుతారు. అక్కడి నుంచి మరో రథంలో దేవుళ్లను గుండిజా ఆలయానికి తీసుకెళతారు.

రథాలు

పూరీ వీధుల్లో శ్రీకృష్ణుడు, బలరాముడి విగ్రహాలను రథంలో ఊరేగిస్తారు. ఆ రథం సుమారు 45 అడుగుల ఎత్తు, 35 అడుగుల వెడల్పు ఉంటుంది. ఈ రథానికి 16 చక్రాలు ఉంటాయి. బంగారు చీపురు రథ యాత్రకు ముందు బంగారు చీపురుతో రథాల ముందు ఊడ్చుతారు. ఆ తర్వాత వాటిని తాళ్లతో లాగుతారు. విగ్రహాలుజి

ఈ గుడిలోని శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరామ విగ్రహాలను చెక్కతో తయారు చేశారు.

గుండీజా ఆలయం

ప్రతి సంవత్సరం ఇక్కడ జరిగే రథ యాత్రలో విశిష్టత ఏంటంటే.. గుండీజా ఆలయానికి ఊరేగింపు రాగానే.. రథం తనంతట తానే ఆగిపోతుంది. దాన్ని ఎవ్వరూ ఆపరు. ఇది కూడా ఇప్పటికీ ఓ మిస్టరీలాగానే ఉండిపోయింది. దేవుడికి ప్రసాదం

పూరీ జగన్నాథుడికి 56 రకాల ప్రసాదాలు సమర్పిస్తారు. ఆ ప్రసాదాలకు కూడా విశిష్ట చరిత్ర ఉంది.

ఆలయ సంప్రదాయం ప్రకారం.. వాటిని మట్టి కుండల్లో వండుతారు. దేవుడికి సమర్పించడానికి ముందు ఆ ప్రసాదాల్లో ఎటువంటి వాసన ఉండదు. రుచి కూడా ఉండదు కానీ..

దేవుడికి సమర్పించిన తర్వాత ఆ ప్రసాదాలు ఘుమఘుమలాడుతాయి. ఎంతో మధురంగా ఉంటాయి ప్రసాదాలు.

ఉమెన్ ఇంపవర్‌మెంట్

ఆత్మగౌరవం

\- ఆర్.కె



శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలమది.....

ఓ రోజు మధ్యాహ్నం డిల్లి రాజమార్గంలో తన వాహనశ్రేణి (కాన్వాయ్)తో కారులో వెళ్తున్నారు ప్రధాని. ఇంతలో దూరంగా మండుటెండలో ఆటబొమ్మలు అమ్ముకుంటున్న తొమ్మిదేళ్ల పాపపై ఇందిరాగాంధీ దృష్టి పడింది. కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా ఆ చిన్నారి దూది బొమ్మలు అమ్ముకుంటున్న తీరు ప్రధాని హృదయాన్ని కదిలించింది. కారుని ఆపించి తన సాయుధులైన అంగరక్షకులతో ఫుట్పాత్ దగ్గరకు వెళ్లి ఆ చిన్నారిని పలకరించారు ప్రధాని. అంతటి మనిషి పిలుస్తున్నా తనని కాదనుకొని ప్రతిస్పందించలేదు ఆ పాప. అంగరక్షకులకు ఆవేశం ముంచుకొచ్చి, ఆ పాపను పట్టుకొని ఈడ్చుకొని వచ్చేందుకు సంసిద్ధమయ్యారు. ఇంతలో ఇందిరాగాంధీ వారిని సున్నితంగా వారించి, తనే ఆ చిన్నారిని పలకరించేందుకు వెళ్ళారు.

"నేను అంతగా పిలుస్తున్నా పలకకుండా వెళ్లిపోతున్నావేం పాపా.!" అంటూ తలపై నిమురుతూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు ప్రధాని.

"అమ్మా.! మీరు పెద్దవారు కదా నాతో పనేముంటుందిలే అని అనుకున్నాను.!" అని అంటూ తన బొమ్మలు సర్దుకోసాగింది.

"నువ్వుష్ట్ర్వ ఎక్కడ ఉంటావు.? మీ నాన్న ఏమి చేస్తుంటారు.?" అంటూ అరా తీశారు ఇందిరాగాంధీ. "ఓ మురికి వాడలో ఉంటున్నాం, జబ్బుతో నాన్న మంచాన పడటంతో ఇంట్లో అమ్మా అక్కయ్యలు బొమ్మలు చేసి ఇస్తే, నేను ఇలా బజారులో అమ్ముతూ ఉంటానమ్మ.! ఇంట్లో అమ్మా, నాన్న, నేను, ఇద్దరు తమ్ముళ్లు , ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్ళు... తొమ్మిది మందికి ఈ బొమ్మలు నుంచి వచ్చిన ఆదాయమే ఆధారం. రోజంతా అమ్మితే ఇరవై నుంచి ముప్పై రూపాయల వరకూ లాభం ఉంటుంది." అంటూ అమ్ముకోవడానికి వెళ్లిపోసాగింది ఆ చిన్నారి.

ఆ పాపా కుటుంబం ఆర్థిక స్థితిగతులు అర్థమై నిట్టూర్చారు ప్రధాని.! వెంటనే తనచేతి సంచి లోంచి 500 రూపాయలు తీసి ఆ పాప చేతిలో ఉంచారు ఇందిరాగాంధీ.

ఆ పాప చివాలున తల పైకెత్తి. సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ "అమ్మా.! నేనేం బిచ్చగత్తెను కాను" అంది ఆవేదన, ఆవేశం నిండిన స్వరంతో.! ఆ చిన్ని గొంతులో ధ్వనించిన ఆగ్రహానికి భారతదేశ ప్రధానమంత్రి ఖంగు తింది. తన తప్పిదమేంటో తెలిసొచ్చి, ఒక్క క్షణం ఆలోచలో పడింది. మెరుపులా ఓ ఆలోచన తట్టింది.

"సరే.! ఈ బొమ్మలు అన్ని ఎంతకు అమ్ముతావు మరి"? అని అడిగారు ఇందిరాగాంధీ. "నూరు రూపాయలు! కానీ అమ్మా ఇన్ని బొమ్మలు మీరు ఏమి చేసుకుంటారు? మీ ఇంటిలో చిన్న పిల్లలు ఉన్నారా? నాపై సానుభూతితో ఐతే నేను అమ్మను.! నాపై దయ చూపెట్టాలిసిన అవసరం లేదులే అమ్మా!, అంటూ సంశయాన్ని వ్యక్తం చేసిందా చిన్నారి.

ఆ పాపా అంత సులువుగా డబ్బులు తీసుకోదని అర్థమైంది ఇందిరాగాంధీకి. "పాపా! మా ఇంటిలో చిన్న పిల్లలు లేకపోయినా, నీ లాంటి చిన్నపిల్లల్ని చాలామందిని కలుస్తుంటాను వారికి బహుమతిగా ఈ బొమ్మలు ఇద్దామ నుకుంటున్నాను.! సరేనా ఇప్పటికయినా ఈ వంద రూపాయలు తీసుకొని బొమ్మలు అమ్ముతావా." అంటూ వందరూపాయల నోటు ఆ పాపకు ఇచ్చారు ప్రధాని. అప్పుడు సమాధాన పడ్డ ఆ చిన్నారి , తన బొమ్మలన్నీ ఆమెకి ఇచ్చేసి నూరు రూపాయలు తీసుకుంది.

ఆ తొమ్మిదేళ్ల పాపా ప్రదర్శించిన ఆత్మ గౌరవాన్ని ప్రధాని తన డైరీలో రాసుకొవడమే కాదు ఎంతో మంది ప్రముఖులకు ఉదాహరణగా చెప్పేవారు. ఆ చిన్నారి భారతీయ ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడేవారు. ఆయాచితంగా వచ్చినదాన్ని భారతీయులు స్వీకరంచరనీ, ఒకరి దయాదాక్షిణ్యాలపై బ్రతికే అలవాటు భారతీయులకు లేదని భారతీయ తత్వాన్ని ఈ ఉదంతం మరోమారు గుర్తుచేస్తుందని ఉదాహరించేవారు ఇందిరాగాంధీ.

వైజాగ్ కుర్రాడు..హైద్రాబాద్‌కు ప్రేమతో రాసిన ఉత్తరం

- శ్రీ

అమ్మలాంటి నిన్ను చూడాలనిపిస్తోంది. అక్కడ కరోనా ఎక్కువగా ఉందని చెబుతుంటే మనసు విలవలాడిపోతోంది. అవకాశం చిక్కితే ఒక్కసారైనా వచ్చిపోవాలనిపిస్తోంది. అందరి కష్టాల్ని తీర్చే అమ్మకి కష్టం వస్తే మనం తట్టుకోగలమా. మనసు విలవిలలాడిపోదూ. ఇప్పుడు నిన్నుతలచుకున్నా నాకూ అలానే అనిపిస్తోంది. ఖాళీ కడుపుతో ఈ నగరానికి చేరిన ఎందరినో భాగ్యవంతుల్ని చేశావు. పేరుకు తగ్గట్టుగా భాగ్యనగరంగా బాసిల్లుతున్నావ్.

ఎక్కడో ఉత్తరాంధ్రలో మారుమూల పుట్టి పెరిగిన నాకు ఎన్నో నేర్పించావ్. ఎంతో ఇచ్చావ్. అందుకే గట్టిగా ఊపిరి పీల్చుకుని హైదరాబాద్ అని నిన్ను ఒక్కసారి మనసులో అనుకుంటే ఎక్కడ లేని కిక్కు వచ్చేస్తుంది. ఆ ఉత్సాహాన్ని నేను మాటల్లో చెప్పలేను. నాకే కాదు. చాలామందికి ఇదే ఫీల్ కలుగుతుందని నాకు తెలుసు. దానికి కారణం నువ్వు అందించిన బతుకు. ఎర్రబస్సెక్కి నేరుగా నీ దగ్గరకు వచ్చిన నాలాంటి ఎంతోమందికి అన్నం పెట్టావు. అవకాశాల్ని అందించావు. లెక్కలేనన్ని ఆనందాల్ని పంచావు. బతుకు చిత్రాన్ని బయోస్కోపులో చూపించావు.



చార్మినార్... ఈ కట్టడం చాలు కదా. గతం చేసినగాయాన్ని నువ్వు ఏ స్థాయిలో ఎదుర్కొని నిలిచావో చెప్పడానికి. నువ్వు నగరమే కాదు. ఎంతోమంది ఊపిరి. అందుకే ఈ నగరంలో ఏం జరుగుతుందో అని ఎన్నో కోట్ల గుండెలు ఎదురు చూస్తాయి. ఆశీర్వదిస్తాయి. బతుకు పోరులో ఎన్నో వేల జీవులు నీ దగ్గరకు చేరి సేదతీరుతున్నాయి కాబట్టి. వారందరి మూలాలు వేరే చోట ఉన్నాయి.

నీతో అనుబంధం ఓ ఆరోగ్యకరమైన వ్యసనం కదా. ఎంత మానుకుందామన్నా నీపై మనసు లాగేస్తుంది. తల్లి లాంటి నువ్వు అందించిన ఆత్మీయతానురాగాలు మనసులో మెలేస్తుంటాయి. అందుకే నాలాంటోడికి రోజులో కనీసం ఓసారైనా నువ్వు గుర్తొస్తావ్. అందుకే పంజాగుట్ట, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, పెద్దమ్మగుడి, సికింద్రాబాద్, అమీర్ పేట్, మూసాపేట, ఇలా ఒకటా రెండా ఎన్నెన్ని గుర్తొస్తాయో.

మన జీవితాల్లో నుంచి ఓ మంచి మనిషినే అంత త్వరగా తక్కువ చేసి మాట్లాడలేం కదా. అలాంటిది ఓ గొప్ప నగరానివి. అందులోనూ జిందగీని పరిచయం చేసిన మహానగరివి నువ్వు. ఎలా మరువగలను. నీ ఖ్యాతిని ఎలా తగ్గించగలను. ఎవరైనా తగ్గించే ప్రయత్నం చేస్తే ఊరుకుంటామా !

రెండు తెలుగు రాష్ట్రాల్లో డిగ్రీ పూర్తయ్యాక ప్రతి ఒక్క యువకుడి చూపు నీ వైపే కదా. దానికి కారణం నీ దగ్గరకు వస్తే చాలు. నీ దగ్గర కాలు మోపితే, అక్కడ శిక్షణ తీసుకుంటే ఇక బతుకుకి ఢోకా ఉండదనే నమ్మకం. అందుకే ఎంత దూరం జరిగినా, ఎంత దూరంలో ఉన్నా నువ్వు అందరి మనసుల్లో, జీవితాల్లోంచి విడదీయ లేని భాగం అయిపోయావ్.

కరోనా వేళ జరుగుతోన్న గందర గోళ పరిస్థితుల్లో అమ్మ లాంటి నీపై దీవేస్తోంది. ఎందుకంటే నీ దగ్గర కరోనా బాగా ఎక్కువగా ఉందని చెబుతుంటే తల్లడిపోతున్నాను. ఒక్కసారి మనసులో ఏదో కలచివేసే భావన కలుగుతోంది. అవకాశం చిక్కితే ఓసారి చూసిరావాలనిపిస్తోంది.

అయినా లోలోపల గట్టిగానే చెబుతోంది త్వరలోనే నువ్వు నీ సహజ ఆకర్షణని సొంతం చేసుకుంటచావని. బిర్యానీ ఘుమఘుమల్ని రుచి చూపిస్తావని. మనసు చెబుతుందిలే. నీ ఒడిలో ఇరానీ ఛాయ్ కప్పుని పెదాలకు ఎప్పుడెప్పుడు అందిస్తానా అని ఎదురు చూస్తున్నాను. మన మిత్రులతో భాయి భాయి అనిపించాలని మనసు పరితపిస్తోంది.

అయినా మనలో మన మాట కానీ... కరోనా ఎక్కడ లేదు చెప్పు. లండన్ నుంచి న్యూయార్క్ వరకూ. ఏ నగరాన్నీ వదల్లేదు కదా. అలా అని మనం బతకడం మానేస్తామా. ఓ అర్నెల్లల్లో అంతా సద్దుమణిగాక పంజాగుట్టలోనో, పాతబస్తీలోనో ధూం ధాం చేసుకోపోతామా.

దావత్‌లో బగారా రైస్‌తో మాంచి ఘాటైన ఏట కూరతో మస్తీ చేసుకోపోతామా. నీకు కష్టం వచ్చింది. కలసి పోరాడతాం. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మా విశాఖలోనూ కరోనా విజృంభిస్తోంది. నీకు తెలుసా. ఇక్కడ కూడా మా వాళ్లందరికీ జాగ్రత్తగా ఉండమని నాకు తోచినంతలో చెబుతున్నాను.అందుకే అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు వెళ్తున్నాను.

ఆల్ ఈజ్ వెల్. ఆల్ ఈజ్ వెల్. ఇక ఉంటానే. హమ్మయ్య నీకు ఉత్తరం రాసేసా. ఇప్పుడు గుండెలో బరువు దిగిపోయినట్టైంది. ఇక నిన్ను చూడడమే తరువాయి. ఆ క్షణాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నా. ఎంత త్వరగా వీలు చిక్కితే. అంత త్వరగా నిన్ను కలుస్తా. ఇప్పటికింతే... చివరగా ఎందుకో ఓసారి గట్టిగా అనాలనిపిస్తోంది. నువ్వు షంషేర్ నగరానివని. బతుకునిచ్చిన నీపై ప్రేమతో...

నీ.. వైజాగ్ కుర్రాడు

కనుమరుగవుతున్న మానవ సంబంధాలు

అనుబంధాలు, అనురాగలు, ఆత్మీయతలు

– కేబి.రమేష్, సీనియర్ జర్నలిస్ట్

మనిషి ఎప్పుడు ఒంటరివాడు కాదు, బంధాలు, అనుబంధాలు, అనురాగలు, ఆత్మీయతలు, స్నేహాలు, నైతిక విలువలను పునాదిగా చేసుకొని కుటుంబాన్ని నిర్మించుకున్నాడు, సమాజం అంటే మానవ సంబంధాలు, ఇవ్వన్నీ ఉంటేనే మనిషి ఆనందంగా శాంతియుతంగా జీవిస్తాడు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న మానవ సంబంధాలు మాత్రము క్రుశించి పోతున్నాయి, మానసిక ఒత్తిడి ఎక్కువ అయ్యింది, ఆర్థిక పరిస్థితులు వ్యక్తుల మధ్య దూరాన్ని పెంచింది, మంచి సంపాదన, పేరు ప్రతిష్టల వల్ల సంతోషం రాదు, మానవ సంబంధాల వల్ల మనిషి ఆనందంగా జీవిస్తాడు. టెక్నాలజీ పెరుగుతున్న సౌకర్యాలు అన్ని అందుబాటులో ఉన్న మానవ సంబంధాలు లేకపోతె మనిషి మాత్రము ఎప్పుడు ఒంటరి వాడే అవుతున్నాడు, ఇతర మనుషులతో, జంతువులతో, ప్రకృతితో సంబంధాలు తెంచుకుంటున్నాడు.

డబ్బు ప్రతి పనికి వెలకడుతుంది, అమ్మ లాలన, ఇల్లాలి ఆదరణ, పెద్దల పోషణ, కుటుంబ పాలన మొదలైనవన్నీ డబ్బు ద్వారా ఇతరుల చేత పొందుతున్నారు.

విలువలు, బంధాలు మార్కెట్లో




సరుకులయ్యాయి, డబ్బు కోసం ఎటువంటి పని చేయడానికైనా ఎవరు వెనుకాడటంలేదు. విలువలు మరిచి ఎన్నో అఘాయిత్యాలు చేయడానికి సిద్ధమవుతున్నాడు, కల్తీ కల్లు, సారా అమ్మకాలు, మానవ అవయవాల దోపిడీ, బాలలపై అత్యాచారాలు, కిడ్నాప్, వ్యభిచారం వంటి అకృత్యాలు షార్ట్ కట్ సంపాదనకు మార్గాలైనాయి, దొంగతనాలు, కుట్రలు, మర్డర్స్, కన్నవారిపై దాడులు వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, పరువు హత్యలు మొదలైనవి మనిషిని పశువుగా మార్చేశాయి.


పెండ్లి అంటే పందిళ్లు, తప్పట్లు, తాళాలు, తలంబ్రాలు, మూడు ముల్లు, ఇలా మొత్తం కలిపి ఏడడుగులు. ప్రస్తుతము పెండ్లి అంటే ఆడంబరానికి కొదవలేదు, ఖర్చులు బాగా పెరిగాయి, విదేశీ పూల అలంకరణాలు, ఇటాలియన్ వంటకాలు, మెహిందీలు, సంగీత్‌లు కానీ ఆత్మీయత కనిపించడం లేదు, ఆత్మీయ పలకరింపులు, అనుబంధాలు మరుగునపడ్డాయి. వచ్చామా, భోజనం చేసామా, గిఫ్ట్ ఇచ్చామా, వెళ్ళామా ఇది ప్రస్తుత పరిస్థితి. ఒకప్పుడు పెండ్లి అంటే ఊరంతా సందడి కానీ ఇది సోషల్ మీడియా కాలం వాట్సాప్‌లో ఆహ్వానం పంపుతున్నారు, మోహమాటానికి పెండ్లికి హాజరవుతున్నారు. ఒకప్పుడు పెండ్లీలు ఇంటివద్దనే చేసేవారు సాంప్రదాయ బద్దంగా జరిగెయి, పందిరికి ఎన్ని గుంజలు పాతాలి అన్న విషయం మర్చిపోయి ఫంక్షన్ హాల్లో పెళ్లిళ్లు చేస్తున్నారు సంప్రదాయాన్ని మర్చిపోతున్నారు.

అనుబంధాల మధ్య జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో కుటుంబం వల్లే తెలుస్తుంది, బంధాలు తెంచుకోకూడదు, అందరితో కలిసుండాలి, చిన్న చిన్న తేడా వచ్చినా పట్టించుకోకూడదు, మనమందరము ఒకే కుటుంబం అని మర్చిపోవద్దు ఒకటిగా కలసి ఆదర్శాలను, సంప్రదాయాలను ముందుకు తీసుకవెళ్ళాలి.

పండుగలకు, పెండ్లిలకు కలుసుకోవాలి కుటుంబ విలువలను కాపాడుకోవాలి. నగరీకరణ పుణ్యమా అని ఇప్పుడున్న జనరేషన్ కుటుంబ ఆప్యాయతానురాగాలకు నోచుకోలేకపోతున్నది, ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై యువతకు ఏకాంతం ఎక్కువగా లభిస్తుంది, ఆర్థిక ఇబ్బందుల వలన భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలు చేస్తుండడంతో పిల్లలను సరిగ్గా పెంచలేక వారి ఆలనాపాలనా కోసం ఇతరుల దగ్గర వదిలిపెట్టాల్సి వస్తుంది. ఆత్మీయతను పక్కకు పెట్టి నిరంతరము టీవీ లకు అతుక్కుపోతున్నారు. సోషల్ మీడియా పుణ్యమాని మనిషికి తీరిక లేకుండాపోతుంది, సంప్రదాయ ఆటలకు బదులు వీడియో గేమ్స్ తో ఎక్కువగా కాలం గడుపుతున్నారు.

చిన్న చిన్న సమస్యలను, సవాళ్ళను అధిగమించ లేకపోతున్నారు, తీవ్ర వత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, విద్యావిధానం కుంటుపడింది, పరిస్థితులను చక్కపెట్టేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. యువతను సమాజంలో భాగంగా పెంచాలి వారికి సామాజిక బాధ్యతను గుర్తుచేయాలి. సమాజంలో విపరీత మార్పులు చోటుచేసుకున్నాయి, వ్యక్తుల మధ్య కుటుంబాల మధ్య దూరం పెరిగింది. వేష భాషలు, ఆహారపు అలవాట్లలో మార్పులు వచ్చాయి. మన అనే పదం మరిచి నాది అనే పదానికి అలవాటుపడ్డారు, నైతిక విలువలు మానవ సంబంధాలు సన్నగిల్లాయి.   తల్లిదండ్రులు, పిల్లలు, స్నేహం మధ్యగ్యాప్ పెరిగింది, ఆర్థికంగా ఎదిగే క్రమంలో మానవ సంబంధాలు అంతరించాయి. చివరకు మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడింది. కృత్రిమ బంధాలు నశించి మానవ సంబంధాలు పెరిగినప్పుడే బంధాలు, అనుబంధాలు, ఆత్మీయతలు, అనురాగాలు, ఆప్యాయతలు, నైతిక విలువలు, సంప్రదాయాలు తిరిగి అవతరిస్తాయి అప్పుడే మనిషి సంతోషంగా, స్థిరంగా జీవించగలడు.





సత్యమేవ జయతే

- సి.జయంత్

సత్యమేవ జయతే, మన నినాదం. గజరాజు మన వారసత్వ జంతు రాజం. చైనా జాతీయ జంతువు డ్రాగన్. డ్రాగన్, అంటే భయంకరమైన జంతువు.దీన్ని బట్టే,రెండు దేశాల ప్రవృత్తి తేటతెల్లమవుతుంది. ఐశ్వర్యానికి, విజయానికి ప్రతీక ఏనుగు.సత్యాన్ని నమ్ముకున్నవారికి తాత్కాలికంగా కష్టాలు,ఇబ్బందులు, అపజయాలు వచ్చినా, చివరి గెలుపు సత్యానిదే. ధర్మానిదే. ఇది పుక్కిటి పురాణపు మాట కాదు. చరిత్ర చెప్పిన సత్యం. మన ఆస్తిని నిలుపుకోవడం ధర్మం.పరులసొమ్ము ఆశిస్తే, అది పామై కరవక మానదు.భారత్ –చైనా మధ్య సాగుతున్న ఈ పోరు,ధర్మానికి –అధర్మానికి మధ్య సాగుతున్న యుద్ధం. ధర్మమేవ జయతే. గల్వాన్ లోయతో పాటు పాంగాంగ్ సరస్సు ప్రాంతంలోని భారత భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి చైనా తీవ్ర ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలో అగ్రదేశంగా సుస్థిర స్థానం ఏర్పరచుకోవడం ఒక్కటే దాని లక్ష్యం. దాని కోసం దుష్ట, దుర్మార్గ, దురాచారాలన్నీ అవలంబిస్తోంది. నయవలసవాదం (నియో కలోనియలిజం) చైనా సిద్ధాంతం.సరిహద్దు దేశాలన్నింటినీ సామ,దాన, భేద,దండోపాయాలతో తన కబంధహస్తాల్లో ఉంచుకొనే ప్రయత్నంలో భాగమే ఈ దుశ్చర్యలు. పాకిస్తాన్, నేపాల్ వంటి దేశాల దగ్గర ఆ పప్పులు ఉడుకుతున్నాయి కానీ, భారతదేశం దగ్గర అది కుదరడం లేదు. దొంగదెబ్బలు తీయడమే మార్గంగా పెట్టుకొని సాగుతోంది. వాణిజ్య ఒప్పందాల ద్వారా మన వల్ల ఎంతో లాభం పొందుతూనే, ఇంకొక పక్క, దురాక్రమణ చర్యలను ఆపకుండా ముందుకెళ్తోంది. ద్వైపాక్షికచర్చలలో చేసుకున్న ఒప్పందాలు, కుదుర్చుకున్న మాటలకూ ఆచరణలో ఎటువంటి విలువను ఇవ్వకుండా, విదేశాంగ విధానానికి, నైతికతకు తూట్లు పొడుస్తోంది. మహ్మద్ గల్వాన్ మనుమడు గులామ్ రసూల్ గల్వాన్ కూడా గల్వాన్ ప్రాంతం ఎప్పటికీ భారతదేశానిదే అని చెబుతున్నాడు. ఈ ప్రాంతానికి ఇతని తాతపేరే పెట్టారు. బ్రిటిష్ పాలన సమయంలో, వారికి టిబెట్, మధ్యఆసియా కొండల్లోని కనుమలకు దారిచూపించే గైడ్‌గా గల్వాన్ పనిచేశాడు.బ్రిటిష్ బృందానికి నాయకత్వం వహించిన లార్డ్ డన్మోర్, కృతజ్ఞతా చిహ్నంగా, ఈ లోయ ప్రాంతానికి గల్వాన్ పేరుపెట్టాడు. ఇది సుమారు 100ఏళ్ళ క్రితం జరిగిన వృత్తాంతం. ఇది చరిత్ర. దీన్ని బట్టి, ఈ ప్రాంతం నూటికి నూరు శాతం భారతదేశానిదే, అని స్పష్టమవుతోంది. ఇది తమ భూభాగమంటూ చైనా ముందుకు రావడంలో ఎటువంటి అర్థం లేదు. రేపు అంతర్జాతీయ న్యాయస్థానాలలోనూ చైనా వాదం నిలబడదు. 1962లోనూ చైనా ఈ ప్రాంతాన్ని ఆక్రమించాలని చూసింది. ఇప్పుడూ అదేపనిలో ఉంది. గత ఐదారువారాలుగా భారత్–చైనా సరిహద్దులోని గల్వాన్ లోయ, హాట్ స్ప్రింగ్, దౌలత్ బేగ్ ఓల్డీ, డెమ్ చోక్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అవి, కొన్నిరోజులుగా మరింత తీవ్రంగా మారుతున్నాయి. ఈ దుర్ఘటనలో మనం 20మంది సైనికులను కోల్పోయాం. అంతకు మించి, చైనా కూడా సైనికులను కోల్పోయింది. కోల్పోయినా బయటకు చెప్పని విచిత్ర యుద్ధనీతి చైనా సొంతం.అమరవీరులకు భారత్ యావత్తూ అంజలి ఘటిస్తోంది.చైనా వాళ్ళ సైనికులపట్ల మౌనం వహిస్తోంది.అదీ చైనా తత్త్వం.ఇటువంటి స్వభావాలు, విధానాల వల్లనే, ప్రపంచంలో చైనా విశ్వాసం కోల్పోతోంది. భారత్ భూభాగాలు ఎంతవరకూ ఆక్రమణకు గురయ్యాయో చరిత్రకారులకు, పరిశీలకులకూ తెలిసిందే. గల్వాన్ ఘటన తర్వాత, శత్రుదేశ సైనికులు చాలా భయపడ్డారని తెలుస్తోంది.మనవారు చేసిన ప్రతిదాడిని ఊహించని చైనా శిబిరంలో కలవరం చోటుచేసుకుంది. ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో, ఘర్షణ జరిగితే కఠినంగా వ్యవహరించండని మన బలగాలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.అవసరమైతే తుపాకులు కూడా వాడండని చెప్పడం, దీర్ఘకాలంగా ఉన్న విధానాల స్వస్తి పలకడంగా భావించాలి.దీని ద్వారా, సైనికబలగాలకు మరింత స్వేచ్ఛ ఇస్తూ, యుద్ధోన్ముఖులను చేసే దిశలో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు విశదమవుతోంది.ఘర్షణ సమయాల్లో తుపాకులు వాడ కూడదని 1996, 2005లో ఇరు దేశాలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.ఐనప్పటికీ, చైనా నీతిబాహ్యంగా వ్యవహరిస్తున్నప్పుడు, దీటైన సమాధానం చెప్పడం యుద్ధనీతి.అందుకే, లడఖ్ తో పాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిమ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ ల వెంబడి ఉన్న వాస్తవాధీనరేఖ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటివరకూ రాళ్లదాడి, తోసుకోవడం వరకే పరిమితమయ్యారు. మొన్న జరిగిన దాడిలో చైనా మనవారిపై మేకులు, ఇనుపకడ్డీలు వాడి దుర్మార్గంగా ప్రవర్తించింది. అంతగా దాడి చేసినా, మనవాళ్ళు ఆత్మరక్షణ కోసం కూడా తుపాకులు వాడలేదు.ప్రాణాలుపోయినా మాటకు కట్టుబడ్డారు.అందుకే, మొన్న యుద్ధం జరుగలేదు. ప్రస్తుతం,గల్వాన్ లోయ దగ్గర వాస్తవాధీన రేఖను దాటి చైనా సైన్యం ముందుకొచ్చి, తిష్ఠవేసింది. ఇక్కడ మళ్ళీ ఘర్షణలు జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తవాతావరణమే ఉంది. రెండు దేశాలు పెద్ద ఎత్తున బలగాలను మోహరించాయి. భారత్–చైనాలు ఫిరంగులు, ట్యాంకులను సిద్ధం చేసుకున్నాయి. ఇది ఇలా ఉండగా, రష్యా రాజధాని మాస్కోలో, చైనా –భారత్ దేశాల రక్షణశాఖా మంత్రులు ఒకే వేదికపై కలుస్తున్నారు. ఈ తరుణంలో ఇది చాలా కీలకమైన సందర్భం. దీనికి ముందుగా, భారత్–చైనా విదేశాంగ మంత్రులు వీడియో సమావేశంలో పాల్గొనున్నారు. ఈ సమావేశాల నేపథ్యంలో, రష్యా మధ్యవర్తిత్వం పోషించే అవకాశం ఉంది. రెండు దేశాలకు మిత్రదేశంగా ఉన్న రష్యా ఎలా వ్యవహరిస్తుంది, ఫలితాలు ఎలా ఉంటాయని ప్రపంచ దేశాలన్నీ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. మధ్యవర్తిత్వానికి అమెరికా సిద్ధమని ట్రంప్ ప్రకటించినా, రెండు దేశాలు ఇప్పటికే తిరస్కరించడం గమనార్హం. మొత్తంమీద, భారత్– చైనాల మధ్య యుద్ధం జరుగుతుందా, చర్చలతో సమసిపోతుందా వేచిచూడాలి. సత్యమేవ జయతే.



వేటూరి వైభవం

- కొడుకుల శ్రీనివాస్

అభిరుచి గల నిర్మాత ఏడిద నాగేశ్వరరావు "గోదారి ప్రేమికుడు రచయత మంచి కళాత్మకత కలబోసిన వంశీ దర్శకత్వంలో వంశీ రాసిన నవల "మహల్ లో కోకిల" ని కొన్ని మార్పులు చేసి తీసిన కళాఖండం "సితార" అన్ని పాటలూ వేటూరే రాసారు. పాటలు రాయడానికి ముందే నవల చదివారట. స్టోరీ డిస్కర్షన్‌లో కూడా పాల్గొన్నారు. అందుకే అన్ని పాటల్లోనూ మనకి సినిమా కథే కనిపిస్తుంది.

సినిమాలో బాగా బతికి చెడ్డ ఓ జమిందార్ చెల్లెలు ఇంట్లోంచి వచ్చేసి గతాన్ని దాచేసి అనుకోకుండా పెద్ద సినిమా తార అయిపోతుంది. ఆమె పిఏగా శుభలేఖ సుధాకర్ ఆమెను తాను ఆరాధిస్తుంటాడు. ఆమే గతం తెలుసుకోవాలని ప్రయిత్నించి ఓడిపోతాడు. ఆ సందర్భంలో వచ్చే పాట ఇది.

జిలిబిలి పలుకుల చిలిపిగ పలికిన ఓ మైనా...మైనా..
కిలకిల నగువుల వలపుగ చిలికిన ఓ మైనా..
మిలమిల మెరిసిన తార..
మిన్నును వీడిన తార..
మధువుల పెదవుల మమతలు విరిసిన ఓ మైనా
కలలను పెంచకు కలతలు దాచకు ఓమైనా ఏ మైనా.,

ఇక్కడ మైనా పక్షితో పోల్చడానికి గతంలో ఆ రాజమహల్‌లో హీరోయిన్‌కి పక్షులతోనే సావాసం. ఇంటినిండా చిలకలు మైనా పక్షులే. చిలకపలుకుల్లా పొడి పొడిగా ముద్దుగా ముక్త సరిగా మాట్లాడుతుంది కాబట్టి అలా అన్నారు. ఇక కిలకిల పక్షుల్లాగే నవ్వులు రువ్వుతూ వలపులు చిలకరిస్తోందట. రూపం బహు సౌందర్యం..అందులోనూ రాజకన్య కదా! ఆస్థులు అంతస్థులు పోయినా దేవుడిచ్చిన అందాలు ఎక్కడికీ పోవు కదా అందుకే నక్షత్రంలా మిలమిల వెలిగి పోతోందట!

మిన్నును వీడిన తార అంటే

ఆకాశం నుండి దిగివచ్చినది అని కథాపరంగా ఆ బందీలాంటి రాచకోట నుండి చెరవీడినదని అర్థం వస్తుంది.

మధువుల పెదవుల మమతలు విరిసిన..అంటే తన తీయని మాటలతో స్నేహ మధురిమలు

పంచి మమతానురాగాల బంధం వేసిందని ఎందుకంటే సుధాకర్ కి కొంచెం లవ్ కదా! కలలను పెంచకు.,కలతలు దాచకు అంటే సితార గురించి పాపం ఎన్నో కలలు కంటున్నాడు జీవి . ఏదో ఆ తీపి కబురు తొందరగా చెప్పకుండా తన కలలను పెంచేస్తోందని ఓ అర్థం. ఆమె పరంగా ఆలోచిస్తే ఎప్పుడూ మూఢిగా కలలప్రపంచంలోనే విహరిస్తుంటావు అలా కలలను కనడం ఆపి నిజంలోకి రమ్మని ఓ అర్థం. కలతలు దాచుకోకుండా అవి ఎలాంటివైనా ఏమైనా ఎంత కష్టమైనా నాతో పంచుకో అని ఆమె గతం తెలియని వర్తమాన ప్రేమికుడు అడుగుతున్నాడు.

ఇక చరణంలో
అడగను లే చిరునామ,
చిరునవ్వే పుట్టిల్లు నీ కైనా నాకైనా.,,తారలకే సిగపూవ..తారాడే సిరిమువ్వ

హరివిల్లూ రంగుల్లో అందాలే..

చినికిన చిలకవు ఉలకవు పలకవు ఏమైనా ఓ మైనా...

ఎన్నిసార్లు అడిగిన తానెవరో చెప్పదు సితార అందుకే నీ అడ్రస్ నేనడగునులే...నాకూఎవరూ లేరు మనద్దిరికీ చిరునవ్వులే పుట్టినిల్లు అనుకుందాం ఎంత చక్కని భావనండీ..

తారలందిరిలో సిగపూవట అంటే తలపై ధరించే పువ్వు స్థానం శిఖరాగ్రం అప్పటికే బోల్డు హిట్ సినిమాలు కొట్టేసి సితార సూపర్ స్టార్ పొజిషన్‌లో ఉంటుంది కాబట్టి సినీతారలలో నెంబర్ వన్ అని చెప్పడం. గురువుగారి పాటలో మాటలమహత్మం ఏమో కానీ నటించిన భానుప్రియకి ఇదే మొదటి సినిమా. సూపర్ హిట్ ఆయింది తొలి సినిమాతోనే భానుకి స్టార్ డం తెచ్చిపెట్టింది. తారాడే సిరిమువ్వా అంటే కాలికి గజ్జెలు కట్టుకొని నర్తిస్తుంటే ఆ మువ్వలు కూడా లయ బద్ధంగా ఘల్ ఘల్ మంటూ కదులుతాయి. అలాంటి తారాడే మువ్వలా ఉన్నావని పోలిక, అదీకాక సినిమాలో భానుపెద్ద నాట్యకత్తె కూడా.నిజ జీవితంలో కూడా....

ఎంతడిగినా చలించవు ఉలుకూలేదూ పలుకులేదూ ఉ అనవు పోనీ ఊహూ అనవు.

దానికి అమె అంతరంగంలోనే ఇలా బదులిస్తుంది. సినిమాలో కూడా సైడ్ సాంగే.

ఉరుములలో అలికిడిలా వినిపించే ఈ మైనా..

అంటే ఉరుము ఎంతసేపు ఉరుముతుంది కొన్ని క్షణాలపాటు అప్పుడు శబ్ధం పెళపెళమని ఎంత సేపు వినిపిస్తుంది కొన్ని క్షణాలే అలా నేను కూడా స్థిరమైన శబ్దాన్ని కాదు జస్ట్ అలికిడినే కానీ కలివిడిని కాను...

మెరుపులలో నిలకడగా కనిపించే అంటే మెరుపు క్షణ భంగురమే చూసే లోపే కళ్ళు జిగేల్ మంటాయి అలాంటి వాటిలో నిలకడగా కనిపిస్తుందరి

అంటే నన్ను ఈ లోకంలో ఎవరూ చూడలేరు నేనీలోకాన్ని చూడలేను ఎందుకంటే ఆమె గతం అలాంటిది ప్రేమించిన వాడికీ దూరమయి జీవశ్చవంలా బతుకుతోంది, ఎండలకే అల్లాడి

కష్టాల వేడి తట్టుకోలేక పోతున్నా

వెన్నెల హాయిగా చల్లగా తెల్లగా ఉంటుంది కాని ఆ వెన్నెల వెలుగుల వెనక క్రీనీడను నేను మనసంతా నల్లని చీకటే

వినువీధి అంటే ఆకాశంలో వీణం రాగంలా అంటే బహుశా ఒక గమ్యం లక్ష్యం లేకుండాగాల్లో కలిసిపోయి పయినిస్తున్న పాటనిగాల్లో దీపం నేను చెప్పడం అనుకుంటా...ఆశల ముంగిట్లో ఊహల ముగ్గులు నిలిచేనా ఏమైనా...అంటే నేనే ఓ ఊహని నాపై ఆశలు పెట్టుకోకు ఊహల్లో వేసిన ప్రేమ ముగ్గు మరో ఊహ రాగానే చెరిగి పోదూ అని చెప్పినట్లు. మొత్తం సినిమా కథ అంతటిని ఓ పాటలో చెప్పేయలేదూ...దటీజ్

వేటూరి...ఇదే అక్షర నివాళి..

సాదాసీదాగా సీఎం కూతురి పెళ్ళి!!!!

- ప్రజామీడియా నెట్‌వర్క్

కేరళ సిఎం పినరయ్ విజయన్ సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబం నుండి వచ్చిన సంగతి తెలిసిందే.. ఒక రాష్ట్రానికి సిఎం అయినప్పటికి అతను సాధారణ జీవితమే గడుపుతుంటాడు.కులం వద్దు, మతం వద్దు అని చాలామంది మాటల్లో ఆదర్శం వల్లెవేస్తుంటారు..కానీ వాస్తవం వేరుగా ఉంటుంది..కానీ కూతురి పెళ్లి అతి సాధారణంగా జరపడమే కాదు, మతాంతర వివాహం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు విజయన్..

రియాజ్ - వీణాల పరిచయం, పరిణయం

విద్యార్ధి నాయకుడిగా రాజకీయాల్లో ఉన్న రియాజ్ ప్రస్తుతం డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు..గత ఎన్నికల్లో పోటీ చేసినప్పటికి 800 ఓట్ల తేడాతో ఓడిపోయారు.. డివైఎఫ్ఐ పిలుపునిచ్చిన బీఫ్ ఫెస్టివల్‌లో రియాజ్ ప్రముఖంగా పాల్గొన్నారు..అదే కార్యక్రమంలో పాల్గొన్న వీణాకి రియాజ్‌తో పరిచయం ఏర్పడింది. ఒరాకిల్ లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసిన వీణ, ప్రస్తుతం బెంగళూర్‌లో ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హెడ్‌గా ఉన్నారు.. ఈ కంపెనీని ఆమె స్వయంగా స్థాపించారు.. అడపాదడపా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే వీణకి రియాజ్‌తో పరిచయం ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో ఇద్దరూ ఏకం అయ్యారు..రియాజ్, వీణలిద్దరికి ఇది రెండో వివాహమే..వీణకి ఏడేళ్ల కుమారుడు ఉన్నారు..

సిఎం కూతురి పెళ్లి అంటే కొంచెం హంగూ ఆర్భాటం సహజం..కానీ ఈ పెళ్లిలో అవేం లేవు..సిఎం అధికారిక భవనంలో పెళ్లి కొడుకు,పెళ్లికూతురు.. దగ్గర కుటుంబ సభ్యులు, ముప్పై మందికి మించని అతిధులు.. రెండు దండలు.. పెళ్లి తంతు ముగిసింది..



అమెరికాలో చదివిన ఐఐటీ ప్రొఫెసరీయన..

- డా॥ గంగాధర్



చింపిరి జుట్టూ, గుబురుగా పెరిగిన గడ్డం, ఎండిపోయిన డొక్కలూ, ఒంటిని అంటిపెట్టుకున్న ఓ లుంగీ... చూడగానే ఎలాంటి ఆదరణా లేని అభాగ్యుడిలా, బతికిచెడ్డ పేద రైతులా కనిపిస్తారు అలోక్ సాగర్. కానీ ఐఐటీలో చదివి, అమెరికాలో పీహెచ్‌డీ చేసి, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌కు ప్రొఫెసర్‌గా పాఠాలు చెప్పింది అతడే అంటే నమ్మగలరా..! కొన్నాళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో గోడొంగరీ అనే అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరిగినప్పుడు గిరిజనులపైన సర్వే చేయడానికి అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లారు. ఒక్కో ఊళ్లో గిరిపుత్రుల గురించి ఆరా తీస్తుంటే వాళ్లకు సైకిల్ మీద చొక్కా లేకుండా తిరుగుతున్న ఓ పెద్ద మనిషి కనిపించాడు. అతడి మొహం చూస్తే గిరిజనుడు కాదని వాళ్లకు అర్థమైంది. వాళ్లకు సంబంధం లేని వ్యక్తి అక్కడేం చేస్తున్నాడనే అనుమానం కలిగింది. తానూ వాళ్లలో ఒక్కడినేనని ఆ పెద్దాయన పదేపదే చెప్పినా అధికారులకు నమ్మకం కలగలేదు. ఆయనకు సంబంధించిన రేషన్ కార్డు, ఓటర్ కార్డు లాంటి ధ్రువ పత్రాలేవైనా ఉంటే చూపించమని నిలదీశాక కానీ అసలు విషయం బయట పడలేదు. ఆ గిరిపుత్రుల్లో ఒకడిగా కలిసిపోయి జీవిస్తోన్న ఆ పెద్దాయన పేరు అలోక్ సాగర్. అతడి తండ్రి ఐఆర్ఎస్ అధికారి. తల్లి ఫిజిక్స్ ప్రొఫెసర్.

దిల్లీ ఐఐటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, పీజీ పూర్తి చేసిన మేధావి. ఆపైన టెక్సాస్‌లోని హ్యూస్టన్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా కూడా అందుకున్నారు. భారత్‌కు తిరిగొచ్చి దిల్లీ ఐఐటీలో పదేళ్లపాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. అలా అలోక్ దగ్గర పాఠాలు నేర్చుకున్న ఎంతో మంది ప్రముఖుల్లో మాజీ ఆర్బీఐ గవర్నర్ రఘురాం రాజన్ కూడా ఉన్నారు. ఆయన నేపథ్యాన్ని ధ్రువీకరించుకున్నాక అక్కడి అధికారులకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు.

ఉద్యోగానికి రాజీనామా

ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సమయంలో ఓసారి ఏదో పరిశోధన పనిమీద మధ్యప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతానికి వెళ్లారు అలోక్. అక్కడ ప్రపంచంతో సంబంధం లేకుండా, కనీస సదుపాయాలకు కూడా దూరంగా జీవిస్తోన్న గిరిజనుల దీనస్థితి ఆయన్ని కలవరపెట్టింది. వాళ్ల కోసం ఏదైనా చేయాలని అనిపించినా, బయటి వ్యక్తులను అంత త్వరగా గిరిజనులు నమ్మలేరు. అందుకే అలోక్ ఎంత అడిగినా వాళ్లకేం కావాలో, అక్కడి సమస్యలేంటో చెప్పలేదు. గిరిజనుల్లో ఒకడిగా మారితేనే వాళ్లు తనని ఆహ్వానిస్తారని అలోక్‌కి అనిపించింది. ఐఐటీలో పాఠాలు తాను కాకపోతే మరొకరు చెబుతారనీ, కానీ వాళ్ల జీవితాలని మార్చడానికి తాను పూనుకోకపోతే ఇంకొకరు వస్తారన్నగ్యారంటీ లేదనీ అనిపించింది. దాంతో మరో ఆలోచన లేకుండా దిల్లీ వెళ్లి ఉద్యోగానికి రాజీనామా చేసి 32ఏళ్ల క్రితం కట్టుబట్టలతో కొచాము అనే గిరిజన గ్రామానికి చేరుకున్నారు. అప్పట్నుంచీ వాళ్లు తినేదే తింటూ, వాళ్లతోనే ఉంటూ పిల్లలకు చదువు చెబుతూ, ఊళ్లో చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తూ ఆ అమాయకులకు పెద్దదిక్కుగా అక్కడే ఉండిపోయారు అలోక్. బయటి వాళ్లెవరైనా గ్రామానికి వచ్చినా తన నేపథ్యం బయటపెట్టేవాడు కాదు. ఇప్పుడుకూడా, ఎన్నికల అధికారులు తనను ఆ ప్రాంతం వదిలి

అయోమయంలో ప్రైవేట్ స్కూల్స్

- బి.మల్లి



బడా కార్పొరేట్ యాజమాన్యాలు మినహా.. రాష్ట్రంలో చిన్నా చితకా ప్రైవేట్ స్కూల్స్ యజమానులు తీవ్ర అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మెయిన్ ఎగ్జామ్స్ ముగిసేలోపే లాక్‌డౌన్ వచ్చిపడింది. వాస్తవానికి ఈ ఎగ్జామ్స్ కి కొన్నిరోజుల ముందు, హాల్ టికెట్ల జారీ సమయంలో ఫీజు బకాయిలు వసూలు చేసుకుంటారు. లాక్‌డౌన్ తో ఆ బకాయిలన్నీ పూర్తిగా ఆగిపోయాయి. ప్రభుత్వ ఆదేశాలతో చాలాచోట్ల అప్పుచేసి మరీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించారు. ఇక్కడే ఇంటర్వెల్ పడింది. తర్వాత పరిస్థితే అగమ్యగోచరంగా ఉంది.

మరో నెల రోజుల పాటు స్కూల్స్ తెరిచే అవకాశమే లేదు. ఒకవేళ తెరిచినా విద్యార్థుల సంఖ్య, స్కూల్ వాతావరణం వంటి విషయాలపై ప్రభుత్వాలు ఎలాంటి మార్గదర్శకాలు ఇస్తాయోనని ఆలోచనలో పడ్డారు యజమానులు. సామాజిక దూరం నేపథ్యంలో స్కూల్ వ్యాన్ లో పిల్లల సంఖ్య సగానికి పరిమితం చేయాలి. పోనీ ఆ బాధ్యత తల్లిదండ్రులకే వదిలేద్దామంటే.. స్కూళ్లు మాన్పించే ప్రమాదం ఉంది. ఇప్పటికే చాలామంది పేరెంట్స్ కరోనా భయంతో పిల్లల్ని ఇంటికి దగ్గర్లో ఉన్న స్కూళ్లలో చేర్పించే ఆలోచనలో ఉన్నారు. స్కూల్ ఫీజ్, వ్యాన్ ఫీజ్.. ఏది తేడాకొట్టినా యాజమాన్యాలకే నష్టం.

ఇక రెసిడెన్షియల్ స్కూల్స్ ది మరో సమస్య. అసలు ఫీజుల కంటే హాస్టల్ ఫీజులపై ఆధారపడే కొన్ని సంస్థలు నెట్టుకొస్తుంటాయి. అలాంటివాటికి ఈ ఏడాది కష్ట కాలమే. తల్లిదండ్రులు పిల్లల్ని హాస్టల్స్ లో ఉంచేందుకు ఇష్టపడటం లేదు. స్కూల్, కాలేజీ హాస్టళ్లలో పారిశుధ్యం ఎలా ఉంటుందో, పక్క పిల్లలు ఏ రెడ్ జోన్ నుంచి వచ్చి ఉంటారోనని ఆందోళనలో ఉన్నారు. అందుకే ఈ ఏడాది రెసిడెన్షియల్ క్యాంపస్ లు 20శాతం కూడా భర్తీ కావని విద్యారంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

జాతీయ సర్వేలన్నీ లాక్‌డౌన్ తర్వాత వెంటనే పిల్లల్ని స్కూళ్లకు పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడటంలేదని చెప్పుకొస్తున్నాయి. మొత్తంమ్మీద ఈ ఏడాది అన్నిరంగాలు ఇబ్బం దులు పడ్డట్టే విద్యారంగంలో ప్రైవేట్ యాజమాన్యాలు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కోబోతు న్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టబోతున్న ఇంగ్లిష్ మీడియం సక్సెస్ అయితే.. అందరూ సర్కారు బడులపై ఆసక్తి చూపించే అవకాశముంది. ఏపీలోనే కాదు దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థ కరోనాకి ముందు.. కరోనా తర్వాత అన్నంతగా మారిపోతుందనడంలో సందేహం లేదు.

వెళ్లిపోమని ఆదేశించడంతో, తప్పనిసరై వాటిని బయట పెట్టాల్సి వచ్చిందంటారు అలోక్.

దుస్తులు మూడు జతలే...

గిరిజనుల్లో ఒకడిలా ఉండాలంటే వేషభాషలూ వాళ్లకు తగ్గట్లే ఉండాలి. పాతికేళ్లుగా అలానే జీవిస్తున్నారు అలోక్. ఒక సైకిలు, మూడు జతల దుస్తులూ... ఇవే ఆ గూడెంలో ఆయనకున్న ఆస్తి. ఆ సైకిల్ మీదే సుదూర ప్రాంతాలకు వెళ్లి రకరకాల విత్తనాలను సేకరించి నామమాత్రపు ధరకు వాటిని గిరిజనులకు విక్రయించడమే జీవనోపాధిగా మార్చుకున్నారు. అక్కడి వాళ్లు మాట్లాడే రెండు మూడు యాసల్లో ప్రావీణ్యం సంపాదించి, అలానే సంభాషించడం అలవాటు చేసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా గిరిజనులకు అందే అన్ని రకాల సౌకర్యాలూ పూర్తిగా అందేలా చూస్తూ, వాళ్ల జీవన ప్రమాణాలను పెంచుతూ అండగా నిలబడ్డారు.

యాభైవేల మొక్కలు...

గిరిజనులతో పాటు ప్రకృతిపైనా అలోక్‌కు మమకారం ఎక్కువే. ఆ ప్రేమతోనే ఇన్నేళ్లలో తానుంటోన్న బీటుల్ జిల్లాలో యాభై వేలకు పైగా మొక్కలు నాటారు. ఆయన గిరిజన గ్రామాల్లో అడుగుపెట్టాక బడికెళ్లకుండా పనిబాట పట్టే చిన్నారుల సంఖ్య బాగా తగ్గిపోయింది. వ్యవసాయం చేసుకునే గిరిజనులకు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడంలో సహాయ పడుతున్నారు. ఖాళీ సమయంలో పెద్దలకు చదువుతోపాటు పరిశుభ్రత పాఠాలూ బోధిస్తున్నారు. పౌష్టికాహార లోపాన్ని గిరిజన గ్రామాల నుంచి దూరం చేయడానికి శ్రమిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వానికీ గిరిపుత్రులకూ మధ్య పాతికేళ్లుగా వారధిలా పనిచేస్తున్నారు అలోక్. అతడి సోదరుడు ఇప్పటికీ ఢిల్లీ ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండటం విశేషం. ఎన్నికల సమయంలో అలోక్ గిరిజనుల మనసు మార్చి తమకు వ్యతిరేకంగా ఓటేయిస్తారని స్థానిక నాయకులు భయపడ్డారు. అందుకే అతడిని పోలీసుల సాయంతో అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. కానీ వాళ్లకా హక్కులేదని అతడికి తెలుసు. ఎక్కువగా ఒత్తిడి పెడితే గిరిజనులూ వూరుకోరనిపించి పోలీసులూ వెనక్కితగ్గారు. 'ప్రజలకు మంచి చేయడానికి పెద్ద పెద్ద డిగ్రీలతో పనిలేదు. అందుకే వాటితో నాకు అవసరం లేదు. ఎప్పటికీ నా గురించి బయట పెట్టకూడదనుకున్నా, కానీ కుదరలేదు' అంటారు అలోక్.

ఆడాళ్ళూ ..మీకు జోహార్లు

- యం.జయశ్రీ

పద్మజ "వై కట్టప్ప కిల్డ్ బాహుబలి?" – ఈ ఒక్క ప్రశ్న ఓ రెండేళ్ల పాటు మనందరి బుర్రలు బద్దలు కొట్టుకునేలా చేసింది.

కానీ అంతకంటే మిస్టీరియస్ ప్రశ్న ఒకటుంది, ప్రత్యేకించి మా ఆడాళ్లకి, అదే....

"ఈ రోజు ఏం వండాలి...?

అవును, ఇదే...!

ఈ ప్రశ్నకి అంతం లేదు, ఇది ప్రతిరోజూ పుడుతూనే ఉంటుంది.

చక్కగా పొద్దున్నే లేచి కాసేపు కురిసే వాన చుక్కల్ని, విరిసే పూల మొక్కల్ని తనివితీరా చూద్దామని మనసు కోరుతుంది. కానీ దాని నోరు నొక్కి ఈ ప్రశ్న వంటింటి వైపు లాక్కెళ్తుంది.

అయినా అసలు వంట ఆడవాళ్లే ఎందుకు చేయాలి..? నలభీములు కూడా నవనవలాడే నవకాయ పిండివంటలు వండిపెట్టారుగా వాళ్ళ పెళ్ళాలకి, మరి మన పురుషులెందుకు వంట చెయ్యరు? ఇలా పరిపరివిధాలుగా ఆలోచించి, ఇది కూడా కలికాలం సైడ్ ఎఫెక్ట్స్ లో ఒకటయ్యుంటుందిలే అని సరిపెట్టుకుందామనుకున్నా.

అబ్బే, ఈ కోతి మనసు అలా ఎలా ఊరుకుంటుంది..?

"లేదు, లేదు, ఇలాంటి మహత్తరమైన ఆలోచనల్ని మొగ్గలోనే తుంచెయ్యకూడదు, ఈ అన్యాయం మీద యుద్ధం చేద్దాం.... మార్పు వైపు మనమే మొదటి అడుగేద్దాం...." అనుకొని 'వంటింటి తంట' అని ఓ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, నాకు తెలిసిన ఓ పాతిక మంది ఆడ లేడీస్‌ని దాంట్లో ఆడ్ చేసి, మన డిమాండ్లు పరిష్కారమయ్యేదాకా నిరాహార దీక్ష చేద్దామని పిలుపునిచ్చా....


"వంట పనిలో బిజీగా ఉన్నామని, వంట అయ్యాక తినేసి తీరిగ్గా వచ్చి నిరాహారదీక్ష చేస్తామని" మెసేజ్ పంపారు వాళ్లంతా!

సాటి ఆడవాళ్ళ రెస్పాన్స్ చూసాక "ఛ , బొత్తిగా ఉద్యమ స్ఫూర్తి లేదు వీళ్ళకి " అని నిట్టూర్చి, నా నిరాహారదీక్షని కూడా వేణ్ణీళ్ళల్లో నిమ్మకాయరసం పిండుకు తాగి విరమించాను.

అయినా ఏదో అనుకుంటాంగాని ఈ మగాళ్ళు వంట చేసినా కూడా మా చెడ్డ చిక్కులున్నాయి. అవేంటంటే...

మొదటి రకం:

వీళ్ళకి వంటల్లో ఓనమాలు కూడా రావు. తప్పక వీళ్ళు వంట చేయ్యాల్సొస్తే 'ఏమోయ్, స్టవ్వు కుడి వైపు తిప్పితే వెలుగుతుందా లేదంటే ఎడమ వైపా?, "ఇవి ఆవాలా, గసగసాలా..?', 'బియ్యంలో చెంచాడు నీళ్ల పొయ్యాలా లేక బిందెడా...?' ఇలాంటి ప్రశ్నలతో



మన బుర్రని కూడా వండేస్తారు. వీటన్నిటికీ సమాధానం చెప్పే కంటే మనం చేసుకోవడమే ఉత్తమం అనిపిస్తే తప్పులేదు.

రెండో రకం:

ఈ చెయ్యి తిరిగిన నలభీములతో మన ఆడాళ్ళు పడే తిప్పలు అరాచకం అంతే....! వీళ్ళకి వాళ్ళ వంటలు తప్పించి, మనం ఎంత బాగా వండినా నచ్చదు. అలాగని రోజూ వండుతారా... అంటే వండరు మరి, పైపెచ్చు మనల్ని మొదటిరోజు స్కూల్‌కెళ్లిన పిల్లాడిని, రెండో తరగతోడు చూసినట్టు బొత్తిగా చిన్నచూపు చూస్తారు. విరివిగా వాళ్ళకి తోచిన సలహాలు, ఉపన్యాసాలు ఇస్తుంటారు.

ఇంకో రకం:

కొంతమంది ఓసీడి మొగుళ్లుంటారు , వీళ్ళు వండేదేముండదు కానీ, సందు దొరికినప్పుడల్లా వంటింట్లోకొచ్చి, 'స్టవ్వు మీద పొంగిన పాల మరకలనో, మూత పెట్టడం మర్చిపోయిన కూర గిన్నెలనో, కుళ్లిపోయిన కూరగాయలనో' చూపించి మన సమర్ధతని

ఇప్పుడు నువ్వో.. హిమశిఖరం



ఇప్పుడు నువ్వో.. హిమశిఖరం.
ఇప్పుడు నువ్వో.. మా భారతరత్నం.
నీ జననం అతి సామాన్యం
నీ మరణమే తీరని అన్యాయం.

తను కన్న కలల్ని నీద్వారా తీర్చుకున్న
నీ తండ్రి పుత్రోత్సాహం ముందర..
కడుపున పుట్టిన కన్నబిడ్డను
భరతమాత రక్షణకై దత్తతిచ్చిన
నీ తల్లి దాతృత్వం ముందర..
రేపటి మీ భవిష్య కలల్ని మోస్తూ
పసిపిల్లల్ని కంటికి రెప్పలా చూస్తూ..
యుద్ధభూమికి వీరుణ్ణి సాగనంపిన
నీ అర్ధాంగి త్యాగం ముందర..
మేమెంత...మా త్యాగాలెంత??.

ఆకాశమంత ఎత్తులో
మువ్వన్నెల జెండాలా నువ్వెప్పుడూ
రెపరేపలాడుతూనే ఉంటావ్.
అవనిపై నిల్చోని ఆ ఆకాశమే మాకు
గొడుగయిందనే ఆత్మనిబ్బరంతో మేమూ..
ఎలాగోలా...బ్రతికేస్తాం.
పేరులోని సంతోషాల్ని నీమోములో బిగపట్టి
దుఃఖాన్ని మాత్రం దేశంకై వదిలేశావ్.
నీవొక్కడిగానే మరణించినా..
కోట్లాది భారతీయుల గుండెల్లో మాత్రం
వీరుడిగా తిరిగి పునర్జన్మనెత్తావ్.
నీ త్యాగం మరవలేము మహాశయా.

-- జైహింద్..--

– రవిప్రసాద్‌బిసాండేసరి..

ప్రశ్నిస్తుంటారు.

కాని ఏ రకం మగాళ్లు వంట చేసినా చివరికి ఒకటి మాత్రం కామన్... స్టార్ హీరో సినిమా ఫస్టుడే, ఫస్ట్ షో అయిన తర్వాత థియేటర్ లా భీభత్సంగా ఉంటది వంటిల్లు. దాన్ని నెక్స్ట్ షోకి సిద్ధం చెయ్యాలంటే మన నడుం విరగడంగ్యారంటీ ! ఇక సింక్‌లో అయితే గిన్నెల సునామీ వచ్చి మనల్ని ముంచేస్తుంది.

ఇంతలో 'వంట ఆలస్యమైతే పిల్లలు ఆకలి రాగం తీస్తారని' అంతరాత్మ హెచ్చరికలు జారీ చేసింది.

ఆలోచనలతో వేడెక్కిన బుర్రని తీసుకెళ్లి అలా ఫ్రిడ్జ్లో దూర్చా.

పనిలో పడి ఈ వారం మార్కెట్ కి వెళ్ళలేదన్న సంగతిని గుర్తు చేస్తూ, మొన్న మార్చ్ నెల లాక్‌డౌన్‌లో రోడ్లలాగా ఖాళీగా కనిపించింది ఫ్రిడ్జ్...! లాక్డౌన్ని లెక్కచెయ్యకుండా రోడ్డెక్కి, పోలీసుల చేతిలో దెబ్బలు తిని ఎరుపెక్కిన వీపులా ఎర్రగా కనపడింది ఒకే ఒక టమాటో..!

దీనితో ఏం వండాలిప్పుడు? ఏమిటి మన తక్షణ కర్తవ్యం..? అని

కాసేపు మెదడుకి పదును పెట్టా...!

ఆ...ఐడియా !!!

చకచకా ఆ ఉన్న ఒక్క టొమాటోని కప్పుడు పప్పుతో కలిపి కుక్కర్లో పెట్టి మూత పెట్టా...

ఇదెలా ఉంటుందో ఏమిటో...?

ఒక అరగంటాగి పోపు పెట్టి, వీళ్ళని భోజనానికి పిలుస్తూ చెప్పా... ఈ రోజు టమాటో పప్పు చేసా, ఎంత బాగా కుదిరిందో. కాచిన నెయ్యి వేసుకుని, ఆవకాయ కలుపుకుని తింటే.. అబ్బబ్బబ్బా... అమృతమే అసలు!

మేటర్ వీక్‌గా ఉన్నప్పుడు ఇలా పబ్లిసిటీ పీక్స్ లో ఉండేలా చూసుకోవడం మా ఆడాళ్ళకి గరిటెతో పెట్టిన విద్య మరి!

కంచం ముందు కూర్చొని అన్నంలో సున్నాలు చుడుతోంది చిన్నది .

"ఇంకా మొదలు పెట్టవేం, తిను" అన్నా.

"నేను పప్పు తినను, నాకు వద్దు" అని నసిగింది.

"లేదు, పప్పు చాలా బావుంది, తినాల్సిందే"

"నేను తినను, తినను, తినను..."

'వేలెడంత లేవు , నా దగ్గరా నీ ధిక్కారము' అనుకొని కళ్ళు కాస్త పెద్దవి చేసి గంభీరంగా చెప్పా..

"నా మాటే శాసనం... నేను చేసిందే వంటకం, నీకు వేరే ఆప్షన్ లేదు, తిను"

అది కూరలో వేసిన కరివేపాకు తీసి తాపీగా కంచం పక్కన పెట్టి నా వైపు చూసింది.

ఇది తెలిసి సింబాలిక్‌గా చేసిందా, అయినా దీనికి కూరలో కరేపాకు విషయం తెలిసే ఛాన్స్ లేదే?

ఇంతలో వాళ్ళ నాన్న వడియాలు వేయించి తెచ్చి, దాని ప్లేట్లో వేశారు.

చకచకా నాలుగు వడియాలు తిని, ఒక్క ముద్ద పప్పన్నం నోట్లో పెట్టుకొని, మొహం చేదుగా పెట్టుకుంది.

"నువ్వు చేసిన పప్పు ఏం బాలేదు నాకు , డాడీ చేసిన వడియాలే బావున్నాయి, అయినా డాడీలే బాగా వండుతారని మా ఫ్రెండ్ కూడా చెప్పింది" అంది కచ్చిగా.

"దేవుడా...!!!!"

ఇంతసేపు కష్టపడి మరీ వండితే రాని గుర్తింపు, కాసిని వడియాలు వేయించి సంపాదించేసాడు ఈయన.... ఇలా పిల్లలకి నచ్చే ఈజీ వంటలు చేసి, వాళ్ళని మచ్చిక చేసుకోవడం అస్సలు మెచ్చ తగిన విషయం కాదు.

ఇది నిశ్చయంగా ప్రతిపక్షాల కుట్రే!!!

అర్జెంటుగా ఇంకో వాట్సాప్ గ్రూప్ మొదలుపెట్టాలి. కాసేపట్లో లింక్ పంపుతా, జాయిన్ అయిపోండి మరి!

జగన్ ..ఆర్ ఆర్ ఆర్.... దొంగాట

- పి.సురేష్

ప్రస్తుతానికి తెలుగునాట ఆర్ఆర్ఆర్ అంటే ఎంపీ రఘురామకృష్ణంరాజు. ఆయన చాలా తెలివిగా తమ గేమ్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ సిఎమ్ జగన్ అంతకన్నా తెలివిగా మౌనాన్ని మించిన ఆయుధం లేదన్నట్లు దానినే ప్రయోగిస్తున్నారు. అయినా జగన్ సహనాన్ని ఆద్యంతం తెగేదాకా లాగాలనే రఘురాముడు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.



ఈయన తన మానాన తను సంచలన ప్రకటనలు చేసుకుంటూ వెళ్తున్నారు. జగన్‌ను లేదా జగన్ పాలనను ఎవరు తిడతారా? అది మాజీ సర్పంచ్ అన్నా కావచ్చు, ఎమ్మెల్యేగా గెలవలేకపోయిన వారయినా కావచ్చు ఫస్ట్ ఫేజీ అంకితం చేసేద్దాం అని చూస్తున్న తెలుగుదేశం అనుకూల మీడియాకు రఘురామకృష్ణంరాజు లాంటి ఎంపీ దొరికేసరికి పండగలా వుంది.

సుజన ఆదర్శమా?

ఈయన ఒకందుకు స్టేట్‌మెంట్లు పడేస్తున్నారు. వాళ్లు ఒకందుకు కళ్లకు అద్దుకుని మరీ తీసుకుంటున్నారు. దీని మీద ఓ ఆంగ్ల పత్రిక డిటైల్డ్ కథనం అందించింది.

రఘురామకృష్ణంరాజుకు చెందిన 947 కోట్ల బ్యాంక్ ఫ్రాడ్ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోందట. ఇది కీలక దశకు చేరుకుందని తెలుస్తోంది. ఇప్పుడు ఈ గండం నుంచి గట్టెక్కాలి అంటే భారతీయ జనతాపార్టీ అండదండలు కావాలి. అంతకు మించి గత్యంతరం లేదట

సుజనచౌదరి ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు టీడీపీ నుంచి భాజపాలోకి జంప్ జిలానీ అన్నారు. ఇప్పుడు ఆయన దాదాపు హ్యాపీగానే వున్నట్లు కనిపిస్తోంది.

సో, ఇదే బాటలో ముందుకు వెళ్లాలని రఘురాముడు ఆలోచిస్తున్నారా? అన్న డౌట్‌ను ఆ ఆంగ్ల పత్రిక కథనం వ్యక్తం చేసింది.

అలా అని చటుక్కున వెళ్లిపోవడానికి లేదు. ఫిరాయింపు చట్టాలు లాంటివి అనేకం వున్నాయి. అందువల్ల అత్యంత సులువైన మార్గం పార్టీ నుంచి సస్పెండ్ కావడమే. ఇప్పుడు అందుకోసమే ఆయన తెగేదాకా లాగుతున్నారు అన్నది సర్వత్రా పాకిపోయింది. అందరికీ అర్థం అయిపోయింది.

జగన్ స్ట్రాటజీ

రఘురామ కృష్ణం రాజు మాట్లాడాల్సినవన్నీ మాట్లాడేసారు. ఇసుక దగ్గర నుంచి టచ్ చేయాల్సినవన్నీ టచ్ చేసేసారు. ఇక ఎన్నిసార్లు మాట్లాడినా ఇక ఇవే పాయింట్లు. కొత్తగా చెప్పేవి ఏమీ వుండవు. జనాలుకు చేరాల్సినవి చేరిపోయాయి. ఇక ఇప్పుడు సస్పెండ్ చేయడం దేనికి? ఒక్కటే విషయం కోసం.

పార్టీలో మిగిలిన వారికి భయం వుండాలంటే సస్పెండ్ చేయాలి. కానీ వైకాపాలో ప్రస్తుతానికి ఆ భయం బాగానే వుంది. అందుకే జగన్ మౌనంగా వుండిపోయారు. ఎంత మాట్లాడితే అంతా మాట్లాడనీ అన్నట్లు వున్నారు. ఇది బహశా ఆర్ఆర్ఆర్ ను మరింత ఇరిటేట్ చేయవచ్చు.

భాజపా తప్పిదం

ఇక్కడ భాజపా తప్పిదం కూడా వుంది. నైతిక విలువల మీద వుండే పార్టీ, విదేశాల నుంచి నల్లధనం తెప్పిస్తామన్న పార్టీ, రుణాలు ఎగ్గొట్టేవారి మీద చర్యలు తీసుకుంటామన్న పార్టీ, అలాంటి నేరాలకు పాల్పడిన వారిని పార్టీలోకి రానివ్వడమే తప్పు. వచ్చాక, వాళ్లను కాపాడడం ఇంకా తప్పు.

సుజన కేసులు అలా అబేయన్స్ లోకి వచ్చినట్లు కనిపించడమే ఇప్పుడు ఆర్ఆర్ఆర్ కు ధైర్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. మొత్తం మీద ఈ క్యాట్ అండ్ మౌస్ గేమ్ ఎన్నాళ్లు సాగుతుందో చూడాలి.

వలస కార్మిక విషాదం

- కె.వెంకట్, పి.హెచ్‌డి

2020 నాటి కోవిడ్ 19 సంక్షోభంలో అత్యంత అమానుష పర్వం ఏదైనా వుందా అంటే అది వలసకార్మికులకు సంబంధించినదే. లాక్‌డౌన్ వలన ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది, ఉద్యోగాలు పోతాయి, ఫ్యాక్టరీలు మూతపడతాయి, వ్యాపారాలు దెబ్బ తింటాయి... ఇలా ఎన్ని వున్నా, వలస కార్మికుల ప్రస్థానంతో సరిపోలవు. ఇది మానవవిషాదం. వారి గురించి ఫోటోలు చూసినా, వీడియోలు చూసినా కన్నీళ్లు రానివాడు మనిషే కాదు. ఇలాంటిది ఈ శతాబ్దిలోని రెండు దశాబ్దాలలో చూడలేదు. గత శతాబ్ది మధ్యంలో 1947లో దేశవిభజన సమయంలో జరిగినదే దీనికి దగ్గరగా వస్తుంది.

విభజన జరిగినపుడు ప్రజలు అటూయిటూ తరలివెళతారని నాయకులు ఊహించలేదు. అప్పటిదాకా తరతరాలుగా ఇరుగుపొరుగున నివసిస్తూ వచ్చిన హిందూ, ముస్లిములు అలాగే కొనసాగుతారనీ, ఎటొచ్చీ వాళ్లున్న దేశం పేరు మాత్రమే మారుతుందని అనుకున్నారు. అయితే దేశాలు వేరుపడ్డాయని అనగానే వాళ్లు కత్తులు చేతబట్టి కుత్తుకలు కోసుకున్నారు. భయంతో హిందువులు ఇటూ, ముస్లిములు అటూ తరలివెళ్లిపోయారు. రైళ్లు, బస్సులు, ఎడ్ల బళ్లు ఏది దొరికితే అది పట్టుకుని బయటపడ్డారు. అయితే సరిహద్దు దాటేవరకే మరణభయం.

మరి ఇప్పుడు దేశసరిహద్దుల్లోనే ఈ విలయం. ఏ వాహనమూ లేదు, కాలి నడకనే వందలాది, వేలాది మైళ్ల పయనం. అప్పుడైతే చేతిలో డబ్బుంటే దారిలో ఏదైనా కొనుక్కోవచ్చు. ఇప్పుడు చేతిలో డబ్బూ లేదు, ఉన్నా కొనుక్కోవడానికి దుకాణమూ లేదు, దుకాణాల్లో తిండీ లేదు. ఆకలితో, దాహంతో, ఎండలో, చీకటిలో నడక. అప్పట్లో కొన్ని సరిహద్దు రాష్ట్రాలకే ఈ సమస్య వచ్చిపడింది. ఇప్పుడు దేశమంతా సమస్యే. అప్పట్లో లక్షలాది ప్రజలు శరణార్థులుగా తరలి వస్తారని ఊహించలేని నెహ్రూ, పటేల్, జిన్నా అందరూ బిత్తరపోయారు. కమ్యూనికేషన్ సౌకర్యాలు లేవు కాబట్టి ఎక్కడ ఏం జరుగుతోందో తెలియక బెంబేలెత్తారు. ఇప్పుడు కమ్యూనికేషన్ సౌకర్యాలు అద్భుతంగా వున్నాయి. ఏం జరుగుతోందో తెలుసు. అయినా పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంది.

అప్పట్లో ఎటుచూసినా హింస, రక్తపాతం. ప్రజల్లో ప్రతీకారేచ్ఛ. ఇప్పుడు హింస లేదు. ఆకలి చావులే. వలస కార్మికులపై జాలి తప్ప ఎవరికీ క్రోధం లేదు. అయినా వారికి ఏ ఉపకారమూ జరగలేదు, ఏ సహాయమూ అందలేదు. అప్పుడు రాడ్‌క్లిఫ్ అనే బ్రిటిషు లాయరు వచ్చి, స్థానిక సమస్యల పట్ల ఏ అవగాహనా లేకుండా మ్యాప్ మీద గీతలు గీస్తూ, మూడు రోజుల్లో విభజన ప్రక్రియ ముగించాడు కాబట్టే ఈ అనర్థం జరిగింది అన్నారు. అప్పటికింకా పరిపాలన బ్రిటిషు అధికారుల చేతుల్లోనే వుంది కాబట్టి అల్లర్లు జరుగుతూ వుంటే మా బాగా జరిగింది అనుకుంటూ ఉదాసీనంగా ఉన్నారని మనవాళ్లు ఆడిపోసుకున్నారు. తెల్లదొర రాడ్‌క్లిఫ్ మూడు రోజులు టైమిచ్చాడు. ఇప్పటి పాలకుడు నల్లదొర ఇచ్చిన గడువు నాలుగు గంటలే! అందరూ యిళ్లల్లోనే వుండాలన్నాడు. ఇల్లు చేరనిస్తే కదా, ఇంట్లో వుండడానికి!

అబ్బే, నా ప్రసంగం వినడానికి అందరూ తమతమ ఇళ్లల్లోనే వుండి వుంటారనుకున్నా అనడానికి లేదు. దేశంలో వలస కార్మికులు ఉన్నారన్నది పాలకులకు, అధికారులకు అందరికీ తెలుసు. ఏటా 90 లక్షల మంది వలస కార్మికులు పెరుగుతున్నారని నీతి ఆయోగ్‌యే ఎప్పుడో చెప్పింది. 8 కోట్ల మంది అంతర్రాష్ట్రీయ కార్మికులున్నారని నిర్మలగారు ఇప్పుడు స్వయంగా చెప్పారు. రాష్ట్రంలోనే ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వలస వెళ్లి పనిచేసే వారు 5 కోట్ల దాకా వుంటారని అంచనా. మొత్తం 13 కోట్లు అంటే, దేశజనాభాలో దాదాపు 10 శాతం. లాక్‌డౌన్ విధిస్తే ఇన్ని కోట్లమంది గతేమిటి అని ఎవరికీ తట్టలేదా!!?

వీళ్లంతా వసతి కలవారు, ఎవరి బాగు వాళ్లు చూసుకోగలిగిన వారనుకున్నాం అనడానికి లేదు. ఇది దశాబ్దాల పాపం. గ్రామీణ ప్రాంతాలను పాడుపెట్టేశాం, వ్యవసాయం కిట్టుబాటు కాకుండా చేశాం, గ్రామాల్లో పరిశ్రమలు పెట్టలేదు, అభివృద్ధిని వికేంద్రీకరించకుండా నగరీకరణకి పెద్దపీట వేసి దేశప్రజలంతా అటువైపు పరుగులు తీసేట్లు చేశాం, అక్కడే మెట్రోలు, బుల్లెట్ ట్రెయిన్లు, ఐఐటీలు, ఎయిమ్స్, సూపర్ స్పెషాలిటీలు, హైపర్ మాల్స్, ఫ్లయిఓవర్లు, స్కైస్క్రాపర్లు... ఇవన్నీ కట్టడానికి కావలసిన లేబర్ నంతా గ్రామాల నుంచి తీసుకుని వచ్చి కుదేశాం.

భారతదేశంలోని వలస కార్మికులలో 33% మంది యుపి నుంచి, 15% మంది బిహార్ నుంచి, 6% మంది రాజస్థాన్ నుంచి వచ్చి వుంటారని ఓ అంచనా. మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలు.. ఇలా అనేక రాష్ట్రాలు వలస కూలీలను సరఫరా చేస్తున్నాయి (వీళ్లని ఎవరూ పట్టించుకోక పోవడం చేత గణాంకాలు స్థిరంగా లేవు). ఆ రాష్ట్రాల్లో వీళ్లకు ఉపాధి లేదు. అందుకే బయటి రాష్ట్రాలకు వచ్చి తక్కువ కూలీకి పని చేస్తున్నారు. దిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, తెలుగు రాష్ట్రాలు వంటి అనేక రాష్ట్రాలు వీళ్ల చేత పనిచేయించుకుంటున్నాయి. బిహార్ రాష్ట్రంలో దాదాపు 8% వలస కార్మికులేనట!.

ఎక్కడివాళ్లు అక్కడే అనడంతో 8 కోట్ల మంది ఇతర రాష్ట్రాలలో, 5 కోట్ల మంది రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో ఇరుక్కుపోతారని, రెక్కాడితే కానీ డొక్కాడని ఈ జనాభా వద్ద సేవింగ్స్ ఏవీ వుండవని, వాళ్లు పని చేసే చోట చాలా మందికి పక్కా ఇళ్లు కూడా వుండవనీ,

పని చేసే స్థలాల్లోనే టెంట్లలో, షెడ్లలో వుంటారనీ పాలకులకు, వారి సలహాదార్లకు తెలియదా? నిర్మలగారు ఈ రోజు వలస కార్మికులకు తక్కువ అద్దెలో యిళ్లు యిచ్చే పథకం పెడతామని చెప్తున్నారు. వాళ్లకు సరైన గూడు లేదన్న సంగతి నెలన్నర క్రితం తెలియదా? వలస వచ్చినచోట కూడూ, గూడూ రెండూ లేకుండా మూడు వారాల పాటు ఎలా వుండగలరని అనుకున్నారు?

మూడు వారాల పాటు లాక్‌డౌన్‌లో వుంటే చైన్ తెగిపోతుందని మోదీగారికి ఎవరో చెప్పారు, ఆయన మార్చి 24న అదే చెప్పారు. తెగకపోతే.. అనే సందేహం రావాలి కదా, అప్పుడు ఈ వలస కార్మికుల గతేమిటి అని కూడా ఆలోచించాలిగా! నిజానికి లాక్‌డౌన్ పొడిగిస్తూ పోతున్నారు. మూడు వారాలు ఆరువారాలైంది. ఇంకా సాగుతోంది. ఇలా జరిగితే ఎలా అనే కంటిజెన్సీ ప్లాను ఉండాలిగా! అదేమీ లేకుండా ఎక్కడివాళ్లు అక్కడే గప్‌చుప్ అంటే ఎలా? 6 కోట్ల లోపు జనాభా వున్న దక్షిణాఫ్రికా మూడు రోజుల గడువు ఇవ్వగా లేనిది 135 కోట్ల ఇండియా ఎన్ని రోజులివ్వాలి? ఇప్పుడు వేసిన శ్రామిక రైళ్లు అప్పుడే వేస్తే పోలా? కనీసం రాష్ట్రపు సరిహద్దుదాకా తీసుకెళ్లి పడేస్తే, అక్కణ్నుంచి నడిచే దూరం తగ్గేదిగా! నడవలేకపోతే తెలిసున్నవాళ్లెవరి ఇంట్లోనైనా తలదాచుకునే వీలుండేది.

ఇన్నాళ్లకు తరలింపులు ప్రారంభించారు. బస్సులు వాడుతున్నారు. బస్సులో మహా అయితే 50 మంది పడతారు. అదే రైలైతే వెయ్యి మంది పడతారు. స్పీడూ ఎక్కువ. సిబ్బందితో ఇంటరాక్షనూ వుండదు. టాయిలెట్ సౌకర్యాలూ వుంటాయి. లాక్‌డౌన్ పీరియడ్‌లో కూడా శ్రామిక్ రైళ్లు నడిపేసి వుంటే వలస కార్మికుల సమస్య తీరిపోయి వుండేది. అబ్బే దానివలన కరోనా మరీ వ్యాపించేది అనుకోనక్కరలేదు. అప్పటికంటె యిప్పుడు ప్రమాదం మరింత ఎక్కువైంది. వీళ్లు ఇళ్లు చేరి వుంటే గ్రామాల్లో సామాజిక దూరం పాటించడం సులభమయ్యేది. క్యాంపుల్లో గుంపులుగా వుంటూ, రోడ్ల మీద గుంపులుగుంపులుగా వెళ్లి కరోనా ప్రమాదానికి మరింత ఎక్కువగా గురయ్యారు. వీళ్లంతా మాటిమాటికీ 20 సెకండ్ల పాటు మోచేతుల దాకా కడుక్కోవడానికి క్యాంపుల్లో నీళ్లున్నాయా? రహదారుల్లో నీళ్లున్నాయా? తాగడానికి, కడుక్కోవడానికి చలివేంద్రాలు ఎవరైనా ఏర్పాటు చేశారా?

లాక్‌డౌన్ విధించిన 5 రోజుల తర్వాత యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ గత మూడు రోజుల్లో లక్షమంది వలస కార్మికులు రాష్ట్రానికి చేరారని, వారికి 14 రోజుల క్వారంటైన్ విధించామని ప్రకటించారు. అంటే వీళ్లంతా లాక్‌డౌన్ నియమాలను ఉల్లంఘించి, అక్రమంగా నడిచి వచ్చినవారన్నమాట! ఎలాగూ క్వారంటైన్ విధించి జాగ్రత్తలు తీసుకుంటూన్నపుడు సక్రమంగానే రప్పిస్తే పోయేదిగా! ప్రాణాలకు తెగించి వచ్చినవారికే ఆ వెసులుబాటు యివ్వడం దేనికి? ఆ తర్వాతి రోజుల్లో ఎన్ని లక్షల మంది వచ్చారో లెక్కలు వాళ్లే చెప్పాలి. పంజాబ్, హరియాణాలలో రికార్డు స్థాయిలో గోధుమలు పండితే పంట నూర్చడానికి లాక్‌డౌన్ నిబంధనలు సడలించి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా కూలీలలను రప్పించుకున్నారు. మరి అప్పుడు కరోనా భయం లేదా?

నిజానికి వలస కూలీలు లేనిదే అనేక రాష్ట్రాలలో బండి చక్రాలు కదలవు. ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ మళ్లీ పట్టాలెక్కాలంటే వాళ్లు ఉండి తీరాలి. మా ఇంటికి వెళ్లిపోతాం, మా వాళ్లను చూసుకోవాలి అంటూ వాళ్లు ఇప్పుడు వెనక్కి వెళ్లిపోతూ వుంటే వాళ్లను నయానో, భయానో ఆపాలని చూస్తున్నాయి ఆ రాష్ట్రప్రభుత్వాలు. ఇంత ముఖ్యమైన శ్రామికవర్గాన్ని ఇన్నాళ్లూగాలికి వదిలేయడంలో ఏ విజ్ఞత వుంది? ఏ మానవత్వం వుంది? మార్చి 24నే వాళ్లతో 'ఇక్కడే ఉంటారా? ఇంటికి వెళతారా? ఉండేమాటైతే మీకు మామూలుగా వచ్చే ఆదాయంలో సగం ఇస్తాం, మీ కోసం క్యాంటీన్లు నడుపుతాం, మీ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడేందుకు విశేష సౌకర్యాలు కల్పిస్తాం' అనాల్సింది. కాదూ వెళ్లిపోతామంటారా, రైలెక్కండి, మీ రాష్ట్ర సరిహద్దుల్లో దింపేస్తాం. అక్కణ్నుంచి మీ రాష్ట్రం చూసుకుంటుంది అనాల్సింది కదా!

సరిహద్దు దాకా అని ఎందుకంటున్నానంటే ఇప్పుడు వీరి బాధ్యత రాష్ట్రాలదే అని కేంద్రం అంటున్నా, రాజ్యాంగం ప్రకారం అంతర్రాష్ట్రీయ కూలీలు కేంద్రపరిధిలోని అంశం. రాష్ట్రంలోనే జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లేవారి సమస్య రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. లాక్‌డౌన్ విధించేముందు కేంద్రం రాష్ట్రాలతో చర్చించి, వీరి విషయం కూడా ప్రస్తావించి వుంటే ఒక విధానం రూపొందేది. అది జరగకపోవడంతో ఈ విషాదం సంభవించింది. లాక్‌డౌన్ విధించిన రెండు, మూడు రోజులకే ఇది తెర మీదకు వచ్చింది. అందరూ అయ్యో, అయ్యో అనడం మొదలుపెట్టారు. కానీ పాలకులు కూడా ఏమీ చేయలేదు. 45 రోజుల తర్వాత 20 లక్షల కోట్ల పాకేజిలో వీళ్ల గురించి ప్రస్తావించారు కానీ మొదట్లో ప్రకటించిన 1.70 లక్షల కోట్ల పాకేజీలో వీరి వూసేది?

బీదల కోసం స్కీములంటూ అప్పుడు చెప్పినవేమిటి? నరేగాని రోజుకి రూ.20 పెంచడం. లాక్‌డౌన్‌లో అది అక్కరకు రాదు కదా. రేషన్ ఇస్తున్నవారికి అదనంగా నెలకు 5 కిలోల గోధుమ, 1 కిలో పప్పుధాన్యాలు చొప్పున మూడు నెలలు ఉచితం,గ్యాస్ సిలిండర్లు మూడు నెలల పాటు ఉచితం. ఇవి రేషన్ కార్డులు ఉన్నవారికే వర్తిస్తాయని, వలస కూలీలకు దీనివలన లాభం లేదని పాలకులకు తోచలేదా? ఇప్పుడు గుర్తు వచ్చింది. దేశమంతటికీ వర్తించే రేషన్ కార్డు రాబోతోందన్నారు. కార్డుతో సంబంధం లేకుండా రేషన్ ఇస్తామంటున్నారు. అసలు రోడ్ల మీద నడిచి పోయేవారికి గోధుమలు ఇస్తే ఏం చేసుకుంటాడు, వండించి ఇవ్వాలిగానీ! ఇప్పుడు వచ్చింది ఆ ఆలోచన. జాతీయ రహదార్లపై నడిచి వెళ్లేవారి కోసం స్టాల్స్ నిర్వహించి, అన్నం పెడతారట.

అంటే మీరు నడక మాత్రం ఆపకండి, భోజనం పెట్టి నడిపిస్తూనే ఉంటాం అన్న అర్థం రావటం లేదూ? నడకెందుకు? రైళ్లు ఏర్పాటు చేస్తాం, దగ్గరున్న రైల్వేస్టేషన్ వరకు వాహనాలు ఏర్పాటు చేస్తాం అంటే సరిపోలేదా? 'బోగీలో 50 మందిని ఎక్కమంటే 100 మంది ఎక్కుతారు, చెప్పినమాట వినరు, అదుపు చేయడానికి ఆర్‌పిఎఫ్ సిబ్బంది చాలరు' అంటారా, మిలటరీని దింపండి. వాళ్లు తోలు ఒలిచేసి పద్ధతిగా పంపిస్తారు. మిలటరీ ట్రక్కులు నడిపి, కనీసం గర్భిణీలను, పిల్లలను, ముసలివారిని తీసుకెళ్లండి.

కేజీఎఫ్ – కోలార్ గోల్డ్ ఫీల్డ్స్

– బి.వీరయ్య

కేజీఎఫ్ అనగానే ఎవరికైనా సరే ముందుగా గుర్తుకు వచ్చేది.. దాని పేరిట వచ్చిన మూవీ.. సినిమాలో ఆ మైన్లను చూపిస్తారు. కానీ నిజానికి ఇక్కడ చెప్పబోయేది ఆ మూవీ గురించి కాదు. కోలార్‌లో ఉన్న బంగారు గనుల గురించి. 19వ శతాబ్దం నుంచే అక్కడ బంగారం తవ్వకాలు మొదలుపెట్టారు. మన దేశానికి ఉన్న ముఖ్యమైన బంగారు గనిగా కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) పేరుగాంచింది. అయితే అంతటి పేరున్న గనిని కేంద్రం ఎందుకు మూసివేసింది? బంగారం తవ్వి తీయవచ్చు కదా? అంటే.

1900వ సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం కోలార్‌లో కావేరి నదిపై జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు మైసూర్ మహారాజుకు ఓ ప్రతిపాదన పంపింది. దీనికి ఆయన కూడా ఒప్పుకున్నారు. దీంతో వడి వడిగా పనులు జరిగి విద్యుత్ కేంద్రం ఏర్పాటైంది. మొత్తం 148 కిలోమీటర్ల విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రపంచంలోనే అత్యంత పొడవైన విద్యుత్ లైన్లు కలిగిన ప్రాంతంగా కోలార్ పేరుగాంచింది. ఇక ఆ పవర్ ప్లాంట్ దేశంలోనే మొదటి పవర్ ప్లాంట్ కాగా.. ఆసియాలో రెండోది.

ప్రస్తుతం కర్ణాటకనే కాదు, దేశవ్యాప్తంగా అనేక చోట్ల నిత్యం ఎక్కడో ఒక చోట విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడి కరెంట్ పోతుంటుంది. కానీ 1902వ సంవత్సరం సమయంలో కోలార్, కేజీఎఫ్‌ల వద్ద నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేది. అప్పటికి ఇంకా బెంగళూరు, మైసూరులకే విద్యుత్ రాలేదు. కానీ కోలార్‌కు వచ్చింది. ఇక పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందే అక్కడ బంగారు గనులను తవ్వడం మొదలు పెట్టారు. అందుకు బ్రిటిష్ ఆర్మీలో అప్పట్లో పనిచేసిన మైకేల్ ఫిట్జరాల్డ్ లావెల్ అనే ఐరిష్ సైనికుడు ముందుగా ప్లాన్ వేశాడు.

మైకేల్‌కు 1804వ సంవత్సరంలో ప్రచురితం కాబడ్డ ఓ 4 పేజీల ఆర్టికల్ లభించింది. అందులో కోలార్‌లో ఉన్న బంగారు నిక్షేపాల గురించి ఆయనకు తెలిసింది. దీంతో 1871లలో ఆయన తన మకాం బెంగళూరుకు మార్చాడు. ఆ తరువాత కొంత కాలానికి కోలార్ గనుల్లో బంగారం తవ్వకాలు మొదలయ్యాయి. అనంతరం పవర్ ప్లాంట్ వచ్చింది. అప్పటి వరకు ఆ బంగారు గనుల్లో వెలుగు కోసం క్యాండిల్స్, కిరోసిన్ లాంతర్లు ఉపయోగించే వారు. కానీ విద్యుత్ రాకతో ఆ గనుల్లో విద్యుత్ బల్బులు వెలిగాయి. ఇక కోలార్ ప్రాంతమంతా బ్రిటిష్ వారితో నిండిపోయి చిన్నపాటి ఇంగ్లండ్‌ను తలపించేది. ఎటు చూసినా బంగ్లాలే కనిపించేవి. కానీ అక్కడి గనుల్లో భారతీయులు పనిచేసేవారు. అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లలో వారు నివాసం ఉండేవారు. ఒక్కో షెడ్డుల్లో ఒకటి కన్నా ఎక్కువ కుటుంబాలు దుర్భర పరిస్థితిలో నివాసం ఉండేవి.

1956 అనంతరం కోలార్ బంగారు గనులు జాతీయం అయ్యి కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లాయి. అప్పటి నుంచి 2001 వరకు ఆ గనులలో తవ్వకాలు కొనసాగాయి. మొత్తం భారత్‌లో ఉత్పత్తి అయ్యే బంగారంలో కేవలం ఆ గనుల నుంచే 95 శాతం వరకు బంగారం వచ్చేది. కానీ 2001లో ఆ గనులను మూసేశారు. తరువాత అక్కడ గనులన్నీ భూగర్భ జలాలతో నిండిపోయాయి. కానీ ఇప్పుడు మళ్లీ ఆ గనులను ఓపెన్ చేసి బంగారం తవ్వాలని పలువురు కేంద్రాన్ని కోరుతున్నారు. అయితే కోలార్ గనుల్లో బంగారం నిల్వలు ఇంకా ఉన్నప్పటికీ.. ఆ బంగారాన్ని తవ్వి తీయాలంటే.. ఆ బంగారం కన్నా ఎక్కువ ఖర్చు అవుతుందట. అందుకనే ఆ గనులను అప్పట్లో మూసేశారు. అప్పటి నుంచి అక్కడ తవ్వకాలను జరపడం లేదు. అలా 2001 నుంచి ఆ గనులు మూసే ఉన్నాయి. ఆ విధంగా కేజీఎఫ్ గనుల అధ్యాయం ముగిసింది..!





కిమ్‌శకం ఇక ముగిసినట్లేనా.?

అధ్యక్ష పదవి రేసులో ఆ ఇద్దరు.!

- ఫణి

తాజాగా డైలీ ఎన్‌కే కిమ్ జాంగ్ ఉన్ గురించి ఓ ఆసక్తికరమైన కథనాన్ని ప్రచురించింది. త్వరలోనే కిమ్ జాంగ్ ఉన్ అధ్యక్షుడిగా తప్పుకోనున్నట్లు అందులో పేర్కొంది. అధ్యక్ష పదవి రేస్‌లో ఇద్దరు శక్తివంతమైన వ్యక్తులు ఉన్నారట కిమ్‌శకం ఇక ముగిసినట్లేనా.? అధ్యక్ష పదవి రేసులో ఆ ఇద్దరు.

కిమ్ జాంగ్ ఉన్.. ఈ పేరు ఒక బ్రాండ్.. ఆధునిక నియంతగా పేరుగడించిన కిమ్ ప్రపంచదేశాలతో పాటు అగ్రరాజ్యం అమెరికాను సైతం గడగడలాడించారు. చూడడానికి జానదే ఉన్నా.. ఆయన చేసే చేష్టలు, చర్యలు మాత్రం వేరే లెవెల్ అని చెప్పొచ్చు. ఇదిలా ఉంటే ఈ డిక్టేటర్ 2020లో కరోనా వైరస్ కంటే ఎక్కువ సంచలనం అయ్యారని చెప్పాలి. ఈయన చనిపోయారంటూ అనేక రూమర్స్ ప్రపంచ మీడియాలో ఏప్రిల్, మే నెలల్లో హల్‌చల్ చేశాయి. అయితే ప్రస్తుతం కిమ్‌కు నాయకత్వ భయాల ఎక్కువగా పట్టుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందటంతో నార్త్ కొరియా ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. చైనా నుంచి రావాల్సిన ఫండింగ్ కూడా ఆగిపోయింది. దీనితో ఆ దేశంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అక్కడ మాత్రం ఇప్పటివరకు ఒక్క కరోనా కేసు కూడా నమోదైనట్లు అధికారికంగా వార్తలు రాలేదు.

ఇదిలా ఉంటే తాజాగా డైలీ ఎన్‌కే కిమ్ జాంగ్ ఉన్ గురించి ఓ ఆసక్తికరమైన కథనాన్ని ప్రచురించింది. త్వరలోనే కిమ్ జాంగ్ ఉన్ అధ్యక్షుడిగా తప్పుకోనున్నట్లు అందులో పేర్కొంది. అధ్యక్ష పదవి రేస్‌లో ఇద్దరు శక్తివంతమైన వ్యక్తులు ఉన్నారట. వారిలో ఒకరు రికనైసెన్స్ జనరల్ బ్యూరో అధిపతి రిమ్‌గ్వాంగ్-ఇల్ కాగా, మరొకరు సుప్రీంగార్డ్ కమాండ్ హెడ్‌గ్వాక్ చాంగ్-సిక్. ఉత్తర కొరియాలో సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం.. రిమ్‌గ్వాంగ్-ఇల్ వ్యూహాత్మక కార్యకలాపాలలో నిపుణుడని.. అలాగేగ్వాక్ చాంగ్-సిక్ చాలా తెలివైనవాడని తెలుస్తోంది. గతంలో ఆర్‌జీబీకి హెడ్‌గా వ్యవరించిన జాంగ్ గిల్ సాంగ్ సౌత్ కొరియాపై ఓ సీక్రెట్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా.. అది కాస్తా ఫెయిల్ అయింది. దీనితో వెంటనే అతడి స్థానంలో రిమ్‌గ్వాంగ్-ఇల్‌ను నియమించారు. కాగా, కిమ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీగాడిలో పెట్టడంలో విఫలమైతే.. వీరిద్దరిలో ఒకరికి అధ్యక్ష పదవి కట్టబెట్టాలని నార్త్ కొరియా వర్కర్స్ పార్టీ వర్గాలు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

మహారాణి అప్పలకొండయాంబ

(రీవా సర్కార్)గారి ప్రజా సంక్షేమ కార్యాలు విజయనగరంలో

- కె.దుర్గ



రాణీ అప్పలకొండ యాంబగారు మహారాజరాజశ్రీ విజయరామ గజపతి(3), అలక్రాజేశ్వరిగార్ల కుమార్తె. ఆమె వివాహం మాధోఘడ్, బాగేల్ ఖండ్ నందలి రీవా సంస్థానానికి చెందిన శ్రీ రామరాజ్ సింగ్‌గారితో జరగడంతో ఆమె రీవా రాణీగా పిలువబడినారు. చిన్న వయసులోనే భర్తను కొల్పోవడంతో, విజయనగరం విచ్చేసి సోదరుడైన మహారాజు ఆనంద గజపతికి, తల్లి రాణీ అలక్రాజేశ్వరిగారికి విజయనగర రాచరికపు పరిపాలనా వ్యవహారాల్లో సహకరించీ, విజయనగరాన్ని "రీవా సంస్థానం" అన్నంత ఉచ్ఛ స్థాయిలో నిలబెట్ట డానికిగాను ప్రజలకు సమస్త సౌకర్యాలు అందించే దిశగా ప్రయత్నించీ జనావళిలో గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. ప్రజలలో ఆమె పట్ల గౌరవమూ, భయం, భక్తీ కలిగి ఉండేవి.

"ఖర" నామ సంవత్సరం 1891 లో వర్షపు లేమి వల్ల అటు ఆంధ్ర దేశమే కాక విజయనగరంలో కూడా బహు నీటి ఎద్దడికి గురి కావడం, పంటలు నష్టము వాటిల్లడంతో, ఆ ఏటి నుండీ నీరు కొరత ఎక్కువగా వేసవిలో కానవచ్చేది. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించే ఒక మంచి ఆలోచనతో ఒక లక్ష రూపాయలు ఆమె తన వైపునుండీ విరాళంగా ఇస్తూ, వాటర్ వర్క్స్ (పంపు హౌస్) నిర్మించీ, నెర్లిమర్ల నుండీ విజయనగరానికి నీరు అందించే ఏర్పాటు చేయించేరు. ప్రజల సంక్షేమార్థం తన స్వయం ఖర్చులతో "మాతా శిశు వైద్యశాల" (ఘోషా హాస్పిటల్) 1903-04 ప్రాంతంలో కట్టించడం జరిగినది.

ఆమె తన వీలునామాలో ఒక లక్ష రూపాయలు విజయనగర సంస్థానం ఖజానాలో ఉండేటట్టు ఆలోచనగావించీ ఆ ఆసుపత్రి నిర్వాకం గూర్చి నిర్ణయం తీసుకున్నారు ఆ రోజుల్లో. అలాగే, విజయనగరం రైల్వే స్టేషన్ పరిసరాల్లోను యాత్రికుల ఉచిత భోజన సౌకర్యార్థం కొంత ధనం కేటాయించారు. ఖజానాలో దాచబడిన మూలధనంపై వచ్చే వడ్డీ ఆదాయంతో, బెనారస్‌లో బ్రాహ్మణ ఆచారాన్ని పాటించే విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం గూర్చి ఆలోచన చేసిన మహా పుణ్యశాలి ఆమె.

పెట్రోల్ ధరలు మెత్తగా పెంచేస్తూ, పిండేస్తున్నారు!

- ప్రజామీడియా నెట్‌వర్క్

ఒకవైపు అంతర్జాతీయంగా లాక్‌డౌన్ పరిణామాలతో చమురు ఉత్పత్తి మీద ఆధారపడిన దేశాలు హడలిపోతున్నాయి. పెట్రోల్‌కు డిమాండ్ దారుణంగా పడిపోవడంతో ఆయా దేశాల్లోని చమురు కంపెనీలు దివాళ భయాలకు వెళ్లాయి. ధర పడిపోవడంతో అవి ఏం చేయాలో అంతుబట్టని పరిస్థితుల్లో ఉన్నాయని అంతర్జాతీయ మీడియా చెబుతూ ఉంది!

ఇండియాలో మాత్రం ఆ పరిణామాలతో సంబంధం లేకుండా పెట్రోల్ ధరలు పెరుగుతూ పోతున్నాయి. లాక్‌డౌన్‌తో కేంద్రానికి తగ్గిన ఆదాయాన్ని కేవలం పెట్రోల్ ద్వారానే భర్తీ చేయాలని మోడీ ప్రభుత్వం భావిస్తోందేమో కానీ.. వారం రోజుల్లో లీటర్ పెట్రోల్ పై ఏకంగా నాలుగు రూపాయల ధరను పెంచారు. గతంలో పెట్రోల్ ధరల్లో కొన్ని నెలలకు ఒకసారి హెచ్చుతగ్గులుండేవి. అయితే ఇప్పుడు ఏ రోజుకారోజు హెచ్చుతగ్గులు ప్రజలకు అర్థం అయ్యే అవకాశం లేదు! లీటర్ పెట్రోల్ పై దాదాపు నాలుగు రూపాయలు పెంచేయడం, డీజిల్ పై మరో నాలుగు రూపాయలు పెంచడం.. అంటే మాటలేమీ కాదు. భారీ పెంపుదలే. అయితే రోజు వారీగా రూపాయి, అర్థరూపాయి పెంచుకుంటూ.. వారం రోజుల్లో నాలుగు రూపాయలు పెంచేశారు. ప్రజలకు అర్థం అయ్యేలోగా కేంద్రం ఇలా పిండేసుకుంటూ ఉంటుంది.

ఇటీవలే సర్ చార్జీలను పెంచేసుకుని పెట్రో అమ్మకాలతో లాభాలకు లైన్ క్లియర్ చేసుకుంది కేంద్రం. జనం కరోనా లాక్‌డౌన్ కష్టాలతో ఉన్నా, నిత్యవసరాల ధరలను ప్రభావితం చేసే పెట్రోల్-డీజిల్ ధరల పెంపు విషయంలో ఏ మాత్రం రాజీపడకుండా, ప్రజల మీద ఏ మాత్రం దయ చూపకుండా మోడీ ప్రభుత్వం తన ధోరణిలో సాగుతూ ఉంది.

గతంలో పెట్రోల్ మీద రూపాయి ధర పెంచినా ఏం తిన్నేట్టు లేదు, ఏం కొనేట్టు లేదంటూ మీడియా హడావుడి చేసింది, కమ్యూనిస్టులు రోడ్డెక్కేవారు. ఇప్పుడు పెంచుకుంటూ పోతున్నా అడిగే నాథుడు కూడా లేదు! దేశం ప్రశ్నించడాన్ని మరిచిపోతోందా?

సొంతభూమి.... స్వర్గసీమ

- బి.రాము

మనిషి జీవన చిత్రం, సామాజిక శిల్పం, భౌగోళిక రూపంలో పెను మార్పులకు కరోనా ప్రభావం కారణమవబోతోంది. ఉపాధి, ఉద్యోగాలు, విద్య మొదలైన రంగాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్వదేశీ ఉత్పత్తులేకాక,స్వదేశీ విద్య, ఉపాధులపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన తరుణం వచ్చేసింది. స్వక్షేత్రాలకు చేరుతున్న కూలీల్లో ఎక్కువమంది తిరిగి వలస వెళ్ళడానికి సుముఖంగా లేరు. స్థానికంగా ఉండే పనుల్లోనే ఉపాధి వెతుక్కుంటారు. ఉపాధి అవకాశాలు కూడా కొత్తరూపును సంతరించుకుంటాయి. సొంతఊర్లకు వెళ్లకుండా, పట్టణాల్లో, నగరాల్లో ఉన్నవారితో పాటు, వివిధ రంగాల్లో పనిచేస్తూ, ఉపాధిని కోల్పోయినవారు కూలీలుగా మారే అవకాశం ఉంది. విద్య, ఉద్యోగాల కోసం విదేశాలు వెళ్లే సంస్కృతి కూడా తగ్గుముఖం పట్టే పరిణామాలు కన్పిస్తున్నాయి. పల్లె నుండి మహానగరాల వరకూ ఇప్పటివరకూ ఉన్నవాటికి భిన్నమైన దృశ్యాలు భవిష్యత్తులో కనిపిస్తాయి. ముఖ్యంగా పల్లెలు కొత్త శోభను సంతరించుకుంటాయి. పల్లెలే పట్టణాలుగా మారుతాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుండి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి వరకూ గ్రామీణ ప్రాంతాలపై దృష్టి ఎక్కువ పెడుతున్నారు. ఇది మంచి పరిణామంగానే భావిద్దాం. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఆరోగ్యంతోపాటు సమగ్ర గ్రామీణాభివృద్ధికి కూడా ఊతమిచ్చే దిశగా కేంద్రప్రభుత్వం వివిధ కొత్త పథకాలను రూప కల్పన చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది, చేయాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది. ఇక నుండి వ్యవసాయ రంగం, గ్రామీణ వృత్తులు ప్రధాన ఆదాయమార్గాలుగా మారే అవకాశం ఎక్కువగా ఉందని నిపుణులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఊరును మారుద్దాం, అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వాగతిద్దాం. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అభినందిద్దాం. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీరు, సాగునీరు, రోడ్లు, ఆస్పత్రులు, శానిటేషన్, విద్యాలయాలు మొదలైన వసతుల కల్పనకు పెద్ద పీట వెయ్యాలి. సరియైన రోడ్లు, విద్యుత్, రవాణా లేని గ్రామాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. చదువుకోవాలంటే మైళ్లకు మైళ్ళు నడవాల్సిన పరిస్థితి ఇంకా చాలా పల్లెల్లో నెలకొని ఉంది. కరెంట్ వెలుగులు లేని పల్లెలు కూడా ఇంకా ఉన్నాయి. ఒక ఊరి నుండి పక్క ఊరుకు వెళ్లాలంటే రాళ్లు, ముళ్ళు ఉన్న మార్గాల్లో, గతుకుల రోడ్లలో వెళ్లాల్సిన పరిస్థితులు ఇంకా చాలా పల్లెల్లో ఉన్నాయి. అవిద్య, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పల్లెలు ఎన్నో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామాల పరిస్థితులను క్షేత్రస్థాయిలో దర్శించి, అధ్యయనం చెయ్యాలి. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చాలా గ్రామాలు ఇప్పటికీ ఎంతో వెనుకబడే ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో సమతుల్యత సాధించినప్పుడే సమగ్ర ప్రగతికి రాష్ట్రం చేరుకుంటుంది. కరోనా నేర్పిన పాఠాల్లో సొంతఊరుపై మక్కువ పెరగడం మంచి పరిణామంగానే భావిద్దాం. పల్లెలు, చిన్న



చిన్న పట్టణాల్లో నివాసాలు పెరిగే క్రమంలో, దానికి తగినట్లుగా వసతుల కల్పనలో ప్రభుత్వ చర్యలు వేగం పెంచుకోవాలి. ఉపాధి హామీ పథకం రూపురేఖలు మారాలి. సరికొత్త అధ్యయనాలతో కొత్త పనులను ఇందులోకి చేర్చాలి. పల్లెల్లో కూడా మద్యం వినియోగం పెరుగుతోంది. దీన్ని అరికట్టాలి. ఇంటర్నెట్ సదుపాయం ప్రతి పల్లెకు చేరాలి. వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దితే పల్లెలు కళకళలాడుతాయి. వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం కూడా పెరిగేలా ప్రభుత్వాలు ప్రోత్సాహకరమైన వాతావరణం కల్పించాలి. పల్నాడు, ప్రకాశం, రాయలసీమలోని కొన్ని గ్రామాల్లో పరిశుద్ధమైన నీరు అందడం లేదు. అపరిశుభ్రత తాండవించే ప్రాంతాలను కాపాడడంలో ప్రభుత్వం ప్రధాన భూమిక పోషించాలి. కరోనా నివారణకు పరిశుభ్రతే మొదటి ఔషధం. పల్లెల్లో గృహనిర్మాణాలు ఊపందుకునేలా చెయ్యాలి. పల్లెలో ఉంటే జీవితం ఎంతో బాగుంటుందనే భరోసాను ప్రభుత్వాలు కలుగజేస్తే, ఆవాసాలు పెరుగుతాయి. నిర్మాణం రంగం పల్లెల్లో కూడా ఊపందుకుంటుంది. సొంతభూమిపై నిలదొక్కోవాలనే ఆలోచనలు అవసరంగా మారిన ఈ సందర్భానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తోడునీడగా నిలవాలి. ఉన్న ఊర్లో ఉపాధి ఉంటే, ఇంకొక ఊరుకు ఎందుకు వలస వెళ్తారు? స్వదేశంలో మంచి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉంటే? వేరే దేశం కోసం ఎందుకు వెంపర్లాడుతారు. స్వక్షేత్రాన్ని స్వర్గసీమగా మార్చుకోవడమే కర్తవ్యంగా భావిద్దాం.

నే(నే)పాలు-పాపాలు

- ఎన్. జితేంద్రకుమార్

ప్రపంచ వ్యాప్తంగా కరోనా విషయంలో చెడ్డపేరు తెచ్చుకొని, తీవ్ర ఒత్తిడిలో ఉన్న చైనా అధినేతకు ఇరుగుపొరుగు దేశాలు ఎక్కువగా గుర్తుకొస్తున్నట్లున్నాయి. ఈ ఒత్తిడి నుండి, ఈ చెడ్డపేరు నుండి బయటకు రావడానికి జాతీయవాదం అస్త్రాన్ని తమ దేశంలో పరోక్షంగా వదులుతున్నారు. తాజాగా, నేపాల్ ను భారతదేశంపై రెచ్చగొట్టడమే దీనికి సాక్ష్యం. ఉదాహరణకు, జపాన్‌లో అలజడి సృష్టించడానికి దక్షిణ చైనా సముద్రప్రాంతంలో సంఘర్షణలు సృష్టిస్తూ ఉంటారు. చైనాకు ఇదొక అనైతిక నైపుణ్యం, రాజకీయ వ్యూహం. ఈ వ్యూహాలకు నేపాల్ ను బలిపశువుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. నిజం చెప్పాలంటే, భారతదేశంతో ప్రత్యక్ష యుద్ధం చెయ్యడానికి చైనా సిద్ధంగా లేదు. కవ్వింపుచర్యలే తప్ప, భారత్ – చైనాల మధ్య యుద్ధం జరిగే పరిస్థితి వచ్చే అవకాశాలు చాలావరకు లేవనే చెప్పాలి. పోయిన 2019 సంవత్సరం అక్టోబర్ లో భారతదేశం మ్యాప్ కొంత మార్చుకుంది. అందులో, లిపు లేక్, కాలాపానీ, లింపియాధుర కూడా ఉన్నాయి.జమ్ము, కశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ సమయంలో ఇది జరిగింది. దీన్ని నేపాల్ తీవ్రంగా వ్యతిరేకించింది.ఇవి తమ భూభాగాలంటూ పార్లమెంట్‌లో తీర్మానం కూడా చేసింది. తాజాగా, ఈ నెల 19 వ తేదీనాడు నేపాల్ కొత్త మ్యాపు కూడా సృష్టించుకుంది. అందులో భారతదేశ భూభాగాలైన లిపు లేక్, కాలాపానీ, లింపియాధురలను చేర్చుకోవడం సంచలనాత్మకంగా చర్చనీయాంశమైంది. అంతటితో ఆగకుండా, కరోనా నేపథ్యంలో భారతదేశంపై నేపాల్ ప్రధాని శర్మ ఓలి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.చైనా, ఇటలీ వైరస్ ల కంటే ఇండియా వైరస్ ప్రమాదకరమని నేపాల్ అధినేత మాట్లాడారు.భారతదేశ రాజముద్రలో ఉండే 'సత్యమేవ జయతే ' అనే వాక్యాలపైనా శర్మ ఓలి వ్యంగ్య బాణాలు వదిలారు.భారత్ సత్యమేవ జయతేకి కట్టుబడి ఉంటుందో? సింహమేవ జయతే అనుకుంటుందో చూడాలని శర్మ పరుషమైన వ్యాఖ్య చేశారు. ఈ చర్యలన్నింటి వెనకాల చైనా హస్తం ఉందనే అభిప్రాయాన్ని పరోక్ష పదజాలంతో భారతీయ అధికారులు వెలిబుచ్చారు. ఇది నేపాల్ కు గుచ్చుకుంటోంది. భారతీయ యాత్రికులు, భక్తులు టిబెట్ లోని మానస సరోవర్ కు వెళ్ళడానికి సుముఖంగా ఉండే విధంగా భారతదేశం ఒక రోడ్డు నిర్మించింది.రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ నెల 8వ తేదీ దాన్ని ప్రారంభించారు. ఉత్తరాఖండ్‌లోని దర్చులా రోడ్డు –లిపు లేక్ పాస్‌ను ఈ రోడ్డు అనుసంధానం చేస్తుంది. దీనిపైన కూడా నేపాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.భారత్ భూభాగంలో ఉన్న లిపులేక్, కాలాపానీ, లింపియధురలను తిరిగి తెచ్చుకుంటామని, నేపాల్ ప్రధాని శర్మ ఈ బుధవారం పార్లమెంట్ లో ప్రకటించారు.వాస్తవం చెప్పాలంటే, నేపాల్ చాలా చిన్న దేశం.భారతదేశంతో తలపడేంత శక్తి సామర్థ్యాలు ఉన్న దేశం కానేకాదు.ఇవ్వన్నీ ఉత్తర ప్రగల్భాలు. చైనా ఉరికొల్పుతున్న ప్రభావాలు. నేపాల్ – భారదేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక సంబంధ బాంధవ్యాలు బలంగా ఉన్నాయి.నేపాల్ లో హిందూ రాజరిక పాలన కొనసాగిన 2006 వరకూ రెండు దేశాల మధ్య సత్ సంబంధాలే నెలకొనిఉన్నాయి.తదనంతర పరిణామాలను గమనిస్తే, నేపాల్ లో కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ చైనాతో స్నేహ సంబంధాలు పెరుగుతూ వచ్చాయి.అదే సమయంలో భారతదేశం పట్ల వ్యతిరేకత కూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ అంశంలో నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీలోనే కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు.భారతదేశంతో రాజకీయ, దౌత్య చర్యలు ప్రారంభించి, సమస్యలు పరిష్కరించుకోవాలికానీ, ఉద్రిక్త పరిస్థితులు కల్పించుకోవడం సరియైన చర్య కాదని నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ నేత గణేష్ సైతం వ్యాఖ్యానించారు. తమ ప్రధాని తీరును తప్పు పట్టారు. నేపాల్ – భారతదేశాల మధ్య సరిహద్దు వివాదం ఎప్పటి నుండో ఉంది. బ్రిటిష్ వాళ్ళు పరిపాలించే సమయంలో 200 సంవత్సరాల క్రితం 1816లో ఒక ఒప్పందం జరిగింది. దీన్ని సుగౌలీ ఒప్పందం అంటారు. భారత్ తరపున అప్పటి బ్రిటిష్ పాలకులు ఈ ఒప్పందానికి సంతకం చేశారు. సరిహద్దు ప్రాంతంలో నారాయణీ, మహాకాళీ, మెచ్చి అనే నదులు ప్రవహిస్తూ ఉంటాయి. వీటిని ఆధారంగా చేసుకొని సరిహద్దులు నిర్ణయించుకోవడం కూడా సమస్యగా మారింది. ఇన్నేళ్లల్లో, ఈ నదుల ప్రవాహ ప్రయాణంలో దిశలు కూడా మారుతూ వస్తున్నాయి. ఈ ప్రాంతంలో నేపాల్ వైపు నుండి పహారా కూడా లేదు. రెండు దేశాలకు సంబంధించిన పాత మ్యాపులు కూడా ప్రస్తుతం ఎంతవరకు అందుబాటులో ఉన్నాయన్నది కూడా చెప్పలేం. తమ భూభాగంలో 60వేల హెక్టార్లను భారతదేశం ఆక్రమించుకుందనీ నేపాల్ గతంలో ఆరోపణలు చేసింది. ఈ రెండు దేశాల మధ్య ఉన్న సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోడానికి కమిటీని రూపొందించుకోవలనే ఆలోచనలు చేసినప్పటికీ, అది ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. క్రమేపీ, రెండు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలు కూడా తగ్గుతూ వస్తున్నాయి. ఎంతో చారిత్రక, సాంస్కృతిక బాంధవ్యాలున్న ఈ రెండు దేశాల మధ్య బంధాలు మరింత పెరగడానికి, అపార్థాలు, సమస్యల పరిష్కారానికి రెండు దేశాల అధినేతలు బలంగా ప్రయత్నం చేసి ఉండవల్సింది.కానీ, ఆశించిన స్థాయిలో జరుగలేదు. 1997లో ఇంద్రకుమార్ గుజ్రాల్, 2014లో నరేంద్రమోదీలు మాత్రమే

ప్రధానమంత్రి హోదాలో నేపాల్ ను ఈ మధ్యకాలంలో సందర్శించారు. నేపాల్ ప్రస్తుత ప్రధాని శర్మ అధికారంలోకి వచ్చిన తర్వాత, చేసిన మొదటి విదేశీ పర్యటన కూడా భారతదేశమే కావడం గమనార్హం. ఇది 2018లో జరిగింది. ఇండో –నేపాల్ కమీషన్ ఏర్పాటుచేసుకొని, ప్రతి రెండేళ్ళకొకసారి సమావేశమై, పరస్పర ప్రయోజనాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలనే ఒప్పందం 1987లో జరిగింది. కానీ, ఇది కార్యరూపం ధరించలేదు. 2014లో నరేంద్రమోదీ నేపాల్ పర్యటన, 2018లో శర్మ ఓలి భారత్ పర్యటనల అనంతరం రెండు దేశాల మధ్య సంబంధ, బాంధవ్యాలు మెరుగుపడతాయని ఆశించాం. ఇప్పటికైనా చైనా కుయుక్తులకు లొంగకుండా, భారతదేశంతో నేపాల్ సత్ సంబంధాలు పెంచుకుంటే, ఆ దేశానికే ఎక్కువ ప్రయోజనం. ఉభయదేశ ప్రజలకూ ఆమోదయోగ్యం. కరోనా అంశంతో, ప్రపంచ దేశాలన్నీ చైనా పట్ల నమ్మకం కోల్పోతున్నాయి. భారతదేశం పట్ల విశ్వాసం పెంచుకుంటున్నాయి. ఇటువంటి దశలో, భారత్‌తో వియ్యమందుకోవడం శ్రేయస్కరం. చైనాను చూసుకొని, భారత్ తో కయ్యానికి దిగితే, భారీగా నష్టపోయేది నేపాల్ మాత్రమే. ఈ సత్యం అర్థమై, ఈ వివేకం నేపాల్ అధినేతలకు అలవాడాలని అభిలషిద్దాం. రెండు దేశాల మధ్య మైత్రి సాధించే దిశగా భారత్ అధినేత లు అడుగులు వేస్తారని ఆకాంక్షిద్దాం. చైనా ఈ పిచ్చి చేష్టలు మాని, భారతదేశం విలువ తెలుసుకొని ప్రవర్తించాలని కోరుకుందాం.

ఫెయిర్ అండ్ లవ్లీ పేరు మారుతుంది!!

- ప్రజామీడియా నెట్‌వర్క్



'ఫెయిర్ అండ్ లవ్లీ.. ఇక నిగారింపును ఇవ్వదు..' అంటూ అమ్మాయిలను అవాక్కయ్యేలా నటి యామీ గౌతమ్ యాడ్‌లో పలకరిస్తూ ఉంటుంది. అదేమంటే.. మామూలుగా నిగారింపును ఇవ్వకుండా హెచ్ డీ నిగారింపును ఇస్తుందంటూ ఆమె పంచ్ లైన్ చెబుతూ ఉంటుంది! జనాలకు ఈ ఫెయిర్నెస్ క్రీమ్‌తో ఉన్న అనుబంధం ఏమిటో చెప్పనక్కర్లేదు. ఇరవై, ఇరవై ఐదేళ్ల సంవత్సరాల నుంచి ఇండియాలో ఫెయిర్ అండ్ లవ్లీ ప్రభంజనం మొదలైంది. ఐదు రూపాయలకే అందుబాటులోకి పెట్టేసి ఇది అప్పటి యువతకు విపరీతంగా చేరువై పోయింది.

20 యేళ్ల కిందట, అమ్మాయిలు–అబ్బాయిలు ఈ ఫెయిర్ నెస్ క్రీమ్‌ను వాడటాన్ని ఎంతగా ఆస్వాధించారో తెలిసే ఉంటుంది. ఐదు రూపాయలకే అందుబాటులోకి రావడం అనేది మధ్యతరగతి యువతకు బాగా చేరువ చేసేసింది. అప్పట్లో కాలేజీకి బయల్దేరే ముందు ఈ క్రీమ్ వాడకుండా గడపదాటే టీనేజర్లు, డిగ్రీ కాలేజ్ స్టూడెంట్స్ ఉండరేమో! ఆ స్థాయిలో ఇది అల్లుకుపోయింది.


ఆ తర్వాత రకరకాల క్రీమ్‌లు వచ్చాయి. ఇండియాలో ఇది పెద్ద వ్యాపారం. తెల్లగా ఉండాలి, స్కిన్ ఫెయిర్‌గా కనిపించాలనే కోరిక భారతీయులకు ఎంతలా ఉంటుందో వివరించనక్కర్లేదు. ఐదు రూపాయల ఫెయిర్ అండ్ లవ్లీ షాషేతో మొదలు పెడితే.. వందల, వేల రూపాయల క్రీమ్‌లను వాడే వాళ్లు ఉన్నారు. అందరి లక్ష్యం ఒక్కటే, తెల్లగా కనిపించాలి, నిగారించాలి!

అందుకు తగ్గట్టుగా వీటి యాడ్స్ కూడా అలానే ఉంటాయి. నల్లగా ఉండే వారికి ఆత్మవిశ్వాసం ఉండదు, ఫెయిర్ అండ్ లవ్లీ పట్టించేసుకోగానే.. ఎయిర్ హోస్టెస్ అయిపోవచ్చు, క్రికెట్ కామెంటరేటర్‌గా రాణించేయవచ్చు అన్నట్టుగా దశాబ్దాల నుంచి యాడ్స్ దంచేస్తూ ఉన్నారు. ఇది ఒకరకంగా వర్ణ వివక్షను ప్రోత్సహించేది, నల్లని శరీర ఛాయతో ఉన్న వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేదే అని చెప్పనక్కర్లేదు. ఈ క్రీమ్ లు జనాలను తెల్లగా ఏం మారుస్తాయో కానీ, ఆ యాడ్స్ ఫెయిర్‌గా లేని వారి కాన్ఫిడెన్స్ ను మాత్రం దెబ్బతీస్తూ ఉంటాయి.

ఈ క్రమంలో వీటిపై విమర్శలు ఈనాటివి కావు. వీటిని ఎండోర్స్ చేసే హీరోయిన్ల మీద కూడా అనేక మంది దుమ్మెత్తిపోశారు. ఇక అంతర్జాతీయంగా ఈ తరహా వివక్షలపై ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో యూనీలీవర్ సంస్థ స్పందించింది. తమ ప్రోడక్ట్ అయిన ఫెయిర్ అండ్ లవ్లీ పేరు మార్చబోతున్నట్టుగా ప్రకటించింది. వేరే పేరును వెదుకుతున్నట్టుగా పేర్కొంది. అలాగే ఆ క్రీమ్ ఎప్పటిలానే అందుబాటులో ఉంటుందని, అయితే ఇక నుంచి వైట్, ఫెయిర్ నెస్ .. అనే మాటలను ఉపయోగించేది ఉండదని తెలిపింది. యూనీలీవర్‌కు చెందిన ఇతర ప్రోడక్ట్స్ విషయంలో కూడా రంగు విషయంలో వివక్షను చూపే అన్ని యాడ్స్‌కూ అడ్డుకట్ట వేయనున్నట్టుగా ప్రకటించింది!

తల్లి కూతుర్ల సైకాలజి

- యార్లగడ్డ ప్రసాద్



ఆడపిల్లకు కౌమారప్రాయం వచ్చినపుడు తల్లీకూతుళ్ల మధ్య గొడవలు చోటు చేసుకోవడం సాధారణమైన విషయం. ఇది హద్దుల్లో వున్నంతవరకు ఫర్వాలేదు కానీ, కొందరిలో శ్రుతి మించి, అమ్మాయి చెప్పినమాట వినని పరిస్థితి కూడా కొన్ని సందర్భాల్లో వస్తూంటుంది. అసలు ఇద్దరి మధ్య గొడవలు ఎందుకు రావాలి అనే ప్రశ్న వస్తుంది. దానికి కారణం అసూయ అంటారు సైకాలజిస్టులు. నిజమా అని ఆశ్చర్యపడవద్దు. మనమంతా మానవులం. మనకు తెలియకుండా లోపల ఎన్నో పొరలు వుంటాయి.

కూతురు కాస్త పెద్దదయిన కొద్దీ తల్లికి ఎటెన్షన్ తగ్గిపోతుంది. ఆవిడ నలభైలలోకి వస్తూ వుంటుంది కాబట్టి, తన అందంపై తనకు నమ్మకం సడల నారంభిస్తుంది. అదే సమయంలో కూతురు ఛెంగుఛెంగున తిరుగుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తూ వుంటే ఈవిడకు తెలియని అసూయ కలుగుతుంది. 'ఏవిటా వేషాలు, కుదురుగా ఓ చోట ఉండలేవూ, పైట సర్దుకో. ఎవరైనా చూస్తే నన్ను తిడతారు.' అంటుంది. ఎవరైనా కూతురి అందాన్ని మెచ్చుకుంటే సంతోషిస్తూనే, అలాటి మోడర్న్ డ్రెస్ వేసుకుంటే నేను ఇంకా అంతకంటె అందంగా వుంటాను అనుకుంటుంది.

కొన్ని కేసుల్లో కూతురు యుక్తవయసుకి వచ్చినా ఆమె కంటె తల్లి ఎక్కువ ఆకర్షణీయంగా వుంటుంది. అపరిచితులైన మగవారు ఆమెతో మాట్లాడడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. అప్పుడు కూతురికి తల్లిపై అసూయ పుడుతుంది. ఇంత వయసు వచ్చినా ఈ వేషాలేమిటి అంటూ తల్లి గురించి స్నేహితుల వద్ద, తన ఈడువారి దగ్గర వ్యాఖ్యానిస్తుంది. తల్లి సోషల్‌గా వుండి, నలుగురిలో తిరుగుతూ పేరు తెచ్చుకుంటూ వుంటే కూతురితో మానసిక సమస్యలు తప్పవు. చెప్పిన మాట వినదు, ఎప్పుడూ చికాగ్గా వుంటుంది. ఒకవిధమైన యిన్‌సెక్యూరిటీతో ఎప్పుడూ తల్లితో పోట్లాడుతూ వుంటుంది. తల్లిని తనకు పోటీదారుగా చూస్తుంది.

కొన్ని కుటుంబాలలో ఇంటి యజమాని కూతురిపై వల్లమాలిన ప్రేమ కనబరుస్తూ, ఆమె మాటకే విలువ ఇస్తూ భార్యను తీసిపారేస్తుంటాడు. హేళన చేస్తూ వుంటాడు కూడా. అది భార్యకు కష్టంగా తోస్తుంది. ముఖ్యమైన నిర్ణయాలలో తన మాటకు విలువ లేకపోవడం, కూతురి మాటే చెల్లడం చూసి భర్త ఆదరణ విషయంలో ఆమె కూతుర్ని పోటీదారుగా ఫీలవుతుంది. ఆమె కంటూ వేరే ఆదాయ వనరు లేనప్పుడు, భర్తదే మొత్తం పెత్తనం అయినప్పుడు యీ బాధ మరింతగా వుంటుంది. అందువలన అవకాశం దొరికినప్పుడు కూతుర్ని అకారణంగా విమర్శిస్తూ, అనవసరంగా కట్టడి చేయాలని చూస్తుంది, దానితో కూతురికి శత్రువై పోతుంది.

మెనోపాజ్ సమయంలో కొందరు స్త్రీలకు మానసిక సమస్యలు కూడా వస్తాయి. అదే సమయంలో కూతురిపై అసూయ కూడా కలిగిందంటే సమస్య మరింత జటిలమవుతుంది. పాశ్చాత్యదేశాల్లో చాలామంది మహిళలు వివాహమైన తర్వాత కూడా తల్లులు తమ పట్ల అసూయ కనబరచారని ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు మీకున్నన్ని అవకాశాలు మా టైములో మహిళలకు ఉండి వుంటే నేను యింకా మెరుగైన స్థితిలో ఉండేదాన్ని అనే ఫీలింగుతో తను సాధించినదానిని తల్లి తక్కువ చేసి మాట్లాడుతోందని వారు వాపోతున్నారు. నువ్వు ముందుకు సాగు, కానీ నన్ను దాటిపోయేటంతగా వెలిగిపోకు.. అని తల్లులు కూతుళ్లకు చెప్తున్నట్లుందని వారి అభిప్రాయం. మన దేశంలో కొన్నాళ్లకు ఈ పోలికా రావచ్చేమో.

గల్వాన్ అమరవీరుల కన్నీటి కథలు

- సి.హెచ్. వెంకటేష్, ఎమ్.ఎ. ఎం.ఫిల్, , బెంగళూరు



భారత్, చైనా సైని తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయ ప్రాంతంలో జూన్ 15వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణలో 20 మంది భారతీయ సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

వీరిలో ఎక్కువ మంది బిహార్ రెజిమెంట్‌కు చెందినవారు.

మొదట ముగ్గురు సైనికులు మరణించినట్లు సమాచారం వెల్లడైంది. తీవ్రగాయాలపాలైన మరో 17 మంది కూడా మరణించినట్లు ఆ తర్వాత భారత సైన్యం స్వయంగా ప్రకటించింది.

ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల వివరాలివే...

కల్నల్ సంతోష్ బాబు

కల్నల్ బికుమల్ల సంతోష్ బాబు, తెలంగాణ

16-బిహార్ రెజిమెంట్‌లో కమాండింగ్ ఆఫీసర్ సంతోష్ బాబు నేతృత్వం వహిస్తున్న దళంతోనే గల్వాన్ లోయలో చైనా సైనికులు ఘర్షణకు దిగారు.

సంతోష్ బాబుది తెలంగాణలోని సూర్యాపేట. పూర్తిగా ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంతిమ సంస్కారాలు జరిగాయి. కరోనావైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆయన అంతిమ సంస్కారాలకు 50 మంది మాత్రమే హాజరయ్యేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ, సంతోష్ బాబుకు అంతిమ వీడ్కోలు పలికేందుకు వందల సంఖ్యలో జనం ఆయన నివాసానికి వచ్చారు.

సంతోష్ బాబు వయసు 37 ఏళ్లే. 1982లో ఆయన జన్మించారు.

రాబోయే సెప్టెంబర్‌లో సంతోష్ బాబు సూర్యాపేట రావాల్సి ఉందని ఆయన తండ్రి ఉపేందర్ చెప్పారు.

అనుకోకుండా జరిగిన ఈ ఘటన గురించి సంతోష్ బాబు భార్యకు ఫోన్ ద్వారా సైన్యం నుంచి సమాచారం అందింది. వారి కుటుంబమంతా శోక సంద్రంలో మునిగిపోయింది.

సంతోష్ బాబుకు భార్య మంజుల, కూతురు అభిజ్ఞ, కుమారుడు అనిరుధ్ ఉన్నారు.

సంతోష్ బాబు చైనా సరిహద్దుల్లో ఏడాదిన్నరగా విధుల్లో ఉన్నారు

గణేశ్ రామ్ కుంజామ్, ఛత్తీస్‌గఢ్

2011లో గణేశ్ కుంజామ్ సైన్యంలో చేరారు. నక్సల్ ప్రభావిత ప్రాంతమైన బస్తర్‌లో సైన్యం భర్తీ శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు ఆయన ఎంపికయ్యారు.

బస్తర్‌లోని కొంకెర్‌లో ఉన్న కుకుర్‌టోలాలో కుంజామ్ ఇల్లు ఉంది. ఆయన పెళ్లి జనవరిలో ఖాయమైంది. ఆయన సెలవుపై ఇంటికి రావాల్సి ఉంది.

కుంజామ్‌కు ఇద్దరు తోబుట్టువులు. వారిలో ఒకరికి వివాహమైంది.

కుంజామ్ మరణం సమాచారం ఆయన చిన్నాన్న తిహాడూకు ఫోన్ ద్వారా అందింది.

నెలల రోజులుగా ఇంట్లోవారితో కుంజామ్ ఫోన్‌లో కూడా మాట్లాడలేదు.

కే పలనీ, తమిళనాడు

పలనీది తమిళనాడులోని మధురైలో ఉన్న కడూకలూరు గ్రామం. కాలేజీ చదువు మధ్యలోనే ఆపేసి ఆయన సైన్యంలో చేరారు. అప్పుడు ఆయన వయసు 18 ఏళ్లే.

ఆ తర్వాత కరెస్పాండెన్స్ కోర్సులో బీఏ డిగ్రీ పూర్తి చేశారు.

పలనీ కుటుంబం కొత్త ఇల్లు కట్టుకోవడంతో ఇటీవల గృహ ప్రవేశం కార్యక్రమం చేసుకుంది. దీనికి పలనీ రాలేకపోయారు.

ఇదే నెలలో పలనీ పుట్టిన రోజు ఉందని, చివరి సారిగా ఆయన ఆ రోజే ఇంట్లోవారితో మాట్లాడారని పలనీ తమ్ముడు ఇదయకనీ చెప్పారు.

ఇదియకనీ కూడా సైన్యంలోనే ఉన్నారు. ఇప్పుడు ఆయన రాజస్థాన్‌లో విధుల్లో ఉన్నారు.

తాను సైన్యంలో చేరేందుకు సోదరుడే స్ఫూర్తి అని ఇదయకనీ చెప్పారు.

"చివరగా మాట్లాడినప్పుడు లద్దాఖ్ సరిహద్దు వైపు వెళ్తున్నామని, అక్కడ నెట్‌వర్క్ సమస్య ఉంటుందని చెప్పారు. ఆయన మరణం మా కుటుంబానికి తీరని నష్టం. మా వదిన, వాళ్ల ఇద్దరు పిల్లల పరిస్థితి తలచుకుంటే బాధగా ఉంది" అని అన్నారు.

కుందన్ ఓఝా, ఝార్ఖండ్

మూడేళ్ల క్రితమే కుందన్‌కు వివాహమైంది. 20 రోజుల క్రితమే ఆయనకు కూతురు జన్మించింది. ఆ పాపను ఇంకా కుందన్ చూడనేలేదు.

కుందన్‌ది ఝార్ఖండ్‌లోని సాహెబగంజ్ జిల్లాలోని శాహ్‌పుర్. 2011లో ఆయన సైన్యంలో చేరారు.

గణేశ్ హాంసదా, ఝార్ఖండ్

22 ఏళ్ల గణేశ్ హాంసదా సైన్యంలో చేరిన వెంటనే లేహ్‌లో విధుల్లో నిర్వర్తించాల్సి వచ్చింది. హైదరాబాద్‌కు ఆయన బదిలీ కావాల్సి ఉంది. అయితే, కరోనావైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆ బదిలీ నిలిచిపోయింది.

గణేశ్‌ది ఝార్ఖండ్‌లోని తూర్పు సింహభూమ్ జిల్లాలోని బహరాగోడాలో ఉన్న కోసాపాలియా గ్రామం.

గత ఫిబ్రవరిలో గణేశ్ సెలవుపై తమ ఊరికి వచ్చారని ఆయన సోదరుడు దినేశ్ హాంసదా చెప్పారు.

అమన్ కుమార్ సింగ్, బిహార్

25 ఏళ్ల అమన్‌కు గత ఫిబ్రవరి 27న వివాహమైంది.

"త్వరలోనే తిరిగివస్తా అని చెప్పారు. ఆయనకు లేహ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఆయన ఎప్పటికీ తిరిగి రారు" అంటూ అమన్ భార్య మీనూ దేవి రోధించారు.

"మాకు ప్రభుత్వంపై ఎలాంటి ఫిర్యాదూ లేదు. దేశ సేవలో మా కొడుకు ప్రాణ త్యాగం చేశారు. ఇంతకన్నా గర్వించే విషయం ఏముంటుంది? మా కొడుకు కాబట్టి, బాధ ఎలాగూ ఉంటుంది" అని అమన్ తండ్రి సుధీర్ అన్నారు

కుందన్ కుమార్ యాదవ్, బిహార్

కుందన్‌ది సహర్సాలోని ఆరణ్ గ్రామం. ఆయన తండ్రి ఒక రైతు.

కుందన్‌కు భార్య బేబీ దేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుల్లో ఒకరి వయసు ఆరేళ్లు, ఇంకొకరికి నాలుగేళ్లు. కుందన్ నాలుగు రోజుల క్రితమే తమతో ఫోన్‌లో మాట్లాడారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

సునీల్ కుమార్, బిహార్

సునీల్ కుమార్ పట్నా జిల్లాలోని సికరియాలో ఉన్న తారాపూర్ గ్రామం. 2002లో ఆయన సైన్యంలో చేరారు. సునీల్ తండ్రి బాధతో ఏమీ మాట్లాడే స్థితిలో లేరు. లాక్‌డౌన్ కారణంగా సునీల్ ఇంటికి రాలేకపోయారని ఆయన తల్లి అన్నారు.

సునీల్ భార్య రీతీ దేవి, వారి ముగ్గురు పిల్లలు దానాపూర్‌లో ఉంటున్నారు. సునీల్, రీతీల కూతురు ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇద్దరు కుమారుల్లో ఒకరు ఆరో తరగతి, ఇంకొకరు యూకేజ

చందన్ కుమార్, బిహార్

చందన్ కుమార్ వయసు 24 ఏళ్లు. రెండేళ్ల క్రితమే సైన్యంలో చేరారు. ఆయనది జగదీశ్‌పుర్‌లోని జ్ఞానపుర్ గ్రామం. నాలుగు నెలల క్రితమే గ్రామానికి వచ్చి వెళ్లారు. చందన్ తండ్రి హృదయానంద్ సింగ్ రైతు. ఆరు రోజులుగా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడలేదు.

చందన్ మరణం గురించి మంగళవారం రాత్రి సైన్యం నుంచి హృదయానంద్‌కు ఫోన్ వచ్చింది. కానీ ఆయన ఆ ఫోన్ ఎత్తలేదు. మరుసటి రోజు ఉదయం వారికి సమాచారం తెలిసింది.

జయ్ కిశోర్ సింగ్, బిహార్

జయ్ కిశోర్ సింగ్ వయసు 22 ఏళ్లు

జయ్ కిశోర్ సింగ్‌ది వైశాలి జిల్లాలోని చకఫ్తుహ్ గ్రామం. ఆయన అవివాహితుడు. తండ్రి పేరు రాజ్ కపూర్ సింగ్.

"ఓ నెల క్రితం అతడి నుంచి ఫోన్ వచ్చింది. ఎత్తైన ప్రాంతంలోకి వెళ్తున్నానని, అక్కడ ఫోన్ సిగ్నల్ ఉండదని చెప్పాడు. తిరిగి వచ్చాక ఫోన్ చేస్తానని అన్నాడు" అని రాజ్ కపూర్ సింగ్ చెప్పారు.

మళ్లీ జయ్ కిశోర్ నుంచి ఇంటికి ఫోన్ రాలేదు. బుధవారం ఉదయం 9 గంటలకు వారికి ఆయన మృతి వార్త తెలిసింది.

2018లో జయ్ కిశోర్ సైన్యంలో చేరారు. ఆయన సోదరుడు నంద కిశోర్ కూడా సైన్యంలోనే ఉన్నారు. సిక్కింలో విధులు నిర్వర్తిస్తున్నారు.

బిపుల్ రాయ్, పశ్చిమ బెంగాల్

బిపుల్ రాయ్ స్వస్థలం పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌దువార్. కొన్నేళ్ల క్రితమే ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌కు మారారు.

ఓ నెల క్రితమే లేహ్‌లో బిపుల్‌కు పోస్టింగ్ వేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు. చివరగా డిసెంబర్‌లో ఆయన సెలవుపై ఇంటికి వచ్చారని తెలిపారు.

బిపుల్‌కు భార్య, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు

రాజేశ్ ఓరంగ్, పశ్చిమ బెంగాల్

రాజేశ్ ఓరంగ్ 2015లో సైన్యంలో చేరారు. ఆయనది బీర్‌భూమ్ జిల్లా.

కుటుంబ సభ్యులు ఆయనకు ఈ ఏడాది పెళ్లి చేయాలనుకున్నారు. దాదాపు పెళ్లి ఖాయం చేసుకున్నారు. ఇంతలోనే రాజేశ్ మరణవార్తను వాళ్లు వినాల్సి వచ్చింది.

గత వారం రాజేశ్ తనకు ఫోన్ చేశారని ఆయనకు వరుసకు సోదరుడయ్యే అభిజీత్ చెప్పారు.

"పైకి వెళ్తున్నా అని నాతో చెప్పాడు. పర్వతాల పైకి వెళ్లడం గురించి అలా మాట్లాడాడు. కానీ, పైనున్న స్వర్గానికి వెళ్తాడని ఎవరికి తెలుసు" అని ఆయన చెప్పారు.

"కొడుకు చనిపోయాడని బాధ ఉన్నా, దేశం కోసం అమరుడయ్యాడని గర్వంగానూ ఉంది. ప్రభుత్వం చెంపపెట్టు లాంటి బదులు ఇవ్వాలి. అప్పుడే అమరుల కుటుంబాలకు మనశ్శాంతి" అని రాజేశ్ తండ్రి సుభాష్ అన్నారు

దీపక్ కుమార్, మధ్యప్రదేశ్

దీపక్ కుమార్ సెలవుపై రీవాలోని తన ఇంటికి రావాల్సి ఉంది. కానీ, కరోనావైరస్ వ్యాప్తి వల్ల ఆయన సెలవు రద్దైపోయింది.

చివరగా తనతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు లాక్‌డౌన్ ముగియగానే ఇంటికి వస్తానని దీపక్ చెప్పారని ఆయన నానమ్మ అన్నారు.

దీపక్‌కు తల్లి లేరు. ఆయన్ను నానమ్మే పెంచి పెద్ద చేశారు.

"ఇప్పుడు లాక్‌డౌన్ ముగిసింది. మా దీపక్ కూడా కనుమరుగయ్యాడు" అని ఆమె బాధపడ్డారు.

చంద్రకాంత ప్రధాన్, ఒడిశా

చంద్రకాంత ప్రధాన్‌కు 28 ఏళ్లు. ఆయనది కంధ్‌మాల్ జిల్లాలోని బైరపంగా గెన్ గ్రామం. 2014లో ఆయన సైన్యంలో చేరారు.

చంద్రకాంత ఆదివాసీ వర్గానికి చెందినవారు. ఆయనకు తల్లి, తండ్రి, ఇద్దరు తమ్ముళ్లు, ఓ అక్క ఉన్నారు. కుటుంబంలో సంపాదించేది చంద్రకాంత ఒక్కరే.

ఇప్పుడు ఆయన మరణంతో ఆ కుటుంబానికి ఆధారం లేకుండా పోయింది.

నందురామ్ సోరెన్, ఒడిశా

నందురామ్ సోరెన్ సైన్యంలో చేరి చాలా ఏళ్లు గడుస్తోంది.

12వ తరగతి పాస్ అయిన వెంటనే 1997లో ఆయన సైన్యంలో జవానుగా చేరారు. ఆయనది మయూర్‌భంజ్ జిల్లాలోని రాయరంగపుర్‌లో ఉన్న చంపువాడ గ్రామం.

నందురామ్ వయసు 43 ఏళ్లు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు

గుర్విందర్ సింగ్, పంజాబ్

గుర్విందర్ సింగ్ వయసు 22 ఏళ్లే. ఆయన సంగరూర్ జిల్లాలోని లోలేవాలా గ్రామానికి చెందినవారు. గుర్విందర్ రెండున్నరేళ్ల కిందటే సైన్యం చేరారు. ఆయనది 3-పంజాబ్ రెజిమెంట్. గుర్విందర్‌కు పెళ్లి చేసేందుకు ఇంట్లో వాళ్లు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే అనుకోకుండా ఆయన ప్రాణాలు కోల్పోయారు.

గుర్విందర్‌ది వ్యవసాయ కుటుంబం. గత నవంబర్‌లో ఆయన స్వగ్రామానికి వచ్చి, మూడు రోజులు ఉండి వెళ్లారు. 20 రోజుల క్రితం చివరగా ఆయన ఇంట్లోవారితో ఫోన్‌లో మాట్లాడారు

సత్నమ్ సింగ్, పంజాబ్

సత్నమ్ సింగ్ 3-పంజాబ్ రెజిమెంట్‌కు చెందినవారు. ఆయనది గురుదాస్‌పుర్.సత్నమ్‌కు తల్లి, తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు

సత్నమ్ తండ్రి కూడా ఇదివరకు సైన్యంలో పనిచేశారు. ఆయన సోదరుడు సుఖ్‌చైన్ సింగ్ ఇప్పుడు సైన్యంలోనే ఉన్నారు. తాను ఎక్కడ విధులు వేస్తున్నారో సత్నమ్ సింగ్ కుటుంబ సభ్యులకు చెప్పలేదు.

మన్‌దీప్ సింగ్, పంజాబ్

మన్‌దీప్ సింగ్ 1998లో సైన్యంలో చేరారు. ఆయన పటియాలా సమీపంలోని సీల్ గ్రామానికి చెందినవారు. మన్‌దీప్ సింగ్‌కు తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వితంతువులైన ఇద్దరు సోదరీమణుల భారం కూడా మందీప్‌పైనే ఉండేది. మన్‌దీప్ మరణంతో ఇప్పుడు వారంతా ఆధారం కోల్పోయారు.

గురుతేజ్ సింగ్, పంజాబ్

గురుతేజ్ మనసా సమీపంలో బెరేవాల్ డోగ్రా గ్రామానికి చెందివారు. ఆయన వయసు 20 ఏళ్లే. జూన్ 15న గురుతేజ్ అన్న పెళ్లి జరిగింది. చైనాతో సరిహద్దుల్లో ఘటనల నేపథ్యంలో ఆయన సెలవు రద్దైంది. ఇంటి ముందు ఒక సోదరుడి కోసం వేసిన టెంట్, మరో సోదరుడి అంత్యక్రియలకు అలాగే వాడాల్సి వస్తుందని ఆ కుటుంబంలో ఎవరూ ఊహించలేదు. సంబరాల్లో ఉన్న ఆ కుటుంబం సంతోషం అంతా ఒక్క ఫోన్ కాల్‌తో దూరమైపోయింది.

అంకుర్ ఠాకుర్

అంకుశ్ ఠాకుర్, హిమాచల్ ప్రదేశ్, అంకుశ్ వయసు 21 ఏళ్లు. వారి కుటుంబంలో ఆయన మూడో తరం సైనికుడు. అంకుశ్ తండ్రి, తాత కూడా సైన్యంలో పనిచేశారు. ఏడాదిన్నర క్రితమే అంకుశ్ సైన్యంలో చేరారు. సియాచిన్‌లో పోస్టింగ్ పూర్తైన తర్వాత ఆయన హమీర్ పుర్‌లోని తన ఇంటికి సెలవుపై రావాల్సి ఉంది. కానీ, కొన్ని రోజుల క్రితమే ఆయన లద్దాఖ్ వెళ్లారు. అక్కడి నుంచి తొందర్లోనే ఇంటికి వస్తానని తన తండ్రికి ఫోన్‌లో చెప్పారు. అంకుశ్ తండ్రి సైన్యం నుంచి ఇటీవల రిటైర్‌రయ్యారు. సియాచిన్‌లో అంకుశ్ తొలి పోస్టింగ్ ముగిసి ఇంటికి చేరుకున్నాక, అన్నీ కలిపి విందు చేసుకుందామని ఆ కుటుంబం ప్రణాళికలు వేసుకుంది.

ఇంతలోనే వారు ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది.

బోర్డర్ టెన్షన్ వెనుక అసలు కారణాలు ఇవేనా..?

- టి.దినకర్

రెండు దేశాల నడుమ అకస్మాత్తుగా మంటలు ప్రజ్వరిల్లడానికి కారణాలు అనేకం ఉంటాయి... అవి పైకి కనిపించవు... విదేశాంగ విధానాలు అంత తేలికగా అంతుపట్టేవి కావు... ఒక పుల్ల ఇటు నుంచి అటు జరిగినా సరే, అది యాదృచ్ఛికం అయి ఉండదు... దాని వెనుక ఏదో కథ ఉంటుంది... మరి ఇండియా– చైనా నడుమ ఈ ఉద్రిక్తతల మాటేమిటి..? ఈ ప్రాణనష్టాలేమిటి...?

అత్యంత ఎత్తయిన ఈ సరిహద్దులో వ్యూహాత్మక ప్రాంతాల్లో పట్టు కోసం ఇండియా– చైనా పట్టు దలలే ఈ తాజా ఉద్రిక్తతలకు కారణమా..?

రాబోయే రెండుమూడు రాష్ట్రాల ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి బీజేపీ ఇలా చైనాతో ఉద్రిక్తతల్ని పెంచేస్తోందా..?

సరిహద్దుల దాకా యుద్ధసామగ్రి చేరవేతకు... చైనాకు దీటుగా ఇండియా రోడ్లు, వంతెనల్ని, ఎయిర్ స్ట్రిప్పుల్ని నిర్మించడం చైనాకు ఇష్టం లేకపోవడమా..?

ఆక్సాయ్ చిన్ కూడా మాదే, దాన్ని కూడా విముక్తం చేస్తాం అనే బీజేపీ ప్రభుత్వ ప్రచారాల్ని చైనా కౌంటర్ చేసే ప్రయత్నమా..?

రెండు దేశాల్లోనూ అంతర్గత వైఫల్యాలు, సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించటానికి రెండు దేశాల పెద్దలూ ఆలోచిస్తున్నారా..?

ఇలాంటి కారణాల్ని బోలెడు వినిపిస్తున్నారు చాలామంది... కానీ ఇంతకుమించినవే ఉండి ఉంటాయి... బహుశా ఏమై ఉంటాయవి..? 45 ఏళ్ల తరువాత ఎందుకిలా హఠాత్తుగా రెండు దేశాలూ సంయమనం కోల్పోతున్నాయి...?


వాస్తవాధీన రేఖను దాటి ఇండియా తన ఆధీనంలో ఉన్న ఆక్సాయ్ చిన్ పునః స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తుందని చైనా ఏమీ భావించడం లేదు...

సరిహద్దుల దాకా ఇండియా రోడ్లు వేసినా, మౌలిక వసతులు పెంచుకున్నా చైనాకు పెద్ద నష్టమేమీ లేదు... అది ఇరువైపులా జరిగేదే...

కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం.... ఇండియా కొన్ని పాశ్చాత్య దేశాల వ్యూహాత్మక సైనిక కూటమిలో చేరుతోంది... ప్రత్యేకించి అమెరికా...! చిరకాల దోస్త్, నమ్మకమైన దోస్త్ రష్యాతో అంటీముట్టనట్టుగా ఉంటూ... ఇండియా అమెరికా కూటమి వైపు వేగంగా అడుగులు వేస్తోంది... ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్, అమెరికా, కొరియా తదితర దేశాల కూటమితో చైనాకు పడదు... ప్రత్యేకించి అమెరికాను తొక్కేసి, ప్రపంచ అగ్రశక్తిగా ఎదగాలనుకునే చైనాకు ప్రధాన అడ్డంకి అమెరికాయే... ఆ అమెరికాతో ఇండియా దోస్తానా పెరగడం చైనాకు ససేమిరా నచ్చడం లేదు...

అమెరికాతో సాగే ఆర్థిక, దౌత్య యుద్ధాలు ఇంకా పెరగనున్నాయి... ఈ దశలో ఇండియా అమెరికా కూటమిలో చేరడం చైనాకు కంటగింపుగా ఉంది... అందుకే కాస్త తగ్గు బ్రదర్ అని బెదిరించటానికి, ఝలక్ ఇవ్వటానికి చైనా ప్రయత్నిస్తోంది... అదే సమయంలో శ్రీలంక మీదుగా గ్వదార్ పోర్టు దాకా చైనా నిర్మించే మారిటైమ్ రూట్.., వన్ రోడ్ వన్ బెల్ట్ ప్రాజెక్టుగానీ ఇండియాకు ఇష్టం లేవు... అందుకని ఇండియా నేరుగా దక్షిణ చైనా సముద్ర రాజకీయాల్లో వేలుపెడుతోంది... చైనాకు పడని దేశాలకు సపోర్ట్ చేస్తోంది... అంతేకాదు, ఆస్ట్రేలియాతో కలిసి అక్కడ మనం ఓ స్థావరాన్నే ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నాం... ఇలా చైనా వాడు మన పెరట్లో వంట పెడితే... మనం ఏకంగా వాడి వాకిట్లోనే మంటపెడుతున్నాం...


పాకిస్థాన్‌కు మద్దతు, చైనా ప్రాజెక్టులపై మన అభ్యంతరాల్ని చైనా పట్టించుకోకపోవడం... ప్రత్యేకించి హిందూ మహాసముద్ర వాణిజ్యమార్గంలో చైనా తన ఆధిపత్యాన్ని పెంచుకునే ప్రయత్నాలు ఇండియాకు అస్సలు నచ్చడం లేదు... అందుకే తనూ చైనాకు ఝలక్ ఇవ్వాలని భావిస్తోంది... ఓసారి చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్ బెదిరింపు పూర్తిగా అమెరికాపైనే కాన్సంట్రేట్ అయి ఉంది గమనించండి... సో, ఏతావాతా గమనించాల్సింది ఏమిటంటే..? ఈ ఉద్రిక్తతలకు అసలు కారణాలు వేరే ఉంటాయి... పైకి జనం కోసం చెప్పేవి, చూపించేవి, చదివించేవి వేరే ఉంటాయి... దీనికితోడు సెన్సేషనలిజమే ప్రధానంగా అడుగులు వేసే మన మీడియా సరేసరి... దేశభక్తి, జాతీయతాభావం ఎక్స్‌ట్రా ఇండియాలో ఎంత ఉంటుందో, చైనాలోనూ అంతే ఉంటుంది... కాకపోతే మన దేశం ఖర్మ ఏమిటంటే..? ఎవరుపడితేవారు దీన్ని రాజకీయం చేయడం... ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేయడం... ఈ విషయంలో చైనా లక్కీ... చాలా నయం... ఇండియాలో కేంద్ర ప్రభుత్వం ఏకకాలంలో బయటి శత్రువుతో పోరాడాలి, ఇంటి ప్రత్యర్థితో పోరాడాలి... అవునూ, చివరకు ఏమవుతుంది..? పూర్తి స్థాయి యుద్ధం వస్తుందా..? ఈ ప్రశ్నకు ప్రస్తుతానికి సమాధానం.... రాదు...!!



నాన్నంటే నాన్నే

-వై.శర్మ

పెళ్ళిబట్టలు కొందామనుకొన్నప్పుడు పెళ్లాంబిడ్డలతో సమానంగా– నాకూ కావాలి అని పోటీపడే నాన్నలను మనం చూసి ఉండం. నాన్నకు ఆ ఆలోచనే రాదు. 'పట్టుబట్టలు ఎందుకురా, పంచె కండువా చాలు నాకు' అని సరిపెట్టేసుకుంటాడు కాబట్టే, నాన్న ఎప్పుడూ వెనకే ఉండిపోతాడు. అంతమాత్రాన నాన్న ఆటలో అరటిపండో, కూరలో కరివేపాకో కాదు సుమా– అన్నారో వచనకవి. 'నాన్న వెనకబడ్డాడు– ఎందుకంటే వెన్నెముకగా నిలబడ్డాడు కాబట్టి' అని తేల్చారు. లాలన, దీవెన కలగలిస్తే– అమ్మనాన్న అవుతాయి. మొదటిది బహిరంగం, రెండోది గుంభనం. మొదటిదాని విస్తీర్ణం ఎక్కువ. రెండోది గంభీరమైనది, లోతెక్కువ. అందుకే అర్థం చేసుకోవడం కష్టం. 'కథల దీవులంట నాన్న తిప్పినదే తెలుసుగాని, నాలో సృజనకు రెక్కలు కడుతున్నది తెలియలేదు... ఈత కొరకు నాన్న నీట నెట్టినదే తెలుసుగాని, నా తెగువకు ఉగ్గుపాలు పడుతున్నది తెలియలేదు' అని గజల్ కవి రెంటాల కలత చెందడానికి కారణం అదే. నాన్నలం అయ్యేదాకా నాన్న గురించి తెలియకపోవడం జీవితంలో విషాదం. ఆరుద్ర చెప్పినట్లు 'నాన్నగారికి చాలు వంకాయకూర' అనుకొంటూ, ఆయన్ను చాలా ఇళ్లలో ద్వితీయశ్రేణి పౌరుడిగా పరిగణిస్తారు. నాన్నను ఆప్తవాక్యమని, గుప్తధనమని గుర్తించినవారు– చిట్టివలస బులుసుకవి లాగే 'తన గుండెన్ మృదుశయ్యగా మలచి, అమ్మ రూపమున ప్రేమ ఆత్మీయతన్ పంచి, మూపున బంగారపు ముద్దయన్నటుల రేపున్ మాపులన్ మోచి పెంచిన'నాన్నకు కృతజ్ఞతా పురస్కారంగా 'పద్యమై అలరుతన్ చిందాడు మత్ బాష్పముల్' అనుకొంటూ కన్నీటితో కాళ్లు కడుగుతూనే ఉంటారు. అమ్మలో నాన్నను, నాన్నలో అమ్మను– వారిద్దరిలో పార్వతీపరమేశ్వరులను దర్శించి పూజించి తరించడం... జన్మకు దక్కే ఉత్తమోత్తమ సౌభాగ్యం. తాను చేయిపట్టి నడిపించిన చిటికెనవేలు తనకే ఊతంగా మారడం తండ్రికి గర్వం!



మహాభారతంలో యక్షుడు 'నింగికన్నా ఉన్నతుడు ఎవరు?' అని అడిగితే 'ఆక సంబు కంటె పొడవు జనకుడు అరయ' అని ధర్మజుడు బదులిచ్చాడు. అది పాండురాజు గురించి ఆయన పెద్దకొడుకు చెప్పిన మాట కాదు, లోకంలో తండ్రి స్థానం అంతటిదని వ్యాసుడిచ్చిన తీర్పు! 'దేహం తండ్రి ప్రసాదం' అని వేదం స్పష్టంగా చెప్పింది. 'పురుషే హవా అయిమదితో గర్భో...' అంటూ మొదలయ్యే ఐతరేయ మం త్రం తండ్రిని బింబంగా, తనయుణ్ని ప్రతిబింబంగా వివరించింది. 'ఆత్మావై పుత్రనామాసి...' భార్య గర్భాన తానే పుత్రుడై పుడతాడని శ్రుతి పేర్కొంది. 'నా జీవం నా సారం చీల్చి చూసుకుంటెగాని, నాన్న ఇలా నేనై నిలబడి ఉన్నది తెలియలేదు' అన్న కవివాక్కుకు తాత్పర్యం అదే! పెద్దలను కలిస్తే 'మీ తండ్రిగారెవరు?' అని అందుకే అడుగుతారు. నాన్నంటే... వాన ముసురులో దిట్టమైన గొడుగు... మండుటెండలో చల్లని చెట్టునీడ... వణికించే చలిపొద్దుల్లో నునువెచ్చని రగ్గు! నాన్నంటే– అక్షరాభ్యాసం రోజున నల్లని పలకపై దిద్దిన తెల్లని ఓనమాలు. విద్యావంతుణ్ని చేస్తానన్న హామీపత్రంపై ఆకుపచ్చని చేవ్రాలు... నాన్నంటే... రాముడికోసం ఏడ్చి ఏడ్చి కన్నుమూసిన దశరథ'మహారాజు'... శకుంతలపై బెంగతో కంటతడి పెట్టిన కణ్వ'మహర్షి'... కొడుకు పోయాడని వినగానే నిలువునా కూలిపోయిన ద్రోణ'ఆచార్యుడు'. భగవంతుణ్ని 'తండ్రీ' అని సంబోధించడం భారతీయ సంస్కృతికి పాపిట సిందూరం. అలా రాజు, రుషి, గురువు, దైవం... అన్నీ అయిన నాన్నను ఏడాదికోసారైనా మనసారా స్మరించడానికే– పెద్దలు ఈ 'నాన్నలరోజు'ను నిర్దేశించారు. 'నా తండ్రికి పరమ భక్తాగ్రగణ్యుడైన పుత్రుడనేను' అని గర్వంగా ప్రకటించుకొన్నారు కల్పవృక్షంలో విశ్వనాథ. తిరిగి రాముడి నోట 'దశరథరాజు బిడ్డలని ధారుణి మమ్మును గౌరవించు' అని చెప్పించారు. అదే పిల్లలకు చేరవలసిన సందేశం.

చైనా విజన్ - 2050

- డా॥ కిరణ్ బాబు, పి.హెచ్.డి



భారత్ – చైనాల మధ్య ప్రస్తుతం సామరస్య వాతావరణం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ, చైనా విషయంలో మనం ఎప్పటికీ అప్రమత్తంగానే ఉండాలి. లడాఖ్ సరిహద్దుకు సంబంధించి నెలకొని ఉన్న ప్రతిష్టంభనకు ఇరు దేశాలు శాంతియుతంగానే పరిష్కరించుకుంటాయి. దౌత్యపరమైన ఒప్పందాలే దీనికి మార్గాలు వేస్తాయి. నిజం చెప్పాలంటే? రెండు దేశాలకు యుద్దానికి తలపడాలనే ఆలోచనలు లేనేలేవు. ఇదంతా చైనా ఆడుతున్న పెద్దనాటకం. టిబెట్, లడాఖ్‌లు పై సర్వహక్కులు తామే పొందాలన్నదే చైనా ఆలోచనా విధానం. ఈ అంశంలో చైనాకు రెండవ ఆలోచన అన్నది లేనేలేదు. ఎప్పటికైనా భారత్‌కు చైనాతో ఇబ్బందులే వస్తాయి. మన సరిహద్దుదేశాలు, ఆ పక్క దేశాలు దాదాపుగా అన్నింటినీ చైనా తన కబంధ హస్తాల్లోకి తీసుకెళ్లింది. శ్రీలంక, నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, వియత్నాం, లావోస్, మాల్దీవులు, మయన్మార్ మొదలైన దేశాలన్నీ చైనా కనుసన్నల్లోనే ఉన్నాయి. ఈ దేశాలన్నింటినీ అనేక రకాలుగా ఎరవేసి, చైనా లాక్కుంది. భూటాన్ ఒక్కటే మనవైపు ఉంది. ప్రపంచంలోని అనేక ఖండాలనూ తనవైపు తిప్పుకొనే పనిలోనే చైనా ఉంది. ఆసియా, ఆఫ్రికాలోని కమ్యూనిస్ట్ దేశాలన్నీ ఏకం చేసి, వాటికి అగ్రాసనాధిపతిగా ఉంటూ చక్రం తిప్పాలని, ఆ దేశపు ప్రధాన వ్యూహం.కోవిడ్ కూడా అనుమానాస్పదమైన మారణాయుధంగానే భావించాలి. ముఖ్యంగా అమెరికా, ఇండియా లక్ష్యంగా చైనా చేసిన సృష్టిగానే అనుమానించాలి. భిన్న సంస్కృతులు, మతాల సమ్మేళనంగా ఉన్న భారతదేశంలో అంతర్గతంగా వైషమ్యాలు, అలజడులు, అశాంతి సృష్టించాలనే దురాలోచనలు చైనాకు ఉన్నట్లుగానే భావించాలి.అమెరికా విషయంలో కూడా అదే తీరు.తెల్లవారు – నల్లవారి మధ్య అలజడులు సృష్టించి, దూరం పెంచాలనే ఎత్తుగడల పన్నాగంలో ఉందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేక సార్లు వ్యాఖ్యానించారు.ఆర్యులు– ద్రావిడులు, దళితులు – దళితేతరులు, జమ్మూ –కాశ్మీరులు, ఈశాన్య రాష్ట్రాలు– కేంద్ర భారతం, ఇలా 5 రకాలుగా భారతదేశీయులను విడదీయాలనే కుయుక్తుల్లో చైనా ఉందని విశ్లేషకుల అంచనా. 2049 కల్లా ఆసియా ఖండంలోని 15 దేశాలపై తన గుత్తాధిపత్యాన్ని సాధించాలన్నదే చైనా లక్ష్యం. బ్రునై దారుసులం, కంబోడియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, లావోస్, మలేసియా, మయన్మార్, సింగపూర్, థాయిలాండ్, వియత్నాం మొదలైన దేశాలను అసోసియేషన్ అఫ్ సౌత్ ఈస్ట్ ఆసియన్ నేషన్స్ (ఆసియన్) అంటారు. బ్రిటిష్ వాళ్ళు గతంలో దేశాలను ఆక్రమించు కోవాలనుకున్నారు. ఇంతకు నాలుగుఆకులు ఎక్కువ తిని, చైనా ఖండాలను ఆక్రమించుకోవాలనే దాహంలో ఉంది. ఇది నియో వలసవాదం (నియో కలోనియలిజం). భవిష్యత్తులో ప్రపంచ దేశాల మధ్య, ముఖ్యంగా చైనాతో యుద్ధం వస్తే అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలు, జపాన్, ఇండియా మొదలైనవి ఒక పక్షంలో నిలుస్తాయి. జిబౌటి అనే దేశం ఉంది. దీన్ని రిపబ్లిక్ అఫ్ జిబౌటి అంటారు. ఇది తూర్పు ఆఫ్రికాలో ఉంటుంది. కొన్ని దేశాల మిలిటరీ వ్యవస్థల నివాసానికి ఈ దేశం అద్దె ప్రాంతంగా ఉంది. ఈ దేశం యొక్క ప్రధాన ఆదాయమే అది. అమెరికా, ఫ్రాన్స్, జపాన్‌లతో పాటు చైనా కూడా ఈ దేశాన్ని మిలటరీ నివాసాల కోసం అద్దెకు వాడుకుంటుంటోంది. చైనా యుద్ధ వ్యూహంలో అంత సిద్ధహస్తంగా ఉందని చెప్పటానికి ఇదొక ఉదాహరణ. చైనా విజన్– 2050 ఆలోచనలలో భాగమే ఈ వ్యూహాలు, ఈ పథక రచనలు. ఇవ్వన్నీ పరిశీలిస్తే? చైనా విషయంలో భారత్ చాలా అప్రమత్తంగా ఉండాలి. అదే సమయంలో, అమెరికాను కూడా పూర్తిగా నమ్మే పరిస్థితి కాదు. చైనాను వాటేసుకోలేం. అమెరికాను నమ్మలేం. ఇద్దరినీ నమ్మినట్లు నటిస్తూ, మనం అన్ని రకాలుగా సంసిద్ధులు కావడమే మన ముందున్న కర్తవ్యం. ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పాటు సరిహద్దు దేశాల హృదయాలను గమనిస్తే? భారత్ మరో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలి. యువతను అందులో భాగస్వామ్యులను చెయ్యాలి. దేశభక్తి ప్రతి ఒక్కరిలో నింపుకోవాలి. ఇవ్వన్నీ స్వయం ప్రేరిత లక్ష్యాలుగా భారతీయులు కలిసి సాగాలి. రక్షణ, విదేశాంగ విధానం, ఆర్థిక పరిపుష్టి మొదలైన అంశాల్లో కేంద్రప్రభుత్వం కొత్త నెత్తురు ఎక్కించుకొని, మరింత సమున్నతంగా, సమగ్రంగా నడశవాలి.

మనుష్యులను చదవడం

– శ్రీనివాస్

మనలో దాదాపు అందరికీ అవతలివాళ్లు ఎలాటి వాళ్లో తెలుసుకోవాలనే కుతూహలం ఉండడం సహజం. కుతూహలమే కాదు, అవసరం కూడా పడుతుంది. ఒక ఉద్యోగిగా చేర్చుకోవాలన్నా, వ్యాపారభాగస్వామిగా చేసుకోవాలన్నా, స్నేహం చేయాలన్నా, జీవితంలో చోటు యివ్వాలన్నా, కలిసి పని చేయాలన్నా– యిలా అనేకరకాలుగా మనకు అవతలి వాళ్ల గురించి ఒక అవగాహన ఉండడం అవసరం. మంచివాళ్లా, చెడ్డవాళ్లా, మాట వినేవారా, వినని వారా, నిజాలు చెప్తారా, నిజాయితీగా వుంటారా, శాంతంగా ఉంటారా, బాధ్యతగా వుంటారా, యిలాటివన్నీ కొంతకాలం పోయాక మనకే తెలుస్తాయి. వాటిని బట్టి చేరువవడమో, దూరం చేసుకోవడమో చేస్తాం. దీనికి పెద్ద తెలివితేటలు అక్కరలేదు.

అయితే ఒక మనిషి అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు అనేది అర్థం చేసుకోవాలంటే మాత్రం బుర్ర ఉపయోగించాల్సిందే. అది ఒక మెంటల్ గేమ్. ఎవడికి తోచిన కారణాలు వాడు చెప్తాడు. దీన్నే మనుషులను చదవడం అంటారు. అతని స్వభావాన్ని విశ్లేషించి, దానికి కారణాలను కనుగొని, భవిష్యత్తులో రాబోయే సందర్భాల్లో అతనెలా ప్రవర్తిస్తాడో ఊహించి చెప్పడం, అది నిజమైతే భుజాలు చరుచుకోవడం.. ఒక్కోప్పుడు మనం అనుకున్నదాని కంటె భిన్నంగా ప్రవర్తిస్తే దానికి మళ్లీ యింకో కారణం వెతకడం కూడా జరుగుతుంది. ఎందుకంటే మనుషులు ఎప్పుడూ ఒకేలా వుండరు. అనుకోని విధంగా ప్రవర్తించి, మనను ఆశ్చర్యపరుస్తారు. అప్పుడు 'వాడి అసులు బుద్ధి అదేరా, యిన్నాళ్లూ నటించాడు' అని సర్ది చెప్పుకుంటాం. కానీ అలా ఒక్కోప్పుడు భిన్నంగా ప్రవర్తించడం కూడా సహజమే అని తెలుసుకోం.

నలుగురు కలిసి ఏదో మిత్రుడి కోపస్వభావం గురించి ఏకాభిప్రాయానికి వచ్చారనుకోండి. ఇక దానికి కారణాల గురించి ఎవరి విశ్లేషణ వారిదే. అసలా ప్రాంతం వాళ్లందరూ అంతేరా అంటాడొకడు. కొన్ని కోట్ల మంది అలాగే ఉంటారా మరి అదే ప్రాంతం వాడైన ఫలానావాడు శాంతంగానే ఉంటాడుగా, ప్రాంతం కాదు, కులం బట్టి అహంకారం వచ్చింది. అదే కోపంగా ప్రదర్శిస్తాడు, అందరి మీదా చిర్రుబుర్రులాడతాడు అంటాడు మరోడు. ఆ కులంలో మర్యాదగా వున్నవాళ్లు లేరా, కోప తాపాలు జీన్స్ బట్టి వస్తాయి. నిజానికి వాడి కోపం వాళ్ల నాన్న నుంచి వచ్చిందిరా, ఆయనా అంతే దూర్వాసుడుట అంటాడు ఒకడు. మరి వాళ్ల తమ్ముడికి రాలేదేం అంటే సమాధానం రాదు. ఇలా తెలిసున్న వాళ్లందరి గురించి చర్చలు జరుగుతూనే ఉంటాయి.

కాలేజీ రోజుల్లో అయితే ఫలానావాడికి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ అనో, మరోడికి సుపీరియారిటీ కాంప్లెక్స్ అనో, ఇంకోడు తన ఇన్ఫీరియారిటీని కప్పిపుచ్చుకోవడానికి సుపీరియారిటీ చూపిస్తాడనో, ఫలానావాడికి తను చాలా సుపీరియర్ అనే అభిప్రాయం మనసులో ఉన్నా పైకి హంబుల్‌గా ఉన్నట్లు నటిస్తాడనీ.. యిలా తెగ విశ్లేషణలు జరిగిపోతూ ఉంటాయి. ఇక అక్కణ్నుంచి వాడు అధికున్నని ఫీలవడానికి లేదా న్యూనతగా ఫీలవడానికి కారణాలేమిటి అని వెతుకుతారు. డబ్బు వుండడం లేకపోవడం, వాళ్ల నాన్నకు హోదా ఉండడం లేకపోవడం, అందం ఉండడంలూ లేకపోవడం, ఉందని అనుకోవడం, లేదని అనుకోవడం, తమ కులం గొప్పదని అనుకోవడం, అనుకోకపోవడం, చదువు రావడం రాకపోవడం.. యిలా వీటిపై ఎవరికి తెలిసిన వివరాలు వాళ్లు చెప్తారు. అమ్మాయిలు అబ్బాయిల గురించి, అబ్బాయిలు అమ్మాయిల గురించి యిలాటి విశ్లేషణలు మరింత జోరుగా చేస్తారు.

ఇది కాలేజీతో ఆగిపోదు, ఆఫీసుల్లో కూడా సాగుతుంది. "నాకు తెలుసు గురూ, నేను ఫలానా బ్రాంచ్‌లో పని చేసినపుడు చూశా. వీడిలాటి వాడే ఒకడుండేవాడు. సేమ్ యిలాగే గిరజాల జుట్టూ కళ్లజోడూ అదీ, నైస్‌గా మాట్లాడేవాడు. స్టయిల్‌గా కనబడేవాడు. చిట్టీలు పాడతానని చెప్పి అందరి దగ్గరా డబ్బు వసూలు చేసి, ఓ రోజు రాజీనామా చేసి పారిపోయాడు. వీడూ అలాగే చేస్తాడు చూస్తూ ఉండు." అనే మాటలు వినబడతాయి. ఆ పోలికలేమిటో, అవెంత వరకు నమ్మాలో అర్థం కాదు.

తెలియనిదాని గురించి తెలుసుకోవడానికి ఇండక్షన్ మెథడ్, డిడక్షన్ మెథడ్ అనే రెండు మెథడ్స్ కలిపి ఉపయోగించాలని తర్కం చెపుతుంది. కాకి ఎగురుతోంది, చిలుక ఎగురుతోంది, పిచ్చుక ఎగురుతోంది. ఇలా ఎగిరేవాటినన్నిటిని ఒక గ్రూపులో వేసి, వాటిలో ఉన్న సామాన్యగుణం కనుక్కోవడం ఇండక్షన్. సామాన్యగుణం ఏమిటి రంగా కాదు ఎందుకంటే కాకి నలుపు, చిలుక ఆకుపచ్చ. సైజా కాదు పిచ్చుక చిన్నది, గ్రద్ద పెద్దది. ఇలా జాగ్రత్తగా పరిశీలిస్తూ పోతే మనకు తెలుస్తుంది అవన్నీ పక్షి జాతికి చెందినవి అని. పక్షులన్నీ ఎగురుతాయి అనే సూత్రాన్ని కనిపెడతాం ఈ చర్యలనుబట్టి స్వభావాలు నిర్ధారించడం కష్టమనుకుంటే ఆ స్వభావాలకు కారణాలు కనుగొనడం మరీ మరీ కష్టం. కష్టమైన కొద్దీ మానవుడికి ఉత్సుకత మరింత పెరుగుతుంది. ఏవేవో కారణాలు వెతుకుతాడు, ప్రతిపాదనలు చేస్తాడు. గ్రహాల కారణంగా స్వభావం ఉంటుందని చెప్తూ ఉంటారు. ఉదాహరణకి జూన్ నెలలో పుట్టినవారు ఉదార స్వభావులని, జులైలో పుట్టినవారు పిసినారులనీ.. యిలా. మన భారతీయ పద్ధతిలో కూడా మేషరాశిలో పుడితే ధైర్యవంతులు అవుతారని, వృషభరాశిలో పుడితే బద్ధకస్తులవుతారనీ.. యిలాటివి చెప్తూంటారు. ఉన్నవే 12 రాశులు, 12 నెలలు. అంటే జనాభాలో 8.3% మంది ఒకేలా ఉంటారా

అసలు కారణాలు కనుక్కోవలసిన అవసరమేముంది అనే ప్రశ్న రావచ్చు. తక్కినవారిని చదవడం హాబీ అనుకుని ఊరుకోవచ్చు. కానీ మన విషయంలోనే మన మనోవేదనకు కారణాలు తెలుసుకోవలసిన అవసరం పడుతుంది, మనకు అనారోగ్యం కలిగినపుడు! శారీరక రుగ్మతలు వైరస్సు, బాక్టీరియా, తినే ఆహారం, చేసే (లేదా చేయని) కసరత్తు వలన మాత్రమే కాదు, మనసు కారణంగా కూడా వస్తాయి. వాటిని సైకో సొమాటిక్ డిజార్డర్స్ అంటారు.

చైనా కుయుక్తులు చైనా చవక..

అంటూ దీర్ఘాలు తీస్తున్న చైనా ప్రేమికులు తెలుసు కోవలసిన విషయం..

- సి. రాహుల్

చవకగా వస్తువులు లభిస్తుండడం వలన పేదలకు చాలా ఉపయోగకరంగా ఉన్నది పేదలు కూడా ఎగువ తరగతి సౌకర్యాలు పొందుతున్నారు అన్నది కొందరు చైనా వస్తువులను సమర్థించే వారి అభిప్రాయం ..

ఇందులో కొంత నిజం ఆ కొంత నిజం చాటున దాగిన పెద్ద నిజం గురించి వారు ఎందుకు చెప్పడం లేదు అనేది భారతీయులు ప్రశ్న కొంత నిజం చెప్పే వారు కూడా భారతీయులే కదా అంటే అది కూడా కొంత వరకే వారికి వ్యక్తిగత స్వార్థం తప్ప ఎటువంటి జాతీయ భావం లేదు అన్నది ఎక్కువ వరకు వాస్తవం..

అలాగే చవక వస్తువుల చాటున దాగిన పెద్ద నిజం..

ఉదాహరణకి వస్త్రాల ఉత్పత్తిలో భారత్ ప్రథమ స్థానంలో ఉంది. భారతీయ రైతులు పండించే ప్రత్తి ధర క్వింటాలు కి 4000 రూపాయలు వుంటే 2013 లో చైనా 7000 రూపాయలు రైతులకు చెల్లించి మొత్తం పంటను కొనివేసింది. మన దేశపు వస్త్ర పరిశ్రమలకు ప్రత్తి దొరక కుండా చేసింది. దాంతో మన వస్త్ర పరిశ్రమలు మూత పడ్డాయి. ఇలా ఏ దేశం లోని మార్కెట్లలోనైనా చైనా ప్రవేశిస్తే , అక్కడ చైనా తమ వస్తువులను తక్కువ ధరకు అమ్మి ఆయా దేశాల వస్తువులు మార్కెట్లో లేకుండా చేయటం చైనా వ్యూహంలో భాగం.

సైకిళ్ళ పరిశ్రమ వల్ల మన దేశంలో లక్షలాది కుటుంబాలు జీవనం గడుపుతున్నాయి. సైకిళ్ళలోని అన్ని భాగాలు చైనా నుండి రావటంతో తక్కువ ధరకు లభించటం వల్ల పంజాబ్‌లో వందల ఫ్యాక్టరీలు మూత పడ్డాయి.ఒక్క ఫిరొజాబాద్‌లో 400 మూత పడి కేవలం 40 మిగిలాయి. లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడ్డారు.

భారత్‌లోని ట్రక్కులు, బస్సులకు కావలసిన 1,30,000 టైర్లు మన మార్కెట్లలో డంపింగ్ చెసి, ఎటువంటి వారంటీ,బిల్లు లేకుండా తక్కువ ధరకు అమ్మటంతో మన టైర్ల ఫ్యాక్టరీలు మూతపడ్డాయి.

సోలార్ ప్యానల్ ఒక కిలోవాట్ కి 0.51డాలర్ చొప్పున మనం తయారు చేసి అమ్ముతుంటే, చైనా 0.40 డాలర్ చొప్పున అమ్మి మన ఫ్యాక్టరీలను దెబ్బ తీసింది.అదే జపాన్‌లో నైతే చైనా నుంచి వచ్చిన సోలార్ ప్యానల్ ల పై దిగుమతి సుంకం భారీగా విధించి జపాన్ తమ ఫ్యాక్టరీలను కాపాడుకున్నది.

ఎలక్ట్రానిక్ రంగం పూర్తిగా చైనా చేతుల్లోకి పోయింది. విప్రో, జీనత్ కంపనీలు ఉత్పత్తి చేయలేక చేతులెత్తేశాయి. ఇంజినీరింగ్ కళాశాలలలో ఎలక్ట్రానిక్ సబ్జెక్ట్ తీసుకునే విద్యార్థులే లేరు. ఇలాగే 10సంవత్సరాలు కొనసాగితే అప్పుడు బీటెక్,ఎంటెక్, పిహెడీ చేసిన టెక్నాలజిష్టులు దొరకక పోతే మళ్లీ ఎలెక్ట్రానిక్ రంగాన్ని పునరుద్దరించేదెలా?

భారతీయ మార్కెట్లలో ఆట బొమ్మలు మనవి 80శాతం వుండేవి. ఇప్పుడు చైనా నుండి 60శాతం,ఇతర దేశాల నుండి 20 శాతం వస్తున్నాయి. వేలాది ఆటబొమ్మల ఫ్యాక్టరీలు మూలన పడి లక్షలాది మంది నిరుద్యోగులయ్యారు. పైగా రసాయనాలు కలిపిన బొమ్మలు చైనా అమ్ముతున్నది. మన చిన్న పిల్లలు అవి నోట్లో పెట్టుకొని ఆడుతుంటే ఏమి అవుతుందో ఊహించండి. కారు మొదలైన ఆట బొమ్మలకు వెనక వుండే కాయిల్ లు,కాపర్ వైర్లు కూడా చైనా నుండి వస్తున్నాయి.

గతంలో చైనా నుండి దీపావళి టపాసులు వచ్చి ఎంత ప్రమాదాన్ని తెచ్చి పెట్టాయో మనకు తెలుసు. భారత ప్రభుత్వం నిషేధించినా కూడా దొంగ చాటుగా డంపింగ్ చేస్తున్నది.

బ్లడ్ క్యాన్సర్,ఎయిడ్స్ వంటి రోగాల నివారణకు మందులు తయారు చేయటం లో మన దేశం ప్రథమ స్థానంలో ఉంది. ఆఫ్రికన్ దేశాల్లో నాణ్యమైనవిగా, సరసమైన ధరలకు మందులను అమ్మే మంచి పేరు వుంది. కాని చైనా దొంగతనంగా నాసిరకం మందులు తయారు చేసి ప్యాకట్లపై Made in India అని లేబుల్ వేసి ఎక్కువ ధరకు ఆఫ్రికన్ దేశాల్లో అమ్ముతూ, భారత్ ని అపఖ్యాతి పాల్జెస్తున్నది.

మన దేశంలోని ఫార్మాస్యుటికల్ రంగాన్ని దెబ్బ కొట్టి మార్కెట్‌ని ఆక్రమించి ఆధిపత్యం చలాయించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. విటమిన్ ఫొలిక్ యాసిడ్‌ని తయారు చేసే పరిశ్రమలను మూసి వేయించే పనిలో భాగంగా మనకంటే తక్కువగా, కిలోకి 4,500 రూపాయలకు అమ్మి, మన పరిశ్రమలు మూత పడగానే, 11నెలల వ్యవధిలోనే అదే మందును కిలోకి 50,000 చొప్పున అమ్మి సొమ్ము చేసుకున్నది.

ఆఫ్రికన్ దేశాల్లో 60శాతం వనరులు చైనా చేతుల్లో వున్నాయి. 70శాతం మౌలిక వసతుల నిర్మాణం ఆ దేశాల్లో చైనానే చేపట్టింది. ఆ దేశాల్లో చైనా నగరాలను నిర్మించి 25 లక్షల మంది చైనా పౌరులను ఆ దేశాలకు తరలించింది. ఆఫ్రికన్ దేశాల మహిళ లను వివాహాలు చేసుకుంటున్నారు. తద్వారా రాజకీయంగా ఆక్రమణ కోసం వ్యూహం సిద్దపరుచుకున్నారు. సుమారు 20 కోట్ల మంది ఆఫ్రికన్ దేశాల్లోకి చైనీయులని తరలించాలని వ్యూహం.

మన సమీప దేశాలైన నేపాల్ బంగ్లాదేశ్, మయన్మార్,శ్రీలంక లకు అధిక మొత్తంలో ఆర్థికంగా అప్పులు ఇచ్చి,అవి మళ్లీ చెల్లించలేని స్థితిలో వున్నప్పుడు ఆ దేశాల్లో భూములు సేకరించి సైనిక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది.

శ్రీలంకలో తమిళుల ఊచకోత, తద్వారా జాతుల మధ్య ఘర్షణ సృష్టించి , ఆయుధాలు సరఫరా చేసి, శ్రీలంకను అన్ని విధాల సర్వ నాశనం చేసిన చైనా.

సూడాను దేశంలోని 2లక్షల మంది పౌరులను చిత్ర హింసల పాల్జేసి, హత మార్చిన ఘనత చైనాదే.

లాటిన్ అమెరికా దేశాలు, బ్రెజిల్ దేశంలో కూడా తన ఆర్థిక పంజాను జాపి ఆ దేశాల్లోని ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చుతున్నది.

హిందూ మహా సముద్రంలో మైనింగ్ పేరుతో అనుమతులు తీసుకుని, ఆయుధాలు సమకూర్చి సైనికులను మోహరించింది.

చైనా ఒక నరరూప రాక్షసి, పర్యావరణ విధ్వంసకి, మానవత్వాన్ని మంట కలిపే రక్త పిపాసి,ప్రపంచ శాంతిని వెక్కిరించే హింసోన్మాది, యుద్దానికి కాలు దువ్వుతున్న యుద్ధోన్మాది.

చైనా నుండి పారిపోయి అమెరికా శరణు చొచ్చిన ఒక డాక్టర్ అమెరికా సెనేట్ ఉప సమితి సభ్యుల ముందు బయట పెట్టిన రహస్యాలు వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ప్రతి సంవత్సరం 3000 మందిని తప్పుడు నేరారోపణ చేసి మరణ శిక్ష విధించి, తుపాకీ తో పేల్చి, గుండె కొట్టుకుంటున్నప్పుడె వాళ్ల చర్మాన్ని వొలిచి,దానిలో వుండే కొలాజిన్ అనే పదార్థాన్ని తీసి సౌందర్య సాధనాల్లో కలిపి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారం చేస్తున్నదట. అంతే కాదు మరణించిన వారి అవయవాలు కోసి స్మగ్లింగ్ చేసి చైనా ధనం ఆర్జిస్తున్నది అంటే తన స్వంత పౌరులపై కూడా కనికరం చూపక అమానుషంగా వ్యవహరిస్తున్న తీరుని ప్రపంచం తీవ్రంగా ఖండించాలి.

ఆసియా మౌలిక వసతులు పెట్టుబడుల బ్యాంక్ లో చైనా అధిక వాటా కలిగి ఆసియా దేశాలపై ఆధిపత్యం కలిగి ఉండి, భారత్‌ని దెబ్బ తీయాలని ప్రయత్నం జరుపుతున్నది.

సుమారు 70 దేశాలను కలుపుతూ వ్యాపార వాణిజ్య విస్తరణకుగాను ఒకే బెల్ట్,ఒకే రోడ్ నిర్మాణం జరుపుతున్నది. రోడ్,నౌకా,రైలు మార్గం కలిపి చేస్తున్న ఈ నిర్మాణం యొక్క ముఖ్యోద్దేశం ఆయా దేశాల మార్కెట్లను ఆక్రమించడమే.ఆ మార్గంలో వసూలు చేసిన టోల్ రుసుము చైనాకే చెందుతుంది.

1949లో చైనాలో నూతన కమ్యూనిస్ట్ ఏర్పడినప్పటి నుండి భారత్ పై అన్ని వైపులా పరోక్ష యుద్దాన్ని కొనసాగిస్తున్నది. చైనా చెస్తున్న తప్పిదాలను అప్పటి మన హోం మంత్రి సర్దార్ పటేల్జీ ఒక లేఖ ద్వారా ఎత్తి చూపి, హెచ్చరించినప్పటికీ చైనా తన ధోరణి మార్చుకోలేదు.

1949లో భూటాన్ తమ దేశపు రక్షణ మరియు విదేశీ వ్యవహారాలకు భారత్‌ను ప్రొటెక్టర్‌గా ఉండాలని భూటాన్ కోరింది. బౌద్దలామాలు కూడా అప్పటి ప్రధాని నెహ్రూకి ఈ విషయమై నచ్చ చెప్పారు. కాని నెహ్రూ ఒప్పుకోక, చైనాను భూటాన్ కి ప్రొటెక్టర్‌గా ఉంటే బాగుంటుందని సూచించారు.దాని ఫలితంగా చైనా ఇప్పటికీ భూటాన్‌లో వేలాది ప్రజల మానవ హక్కులను అణిచివేస్తున్నది.

చైనాతో మనదేశం పంచశీల ఒప్పందం చేసుకున్న తరువాత, మానస సరొవరం వెళ్ళే దారిలో తపాల,కమ్యూనికేషన్ సౌకర్యాలు మనమే ఉపసంహరించుకునేట్లు చేసింది.ఫలితంగా యాత్రికులను ఇబ్బందులకు గురిచేసింది.

చైనా తమ దేశపు పారిశ్రామిక వేత్తలకు 18 ట్రిలియన్ డాలర్ల మేరకు రుణాలిచ్చి ప్రపంచ దేశాల్లో వ్యాపార విస్తరణకు స్వేచ్ఛనిచ్చింది.

హిమాలయాల్లో ప్రవహించే బ్రహ్మపుత్ర నది నీళ్లు మన దేశంలో ప్రవేశించకుండా పవర్ ప్రాజెక్ట్ లు నిర్మించి అడ్డుకట్ట వేస్తూన్నది.

జమ్మూ కాశ్మీర్ మరియు అరుణాచల్ ప్రదేశ్ లోనికి వీసా లేకుండా తమ దేశపు పౌరులను పంపుతున్నది. ఈ రెండూ భారత్ లో భాగం కాదని చెప్పటం కోసం చైనా ఈ విధంగా వ్యవహరిస్తున్నది.

తనకు సంబంధం లేకున్నా,అనవసర జోక్యం చేసుకుని, పాకిస్తాన్ తీవ్రవాదులను ఇంటర్నేషనల్ టెర్రరిస్టులుగా ప్రకటించకుండా వీటొ చేసి అడ్డుకున్న విషయం మనకు తెలిసినదే.

చైనా పరిశ్రమల ద్వారా ఇతర పనుల ద్వారా కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్ వాయువును 50 శాతం పైగా వదిలిపెట్టి భూ ఉపరితలంపై ఉష్ణోగ్రతను పెంచుతున్నది. ఫలితంగా వాతావరణంలో 1.5 డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగింది.ఉత్తర దక్షిణ ధ్రువాల వద్ద మంచు కరిగి సముద్ర తీర సమీప దేశాలు, దీవులు, అరణ్యాలు జల ప్రళయంలో చిక్కుకునే ప్రమాదం కొని తెస్తున్నది. ఫలితంగా కోట్ల మంది ప్రజలు నిర్వాసితులు అవుతారు.

ప్రతి సంవత్సరం 400 సార్లు సరిహద్దు దాటుతూ బంకర్లను టవర్లను కూల్చటం చైనా నిత్య కృత్యంగా మారింది.

1962లో దొంగ చాటుగా యుద్దానికి దిగి 3000సైనికులను హతమార్చి,38వేల చదరపు కిలోమీటర్ల భారత భూమిని ఆక్రమించి, పైగా భారతే తమ 1,04,000చదరపు కిలోమీటర్ల భూమిని స్వాధీనం చేసుకున్నదంటూ విశ్వ వేదికల పై అబద్దాలు ప్రచారం చేస్తున్నది.

అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అరుణాచల్ ప్రదేశ్ లోని తవాంగ్ జిల్లాలో పర్యటన చేయనున్నాడని తెలిసి చైనాలోని భారత దౌత్యాధికారి శ్రీ మతి అనుపమరావుని మహిళ అని కూడా చూడకుండా రాత్రి 2 గంటలకు లేపి,పిలిచి హెచ్చరించడం జరిగింది.

మానవ హక్కుల భక్షకి, పర్యావరణ విధ్వంసకి, యుద్ధోన్మాది, మార్కెట్లో వస్తువుల డంపింగ్‌తో ఆర్థిక సామ్రాజ్య వాద పిపాసి, నియంత... ఇలా చైనా కేవలం భారత్‌కే కాదు ప్రపంచానికే ప్రమాద కారిగా పరిణమించింది. చైనా విస్తరణ వాదాన్ని, స్వదేశీ డైనమెట్‌తో పేల్చేద్దాం. చైనా వస్తువులను బహిష్కరించి, భారతీయ వస్తువులను ప్రోత్సహిద్దాం.

భారత్‌కు చైనా ఎగుమతి చేస్తున్న ఉత్పత్తుల విలువ

5లక్షల కోట్ల రూపాయిలు పై చిలుకు భారత్ చైనాకు ఎగుమతి చేస్తున్న ఉత్పత్తుల విలువ కేవలం ఒక లక్ష కోట్ల రూపాయలు.వరకు మాత్రమే.. రెండు సమానంగా ఉండాలి అంటే ఉత్పత్తి పెరగాలి దిగుమతి తగ్గాలి.. అంతవరకు కొన్ని సమస్యలకు సిద్దంగా ఉండాలి భారతీయులు.. మాత్రమే.. చైనా ప్రేమికులు కాదు..

ఏదీ ఈజీ కాదూ...

(సినీ రచయిత సత్యానంద్‌గారి రచన)

- ఎల్. ప్రేమ్ కుమార్

ఆ దోసెల బండి దగ్గరకి మా ఫ్రెండ్‌గాడు నేను కార్ ఆపుకుని దిగి వెళ్ళాము ..

ఆ దోసెలు చాలా పాపులర్ .బావుంటాయి

రెండు దోశలు ఆర్డర్ ఇవ్వగానే.

ఆ బండి కుర్రాడు గిన్నె లోని దోసెపిండి గరిటితో 'టప్ 'అని పెనం మీద రెండు సార్లు వేసాడు.ఆ పిండిని చిన్న రౌండ్ నుంచి చూస్తుండగానే పెద్ద రౌండ్‌గా మార్చాడు.అట్లకాడతో నూనె దాని పైన వేసి సులువుగా బోర్లించి,వీపు మీద తట్టినట్టు కొట్టి ,తమాషాగా రౌండ్‌గా గొట్టంలా చేసి పళ్ళాల్లో పెట్టి ఇచ్చాడు.

"ఇంత ఈజీ అనుకోలేదు దోస వెయ్యటం.." ముక్క నోట్లో కుక్కుకుంటూ అన్నాడు ఫ్రెండ్.

ఈజీ యా. ??? అడిగాను.

'చూస్తే తెలియటం లేదు.'మళ్ళీ ముక్క మింగుతూ అన్నాడు.

నేను ఆ దోశలు కుర్రాడికి ఒక వంద నోటు ఇచ్చి, కాసేపు పక్కన ఉండమని మా వాడిని "నువ్వు వెయ్యరా చూద్దాం.." అని రంగం లో కి దింపాను.

అప్పుడు బస్తీ మే సవాల్ అన్నట్టు నవ్వాడు మా ఫ్రెండ్‌గాడు. నవ్వి కదనరంగంలోకి దిగే కొదమసింహం లా ఒళ్ళు విదిలించుకుని

వాడు చాలా ధీమాగా వెళ్లి గరిటితో పిండి తీసి పెనం మీద గొబ్బెమ్మ ని పెట్టినట్టు పెట్టాడు.గర్వంగా ఓ లుక్ ఇచ్చాడు.ఆ పిండిని రౌండ్‌గా తిప్పే కార్యక్రమం మొదలు పెట్టాడు....అప్పుడు మొదలయింది కథాకళీ..గరిటి పిండిని వదలక, వీడు గరిటిని వదలక పరిస్థితి చాలా భీబత్సంగా తయారయింది.అది వృత్తాకారంగా కాకుండా వింతాకారంగా తయారయింది.అక్కడక్కడ ఖాళీలతో చిరుగుల బనియన్ లా ఉండటం తో వీడు ఇంకాస్త పిండి తీసి ఫిలప్ ది బ్లాంక్స్ లా ఆగాప్స్ నింపటం తో అక్కడక్కడ బలిసిన రోగిష్టి దోసెలా తయారయ్యింది.

దాన్ని తిప్పి బోర్లించే ప్రాసెస్‌లో కొంత పెనంకి అతుక్కుని, కొంత తెగి, ముక్కలైన ఆఫ్రికా మ్యాప్‌లా మారిపోయింది. ఆ ముక్కలని దగ్గరకి తెచ్చే ప్రయత్నంలో వీడు చమటలుకక్కుతూ బుసలు కొడుతున్నాడు.ఈలోగా బండి దగ్గర ప్రేక్షకులు పోగయ్యారు. దోసె బండి కుర్రాడు వచ్చే నవ్వుని ఆపుకుంటున్నాడు.. పెనం అంతా వీడి దోసె ముక్కలతో యుద్ధరంగంలా తయారయ్యింది. అట్ల కాడని కత్తిలా తిప్పబోతుండగా చెయ్యి పెనానికి తగలటం, కాలటం, వీడు హీరోయిన్‌లా కెవ్వు మనటం ఒక్కసారి జరిగిపోయాయి. బండి చుట్టు చేరిన ప్రేక్షకులు బాహుబలి చూసినంతగా ఆనందించారు. అట్లకాడ అక్కడ పడేసి అవమాన భారంతో పోయి కార్ ఎక్కేసాడు. దోసెల బండి కుర్రాడికి ఇంకో వంద ఇచ్చి నేను కారు ఎక్కాను.



బయల్దేరాం.

కాసేపు నిశ్శబ్దం.

" చూస్తుంటే చాలా ఈజీగా అనిపించింది.."అన్నాడు.

"చెయ్య బోతే తెలిసింది అది ఎంత కష్టమో..

అవునా..."అన్నాను.కాలిన చెయ్యిని ఊదుకుంటూ తలవూపాడు.

అప్పుడుచెప్పాను వాడికి...

"పొద్దున్న నాతో స్టూడియోకి వచ్చి, షూటింగ్ చూసావ్.బైటకి వస్తూ డైరెక్షన్ చాల ఈజీ యే..మోనిటర్ ముందు కూర్చుని చూసి ఓకే అనటమేగా అన్నావ్.యాక్ట్ చేసే వాళ్ళని చూసి ఒక్క ముక్క పదిసార్లు చేస్తున్నారు..అలాగయితే యాక్టింగ్ ఎవడైనా చెయ్యచ్చు అన్నావ్..ఆ మూల కూర్చుని మనం మాట్లాడుకునేవి డైలాగులుగా రాసేస్తున్నాడు రైటర్‌గాడు..నేను రాయగలను ఆ నాలుగు ముక్కలు..అనికూడా కూశావ్.

సినిమా తియ్యటం ఇంతేనా...చాలా ఈజీఅన్నావు..గుర్తుందా.."అన్నాను.స్వరపేటిక పగిలిపోయినట్టు సైలెంట్ అయిపోయాడు.

"పెనం మీద దోస వెయ్యటం ఏముంది ఈజీ అన్నావ్ ..సినిమా తియ్యటం ఎంత ఈజీ. అన్నావ్..

చూస్తున్నప్పుడు చాలా పనులు మనకి చాలా ఈజీ అనిపిస్తాయి.ఆలా అనిపించినంత మాత్రాన ఆ పని తేలికయినది అనుకోకు..

చేసే వాళ్లకి దానిలో ఎంతో ప్రావిణ్యం ఉందని,

అది ఎంతో కృషి చేస్తే వచ్చిందని, తెలుసుకో.

సచిన్ ఆటని చూసి క్రికెట్ ఈజీ అని,బాలు పాడటం విని సింగింగ్ తేలిక అని,ప్రభుదేవా మూమెంట్స్ చూసి డాన్స్ సులువు అని తేలికగా వాగకు.

వాళ్ళవరకు ఎందుకు....

రోడ్డు మీద ఓ అబ్బాయి వేసిన బొమ్మ,స్టేజి మీద ఓ అమ్మాయి చేసిన డాన్స్, కార్పెంటర్ చెక్కుతున్న కుర్చీ, కుమ్మరి చేస్తున్న కూజా, మేస్త్రి కట్టే మెట్లు, మేదరి అల్లే బుట్టలు, ఇంట్లో వాళ్ళు చేసే వంట, ఇందాక కుర్రాడు వేసిన దోశె చూస్తుంటే ఇవి చెయ్యటం చాలా ఈజీ యే కదా అనిపిస్తుంది.

కాదు. ఈజీ కాదు. అనిగుర్తు పెట్టుకో.

ఎన్నో కళలని సరిఅయిన పాళ్ళలో కలిపి,ఎంతో మంది టాలెంట్ ని ఏకం చేసి తీసే సినిమా.. ఈజీ అని నీలా అనుకునే ఎంతోమంది వస్తుంటారు సినిమా ఇండస్ట్రీ లోకి.

రావటం తప్పుకాదు.

ఈజీ అని తేలికగా తీసుకోవటం తప్పు.

సినెమా ఏదయినా సరే, ఎలావున్నా సరే తియ్యటం మాత్రం ఈజీ కాదు.

గుర్తు పెట్టుకో."

వాడు మొహం మాడ్చుకున్నాడు. ఏడ్చి చస్తాడని,ఓదార్పుగా అన్నాను...

"ఫీల్ అవక

ఒకప్పుడు ఇస్త్రి బండి అబ్బాయి ఇస్త్రి చెయ్యటం చూసి 'ఓస్ ఇంతేనా 'అని,ఇస్త్రి పెట్టి కొని చెయ్యి, చొక్కా జాయింట్‌గా కాల్చుకున్న ,ఘన చరిత్ర నాకూ వుంది.

ఫైనల్‌గా నేను చెప్పేదేమిటంటే

సినిమాకి రాయటం, తీయటం, పాడటం,ఆడటం,పక్కనుంచి కాసేపు చూసి....ఓస్ ఇంతేనా..ఇది చాలా, ఈజీ,అని కబుర్లుచెప్పక అర్థం అయ్యిందా..."అన్నాను.

కారు వాడి ఇంటి ముందు ఆగింది.

దిగుతూ క్రూరంగా నాకేసి చూసి

"ఏది ఈజీ అయినా కాకపోయినా కదిలే కారులో కూర్చో బెట్టి క్లాసులు పీకడం చాలా ఈజీ..నేనూ చెయ్యగలను...ఎందుకంటే వినేవాడు డోర్ తెరుచుకు దూకడు అని ధీమా నీకు.."

అనేసి ఉక్రోషంగా పోయాడువాడింట్లోకి.

వాడు అంతే. మారడు.

సర్దార్ వల్లభాయ్ పటేల్

- శంకర్





సర్దార్ వల్లభాయ్ పటేల్...దేశ స్వాతంత్ర్య పోరాటంలో... స్వాతంత్ర్యానంతరం దేశాన్ని ఐక్యం చేయడంలో ప్రముఖ పాత్ర వహించారు.! సర్దార్ పటేల్ అనగానే ఆయన ధీరత్వం ఎలా సాక్షాత్కరిస్తుందో.... ఆయన కూతురు మనిబెన్ పటేల్ పేరు చెప్పగానే ఆమె నిజాయితీ అలా స్పురణకు వస్తుంది.!

తండ్రి పటేల్ మరణం తర్వాత... మనిబెన్ ఓ బ్యాగ్‌ను తీసుకొని గుజరాత్ నుండి ఢిల్లీకి వెళ్లి నెహ్రూను కలిసింది! నెహ్రూ కు అర్థం కాలేదు...ఆ బ్యాగ్ తెరిచి చూసేవరకు 35 లక్షలు దానికి సంబంధించిన అకౌంట్ పుస్తకం ఉంది. అప్పుడు మనిబెన్..నాన్నగారు చనిపోయే సమయంలో ఈ లెక్క మీకు అప్పజెప్పమన్నారు... ఇవి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన లెక్కలు అని చెప్పింది.

వాస్తవానికి అప్పటికే మనిబెన్ ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది.! తండ్రి ఇచ్చిన డబ్బులు నెహ్రూకు ఇవ్వాల్సిన అవసరం కూడా తనకు లేదు. కానీ ప్రజలిచ్చిన విరాళాలు ఆ పార్టీకే ఇవ్వాలని ఇచ్చేసింది. తన అంతిమ గడియాల్లో మనిబెన్ దుర్భర పరిస్థితులను గడిపింది. ఆరోగ్యం సహకరించక....కండ్లు సరిగ్గా కనబడక ..నడుస్తూ నడుస్తూనే కిందపడిపోయేది.

పటేల్ దేశాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు కానీ ఆయన కూతురికి ఆర్థికంగా అండగా నిలబడడంలో మాత్రం దేశం విఫలం.

చెదిరిన డాలర్ల కల

- కె.వి.రమణ, ఎం.ఎ., బి.ఇడి



అమెరికా అంటే మన దృష్టిలో ఓ భూతల స్వర్గం. సహజంగా మనిషి సుఖాన్వేషి. ఏం చేసినా సుఖసం తోషాల కోసమే ప్రతి ఒక్కరూ నిత్యం పరితపిస్తుంటారు. తమ కలలను నెరవేర్చే దేశం అమెరికా అనే భావన మొదటి నుంచి మనలో బలంగా నాటుకుపోయింది. చదువు నిమిత్తం అమెరికా వెళ్లడం. అక్కడే ఉద్యోగం, ఆ తర్వాత గ్రీన్‌కార్డ్... ఇలా ఎన్నెన్నో కలలు కన్న, కంటున్న వారి కలలను కరోనా మహమ్మారి కల్లలు చేస్తోంది.

అమెరికాను కరోనా అతలాకుతలం చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతుండడం ఆ దేశ ప్రభుత్వానికి వారికి భృతి ఇవ్వడం పెద్ద సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో తమ దేశంలో నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు విదేశీ వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్1 బీ సహా అన్ని రకాల వర్క్ వీసాలను తాత్కాలికంగా నిలిపి వేయాలని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారు.

ఈ నిర్ణయం మన దేశ విద్యార్థులతో పాటు ఉద్యోగాన్వేషణలో ఉన్న వారికి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ట్రంప్ నిర్ణయం అమెరికాలో ఉన్నతవిద్యను అభ్యసించిన భారతీయ గ్రాడ్యుయేట్లకు నిద్ర కరవు చేసింది. ఎందుకంటే గ్రాడ్యుయేషన్ అయిపోగానే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) వర్క్ పర్మిట్‌తో ఉద్యోగం చేస్తున్న దాదాపు 25 వేల మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఈసారి హెచ్1బీ వీసా రానిపక్షంలో స్వదేశానికి తిరుగుముఖం పట్టాల్సిందే.

హెచ్1బీ సహా అన్ని రకాల వర్క్ వీసాల రద్దుపై ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులిస్తానని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇదే జరిగితే మాత్రం వేలాది మంది భారతీయులు ఉద్యోగులు కోల్పోయి రోడ్డున పడతారు. ఓపీటీపై పనిచేస్తూ హెచ్1బీ వీసా కోసం ఎదురు చూస్తున్న దాదాపు 40 వేల మంది ఉద్యోగాలు కోల్పోతారని అంచనా. వీరిలో ఎల్-1పై అమెరికా వెళ్లిన 15 వేల మంది ఐటీ నిపుణులు కూడా ఉన్నారు.

ప్రస్తుతం అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న ఐటీ నిపుణుల రెన్యువల్ దరఖాస్తుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఒక వైపు చెబుతున్నారు. అయితే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ వెలువడే దాకా భవిష్యత్ ఏంటనేది చెప్పలేమంటున్నారు. ఎందుకంటే గతంలో ట్రంప్ ఎన్నికల్లో గెలిచేందుకు అమెరికన్లకే ఉద్యోగాలనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తీసుకొచ్చారనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

ఇప్పుడు కూడా దాన్నే మరోసారి అస్త్రంగా వినియోగించే అవకాశం ఉందంటున్నారు. ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ట్రంప్ దేనికైనా వెనుకాడరని, ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయాలనైనా తీసుకొనే ప్రమాదం లేకపోలేదని భారతీయ ఐటీ నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది మార్చిలో దాదాపు 1.67 లక్షల మంది భారతీయ ఐటీ నిపుణులు హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేశారు. వీరిలో 70 వేల మంది లాటరీలో ఎంపికయ్యారు. వారికి వీసాలు జారీ చేసే ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. మామూలుగా జూన్ నుంచి లాటరీ ద్వారా ఎంపికైన వారికి హెచ్1బీ వీసాలు జారీ చేస్తారు. అయితే ఈసారి కరోనా మహమ్మారి కారణంగా అమెరికాలోని పౌరసత్వ, ఇమ్మిగ్రేషన్ కార్యాలయాలు మూతపడ్డాయి.

అయినా దాదాపు 8 వేల మందికి హెచ్1బీ వీసాలు మంజూరయ్యాయి. మిగిలిన వారి దరఖాస్తులు పరిశీలిస్తున్న సమయంలో కొత్త సమస్య వేధిస్తోంది. జూలై నుంచి రెన్యువల్ అయ్యే వారి దరఖాస్తులను పరిగణ నలోకి తీసుకుంటారా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. ఏది ఏమైనా అమెరికాలో ఉద్యోగుల భద్రత దినదినగండంగా మారింది. ఎప్పుడేమవుతుందో తెలియక , భవిష్యత్‌ను తలుచుకుని ఆందోళనతో బతుకు వెళ్లదీయాల్సిన పరిస్థితి.

పెదరాయుడుకి 25 ఏళ్ళు

- ఆర్. రత్న కుమార్





బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం సాధించి తెలుగు సినిమా చరిత్రలో నిలిచిపోయిన సినిమాల లిస్టు చూస్తే అందులో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు నటించిన 'పెదరాయుడు' ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ చిత్రం ఎవరూ ఊహించని విధంగా సంచలన విజయం అందుకొని ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. సరిగ్గా పాతికేళ్ళ క్రితం ఇదే రోజు (జూన్ 15) థియేటర్స్‌లో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులచేత మంచి తీర్పు అందుకొని కాసుల వర్షం కురిపించిన ఈ సినిమా గురించి 'జీ సినిమాలు' స్పెషల్ స్టోరీ.

అప్పటికే అపజయాలతో సతమతమౌతున్న మోహన్ బాబు తనకు నటుడిగా, నిర్మాతగా మంచి విజయం అందించే చిత్రం గురించి ఎదురుచూస్తున్న సమయంలో సరిగ్గా మిత్రుడు రజనీకాంత్ నుండి ఫోన్ వచ్చింది. తమిళంలో విజయం అందుకున్న 'నాట్టామై' సినిమా తెలుగులో తీస్తే మంచి విజయం అందుకుంటుందని, వెంటనే వచ్చి సినిమా చూడమని మోహన్ బాబుకి చెప్పారు రజని. వెంటనే సినిమా చూసి నచ్చడంతో ఆ విషయాన్ని రజనికి చెప్పి రైట్స్ గురించి మాట్లాడారు మోహన్ బాబు. నిర్మాత ఆర్.బి.చౌదరితో తాను మాట్లాడానని వెళ్లి ఒకసారి కలవమని మోహన్ బాబు కి చెప్పి పంపించారు రజని. సూపర్ స్టార్ చెప్పడంతో వెంటనే తెలుగు రైట్స్ ను మోహన్ బాబు చేతిలో పెట్టారు తమిళ నిర్మాత చౌదరి. లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ బ్యానర్ పై ఈ సినిమాను తీయాలని డిసైడ్ అయిపోయాడు మోహన్ బాబు. వెంటనే ఈ రీమేక్ బాధ్యతను

దర్శకుడు రవిరాజా పినిశెట్టి చేతిలో పెట్టారు.సినిమాలో పాపారాయుడు పాత్రకు మినహా అన్ని పాత్రలకు నటీనటుల ఎంపిక జరిగిపోయింది. ఆ పాత్రను నేను చేస్తా అంటూ గెటప్ తో సహా మోహన్ బాబుకి చెప్పి షాకిచ్చాడు రజని. అతిథి పాత్రను రజనీకాంత్ చేస్తానని చెప్పడంతో మోహన్ బాబు సంతోషానికి అవధుల్లేవ్. అదే విషయాన్ని దర్శకుడు రవిరాజా పినిశెట్టి తో పంచుకుంటే ఆయన కూడా షాక్ అయ్యాడు. అంతా ఓకే హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో సినిమా ఓపెనింగ్. సినిమా ప్రారంభోత్సవానికి చాలా మంది ప్రముఖులు హాజరై మోహన్ బాబుకి చిత్ర యూనిట్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఓపెనింగ్‌కి ఎన్టీఆర్, నాగేశ్వరావుగార్లు ముఖ్య అతిథులుగా విచ్చేసారు. రజనీకాంత్ మెడలో మోహన్‌బాబు దండ వేసి మొదటి షాట్‌కి నందమూరి తారక రామారావుగారు క్లాప్ ఇచ్చారు. అద్భుతమైన సినిమాకు అన్ని వాటంతటవే కుదురుతాయన్నట్టుగా సినిమా షూటింగ్ ఎలాంటి అడ్డు లేకుండా నిర్విరామంగా జరిగింది. పెదరాయుడు, రాజా రెండు పాత్రల్లో మోహన్ బాబు అద్భుతమైన నటన కనబరిచి ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించుకున్నారు. వెండితెరపై పెదరాయుడిగా కలెక్షన్ కింగ్ అదరగొట్టేసారంటూ సినిమా నుండి బయటికొచ్చిన జనాలు చెప్పుకున్నారు. ఇక సినిమాలో రజని చేసిన పాపారాయుడు పాత్ర తాలూకూ సన్నివేశాలకు థియేటర్‌లో అరుపులే. "ఆపరా...." అంటూ సూపర్ స్టార్ పవర్ ఫుల్ డైలాగ్‌కి సీట్లో నుండి ఎగిరెగిరి మరీ కేకలు వేస్తూ మురిసిపోయారు అభిమానులు. ఈ సినిమాకు సంబంధించి నిర్మాత మోహన్ బాబు నుండి నటుడిగా ఎలాంటి పారితోషికం తీసుకోలేదు రజనీకాంత్. అంతే కాదు నిర్మాతగా ఇబ్బందుల్లో ఉన్న మోహన్ బాబుకి షూటింగ్ నిమిత్తం 45 లక్షలు అందించి సినిమా మంచి విజయం సాధించాక తిరిగివ్వమని చెప్పి సూటుకేసు చేతికిచ్చారు కూడా. సినిమా పెద్ద హిట్టయ్యాక మళ్లీ రజనీను కలిసి ఇచ్చిన డబ్బును తిరిగిచ్చి, అలాగే పారితోషికంగా వస్తురూపంలో ఓ పెద్ద బహుమతిని రజనీకి అందించారు మోహన్ బాబు.పెదరాయుడు భార్యగా భానుప్రియ చక్కని నటన కనబరిస్తే రాజా భార్య పాత్రలో సౌందర్య అదరగొట్టేసింది. ముఖ్యంగా పెదరాయుడు గొప్పతనం తెలుసుకొనే సన్నివేశంతో పాటు తన భర్తతో పాటు తనను కూడా ఊరి నుండి వెలి వేసిన తరువాత వచ్చే సన్నివేశాలు, అలాగే శ్రీమంతం సన్నివేశంలో తన నటనతో మెప్పించింది సౌందర్య. ఇక బాబు మోహన్, బ్రహ్మానందం కామెడీ ట్రాక్ కూడా సినిమాలో మంచి హాస్యాన్ని పండించి ప్రేక్షకులకు కితకితలు పెట్టి చక్కని వినోదాన్ని అందించింది. పాకీజాతో బ్రహ్మీ కామెడీ హిలేరియస్‌గా వర్కౌట్ అయింది.

సినిమాకు కోటి స్వరపరిచిన సంగీతం కూడా ప్లస్ పాయింట్. "కదిలే కాలమా" పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా కంపోజ్ చేశాడు కోటి. ఏసుదాసుగాత్రం కూడా ఆ పాటకు ప్రాణం పోసింది."బావవి నువ్వు భామను నేను",

"అబ్బ దాని సోకు.." "కో అన్నదోయ్.." "ఢమ ఢమ గుండె ఢమరుకం మోగె.." పాటలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకొని పెదరాయుడు పాటల పరంగా కూడా సూపర్ హిట్ ఆల్బమ్ అనిపించుకుంది. అలాగే నేపథ్య సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడు కోటి. ముఖ్యంగా తీర్పు చెప్పడానికి పాపారాయుడు, పెదరాయుడు నడుచుకుంటూ వచ్చే సన్నివేశాలకు కోటి ఇచ్చిన ఆర్.ఆర్ ఎప్పటికి ప్రేక్షకులకు గుర్తుంటుంది. సినిమాటోగ్రాఫర్ ప్రకాష్ రావు , ఎడిటర్ గౌతమ్ రాజు కూడా విజయంలో మంచి పాత్ర పోషించారు. అలాగే దేవిశ్రీ ప్రసాద్ తండ్రి రచయిత సత్యమూర్తిగారు సినిమాకు అందించిన మాటలు ఇప్పటికీ ట్రెండింగ్ లో ఉంటాయి. పాతికేళ్లయినా 'పెదరాయుడు' సినిమాలో భార్య భర్తల అనుబంధం గురించి మోహన్‌బాబు చెప్పిన "ఫిష్ అండ్ ఫిషర్ మెన్" డైలాగ్ ఇప్పటికీ సోషల్ మీడియాలో ఎక్కడో చోట కనబడుతుంటుంది.

సరిగ్గా 'పెదరాయుడు' విడుదలైన రోజే చిరంజీవి నటించిన 'బిగ్ బాస్' కూడా ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారీ అంచనాల నడుమ రిలీజైన చిరు సినిమాకి మార్నింగ్ షో కే బ్యాడ్ టాక్ వచ్చింది. కానీ ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చిన 'పెదరాయుడు' మాత్రం రోజు రోజుకి ఊపందుకుంటూ రికార్డులు తిరగరాసి సంచలన విజయం అందుకొని చరిత్ర సృష్టించింది.

తెలుగు సినిమా చరిత్రలో పెదరాయుడు ది ఓ అరుదైన రికార్డు. 41 కేంద్రాలలో డైరెక్టుగా 100 రోజులాడిన సినిమా 9 కేంద్రాలలో 150 రోజులు, 6 కేంద్రాలలో డైరెక్టుగా 175 రోజులు ప్రదర్శింపబడింది. హైదరాబాద్ శాంతి థియేటర్ లో 200 రోజులకు పైగా ఆడి, టోటల్‌గా 12 కోట్లకు పైగా షేర్ వసూళ్లు చేసి 'ఘరానా మొగుడు' రికార్డును క్రాస్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది.సత్యమూర్తి రాసిన కొన్ని పవర్ ఫుల్ డైలాగ్స్ :

1) The relationship between two persons in a family must be like a fish and water but should not be like a fish and a fisherman.

2) ఆపరా. అంతకుమించి ఎక్కువ మాట్లాడితే నీ నాలుక చీరేస్తాను. నాకళ్లల్లోకి సూటిగాచూసి మాట్లాడలేని నువ్వు నాతీర్పుకే ఎదురుచెప్తావా? ప్రాణాలు తీస్తాను. పుట్టిన పుట్టుక కాదురా ముఖ్యం. జరిగిన అన్యాయం, జరగాలసిన న్యాయం ముఖ్యం. రేయ్ తీయరా తాళి. కట్టరా వెళ్లి.

3) పిల్లల్ని పెంచడం మన కర్తవ్యం.. మనకు పుట్టారుగాబట్టి.. పెళ్ళాన్ని పోషించడం మన బాధ్యత..మనల్ని నమ్ముకొని వచ్చిందిగాబట్టి.. తల్లిదండ్రుల్ని కంటిరెప్పల్లా కాపాడుకోవడం మన ధర్మం.. వాళ్ళు మనకు జన్మనిచ్చారుగాబట్టి..

మనల్ని చూసి వాళ్ళు గర్వపడాలిగానీ సిగ్గుపడకూడదురా.

4) గురువులేని చదువు.. జన్మనిచ్చిన వారిని మరచిపోయినవాడి బ్రతుకు రాణించదురా.. రాణించదు.

5)నారు నాటితే వరి పెరుగుతుంది.. మాట జారితే గొడవ పెరుగుతుంది..

6)కంప్యూటర్ కాలంలో కూడా కట్టిన తాళికింకా విలువుందంటే.. ఆ గొప్పతనం కట్టిన వాడిది కాదురా.. కట్టించుకున్న ఆమెది

7)రేయ్.. చివరకు మిగిలేది ఆరడుగుల నేల,గుప్పెడు బూడిదే.

✡ ✡ ✡

పెద్దల సభ

- బుకర్




భారత పార్లమెంట్ లోని ఎగువ సభను రాజ్యసభ అంటారు. దీన్నే పెద్దలసభ అని కూడా పిలుస్తారు. రాజ్యసభ సభ్యులను వివిధ రాష్ట్రాల శాసనసభల సభ్యులు ఎన్నుకుంటారు కాబట్టి దీన్ని రాష్ట్రాల సభ అని కూడా అంటారు. రాష్ట్రాల నుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని రాష్ట్రపతి ఎంపిక చెయ్యడం ద్వారానూ, రాజ్యసభ సభ్యులు నియామకం అవుతారు. వీరి పదవీకాలం 6 సంవత్సరాలు ఉంటుంది. ప్రతి రెండేళ్లకొకసారి మూడో వంతు సభ్యుల పదవీకాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో, ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకుంటారు. ఇదీ, రాజ్యసభ సభ్యులను ఎంపికచేసుకొనే విధానం. లోక్‌సభ సర్వశక్తివంతమైనది. రాజ్యసభతో పోల్చుకుంటే, ఎక్కువ హక్కులు లోక్ సభ కలిగి ఉంటుంది.ప్రజల నుండి నేరుగా ఎన్నిక ద్వారానే లోక్ సభ సభ్యుల ఎంపిక జరుగుతుంది. ప్రజా ప్రతినిధులుగా వీరు, వివిధ పార్టీల నుండి ఎంపికవుతారు. ఇలా ఈ రెండు సభల నిర్మాణం వెనుక, ప్రజాహితమే ప్రధాన ఉద్దేశ్యంగా రాజ్యాంగ నిర్మాతలు రూపకల్పన చేశారు. రాజ్యసభను సెకండ్ ఛాంబర్ అనికూడా అంటారు. అంటే,

సెకండ్ చెక్ అన్నమాట. రాజ్యసభకు కూడా శాసనాధికారం ఉంటుంది. వివిధ శాసనాలను తీర్మానం చేసే క్రమంలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా దేశభక్తితో నిర్ణయాలు జరగాలనే గొప్ప ఉద్దేశ్యంతో, సమాంతర వ్యవస్థగా రాజ్యసభను ఏర్పాటుచేశారు. విజ్ఞాన ఖనులు, మేధావులు, సాంస్కృతిక ప్రేమికులు, గొప్ప ప్రజానాయకులు, పరమ దేశభక్తులు, సత్‌శీలురు ఈ పెద్దల సభలో సభ్యులుగా ఎంపికవుతారు. లోక్‌సభసభ్యులు పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా బిల్లులు ఆమోదించినప్పటికీ, వీటికి అతీతంగా, వీరు ప్రజాహితం కోరుకుంటూ, అవసరమైతే వీటిని అడ్డుకుంటారు. కొన్ని బిల్లుల విషయంలో, లోక్‌సభ సభ్యులు ప్రజలకు ప్రయోజనకారిగా ఉన్నాయని భావించినా, సుదూర భవిష్యత్తు అలోచించి, రాజ్యసభ సభ్యులు వాటిని ఆమోదించకుండా తిప్పికొట్టే పరిస్థితులు వస్తూ ఉంటాయి. పెద్దలసభ, అని పేరు పెట్టుకున్నందుకు, నిజంగా ఎంతో పెద్దమనుషులతో ఈ సభలు శోభాయమానంగా ఉండేవి. దురదృష్టవశాత్తు, విలువలు తగ్గుముఖం పడుతూ, అధికారమే పరమావధిగా సాగుతున్న రాజకీయ వ్యవస్థల మధ్య పెద్దలసభలో పెద్దమనుషులు తగ్గుతూ వస్తున్నారు. రాజకీయ పునరావాస కేంద్రంగా, స్వప్రయోజనాల లక్ష్యంగా, ఇచ్చిపుచ్చుకొనే ధోరణుల మధ్య పెద్దలసభకు కొందరి నియామకాలు జరుగుతూ ఉన్నాయనేది, మెజారిటీ మేధావులు, పరిశీలకుల అభిప్రాయం. ఉభయ సభల్లో బిల్లులు ఆమోదం పొందాలంటే, రాజ్యసభలోనూ అధికార పార్టీకి మెజారిటీ ఉండాలి. ఈ విషయంలో, చాలావరకూ, ప్రతిపక్ష పార్టీలకే మెజారిటీ ఎక్కువగా ఉండే పరిస్థితులను అధికారంలో ఉన్న పార్టీలు ఎదుర్కొంటూ ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో, రాజ్యసభలో మెజారిటీ కోసం,ప్రతిపక్ష సభ్యులకు ఎరవేసి, లాక్కొనే ప్రయత్నాలు అధికారంలో ఉన్న పార్టీలు చేస్తూ ఉంటాయి. రాజకీయక్షేత్రంలో, ఇది యుద్ధనీతిగా అభివర్ణించుకుంటున్నారు. ఈ అభ్యాసం, కొన్నేళ్ల నుండీ పెరుగుతూ వస్తోంది. పెద్దలసభల్లోనూ బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, స్వపక్షీయులు వచ్చి చేరుతున్నారు. ఈ క్రీడలో యుద్ధనీతి ఎలా ఉన్నా, నీతికి, రాజనీతికి తూట్లు పడుతున్నాయి.లోక్ సభలో ఆమోదం పొందినప్పటికీ, రాజ్యసభలో ఆమోదం పొందక, సెలెక్ట్ కమిటీకి వెళ్లి, కాలయాపన జరిగి, ఏళ్ళు పూళ్ళు సాగి, త్రిశంకు స్వర్గంలో నిలిచిపోయిన బిల్లులు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు: మహిళాబిల్లు. ఈ విధంగా, అధికారపార్టీలను ఇరకాటంలో పెట్టి, నైతికంగా గెలిచామనే ఆనందంతో ప్రతిపక్ష పార్టీలు తాండవం చేస్తూ ఉంటాయి. ఈ క్రమంలో, ఎన్నో సంస్కరణలకు నోచుకోవాల్సినవి, మెజారిటీ ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చేవి, చారిత్రకమైన బిల్లులు కూడా ఉంటాయి. ఇదొక రాజకీయ చదరంగం. రాష్ట్ర పాలనకు సంబంధించి, రాష్ట్రాలలో ఉండే, శాసనమండలిని కూడా ఎగువసభ అంటారు.ఇక్కడ, అధికార పార్టీకి మెజారిటీ లేక, ప్రతిపక్షాలు బిల్లుల ఆమోదం విషయంలో ఇబ్బంది పెడితే, అధికారంలో ఉన్న పార్టీకి శాసనమండలిని రద్దు చేసుకొనే అధికారం ఉంది.కానీ, రాజ్యసభను రద్దు చేసే అధికారం కేంద్రంలో లేదు. అలా రాజ్యాంగం నిర్మాణం చేశారు. తమకు మెజారిటీ వచ్చిన దాకా ఆగి తీరాల్సిందే. రాష్ట్రాలకు సంబంధించిన పెద్దల సభల్లోనూ ఒకప్పుడు మహనీయులు ఉండేవారు. రాజకీయ సంస్కృతి మారుతున్న నేపథ్యంలో, ఇక్కడా పెద్దమనుషులు కరువవుతున్నారు. ప్రస్తుతం, దేశంలోని ఎక్కువ రాష్ట్రాలలో శాసనమండలి వ్యవస్థలు రద్దయ్యే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ ఇప్పటివరకూ రాజ్యసభ ప్రస్థానాన్ని గమనిస్తే, నిత్యస్మరణీయులైన మహనీయులు సభ్యులుగా పనిచేశారు. శాసనాల రూపకల్పనలో అచంచలమైన దేశభక్తితో, నిస్వార్థంగా వ్యవహరించారు. అటు ఎంపికచేసిన పార్టీకి, ఇటు రాజ్యసభకు అమేయమైన గౌరవాన్ని తెచ్చిపెట్టారు. నిజంగా దేశ ప్రయోజనాల గురించి ఆలోచించేవారికి ఇది గొప్ప అవకాశం. నియోజకవర్గాల్లోకి వెళ్ళి రాజకీయాలు చేసుకోనక్కర్లేదు. ఓట్ల భయం లేదు.ఖాళీ సమయాల్లో, అద్భుతమైన గ్రంథాలయాల్లో ఉన్న అపార జ్ఞాన సంపదను అక్కున చేర్చుకొని, దేశ ప్రతిష్ఠ పెంచే, సకల జనుల శ్రేయస్సు ప్రసాదించే అద్భుతమైన సలహాలు, సూచనలు పాలకులకు ఇవ్వవచ్చు. ఒకప్పుడు అలాగే సాగేది. నిన్న మొన్నటి వరకూ కూడా, ఎందరో పెద్దలు ఈ పెద్దలసభలకు ఎంపికయ్యారు. వాజ్‌పెయి, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, భూపేష్ గుప్తా, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్.జి.రంగా, నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాల్ రెడ్డి, బూర్గుల రామకృష్ణరావు, వల్లూరి బసవరాజు, కాసు వెంగళరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, దేవులపల్లి రామానుజరావు, పి.కె.కుమరన్ మొదలైన పెద్దలెందరో ఈ పెద్దల సభలో ఉండేవారు. రాష్ట్రపతి ఎంపిక చేసినవారిలోనూ ఎందరో పెద్దలు ఉండేవారు. రాజా రామన్న జాకీర్ హుస్సేన్, అబు అబ్రహాం, శంకర్ కురూప్, ఆర్.కె.నారాయణ్, పండిట్ రవిశంకర్, పృథ్వీ రాజ్ కపూర్, లతా మంగేష్కర్, కులదీప్ నయ్యర్. సి.నారాయణరెడ్డి మొదలైన వాళ్ళు పెద్దల సభకు ఎంతో గౌరవాన్ని, వైభవాన్ని తెచ్చిన గొప్పవాళ్ళు. టెండూల్కర్, జయబచ్చన్, రేఖ, హేమామాలిని మొదలైన వాళ్ళు కూడా ఎంపికయ్యారు. కళాకారులు, కవులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులను గౌరవపూర్వకంగా రాజ్యసభకు ఎంపిక చెయ్యడం ఒక ఆనవాయితీ, ఒక మర్యాద. ఇందులో కొందరు అలంకారప్రాయంగా పదవికి పరిమితమైనవారు, కనీస హాజరు కూడా లేనివారు ఉన్నారు.జయబచ్చన్, డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటివారు తమ పదవిని, సమయాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకున్నారు.కొందరు పార్టీలకు, ప్రభుత్వంలో ఉన్న అధికార పార్టీలకు వివిధ రూపాల్లో ప్రయోజనాలు చేకూర్చి, తత్ఫలితంగా పదవులు దక్కించుకుంటున్నారనే విమర్శలు ఈ మధ్యకాలంలో పెద్ద ఎత్తున వస్తున్నాయి.చట్ట సభల్లో హుందాగా ప్రవర్తించడం,సర్వ ప్రజాహితంగా నిర్ణయాలు తీసుకోవడం, పదవీకాలాన్ని సద్వినియోగం చెయ్యడం, ప్రజాధనాన్ని వృథా కాకుండా చూడడం ఈ సభ్యుల బాధ్యత. రాజ్యాంగం అమలు అనేది, అమలు చేసే పాలకులమీదనే ఆధారపడుతుందని అంబేద్కర్ ఏనాడో చెప్పారు.ఆచరణలో, పెద్దలసభ రాజకీయాలకు అతీతంగా, సర్వ స్వతంత్ర్యమైన వ్యవస్థగా నిలబడాలి. ఉభయ సభలు ఆదర్శవంతంగా సాగాలి.

సుశాంత్.. శాంతం లేక శవం అయ్యాడు

- టి.ఓంకార్ వర్మ



ఎప్పుడో ఒకప్పుడు మనమూ పోతామని తెలిసి బతకడమే జీవితం.. బతికినంత కాలం జీవితానికి అప్పుడప్పుడు గుప్పెడంత ఆనందం, వేలెడంత బాధ, చిటికెడు ఈర్ష్య, గోరంత అమోమయం, చెప్పలేనంత నిరాశ, కావల్సినంత అత్యాశ, కనికరం లేని కష్టాలు, కొలవలేనన్ని కన్నీళ్లు ఇలా జీవితంలో ఎన్నెన్నో.. మధ్యలో కుట్రలు, వెన్నుపోట్లు అదనం.. ఎవర్నో అడిగి ఈ భూమ్మీదకు రాలేము..ఎవరికో చెప్పి మట్టిలో కలిసిపోలేము.. అంతా అదేదో తెలీని మాయ.. ఈ విచిత్రమైన జీవితాన్ని అందరూ నెట్టుకొస్తూనే ఉంటారు ఎలాగో ఒకలా బతుకు బండిని లాగుతూనే ఉంటారు

కానీ బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య గురించి తెలిశాక ఆత్మహత్యలపై మరోసారి చర్చ మొదలైంది. అమ్మా..నాన్న ఇచ్చిన జీవితాన్ని ఎలా వదులుకుంటారు. సొంతంగా ఊపిరి తీసుకోవడానికి ఎంతమానసిక స్థైర్యం కావాలి.. తొలిపొద్దు పొడిచాక మొదలయ్యే జీవితం.. పొద్దుపోయాక గూటికి చేరి.. పొద్దస్తమానం ఏం చేశామో అని ఆలోచించుకుని నిద్రపోతే మళ్లీ పొద్దుపొడిచేనాటికి ఉంటుందో ఊడుతుందో తెలీని ప్రాణం.. మనది..అలా పోతే పర్వాలేదు కానీ సొంతంగా గొంతుకి తాడు కట్టి గిలగిలా కొట్టుకుని కొట్టుకుంటున్న గుండెని బలవంతాంగా ఆపేయడమంటే ఎంతటి కష్టం.. గుండె లోతుల్లో ఏదో భయంకరమైన పరిష్కారం లేని బాధ అయ్యుండొచ్చు.. ఎవరికీ చెప్పుకోలేని సమస్య అయ్యుండొచ్చు..తీవ్రమైన మానసిక ఒత్తిడి అయ్యుండొచ్చు ఏదైనా సరే.. అర్థాంతరంగా జీవితాన్ని ముగించడం దీనికి ముగింపుగా భావిస్తుంటారు చాలామంది అందులో సుశాంత్ సింగ్ కూడా ఒకరు..

చావు పిలుపు అనేక రకాలుగా ఉంటుంది..మృత్యువు యమపాశంతో మన ఇంటి గుమ్మం ముందు నిలబడి రోజుల తరబడి తనతో రమ్మని వేధిస్తుంటే.. మానసికప్రశాంతత దొరక్క ఆ ఆహ్వానాన్ని అందుకునే వారు చాలామంది.. తిండికి లేక,.అప్పులు భరించలేక, అనుకున్నది సాధించలేక, జీవితంలో ఓడిపోయామనే బాధ, తనకెవరూ లేరనే నరకయాతన, ప్రేమించిన ప్రియురాలు నట్టేట ముంచేసి పోతే తట్టుకోలేని గుండెకోత ఇలా ఎన్నెన్నో కారణాలతో చాలామంది ప్రాణం తీసుకుంటూ ఉంటారు.

కానీ సుశాంత్ సింగ్‌కు ఏం లోటు. పుట్టాడు..గెలిచాడు పోయాడు.. చిన్నవయసులోనే స్టార్ హీరో అయ్యాడు..కొన్ని కోట్ల మంది డ్రీమ్ అది.. అతనికున్న ఐడెంటిటీ, అతనికున్న ఫాలోయింగ్ ఎంతమందికి ఉంటాయి.. చేసిన 12సినిమాల్లో ఫ్లాపులు కంటే హిట్‌లే ఎక్కువ.. కావల్సినంత డబ్బు ఉంది ఇంకెన్నో అవకాశాలున్నాయి.. అయినా సరే ఏదో లేదు..ఇంకేదో అనుకున్నది అవలేదు.. ఏదేదో మనసుని వేధిస్తోంది. గుమ్మం దగ్గర నిల్చున్న మృత్యువుతో అది స్నేహం చేస్తోంది..అదే నిద్ర లేకుండా చేస్తోంది. ఏంటది అది తెలుసుకునే ప్రయత్నంలోనే సుశాంత్ ఊపిరిని ఆపేసుకున్నాడు..ఎంతో భవిష్యత్తు ఉన్న స్టార్ హీరో సుశాంత్ ఇలా అర్థాంతరంగా జీవితంను ముగించడం వెనుక ఉన్న కారణం ఏంటా అని అంతా ఆలోచిస్తున్నారు. ఆయనకు ఆర్థిక సమస్యలు ఉన్నాయని ఎక్కువ మంది అనుకుంటున్నారు. అయితే ఆత్మహత్య చేసుకునే స్థాయిలో ఆయన ఆర్థిక పరిస్థితి లేదని ఆయన సన్నిహితులు బలంగా చెబుతున్నారు.

ముంబయిలో ఇల్లు.. ఖరీదైన కార్లు.. బైక్స్.. ఇంకా విలువైన వస్తువులు ఉన్నా సుశాంత్ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులైతే పడలేదు. జీవించలేనంత ఆర్థిక పరిస్థితి ఆయనది కాదు. ఆయన డిప్రెషన్ కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని సన్నిహితులు అంటున్నారు. కేవలం సుశాంత్ మాత్రమే కాకుండా ఇప్పటి వరకు ఆత్మహత్యలు చేసుకున్న ఎంతో మంది స్టార్స్ కూడా ఆర్థిక పరిస్థితి కారణంగా కాకుండా డిప్రెషన్ కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు.

ఉదయ్ కిరణ్ ఆర్థికంగా చితికి పోయినా మరీ పూట గడవనంత ఇబ్బంది అయితే ఏమీ లేదు. ఆయన ఆఫర్లు లేకపోవడంతో డిప్రెషన్‌కు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. సీనియర్ నటుడు రంగనాథ్ తనకు తోడు ఎవరు లేరనే డిప్రెషన్‌తో మానసిక సంఘర్షణకులోనై ఆత్మహత్య చేసుకున్నారు. చాలా మంది స్టార్స్ అప్పుడప్పుడు డిప్రెషన్‌కు లోనవుతూ ఉంటారు. షూటింగ్ సమయంలో చుట్టు వందల మంది ఉన్నా కూడా కొందరు స్టార్స్ ఒంటరి అనే ఫీలింగ్‌తో డిప్రెషన్‌కు గురి అవుతూ ఉంటారు. అలాంటి వారు ఒంటరిగా ఉన్న సమయంలో ఆత్మహత్యలు చేసుకుంటూ ఉన్నారు.

డిప్రెషన్ అనిపించిన సమయంలో స్నేహితులతో మరియు కుటుంబ సభ్యులతో గడపడం ఎక్కువ సమయం పని చేయడం లేదంటే ఎక్కువగా నలుగురిలో ఉండేందుకు ప్రయత్నించడం చేస్తే కొంత అయినా డిప్రెషన్‌ను దూరం చేసుకోవచ్చు అంటూ నిపుణులు చెబుతున్నారు. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకునే కూడా తాను ఒకానొక సమయంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. కాని దాని నుండి బయట పడ్డాను అంటూ చెప్పుకొచ్చింది. అంటే ఆర్థిక పరమైన సమస్యలతో కాకుండా డిప్రెషన్ కారణంగానే సెలబ్రెటీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనేది వాస్తవం.

అపూజ్యనీయులైన చైనా బావగారికి

- యు. హనుమయ్య

అప్రియాతి అప్రియమైన, అపూజ్యనీయులైన చైనా బావగారికి, మీ వియ్యంకుడు ఛీత్కరించుకుంటూ... వ్రాయునది. కుశలమూ, కాకరకాయా ఏమీ లేవు.

మీ దరిద్రాన్ని మాకంటగట్టాక మీరు క్షేమంగానే ఉండి ఉంటారు. మా బతుకే మీ వూహాన్ మార్కెట్లా ఛండాలంగా తయారయ్యింది.

ఏనాడైతే మీ అమ్మాయి "కరోనా కుమారి" మా ఇంట్లో కుడి కాలెట్టి ప్రవేశించిందో కానీ, ఇల్లంతా అల్లకల్లోలం చేసేసి, అన్నిటికీ తాళాలేసి పడేసింది మహాతల్లి.

సామాజిక న్యాయం కోసం ఎల్లప్పుడూ సమసమాజం సందుల్లో సరదాగా తిరిగే మమ్మల్ని "సామాజిక దూరం, సింగినాదం" అని మూకుమ్మడిగా మూటగట్టి ఇంట్లో కూర్చోబెట్టింది మీ ముద్దుల కూతురు!

మూడు నెలలుగా ఇంట్లోనే ఉండీ, తోచీ తోచక మొగుడూ పెళ్ళాలు తిట్టుకునీ, కొట్టుకునీ, థప్పడ్లూ...., తాటాకులూ... అంటున్నారు.

స్కూళ్ళు లేక ఇంట్లోనే ఉంటున్న పిల్లకాయలు అల్లర్లూ, ఆన్లైన్ క్లాసులతో మా బుర్రల్ని మీరు బొద్దింకల్ని తిన్నట్టు తినేస్తున్నారు.

ఈ ఘోరాలన్నింటికీ కారణమైన మీ అమ్మాయి మీద ఒళ్ళు మండి, లాగి పెట్టి ఒక్కటి కొట్టాలని ఉన్నప్పటికీ, ఆ ముళ్ళసుందరిని మేము తాకినా, ఆమె మమ్మల్ని తాకినా క్వారంటైన్ అయ్యేది మా బ్రతుకేనని గ్రహించి ఆ ప్రయత్నం విరమించుకున్నాము. అసలు ఆమెని తాకడమనే వెర్రి ఆలోచనకే భయంతో వణుకుతూ చేతులు శానిటైజర్లతో రుద్దీ రుద్దీ, పాలకోవా మందంలో ఉండే మా చేతులు, పూతరేకుల మందానికి అరిగిపోయాయి.

ఈ తాకడాలు, తలనొప్పులూ ఎందుకులేగాని, పోనీ దూరంనుండైనా నోరారా తిట్టి మా నోటిపూత తీర్చుకుందామంటే, మా మూతులకి మాస్కులు తగిలించేసింది ముష్టి మొహంది.

ఏ మాటకామాట, అసలు మీ అమ్మాయి అందమే అందం! నట్టింట్లో నెత్తి మీద కిరీటం పెట్టుకు తిరుగుతుంది.... వెధవ చీకేసిన తాట్టెంక మొహమూ అదీనూ..!

ఆవిడగారు అడుగెట్టాక,
ఓ పండుగా లేదు, పబ్బమూ లేదు.
ఓ మాటా లేదు, మంచీ లేదు.
ఓ సినిమా లేదు, షాపింగ్ లేదు.
ఐసోలేషన్లూ, క్వారంటైన్లూ తప్ప...!

వెళ్లక వెళ్లక బయటకెళ్లినా, ఈ వేసవిలో ఆ PPE కిట్లు, మాస్కులూ వేసుకుంటుంటే కావేసిన మామిడి పళ్ళల్లా మగ్గి చస్తున్నాం, మా ముక్కూ మొహం మండా!

పొరపాటున బయట చీదినా, తుమ్మినా పక్కనోళ్లు చూసే అనుమానపు చూపుల ఆపరేషన్లని తట్టుకునే కంటే, కూసింత కోపరేషన్తో ఇంట్లో



కూర్చోవడం మంచిదని భావించి గుట్టుగా బతుకుతున్నాం, వెధవ సంతాని... వెధవ సంత!

అంతకీ నయానో, భయానో బెదిరిద్దామని పళ్ళాలూ గిన్నెలూ కొట్టి, దీపాలవీ పెట్టి చూసాము కూడా... అబ్బే, మొండి ఘటం కదూ... లొంగి చావలేదు!

పోనీ మొన్నేదో యుగాంతం అన్నారు కదా, పనిలో పనిగా మీ కరోనా కుమారి కూడా అంతమైపోద్దేమోనని అతిగా ఆశపడ్డాము మరియు ఆవేశపడ్డాము కూడా, అబ్బే ఆ ముచ్చటా తీరలేదు... మాకంత అదృష్టం ఎక్కడిదీ...?

చివరికి ఏవో మాకు తోచిన "ఆత్మనిర్భరాలవీ" ప్రకటించుకుని కాస్త ధైర్యం చెప్పుకుందామనుకున్నాంగానీ, ఇక నిబ్బరంగా ఉండడం మా వల్ల కాదు బాబూ...!!!

అయినా మొదటి నుండీ మీతో సంబంధం కలుపుకోవడం మాకిష్టం లేదు. అయినప్పటికీ పిల్ల మేనమామ అయినటువంటి ఆ WHOగారు చెప్పిన కల్లబొల్లి కబుర్లు నమ్మి, నిండా మునిగి, ఇప్పుడు భయంతో వణికి చస్తున్నాం.

ఇక అసలు చెప్పదలచుకున్నదేమనగా, మరి మీగారాల కూతురు తన పుట్టింటిని, మరీ ముఖ్యంగా తన తల్లిగారైన గబ్బిలాన్ని గుర్తు తెచ్చుకుని గంపెడు గుబులు పడుతుంది..... బెంగతో దిగులు చెందుతుంది.

ఎలాగూ ఆషాడం కూడా వచ్చింది కనుక శాస్త్రం ప్రకారం మీ కరోనా కుమారిని పుట్టింటికి తీసుకెళ్లి, అమ్మాయి బెంగ తీర్చవలసిందని వేడుకుంటున్నాము.

ఆషాడం తర్వాత మీ పుత్రిక మళ్ళీ మా గడప తొక్కకుండా, ఆలోగా మేము కూడా మీలాగా ఒక గోడ కట్టుకుని, మా పాట్లేవో మేము పడతాము.

ఇంతే సంగతులు!

ఇట్లు మీ "కరోనా కుమారి" బాధిత వియ్యాలవారు